
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 324

శుక్రవారం 14-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆకాశమంత ప్రేమ

అగ్ని దహించదు... వరద ముంచెత్తదు
పెనుగాలి పెకలించదు.. ప్రేమ అచంచలం...
అజేయం.. హృదయపు నాలుగు కవాటాలకు
స్పందన ప్రేమ.. మనసుకు సంజీవని ప్రేమ..
ప్రేమ ఉండును... ప్రేమే ఉండును..

నేడు వాలెంటైన్స్ డే - 13లో



పార్లమెంట్‌లో 'వక్ఫ్' జేపీసీ నివేదిక

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్ష సభ్యులు
- తమ అభ్యంతరాలను నివేదికలో చేర్చలేదని ఆగ్రహం
- ఫేక్ రిపోర్టును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్
- ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం
- ఉభయ సభలు వచ్చే నెల 10వ తేదీకి వాయిదా
- మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 దాకా బడ్జెట్ సమావేశాల రెండో సెషన్

- వివరాలు 6లో

న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్లు లేవు

- పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను కోర్టులు కాపాడుతున్నాయి
- ఇండియాలో ఏక పార్టీ ఆధిపత్యం ఉత్తమాటే
- ప్రాంతీయ ఆకాంక్షలు, గుర్తింపునకు ప్రాధాన్యం పెరుగుతోంది
- 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం
- గతేడాది వినాయక చవితికి ప్రధాని మోదీ మర్యాదపూర్వకంగానే మా ఇంటికి వచ్చారు.. దీనిపై అతి విశ్లేషణ అవసరం లేదు
- బీబీసీ ఇంటర్వ్యూలో మాజీ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడి

- వివరాలు 2లో



న్యూస్‌రీల్

వలపు వల.. చిక్కారో విలవిల!



ఏఐను వాడి అమాయకులకు వలపు వల వేస్తున్న సైబర్ మోసగాళ్లు.. అవతలి వ్యక్తి తమ అధీనంలోకి రాగానే మోసానికి తెరతీస్తున్నారు. డేటింగ్ యాప్‌లు, మ్యాట్రిమోని వెబ్‌సైట్లలోని సమాచారాన్ని సేకరిస్తూ ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారు.

- వివరాలు 16లో

19న తెలంగాణ భవన్‌కు కేసీఆర్



బీఆర్‌ఎస్ రజతోత్సవాల నిర్వహణ, పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం వంటి అంశాలపై చర్చించేందుకు ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సుదీర్ఘ విరామం తర్వాత ఈ నెల 19న పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వెళ్లనున్నారు.

- వివరాలు 2లో

క్విక్ కామర్స్.. 'ఏఐ' రైడ్!



పదే పది నిమిషాల్లో డెలివరీతో రప్పా రప్పా దూసుకుపోతున్న క్విక్ కామర్స్ దిగ్గజాలు... దీని కోసం అధునాతన టెక్నాలజీని విరివిగా వాడేసుకుంటున్నాయి. ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతికతల దన్నుతో కస్టమర్ల ఆర్డర్ ధోరణులు వంటివన్నీ చకచకా చక్కబెట్టేస్తున్నాయి.

- వివరాలు 15లో

నాగ్‌పూర్ హైవే 'ప్రైవేటు పరం'

- టీఓటీ పద్ధతిలో రూ .6,661 కోట్లకు అప్పగించిన ఎన్‌హెచ్‌ఏఐ
- ఐదు టోల్ ప్లాజాలు ప్రైవేటు సంస్థకు
- టోల్ వసూలు నుంచి తప్పుకున్న ఎన్‌హెచ్‌ఏఐ

- వివరాలు 5లో



ఏఐ పాఠాలు ఉద్యోగులకు శిక్షణ



ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు కోసం మైక్రోసాఫ్ట్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఎంఓయూతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సంస్థ ప్రతినిధులు

500 ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు తర్ఫీదు: సీఎం రేవంత్‌రెడ్డి

ఏఐ ఫౌండేషన్ అకాడమీ 'అడ్వాంటేజ్ తెలంగాణ' ద్వారా నిర్వహణ

- పరిపాలన, ప్రజాసేవలోనూ కృత్రిమ మేధ వినియోగం
- ఫ్యూచర్ సిటీలో మైక్రోసాఫ్ట్ ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్
- గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ కొత్త భవనాన్ని ప్రారంభించిన సీఎం
- ప్రభుత్వ భాగస్వామ్యంతో 3 కార్యక్రమాలు: మైక్రోసాఫ్ట్

వివిధ రంగాల్లో విస్తృతంగా ఏఐ గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ - 3లో

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం, మైక్రో సాఫ్ట్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటైన ఏఐ ఫౌండేషన్ అకాడమీ 'అడ్వాంటేజ్ తెలంగాణ'కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పరిపాలన, ప్రజాసేవలోనూ ఏఐ సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలో 1.2 లక్షల మందికి ఏఐ సాంకేతికతలో శిక్షణకు 3 కొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ ప్రారంభించింది. సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలిలో కొత్తగా నిర్మించిన భవనాన్ని సీఎం గురువారం ప్రారంభించారు.

భవిష్యత్తు ఏఐ సాంకేతికతదే..

'మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ నడుమ సుదీర్ఘ భాగస్వామ్యం ఉంది. అంతర్జాతీయ ఆవిష్కరణలపై హైదరాబాద్ నుంచి మైక్రోసాఫ్ట్ ఎంతో ప్రభావాన్ని చూపింది. సంస్థ కార్యకలాపాల విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభిస్తాయి. వారి సాధికారతకు కూడా ఇది దోహదపడుతుంది. భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీదే. మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో మిగతా 3వ పేజీలో ▶

ఆవిష్కరణలు, అంతరిక్షం

ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ చర్చ

వాషింగ్టన్: ప్రధాని మోదీ గురువారం స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ ఆవిష్కరణలు, అంతరిక్ష అన్వేషణలు, భారత్‌లో టెస్లా విస్తరణ వంటి అంశాలే కేంద్రంగా చర్చలు జరిపారు. 'అంతరిక్ష రంగం, రవాణా, సాంకేతికత, నూతన ఆవిష్కరణలు మస్క్‌తో సుహృద్భావపూర్వక భేటీలో చర్చకు వచ్చాయి. మస్క్ అమితాసక్తి చూపే ఈ అంశాలపై ఆయనతో లోతుగా చర్చించా. పాలనా యంత్రాంగంలో భారత్ తలపెట్టిన సంస్కరణల గురించి వివరించా. అతితక్కువ ప్రభుత్వ జోక్యం.. హెచ్చుగా పాలన అవే మా లక్ష్యమని తెలిపా' అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వీరి భేటీకి సంబంధించిన పూర్తి వివరాలు వెంటనే తెలియరాలేదు. బ్లెయిర్ హౌస్‌లో జరిగిన ఈ భేటీకి మస్క్ తన ముగ్గురు పిల్లలు ఎక్స్, స్ట్రైడర్, అజూర్‌లను తీసుకు రావడం విశేషం. ఉన్నత స్థాయి సమావేశాలకు సైతం తన పిల్లలను వెంటబెట్టుకు వెళ్లడం మస్క్ ప్రత్యేకత. భారత ప్రధాని మోదీతో తమ తండ్రి చర్చలు జరుపుతుండగా పక్కనే కూర్చుని ఉన్న ముగ్గురు పిల్లలూ ఆసక్తిగా తిలకిస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. వీరిలో ఎక్స్ సరదాగా కనిపించగా, మిగతా ఇద్దరూ అలెర్ట్‌గా ఉన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు అంతరిక్ష రంగాల్లో భారత్ కీలకంగా మారుతున్న తరుణంలో మోదీ, మస్క్‌ల భేటీతో భారత్ మార్కెట్‌తో మస్క్ కంపెనీల బంధం బలోపేతమవుతుందని భావిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)కి మస్క్ సారథ్యం వహిస్తుండటం తెలిసిందే.



వాషింగ్టన్ డీసీలోని బ్లెయిర్ హౌస్‌లో తనతో భేటీకి స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ పిల్లలను తీసుకురావడంతో వారిని పలకరిస్తున్న ప్రధాని మోదీ

సమానంగా వడ్డిస్తాం

టారిఫ్‌లపై ట్రంప్ ఉత్తర్వులు - 6లో

కీలక పదవులు ఎవరికో?!

- ఢిల్లీకి చేరిన టీపీసీసీ కార్యవర్గ జాబితా.. అధిష్టానం ఆమోదించగానే ప్రకటన
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాల నేతలకు 4 వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు
- బలరాం నాయక్ పేరు ఖరారు! రేసులో మరికొందరు ముఖ్య నేతలు
- అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌లలో ఒకరికి అధికారిక పదవి.. కేబినెట్‌లోకి షబ్బీర్ అలీ!
- ప్రచార కమిటీ చైర్మన్ పోటీలో జగ్గారెడ్డి ఒక్కరేనా?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గ నియామక ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఇప్పటికే పార్టీ అధిష్టానంతో పలుమార్లు జరిగిన చర్చల అనంతరం బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలు అన్ని కోణాల్లో కసరత్తు చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. తాజాగా ఏఐసీసీ ఆమోదం కోసం ఈ జాబితాను ఢిల్లీకి పంపారు. అధిష్టానం ఆమోదం లభించిన వెంటనే అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో టీపీసీసీ కార్యవర్గాన్ని జాగ్రత్తగా కసరత్తు చేసి ఎంపిక చేశారనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరుగుతోంది. దీంతో కీలక పదవులు ఎవర్ని వరిస్తాయనే దానిపై ఊహాగానాలు, పార్టీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

ఐదుగురు కాదు.. నలుగురే


పార్టీ అధ్యక్ష పదవి తర్వాత అత్యంత డిమాండ్ ఉన్న పదవి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్. ఈ హోదా కోసం పార్టీలోని చాలామంది సీనియర్లు పోటీ పడుతున్నారు. గతంలో వర్కింగ్ ప్రెసిడెంట్ (ఆర్గనైజేషన్)గా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం వచ్చిన నేపథ్యంలో ఈ పదవికి డిమాండ్ ఏర్పడింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాయకులు, గాంధీ కుటుంబానికి విధేయులుగా ఉన్న వారితో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు చాలా మంది ఈ పదవిని కోరుకుంటున్నారు. గత కార్యవర్గంలో మొత్తం ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉన్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు జగ్గారెడ్డి, గీతారెడ్డి, అజారుద్దీన్, అంజన్‌కుమార్ యాదవ్‌లు ప్రస్తుతం ఈ హోదాలో ఉన్నారు.

ఈసారి ఆ 4 కేటగిరీల వారికి..

గతంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉండడంతో ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారిని మిగతా 12వ పేజీలో ▶

మీరు అడిగినన్ని ఇళ్లు ఇవ్వం

- ఇందిరమ్మ పథకానికి కేటాయింపులు అంతంతే... తెలంగాణకు కేంద్రం షాక్
- పట్టణ ప్రాంతాలను పెంచి భారీగా నిధులు పొందాలనుకున్న రాష్ట్రం ఆశలపై నీళ్లు
- 10 లక్షల యూనిట్లు, రూ.15 వేల కోట్ల నిధులు ఇవ్వాలని రాష్ట్రం ప్రతిపాదనలు
- మీ పట్టణ జనాభా దేశంలో 4% ఉన్నందున 4 లక్షల యూనిట్లే ఇస్తామని తేల్చిచెప్పిన కేంద్రం
- ఆ లెక్కన రూ.6 వేల కోట్ల నిధులు అందే చాన్స్.. కేంద్రంపై మరింత ఒత్తిడి చేసి లెక్క మార్పించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రాంతాలను పెంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా నిధులు పొందాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై కేంద్రం నీళ్లు జల్లింది. కేంద్రం నుంచి భారీగా 'పట్టణ ప్రాంత పేదల ఇళ్ల' నిధులు సాధించి ఇందిరమ్మ పథకం ఖర్చును భారీగా తగ్గించుకోవాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి షాకిచ్చింది. పట్టణప్రాంత ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఐదేళ్లకు రూ.15 వేల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించగా, కేంద్రం తాజాగా చెప్పిన లెక్క ప్రకారం రూ.6 వేల కోట్లు మాత్రమే దక్కుతాయని తేలింది. దీంతో ఇళ్ల పథకం అమలులో రాష్ట్ర ఖజానాపై భారం పడబోతోంది.

అనుకున్నదొకటి, జరిగింది మరొకటి..

పీఎంఏవై కింద దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కోటి, గ్రామీణ ప్రాంతాల్లో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పేదింటి పథకాలకు ఈ మొత్తాన్ని కేటాయిస్తుంది. పీఎంఏవైలో అర్బన్‌లో యూనిట్ కాస్ట్ రూ.లక్షన్నరగా ఉండగా, రూరల్‌లో రూ.72 వేలుగా ఉంది. దీంతో ఎక్కువ నిధుల కోసం అర్బన్ యూనిట్లు ఎక్కువగా పొందాలని తెలంగాణ నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలో పట్టణ ప్రాంత విస్తీర్ణం, జనాభా ఎక్కువగా ఉందని చూపేందుకు ఇటీవల పట్టణ ప్రాంత అభివృద్ధి సంస్థలను అమాంతం పెంచేసింది. గతంలో 9 పట్టణ ప్రాంత అభివద్ధి సంస్థలు ఉండగా, వాటిని 28కి పెంచింది. ఫలితంగా వేల సంఖ్యలో గ్రామ పంచాయతీలు 'పట్టణ' పరిధిలోకి చేరాయి. వీటి ఆధారంగా రాష్ట్రానికి 10 లక్షల అర్బన్ యూనిట్లు కేటాయించాలని, వీటికి రూ.లక్షన్నర చొప్పున రూ.15 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. ఈ నిధులు వస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మిగతా 5వ పేజీలో ▶

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

- సుప్తచేతనావస్థలో అసెంబ్లీ
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం
- రాజకీయ అనిశ్చితి నడుమ ఈ నెల 9న సీఎం పదవికి రాజీనామా చేసిన బిరేన్ సింగ్
- 1951లో అవతరించిన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధింపు ఇది 11వసారి
- 2023 నుంచి జాతుల వైరంతో అట్టుడుకుతున్న రాష్ట్రం

- వివరాలు 6లో

ద్రవ్యోల్బణం తగ్గింపే మా లక్ష్యం..

- ద్రవ్యోల్బణం కట్టడికే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని, పెరిగిన ధరల భారం పౌరులపై పడకుండా చూసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సాధారణ బడ్జెట్‌పై చర్చలో భాగంగా గురువారం రాజ్యసభలో ఆమె ప్రసంగించారు.

- వివరాలు 6లో



ధనాధన్ సమరం

- నేటి నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ టి20 టోర్నీ.
- తొలి మ్యాచ్‌లో గుజరాత్‌తో బెంగళూరు 'ఢీ'
- మొత్తం 5 జట్ల మధ్య నాలుగు వేదికల్లో 22 మ్యాచ్‌లు
- మార్చి 15న ముంబైలో ఫైనల్

- వివరాలు 15లో



ఇంజనీరింగ్ సీట్లు నిండేనా?

1,12,069 రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు..
- తెలంగాణలో ఏటా 50 వేల మంది ఏపీ విద్యార్థులకు సీట్లు
- ఈ ఏడాదితో ఏపీ నాన్ లోకల్ కోటా గడువు పూర్తి .. ఇంజనీరింగ్‌లో ఆ మేరకు డిమాండ్ తగ్గే చాన్స్
- రాష్ట్రపతి ఆదేశాల తర్వాతే కోటా రద్దుకు జీవో
- ఇంకా అధికారికంగా కోరని రాష్ట్ర ప్రభుత్వం
- జీవో వచ్చిన తర్వాతే ఎప్‌సెట్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లకు ఈసారి దరఖాస్తులు తగ్గే అవకాశం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో ఏపీ విద్యార్థులకు నాన్‌లోకల్ కోటా కింద 15 శాతం సీట్లు లభించేవి. ఆ కాలపరిమితి గత ఏడాదితో ముగిసింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ కోటాను తీసివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటా ఏపీ నుంచి దాదాపు 50 వేల మంది విద్యార్థులు తెలంగాణలో ఇంజనీరింగ్ సీట్ల కోసం పోటీ పడతారు. ఇందులో 16 వేల సీట్ల వరకు నాన్-లోకల్ కోటా కింద, మిగతావి జనరల్ పోటీలో ఏపీ విద్యార్థులు దక్కించుకుంటారు. ఇప్పుడు ఏపీ స్థానికతను అనుమతించకపోతే రెండు కేటగిరీల్లోనూ ఆ రాష్ట్ర విద్యార్థులకు సీట్లివ్వరు. యాజమాన్య కోటా సీట్లు మాత్రమే వారికి అందుబాటులో ఉంటాయి. అయితే, ఏపీ నాన్‌లోకల్ కోటా ఎత్తివేతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాతే ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు మిగతా 3వ పేజీలో ▶

ముగ్గురు అదనపు జడ్జీల శాశ్వత హోదాకు కేంద్రం ఓకే



జస్టిస్ కె.సుజన | జస్టిస్ అనిల్‌కుమార్ | జస్టిస్ లక్ష్మీనారాయణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో పనిచేస్తున్న ముగ్గురు అదనపు న్యాయమూర్తులకు శాశ్వత న్యాయమూర్తి హోదా ఇస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 5న కేంద్ర ప్రభుత్వానికి వీరి హోదా గురించి సిఫారసు చేసింది. జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్, జస్టిస్ కె.సుజనలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలన్న ప్రతిపాదనలకు కొలీజియం ఈ నెల 5వ తేదీనే ఆమోదం మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

స్థానిక ఎన్నికల్లో పోటీచేసే దమ్ము కాంగ్రెస్‌కు లేదు

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఓడిపోతామనే భయంతోనే ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే రాష్ట్రానికి నష్టమని ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా? అని ఆయన గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదని, ఇంకా ఎన్నికలు నిర్వహించకుండా 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతున్నా లెక్కచేయడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికైన సర్పంచ్‌లు లేకపోతే గ్రామ సభలు ఎలా జరుగుతాయని, అభివృద్ధి కార్యక్రమాల పరిస్థితి ఏమిటని నిలదీశారు.

రుణం చెల్లించకపోతే గేటు ఎత్తుకెళ్తారా: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అప్పు కింద ఆడబిడ్డల పుస్తెల తాళ్లను కూడా బ్యాంకులకు జమచేయించిన దుష్ట చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. అదే ఆనవాయితీని రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. బ్యాంక్ లోన్ కట్టలేదని జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన పాడి రైతు ప్రేమలత ఇంటి గేటును బ్యాంకు సిబ్బంది ఎత్తుకుపోవడంపై కేటీఆర్ 'ఎక్స్'లో స్పందించారు. 'సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు ఎంతటి అరిగోస పడ్డారో, తిరిగి అలాంటి పరిస్థితే మళ్లీ తెలంగాణలో దాపురించింది. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పులు కట్టకపోతే ఇళ్ల దర్వాజలు, కరెంటు మోటార్లు, స్టార్టర్లను అధికారులు ఎత్తుకుపోయేవారు. రుణం చెల్లించకపోతే ఇంటి గేటును తీసుకురావాలని చెప్పిన అధికారులకు, దొంగలకు తేడా లేదు. పేదలపై చూపిస్తున్న ఈ ప్రతాపాన్ని బ్యాంకు అధికారులు పెద్దలపై చూపించగలరా' అని కేటీఆర్ పేర్కొన్నారు.


ప్రాథమిక వైద్య సేవల్లో సర్కారు విఫలం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: పేదలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లాలో కీసర హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ మూతపడితే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ సహా నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో బస్తీ దవాఖానాల పనితీరు దుర్భరంగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని గురువారం ఆయన ఒక ప్రకటనలో నిలదీశారు. 'దవాఖానాల పనితీరుపై 14 నెలలుగా సమీక్ష నిర్వహించకపోవడంతో మూతపడ్డాయి. దీంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు అన్నారు.

సీఎంకు స్ట్రాంగ్ పిల్లర్స్ మేమే


జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల: సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఖండించారు. ఆయన గురువారం జడ్చర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు జిల్లా నుంచి సీఎం అయిన రేవంత్‌రెడ్డికి తామంతా స్ట్రాంగ్ పిల్లర్లుగా ఉన్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డికి తామెప్పుడూ మద్దతుగానే ఉంటామని స్పష్టం చేశారు. నిధుల కోసం తాము అంతర్గతంగా మాట్లాడుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు రేవంత్‌ను కలవనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నా..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ తెలిపారు. ప్రభుత్వం, పార్టీ అధిష్టానం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నట్లు మీడియాతో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఎలాంటి కుట్ర లేదని, శాస్త్రీయంగా జరిగిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఏ వర్గాన్ని దూరం చేసుకోదన్నారు. కులగణనలో కేసీఆర్, కేటీఆర్, డీకే అరుణ వంటి నాయకులు ఇప్పటికైనా పాల్గొనాలని సూచించారు.



న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్లు లేవు

పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను కోర్టులు కాపాడుతున్నాయి

- ఇండియాలో ఏక పార్టీ ఆధిపత్యం ఉత్తమాటే
- ప్రాంతీయ ఆకాంక్షలు, గుర్తింపునకు ప్రాధాన్యం పెరుగుతోంది
- జిల్లా స్థాయిలో కోర్టుల్లో పెరుగుతున్న మహిళల నియామకాలు

బీబీసీ ఇంటర్వ్యూలో మాజీ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడి

న్యూఢిల్లీ: భారతదేశం ఏకైక రాజకీయ పార్టీ ఆధిపత్యం చెలాయించే దేశంగా మారిపోతోందన్న వాదనను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తిరస్కరించారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు సైతం బలంగా ఉన్నాయని చెప్పారు. తాను సీజేఐగా పనిచేసినప్పుడు రాజకీయ పార్టీల నుంచి, ప్రభుత్వ వర్గాల నుంచి తనపై ఎలాంటి ఒత్తిళ్లు రాలేదని స్పష్టంచేశారు. ఇండియాలో న్యాయ వ్యవస్థ చట్టపరిధిలోనే పనిచేస్తోందని ఉద్ఘాటించారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్లు ఉన్నట్లు తాను భావించడం లేదన్నారు. తాజాగా బీబీసీ 'హార్డ్‌టాక్' ఇంటర్వ్యూలో జర్నలిస్టు స్టీఫెన్ సకర్ అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. పలు అంశాలను ప్రస్తావించారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ఆధిపత్యం కింద ఇండియా ఏక పార్టీ రాజ్యంగా మారుతోందన్న వాదనను తాను అంగీకరించలేనని పేర్కొన్నారు. ఈ మేరకు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వెలువడిన సంపాదకీయాన్ని ఖండించారు. అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ప్రాంతీయ పార్టీలతోపాటు రాష్ట్రస్థాయిలో రాజకీయాలకు ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పడానికి 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. ఇప్పుడు చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయని, దేశంలో ప్రాంతీయ ఆకాంక్షలు, గుర్తింపునకు ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోందని వివరించారు.

సుప్రీంకోర్టుపై ప్రజలకు విశ్వాసం

సొంత పార్టీ నాయకులను రక్షించుకోవడానికి, రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి న్యాయ వ్యవస్థపై అధికార పార్టీ ఒత్తిడి పెంచుతోందని ఆరోపించడం సరైంది కాదని జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అలాంటి ఒత్తిళ్లేవీ తనకు ఎదురు కాలేదన్నారు. పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అనర్హతకు గురయ్యారని, ఆ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిందని గుర్తుచేశారు. ఆయన పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగే అవకాశం కల్పించిందని అన్నారు. పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇండియా కోర్టులు స్థిరంగా పరిరక్షిస్తున్నాయని చెప్పారు. ఎన్నో కేసుల్లో నిందితులకు బెయిల్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడేందుకే కోర్టులు ఉన్నాయని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ఎన్నోసార్లు స్పష్టం చేసిందని వివరించారు. కొన్ని కేసుల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని, అయినప్పటికీ పౌరుల స్వాతంత్ర్యాన్ని కాపాడే విషయంలో సుప్రీంకోర్టు ముందు వరుసలో ఉంటోందని పేర్కొన్నారు. అందుకే ప్రజలు సుప్రీంకోర్టు పట్ల సంపూర్ణ విశ్వాసం చూపుతున్నారని వెల్లడించారు.

అది మర్యాదపూర్వక కలయిక

గత ఏడాది వినాయక చవితి సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో నిర్వహించిన వేడుకలకు ప్రధాని మోదీ స్వయంగా హాజరైన సంగతి తెలిసిందే. సీజేఐ ఇంటికి ప్రధాని రావడం అత్యంత అరుదు. ఈ ఉదంతం అప్పట్లో తీవ్ర వివాదాస్పదంగా మారింది. విపక్షాలు ఆరోపణలు గుప్పించాయి. సీజేఐని ప్రభావితం చేసేందుకు మోదీ యత్నించారని మండిపడ్డాయి. ఈ అంశంపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ మోదీ మర్యాదపూర్వకంగానే తన ఇంటికి వచ్చారని, దీనిపై అతి విశ్లేషణ అవసరం లేదన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లోని వ్యక్తుల మధ్య ఉండే కనీస మర్యాదలను అర్థం చేసుకొనేటంత పరిపక్వత మన వ్యవస్థకు ఉందని వ్యాఖ్యానించారు. ఇలాంటి మర్యాదపూర్వకమైన కలయికల ప్రభావం కేసుల విచారణపై ఎంతమాత్రం ఉండదన్నారు. ప్రధాని మోదీ తన నివాసానికి రాకముందు, వచ్చిన తర్వాత కూడా సుప్రీంకోర్టు ఎన్నో తీర్పులు వెలువరించిందని, ఇందులో ప్రభుత్వానికి ప్రతికూలంగా వచ్చిన తీర్పులు సైతం ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ న్యాయ వ్యవస్థ పాత్ర పార్లమెంట్‌లో ప్రతిపక్షం పోషించే పాత్రలాంటిది కాదని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. కేసులను విచారించడం, చట్టబద్ధమైన పాలన కొనసాగేలా చూడడం మాత్రమే న్యాయ వ్యవస్థ బాధ్యత అని తేల్చిచెప్పారు.

లింగ వివక్ష, వారసత్వ జాడ్యం లేదు

భారత న్యాయ వ్యవస్థపై అగ్రవర్ణ హిందూ పురుషులు పెత్తనం చెలాయిస్తున్నారని, ఇక్కడ కూడా వారసత్వ జాడ్యం కనిపిస్తోందన్న అభిప్రాయాన్ని జస్టిస్ చంద్రచూడ్ ఖండించారు. న్యాయ వ్యవస్థలో లింగ వివక్ష భారీగా తగ్గిపోయిందని అన్నారు. దేశవ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో కొత్తగా చేరుతున్న వారిలో 50 శాతానికిపైగా మహిళలే ఉంటున్నారని గుర్తుచేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య 60 నుంచి 70 శాతం ఉందన్నారు. న్యాయ విద్య మహిళలకు చేరువవుతోందని తెలిపారు. లా స్కూళ్లలో మహిళల ప్రవేశాలు పెరుగుతున్నాయని, వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు వారసత్వంగా కోర్టుల్లో చేరుతున్నట్లు తాను అనుకోవడం లేదన్నారు. తన తండ్రి వై.వి.చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారని గుర్తుచేశారు. సీజేఐగా ఉన్నంత కాలం కోర్టులో అడుగుపెట్టొద్దంటూ తన తండ్రి తనకు చెప్పారన్నారు. దీంతో హార్వర్డ్ లా స్కూల్‌లో మూడేళ్లు చదివానని, తన తండ్రి రిటైర్ అయిన తర్వాతే మొదటిసారి కోర్టులో అడుగుపెట్టానని వెల్లడించారు. ఇండియాలో చాలామంది లాయర్లు, జడ్జిలకు ఎలాంటి న్యాయ నేపథ్యం లేదన్నారు. అయోధ్య రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) వంటి కీలక అంశాలపై నిబంధనల ప్రకారమే తీర్పులు ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ స్పష్టంచేశారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత, రాజకీయ వాస్తవికతల మధ్య చక్కటి సమతుల్యత పాటిస్తూ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.

ఆర్ఆర్ఆర్‌కి నిధుల కొరత లేదు

ఆర్ అండ్ బీ ఆస్తుల సంరక్షణకు చర్యలు చేపట్టండి

- ఉద్యోగ కల్పన కేంద్రాలుగా బీసీ స్టడీ సెంటర్లు
- ప్రీ బడ్జెట్ సమావేశంలో మంత్రులు, అధికారులతో డిప్యూటీ సీఎం భేటీ



సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌ను వచ్చేనెల ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశాలను చేపట్టారు. గురువారం సచివాలయంలో ఆయా శాఖలకు కేటాయింపులకు సంబంధించి రహదారులు – భవనాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రులు, అధికారులతో సమావేశమయ్యారు, ఆర్అండ్‌బీకి సంబంధించి ఆర్ఆర్ఆర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని భట్టి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) 3డి డిజైన్లు వంటి పనులను సత్వరం పూర్తిచేయాలని, ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని భట్టి అధికారులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించాలని, విలువైన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వచ్చే రహదారులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం మేరకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టి నిధులు సద్వినియోగం చేయాలని ఆదేశించారు. కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సెక్రటరీ దాసరి హరిచందన, ఆర్థిక శాఖ సెక్రటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల, గురుకులాల బకాయిలు చెల్లిస్తాం..

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్ల, గురుకులాల అద్దె బకాయిలు వెంటనే చెల్లిస్తామని అందుకు, ప్రతిపాదనలు తీసుకురావాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రీబడ్జెట్ సమావేశం నిర్వహించారు. బీసీ స్టడీ సెంటర్లు ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని భట్టి అధికారులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలని కోరారు. డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షలపైన దృష్టి సారించాలని ఆదేశించారు. ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలు.. వాటి నిర్వహణకు అవసరమైన చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చించారు. ఆర్టీసీ ఆస్తులు, నిర్వహణ, ఆదాయ వనరులపై మంత్రులు అధికారులను అడిగారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

19న తెలంగాణ భవన్‌కు కేసీఆర్

అధినేత అధ్యక్షతన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

- పార్టీ రజతోత్సవాల నిర్వహణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణంపై చర్చించనున్న నేతలు
- పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్న మాజీ సీఎం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సుదీర్ఘ విరామం తర్వాత ఈ నెల 19న పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు రానున్నారు. పార్టీ ఆవిర్భవించి ఈ ఏడాది ఏప్రిల్‌కు 25 ఏళ్లు కానుంది. ఈ నేపథ్యంలో పార్టీ రజతోత్సవాల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ఈ నెల 19న బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే ఈ భేటీకి పార్టీ రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లా అధ్యక్షులు, తాజా, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, మాజీ జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలకు పార్టీ తరఫున ఆహ్వానం పంపించారు. కేసీఆర్ అధ్యక్షత న జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నిర్మాణానికి సంబంధించి దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.

బహిరంగ సభ వేదిక ఖరారు చేసే అవకాశం

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ అనుసరించాల్సిన కార్యాచరణపైనా ఈ భేటీలో సమగ్రంగా చర్చిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి పెంచడంతో పాటు ప్రజల హక్కులను కాపాడే దిశగా పార్టీ పరంగా నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. ఈ నెలాఖరులో బీఆర్ఎస్ సత్తా చాటేలా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో సభా వేదికను కూడా 19న జరిగే భేటీలో ఖరారు చేసే అవకాశముంది. ఆహ్వానితులు కచ్చితంగా హాజరు కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఆరు నెలల తర్వాత..

సుమారు ఆరు నెలల తర్వాత తెలంగాణ భవన్‌కు వస్తున్న పార్టీ అధినేత కేసీఆర్ పలు కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత ఏడాది జూలై 23న తెలంగాణ భవన్‌కు వచ్చిన కేసీఆర్ నేతలతో భేటీలో ప్రభుత్వ పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వంటి అంశాలను ప్రస్తావిస్తూ నేతలను తయారు చేసుకోవడం బీఆర్ఎస్‌కు కొత్త కాదంటూ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికే పరిమితం అయ్యారు. అక్కడే పార్టీ నేతలు, కార్యకర్తలతో భేటీ అవుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం పోరాటం

ప్రజలను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం

బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు




సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై పోరాటం చేసే దిశగా ప్రజలను సమాయత్తం చేయాలని సూచించారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ నాయకత్వంలో పలువురు గురువారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన తప్పుల తడకగా ఉందని ఈ సందర్భంగా కేసీఆర్ అన్నారు. గతంలో కంటి వెలుగు, కేసీఆర్ కిట్ వంటి పథకాలను అమలు చేయడానికి ముందు ప్రభుత్వ పరంగా లోతైన అధ్యయనం చేశామని తెలిపారు. కులగణన వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయాలపై కూడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. బీసీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విశేష కృషి జరిగిందని చెప్పారు. తమిళనాడులో బీసీ రిజర్వేషన్లపై రూపొందించిన పుస్తకాన్ని కేసీఆర్‌కు శుభప్రద్ పటేల్ అందజేశారు. ఆ రాష్ట్రంలో 69 శాతం కోటా ఉందన్న నివేదికలను ఇచ్చారు.

విభజనకు ముందు మిగులు.. తర్వాత అప్పుల కుప్ప

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

- సెంటిమెంట్‌ను అర్థం చేసుకొనే తెలంగాణకు న్యాయం చేస్తున్నాం
- చేతల్లో అభివృద్ధి చేసి చూపుతున్నాం
- పసుపు బోర్డు ఇచ్చింది, 'రామగుండం' పునరుద్ధరించింది మోదీనే
- రాష్ట్రానికి కేంద్రం అందించిన సాయంపై రాజ్యసభలో వివరణ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉందని, ఆ తర్వాత నుంచి అప్పుల కుప్పగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక రకాల అభివృద్ధి చర్యలు చేపట్టినప్పటికీ అప్పులు పెరిగాయని తెలిపారు. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు తెలంగాణకు మేము ఏమేం చేశామో వివరిస్తాం. ఆ పార్టీ, ఈ పార్టీ అని కాదు.. తెలంగాణ ప్రజల తరఫున మాట్లాడుతున్నాం. విభజన చట్టం అమల్లోకి రాకముందు తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉండేది. ఆ తర్వాత అప్పుల్లో కూరుకుపోయింది. నేను ఏ పార్టీని తప్పుపట్టట్లేదు. కానీ వాస్తవం ఇదే' అని ఆమె అన్నారు. గురువారం రాజ్యసభలో బడ్జెట్‌పై సమాధానమిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ సెంటిమెంట్‌ని అర్థం చేసుకున్నామని, ప్రజల ఆకాంక్షలను మాటల్లో కాకుండా చేతల ద్వారా నిజం చేస్తున్నామని స్పష్టం చేశారు. విపక్ష కాంగ్రెస్ సభ్యులు కేవలం ప్రశ్నలకు మాత్రమే పరిమితమైతే తాము మాత్రం అభివృద్ధి పనులన్నింటికీ కార్యరూపం ఇస్తున్నామన్నారు. ఈ క్రమంలో సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారం, పసుపుబోర్డు, సమ్మక్క గిరిజన యూనివర్సిటీ.. వంటివి ఏర్పాటు చేసి రాష్ట్రానికి న్యాయం చేస్తున్నామని తెలిపారు. ఇందిరాగాంధీ మెదక్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించినా.. జిల్లాకు రైల్వేల విషయంలో పెద్దగా చేసిందేమి లేదన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మోదీ పునరుద్ధరించడంతోపాటు దాని సామర్థ్యాన్ని 12.71లక్షల మెట్రిక్ టన్నులకు పెంచారని గుర్తుచేశారు. తెలంగాణలో అత్యంత నాణ్యమైన పసుపు పంట పండుతుందని, అందుకే నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేసింది కూడా మోదీయే అని విపక్షాలకు చురకలంటించారు.

ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్న అభివృద్ధి అంశాలు ఇవీ..

- వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు
- జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్
- సమ్మక్క గిరిజన వర్సిటీ
- బీబీనగర్‌లో ఎయిమ్స్
- 26,500 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం
- భారత్‌మాలలో భాగంగా 4 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ల ఏర్పాటు
- రైల్వే ప్రాజెక్టుల కోసం 5,337 కోట్లు కేటాయింపు
- ఎర్రుపాలెం – నంబూరు – మల్కాన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైలు మార్గం
- 753 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్‌లు
- 5 వందేభారత్ రైళ్లు
- 40 రైల్వేస్టేషన్‌ల పునరుద్ధరణ
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) కింద 2 లక్షల గృహాల నిర్మాణం
- స్వచ్ఛ భారత్ మిషన్ కింద 31లక్షల టాయిలెట్‌ల నిర్మాణం
- జల్‌జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్‌లు
- 82 లక్షల ఆయుష్మాన్ కార్డుల జారీ
- 199 జన ఔషధి కేంద్రాల ఏర్పాటు
- 1.21 లక్షల జన్‌ధన్ ఖాతాలు
- 75 లక్షల ముద్ర ఖాతాల మంజూరు
- రాష్ట్రంలో వెనుకబడిన తొమ్మిది జిల్లాలకు మొత్తం 2,700 కోట్ల నిధుల కేటాయింపు

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో రాక్షస పాలన

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో రాక్షస పాలన సాగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. ఆ పార్టీ నేతలు పాశ్చాత్య సంస్కృతిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి యువతను నాశనం చేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో యువతను మత్తులో ముంచి చిత్తు చేశాడని, డ్రగ్స్‌తో తెలంగాణను నాశనం చేస్తూ, తన బినామీకి క్యాసినో, కోళ్ల పందేలు అప్పగించాడని విమర్శించారు. కేటీఆర్, సంతోష్‌లకు వ్యాపార భాగస్వామిగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నాడని, బీఆర్ఎస్ హయాంలో సన్‌బర్న్ పార్టీల పేరుతో పాశ్చాత్య సంస్కృతిని హైదరాబాద్ తీసుకొచ్చారని ఆరోపించారు. కేటీఆర్, సంతోష్ కనుసన్నల్లోనే పోచంపల్లి ఫాంహౌస్ దందా నడిచిందని, జన్వాడ ఫాంహౌస్‌లో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లికి లింక్ ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఫాంహౌస్‌లలో క్యాసినో, పేకాట, కోళ్ల పందేలు నడిపిస్తూ తెలంగాణ సమాజాన్ని జూదం వైపు నెడుతున్నారని ఆయన విమర్శించారు. గతంలో రేవంత్‌రెడ్డి వైట్ చాలెంజ్ చేస్తే కేటీఆర్ హైకోర్టుకు వెళ్లి పరువు నష్టం కేసు పెట్టి తప్పించుకున్నారన్నారు.

రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అవుతాడు

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: సమయం వచ్చినప్పుడు రాష్ట్రానికి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని కాంగ్రెస్ ఎంపీ మల్లురవి జోస్యం చెప్పారు. మంత్రివర్గంలో బీసీ ఉప ముఖ్యమంత్రి ఎందుకు లేరనే ప్రశ్నకు ఆయన స్పందించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఓసీ నుంచి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్‌గా బీసీ సామాజికవర్గానికి చెందిన మహేష్‌గౌడ్ ఉన్నారని, సమయం వచ్చినప్పుడు బీసీ నేత సీఎం అవుతారన్నారు. మంత్రివర్గంలో 42 శాతం బీసీల వాటాపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, బల్‌రాం నాయక్‌లు విలేకరులతో మాట్లాడారు. కులగణనను మంత్రివర్గం, అసెంబ్లీలో ఆమోదింపచేసుకుంటామన్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వచ్చి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ ఎంపీలతో కలిసి ప్రధానిని కలుస్తామన్నారు. రాజకీయాలకతీతంగా ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్, బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు కూడా తమతో కలిసివచ్చి బీసీ బిల్లుపై ప్రధానికి బ్రీఫింగ్ చేయాల్సిన అవసరముందని సూచించారు.

ఎంపీల మధ్య పోటీ.. గందరగోళం: విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కాంగ్రెస్ ఎంపీలు పోటీ పడ్డారు. చామల కిరణ్‌కుమార్‌ను వద్దని వారిస్తూ మల్లు రవి చేయిపట్టి లాగారు. వాళ్లు అడుగుతున్నారు కదా.. సమాధానం చెప్పాలి కదా అంటూ చామల ఫైర్ అయ్యారు. మరోవైపు మల్లు రవి మాట్లాడుతుండగా బల్‌రాంనాయక్ సమాధానాలు చెప్పేందుకు ప్రయత్నించారు. నేతలు నేనంటే నేను అంటూ పోటీ పడడంతో కాసేపు గందరగోళం నెలకొంది.

నేను ఐఐటీ తెచ్చా.. మీరు ఐటీఐఆర్ తేగలరా?

బీజేపీ ఎంపీలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంగారెడ్డికి ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఐఐటీని తీసుకొచ్చానని, బీజేపీ ఎంపీలకు దమ్ముంటే హైదరాబాద్‌కు ఐటీఐఆర్ ప్రాజెక్టును తీసుకురావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి సవాల్ చేశారు. హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేయించాలని ఇప్పటికే మూడుసార్లు రాష్ట్ర బీజేపీ నేతలను కోరానని, మళ్లీ ఒక్కసారి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు గుర్తు చేస్తున్నానని వ్యాఖ్యానించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గెలిచినా, ఓడినా ఎప్పుడూ ప్రజల కోసం రాజకీయాల్లో లైవ్‌లోనే ఉంటానని చెప్పారు. తనకు పదవులు ముఖ్యం కాదని, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ లైన్‌లో పార్టీ అధిష్టానం ఏ పని చెప్పినా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు కవిత పింక్‌బుక్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ఖజానాలో ఉన్న డబ్బులన్నీ ఆమె తండ్రి కేసీఆర్ ఊడ్చుకుపోయారని, ఇప్పుడు ఖజానాలో బొక్కలు కూడా లేవని, ఏం చేయాలో అర్థం కాక సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిలు తలలు పట్టుకుంటున్నారన్నారు.

సవతి తల్లి ప్రేమను తెలంగాణ సహించదు

నిర్మల వ్యాఖ్యలపై ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: విభజన హామీలు అమలు చేయకుండా.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్న తీరును ప్రజలు ఇక సహించబోరని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో.. విభజనకు ముందు తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉండేదని.. ఇప్పుడు అప్పుల కుప్పగా మారిందని వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. పదేళ్లుగా తెలంగాణకు ఇచ్చిన హామీలు.. బయ్యారం స్టీల్‌ప్లాంట్, వివిధ కేంద్ర సంస్థల ఏర్పాటు కార్యరూపం దాల్చలేదన్నారు. కేంద్రంతోపాటు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు.

తెలంగాణకు పెట్టుబడులు

వెల్లువెత్తుతున్నాయి

హైబిజ్ టీవీ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మాదాపూర్: వాణిజ్యం, వ్యాపారం లేకుండా ప్రభుత్వాలు, వ్యవస్థలు నడవలేవని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2వ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కీలక రంగాలలో అమూల్యమైన సేవలు అందించిన వారికి అవార్డులను అందజేసినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏడాదికాలంలో ప్రభుత్వం వ్యాపారరంగ అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించిందని తెలిపారు. 2023లో తెలంగాణ అభివృద్ధి 2ఎక్స్‌గా ఉందని, రాబోయే నాలుగు సంవత్సరాలలో దాన్ని 10ఎక్స్‌కు చేరుస్తామన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రం సాధించడమే అందుకు నిదర్శనమని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నందుకు హర్షం వ్యక్తంచేశారు. పారిశ్రామిక రంగానికి ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 11 మందికి లెజెండ్ పురస్కారాలను అందజేశారు. సీఎస్ఆర్ కేటగిరీలలో ఉత్తమ గ్రూప్‌గా ఐటీసీకి అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, టీజీఐఐసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సుచిరిండియా సీఈఓ డాక్టర్ లయన్ వై.కిరణ్, భారతీ సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, హైబిజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పాఠాలు.. ఉద్యోగులకు శిక్షణ

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అడ్వాంటేజ్ తెలంగాణ'కార్యక్రమం ప్రారంభమైంది. మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు తెలంగాణలో స్టార్టప్ వాతావరణాన్ని బలోపేతం చేస్తాయి. ఏఐ టూల్స్‌తో, ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ సిటీలో 'ఏఐ ఎక్సలెన్స్ సెంటర్'ను ఏర్పాటు చేస్తోంది. ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను ఈ సెంటర్ అభివృద్ధి చేస్తుంది. ఆవిష్కరణలపై మైక్రోసాఫ్ట్‌కు ఉన్న నిబద్ధత తెలంగాణ పురోగామి విధానాలకు తోడ్పాటును అందిస్తుంది'అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

అతిపెద్ద డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 వేల కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. 'మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విద్యుత్ వాహనాల ఉత్పత్తి కేంద్రం, క్వాంటమ్ ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ తదితరాలతోపాటు మూసీ పునరుజ్జీవ పథకం ద్వారా హైదరాబాద్ సుస్థిర అభివృద్ధి సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌తో అనుబంధం కలిగిన మైక్రోసాఫ్ట్ రూ.15 వేల కోట్లతో భారీ ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్‌గా మారుతోంది. ఏఐ సిటీలో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది..'అని శ్రీధర్‌బాబు తెలిపారు.

ఎక్సలెన్స్ సెంటర్‌పై ఎంవోయూ

ప్రభుత్వ భాగస్వామ్యంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు ఏఐ నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో పెట్టుబడులు రెట్టింపు చేయడంతో పాటు, రాబోయే రోజుల్లో అదనంగా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. దీంతో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు అతిపెద్ద డేటా హబ్ గా అవతరించనుంది. ఇలావుండగా ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి మైక్రోసాఫ్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ, ప్రెసిడెంట్ రాజీవ్‌కుమార్, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధునాతన ప్రమాణాలతో కొత్త క్యాంపస్

మైక్రోసాఫ్ట్ గచ్చిబౌలిలో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన ప్రమాణాలతో కొత్త భవనం నిర్మించింది. ఈ సంస్థకు హైదరాబాద్‌లో ఇప్పటికే మూడు భవనాలు ఉన్నాయి. కొత్త క్యాంపస్‌లో 2,500 మంది ఉద్యోగులకు సరిపడా సదుపాయాలు ఉన్నాయి. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌కు 20 వేల మంది ఉద్యోగులు ఉండగా, సగం మంది హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నారు. కాగా నూతన భవన ప్రారంభం పురస్కరించుకుని సంస్థ గురువారం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలో 1.2 లక్షల మందికి ఏఐ సాంకేతికతలో శిక్షణ అందించేందుకు మూడు కొత్త కార్యక్రమాలను ప్రారంభించింది. 'అడ్వాంటేజ్ తెలంగాణ'పేరిట 500 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 50 వేల మంది విద్యార్థులకు ఏఐ పాఠాలతో శిక్షణ ఇస్తుంది. 'ఏఐ ఇండస్ట్రీ ప్రో'పేరిట 20 వేల మంది ఉద్యోగులకు ఏఐ నైపుణ్యంలో తర్ఫీదు ఇస్తుంది. 'ఏఐ గవర్నర్ ఇనిషియేటివ్'పేరిట సుమారు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ వంటి కీలక రంగాల్లో శిక్షణ ఇస్తుంది.



గూగుల్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

వివిధ రంగాల్లో విస్తృతంగా ఏఐ

- గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ
- వ్యూహాత్మక సహకారం అందించనున్న దిగ్గజ సంస్థ
- డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం
- పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులకు శ్రీకారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వినియోగాన్ని వేగవంతం చేసేందుకు దిగ్గజ ఐటీ సంస్థ గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం గురువారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. టీ హబ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. అనంతరం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. దీనిద్వారా రాష్ట్రంలో వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాల అమలు వేగవంతం కానుంది. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు గూగుల్ వ్యూహాత్మక సహకారం అందిస్తుంది. రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు, రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలో గూగుల్ భాగస్వామ్యం అవుతుంది.

తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్

గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టి ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సేవలను అందిస్తుంది. రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది.

ప్రభుత్వ లక్ష్య సాధనకు తోడ్పాటు: సీఎం

'ఏఐ ఆధారిత తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతో ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్‌తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది..'అని సీఎం రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఇంజనీరింగ్ సీట్లు నిండేనా?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించారు. గత ఏడాది ఎప్‌సెట్‌లో ఇంజనీరింగ్ విభాగానికే 2.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1.80 లక్షల మంది సెట్‌లో అర్హత పొందారు.

సీట్లకు డిమాండ్ తగ్గుతుందా?

రాష్ట్రంలో 174 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. వీటిల్లో మొత్తం 1,12,069 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద 70 శాతం సీట్లు భర్తీ చేస్తారు. 30 శాతం యాజమాన్య కోటా కింద భర్తీ అవుతాయి. గత ఏడాది మరో 3 వేల సీట్ల పెంపునకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతిచ్చినా, ప్రభుత్వం అనుమతివ్వకపోవటంతో కాలేజీలు కోర్టుకెళ్లి అనుమతి తెచ్చుకున్నాయి. దీంతో ఆ 3 వేల సీట్లను ఈసారి ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో అనుమతించాల్సి ఉంటుంది. ఏపీ విద్యార్థులు తగ్గడం, కొత్తగా సీట్లు పెరగడంతో ఈసారి ఇంజనీరింగ్ సీట్లకు డిమాండ్ తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో 58 శాతం ఇంజనీరింగ్ సీట్లు సీఎస్ఈ, కంప్యూటర్ అనుసంధాన డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లోనే ఉన్నాయి. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ సీట్లను తెలంగాణ విద్యార్థులు కొంత తేలికగానే పొందే వీలుంది.

వెంటాడుతున్న న్యాయ సమస్యలు

రాష్ట్ర విభజన సమయంలో పదేళ్లపాటు నాన్-లోకల్ కోటా అమలుకు రాష్ట్రపతి ఉత్తర్వులు ఇచ్చారు. గత ఏడాది ఎప్‌సెట్ నోటిఫికేషన్ సమయానికి పదేళ్లు పూర్తి కాలేదు కాబట్టి నాన్-లోకల్ కోటా అమలు చేశారు. అయితే, నాన్-లోకల్ కోటా ఎత్తివేసే ముందు రాష్ట్రపతి అనుమతి అవసరమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్‌కు అధికారికంగా తెలియజేయలేదు. రాష్ట్రపతి అనుమతి వచ్చిన తర్వాత మాత్రమే కోటా ఎత్తివేత జీవో ఇవ్వాలి. లేని పక్షంలో ఎవరైనా కోర్టుకెళ్తే న్యాయపరమైన చిక్కులు తప్పవని అధికార వర్గాలు అంటున్నాయి.



ప్రభుత్వానికి తెలిపాం

నాన్-లోకల్ కోటా ఎత్తివేత జీవో వచ్చిన తర్వాతే నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. విధి విధానాలు ఏ విధంగా ఉంటాయనేది ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక తెలుస్తుంది. ఇందుకు తగ్గట్టుగానే నిర్ణయాలు తీసుకుంటాం. - ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్.

సంవత్సరం	మొత్తం కాలేజీలు	ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు	ప్రైవేటు కాలేజీల్లో సీట్లు	మొత్తం సీట్లు	ప్రవేశాలు	శాతం
2020-21	186	3,151	95,837	98,988	65,720	66.39
2021-22	180	4,069	1,05,704	1,08,773	77,700	70.54
2022-23	178	4,825	1,03,890	1,11,769	82,350	76.37
2023-24	175	5,667	1,11,769	1,17,426	91,001	77.50
2024-25	174	5,907	1,05,573	1,12,069	95,230	78.05

హైదరాబాద్‌లోనూ కాన్‌స్టిట్యూషన్ క్లబ్

- అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో నిర్మించాలని సీఎం యోచన
- ఢిల్లీలోని క్లబ్‌ను సందర్శించనున్న ఆర్అండ్‌బీ అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డులో ప్రభుత్వం 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్'ను నిర్మించనుంది. ఢిల్లీలో ఉన్న కాన్‌స్టిట్యూషన్ క్లబ్ మాదిరిగా హైదరాబాద్‌లోనూ ఒకటి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఢిల్లీలో ఉన్న క్లబ్ నిర్మాణాన్ని చూసి, ఆ దిశగా ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను రేవంత్ ఆదేశించినట్లు తెలిసింది. ఈ వారంలో ఆర్అండ్‌బీ బృందం ఢిల్లీలో పర్యటించి, క్లబ్ నిర్మాణాన్ని పరిశీలించి ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. ఢిల్లీలో ఉన్న క్లబ్‌లో సమావేశ గదులు, కాఫీ షాప్, బిలియర్డ్స్ గది, జిమ్, సెలూన్, స్విమ్మింగ్‌పూల్, బ్యాడ్మింటన్ హాల్, విశ్రాంతి గదులు ఉన్నాయి. రాజ్యసభ, లోక్‌సభ సభ్యుల అవసరాల కోసం, పలు అంశాలపై సమావేశాలు నిర్వహించే లక్ష్యాలతో ఈ క్లబ్‌ను 1947లో నిర్మించారు. పార్లమెంట్ సమావేశాలు జరిగేటప్పుడు దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి వచ్చే ప్రజాప్రతినిధులు సమావేశాలు, సదస్సుల్లో పాల్గొనడానికి ఇదొక వేదికగా నిలుస్తోంది. ఇంతకంటే ఎక్కువ సౌకర్యాలతో హైదరాబాద్ అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో క్లబ్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారు. హైదరాబాద్‌కు ఒక ఐకానిక్‌గా నిలిచేలా నిర్మాణం చేయాలని, ఢిల్లీలో ఉన్న సౌకర్యాలకంటే ఎక్కువ సౌకర్యాలు ఇక్కడ ఉండేలా చూడాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. దీనితో అధికారుల బృందం ఢిల్లీ పర్యటించి సీఎంకు క్లియర్ రిపోర్టు ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

“ఎవడైతే ధనాన్ని కూడబెట్టి, మాటిమాటికి దాన్ని లెక్కబెడుతూ ఉంటాడో!
తన ధనం, తనను శాశ్వతంగా ఉంచుతుందని భావిస్తున్నాడు! ఎంతమాత్రం కాదు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 14 ఫిబ్రవరి 2025

‘సుప్రీం’ బోనులో ఈసీ

ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భాల్లో తప్ప వినబడని ఎన్నికల సంఘం(ఈసీ) పేరు ఇటీవలి కాలంలో తరచు వార్తల్లోకెక్కుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని ప్రచారం వరకూ... ఆ తర్వాత ఎన్నికల్లో పోలైన వోట్ల శాతం, వాటి లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకూ అన్ని దశల్లోనూ ఈసీపై నిందలు తప్పటం లేదు. తాజాగా ప్రజాతంత్ర సంస్కరణల సంఘం (ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తున్న సందర్భంగా ఈవీఎంల పరిశీలన ప్రక్రియ అమల వుతుండగా వాటి డేటాను తొలగించవద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాల్సి వచ్చింది. నిరుడు ఏప్రిల్‌లో ఈ విషయమై ఇచ్చిన ఆదేశాలను సరిగా అర్థం చేసుకుని, సక్రమంగా పాటిస్తే ఇలా చెప్పించుకోవాల్సిన స్థితి ఈసీకి ఉండేది కాదు. ఈవీఎంలనూ, దానికి అనుసంధానించి వుండే ఇతర యూనిట్లనూ భద్రపరిచే విషయమై సుప్రీంకోర్టు అప్పట్లో కీలక ఆదేశాలిచ్చింది. అవి సరిగా పాటించటం లేదని ఏడీఆర్ మరోసారి కోర్టును ఆశ్రయించింది. ఎన్నికల్లో పరాజితులై 2, 3 స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కనుక ఆ ఎన్నికను సవాలు చేసిన సందర్భాల్లో తనిఖీ చేయడానికి అనువుగా ఈవీఎంలతోపాటు, వాటిలో పార్టీల గుర్తులను లోడ్ చేయటానికి ఉపయోగించే సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యూ)లను సైతం 45 రోజులపాటు భద్రపరచాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఎన్నికల ఫలితంపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయటానికి పరాజిత అభ్యర్థులకుండే 45 రోజుల వ్యవధిని దృష్టిలో పెట్టుకుని ధర్మాసనం ఇలా ఆదేశించింది. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 5 శాతం ఈవీఎంలు, ఎస్ఎల్‌యూలను ఇంజనీర్ల, ఉత్పత్తిదారుల సమక్షంలో తనిఖీకి అనుమతించవచ్చని సూచించింది. వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కించే యంత్రాలు సమకూర్చుకునే ఆలోచన చేయాలని కూడా ఆ సందర్భంగా కోరింది. ఈ ఆదేశాల ఆంతర్యమేమిటో సుస్పష్టం. ఎన్నికలు న్యాయబద్ధంగా జరగడమే కాదు... అలా జరిగినట్టు కనబడాలంటే అంతా పారదర్శకంగా ఉండాలన్నది ధర్మాసనం ఉద్దేశం.

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల అనంతరం ఈవీఎంలూ, వీవీప్యాట్‌లూ, ఎస్ఎల్‌యూల పరిశీలన విషయంలో ఈసీ కొన్ని నియమ నిబంధనలు విడుదల చేసింది. న్యాయస్థానం ఆదేశాలకూ, ఆ నియమ నిబంధనలకూ ఎక్కడా పొంతన లేదు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనూ 5 శాతం ఈవీఎంలు తనిఖీ చేయాలని ధర్మాసనం ఇచ్చిన ఆదేశానికి ఈసీ వేరే రకమైన భాష్యం చెప్పింది. వినియోగించిన ఈవీఎంలలో ఏ పార్టీకి ఎన్ని వోట్లు లభించాయో చూసి, వీవీ ప్యాట్ స్లిప్‌లు దానికి అనుగుణమైన సంఖ్యలో ఉన్నాయా లేదా అన్నది తేలిస్తే వేరే రకంగా ఉండేది. కానీ ఈసీ చేసిందల్లా ఇతరత్రా గుర్తులతో మళ్లీ నమూనా పోలింగ్ నిర్వహించి ఈవీఎంల డేటాకూ, వీవీప్యాట్ స్లిప్‌ల సంఖ్యకూ మధ్య తేడా లేదని నిరూపిస్తే చాలని భావించింది. అంతేకాదు... ఆ నమూనా పోలింగ్ కోసం ఈవీఎంలలోని డేటాను ఖాళీ చేసింది! ఈవీఎంలు సరిచూడాలని అభ్యర్థులు కోరటం అంటే తమ సమక్షంలో ఈవీఎంలలో ఉన్న సాఫ్ట్‌వేర్‌నూ, హార్డ్‌వేర్‌నూ ఇంజనీర్లు పరిశీలించాలని... వీవీ ప్యాట్ స్లిప్‌ల సంఖ్య ఈవీఎంల డేటాతో సరిపోయిందో లేదో చూడాలని అడగటం. ఈసీ అనుసరించిన ప్రక్రియకూ, అభ్యర్థులు కోరుకునేదానికీ పొంతన ఎక్కడైనా ఉందా? ఈ మాత్రానికే అభ్యర్థులనుంచి ఈవీఎంకు రూ. 40,000 చొప్పున వసూలు చేయటం సిగ్గనిపించ లేదా? చిత్రమేమంటే... ఒక్కో ఈవీఎం తయారీకి ఖర్చయ్యేది కేవలం రూ. 30,000! గత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, ఒడిశాల నుంచి 11 మంది అభ్యర్థులు ఈవీఎంలూ, వీవీప్యాట్ స్లిప్‌ల పరిశీలన కావాలన్నారని, అంతా పూర్తయ్యాక ఎక్కడా తేడా కనబడలేదని ఈసీ తేల్చింది. దేశవ్యాప్తంగా చూస్తే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇటువంటి అభ్యర్థనలే 83 వరకూ రాగా, అంతా సవ్యంగానే ఉన్నదని నిర్ధారణ అయిందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 45 రోజులలోపు ఈవీఎంల డేటా తొలగించరాదన్న నిబంధనను సైతం ఈసీ ఉల్లంఘించింది. ఒకపక్క ఈవీఎంల పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతుండగా ఇలా చేయటం అనుమానాలను మరింత పెంచుతుందన్న ఇంగితజ్ఞానం దానికి లేకపోయింది.

మేమిచ్చిన ఆదేశాలేమిటో, మీరు అనుసరించిన ప్రక్రియేమిటో వివరిస్తూ వచ్చే నెల 3లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించటం హర్షించదగ్గది. అసలు 45 రోజుల్లోపే డేటాను ఎందుకు తొలగించాల్సివచ్చిందో కూడా ఈసీనుంచి సంజాయిషీ కోరాలి. ఇక పోలింగ్ శాతంపై ఈసీ విడుదల చేసిన ప్రకటనలు మరింత చిత్రంగా ఉన్నాయి. ఏడు దశల్లో జరిగిన పోలింగ్‌లో 3.2 శాతం నుంచి 6.32 శాతం వరకూ వోట్లు పెరిగినట్టు ఈసీ తేల్చింది. ఈ పెరిగిన వోట్ల శాతం ఆంధ్రప్రదేశ్‌లో 12.54 శాతం, ఒడిశాలో 12.48 శాతం ఉంది. పోలింగ్ ముగిసిన రాత్రి ఏపీలో 68 శాతం వోట్లు పోలయ్యాయని ప్రకటించగా, తుది ప్రకటనలో అది కాస్తా 81 శాతానికి ఎగబాకింది. ఈవీఎంల చార్జింగ్ పెరగటం మరో కథ! ఈ మార్పుల వెనకున్న మంత్రమేమిటో చెప్తే అందరూ విని తరిస్తారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ఎంతో నిష్ఠగా నిర్వహించాల్సిన క్రతువు. ఒక రాజ్యాంగ సంస్థ అయివుండి, నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన ఈసీ అందుకు భిన్నమైన పోకడలను ప్రదర్శించటం దానికి ఎంతమాత్రమూ గౌరవప్రదం కాదు. ఈసీ తీరు గమనించాక చాలామంది మళ్లీ బ్యాలెట్ పత్రాలకు మళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. ఈసీ బాణీ మారకపోతే చివరకు బ్యాలెట్ పత్రం విధానం కోసం జనం ఎలుగెత్తే రోజులు రావటం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.విదియ రా.8.55 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పుబ్బ రా.10.32 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.6.22 నుండి 8.06 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.38 వరకు, తదుపరి ప.12.40 నుండి 1.28 వరకు, **అమృతఘడియలు:** ప.3.40 నుండి 5.23 వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

విధాన లోపాలే మణిపూర్‌కు శాపం

విశ్లేషణ


అజయ్ కె. మెహ్రా

మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ఎట్టకేలకు ఈ నెల 9న రాజీనామా చేశారు. సుమారు 21 నెలలపాటు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిన తెగల కొట్లాటలకు ఈయన ఆజ్యం పోశారని అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలో హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమైన కొద్ది సమయానికి సీఎం తన పదవికి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మణిపూర్‌లో దీర్ఘకాలం కొనసాగిన అనిశ్చితి, ద్వేషపూరిత వాతావరణం కారణంగా మాన భంగాలు, హత్య, విధ్వంసాలు రాజ్యమేలిన సంగతి తెలిసిందే.

దేశ ఈశాన్య ప్రాంతం ఒకప్పుడు ఉగ్రవాదానికి, చొరబాట్లకు, మత్తుమందులకు, ఆయుధాల అక్రమ తరలింపులకు కేంద్రంగా ఉండిందనీ, ప్రస్తుతం అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులకు మారుపేరుగా నిలిచిందనీ అమిత్ షా పేర్కొనడం గమనార్హం. దశాబ్ద కాలంలో కేంద్ర మంత్రులు ఈ ప్రాంతాన్ని 700 సార్లు సందర్శించారని కూడా ఆయన అన్నారు. అగర్తలలో కొంతమంది యువకులకు ఉద్యోగ నియామక పత్రాలను అందించే కార్యక్రమానికి ఆన్‌లైన్‌మాధ్యమంలో హాజరైన హోం శాఖ మంత్రి మాట్లాడుతూ, త్రిపుర సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. ఆశ్చర్యకరంగా ఇదే రకమైన భరోసా, సాంత్వన మాటలు మణిపూర్ విషయంలో ఈ నేత నుంచి వెలువడలేదు!

వ్యతిరేకత స్పష్టమయ్యాకే...

బీరేన్ సింగ్ రాజీనామాకు కొన్ని రోజుల క్రితం అమిత్ షా మణిపూర్ పంచాయతీ రాజ్ మంత్రి, సీఎం వ్యతిరేకి వై.ఖేమ్‌చంద్ సింగ్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ టోక్‌చోమ్ సత్యబ్రత సింగ్‌లతో సమావేశమయ్యారు. బీజేపీ ఎమ్మెల్యేల్లో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మంది సత్యబ్రతను కలిసి సీఎం నేతృత్వం పట్ల తమ అసంతృప్తిని స్పష్టం చేశారు. ప్రజలు, రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తాము నిర్దిష్ట నిర్ణయాలు తీసుకుంటామనీ, ఇంకా వేచి ఉండటం సాధ్యం కాదని కూడా వీరు తేల్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పునరుద్ధరణ తక్షణం జరగాలనీ, లేదంటే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కొన్ని అనూహ్య పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుందనీ వీరు హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 10న ప్రారంభం కావాల్సి ఉండగా... సీఎం రాజీనామాతో అవి నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు త్రిపురలో జరిగిన కార్యక్రమంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలతోనూ విభేదించడం గమనార్హం.

2023 మే నెలలో మణిపూర్‌లో రెండు తెగల మధ్య హింస మొదలైనప్పటి నుంచి బీరేన్ సింగ్ నాయకత్వం మీద అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది. అయితే ప్రధాని, హోంశాఖ, బీజేపీ అధిష్ఠానం బీరేన్‌ను పదవి నుంచి తప్పించేందుకు ఇష్టపడలేదు. ఈ సమయంలోనే రాష్ట్రంలో నేతల మధ్య కుమ్ములాటలు అంతకంతకూ పెరగడం మొదలైంది. కుకి–జో వర్గానికి చెందిన పది మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తామని ప్రకటించారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలైన నాగాస్ పీపుల్స్ ఫ్రంట్, జనతా



దళ్(యునైటెడ్) ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నాయి. ఈ క్రమంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేసింది. అవిశ్వాస తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అయితే హోం శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేసి, 2024 డిసెంబర్‌లో మణిపూర్ గవర్నర్‌గా నియమితులైన అజయ్ భల్లాకు రాష్ట్ర రాజకీయ, శాంతి భద్రతల పరిస్థితుల మీద స్పష్టమైన అవగాహన ఉంది. ఆయన తన అనుభవంతో రాజకీయ సంక్షోభాన్ని నియంత్రించగలిగారని అంచనా.

ఘర్షణల్లో సీఎం పాత్ర?

అయితే రాష్ట్రంలో తెగల మధ్య కొట్లాటను సీఎం స్వయంగా ఎగదోశారన్న ఆరోపణలు వచ్చిన తరువాత పరిస్థితి ఆసక్తికరమైన మలుపు తిరిగింది. మానవ హక్కులపై ఏర్పాటైన కుకీ సంస్థ ఒకటి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కొట్లాటల్లో సీఎం ప్రమేయంపై ఆడియో టేపులు ఉన్నాయని ఈ సంస్థ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. ఈ టేపులను పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్)కి పంపడమే కాకుండా... ఆరు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు ఈ టేపులను విశ్లేషించిన ట్రూత్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ సర్వీసెస్ అందులోని గొంతు 93 శాతం బీరేన్ సింగ్‌దేనని స్పష్టం చేసింది.

ట్రూత్‌ల్యాబ్ ఫలితాలు, సీఎఫ్ఎస్ఎల్‌తో సరిపోలితే దాని ప్రభావం మణిపూర్ రాజకీయాలపై మాత్రమే కాకుండా... జాతీయ స్థాయిలోనూ తీవ్రంగానే ఉండనుంది. బీరేన్ సింగ్ బీజేపీ అధిష్ఠానం, కేంద్ర ప్రభుత్వాలకు అనుగుణంగానే పనిచేశారు. ఘర్షణలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించినా పార్టీ కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ ఆయన్ని తొలగించేందుకు ఇష్టపడకపోవడమే అందుకు నిదర్శనం. ప్రతిపక్షం బీరేన్‌సింగ్‌ను తొలగించేందుకు ఒత్తిడి తీసుకురావడమే కాకుండా... బీజేపీ కేంద్ర నాయకత్వంపై కూడా విమర్శల దాడికి సిద్ధమైంది. బీరేన్ సింగ్ కూడా మోదీ–షా తరహా హిందుత్వ రాజకీయాల స్ఫూర్తితో మెయితీలందరినీ ఒక ఛత్రం కిందకు తీసుకురాగా... ఆర్ఎస్ఎస్ తన వంతు పాత్రను పోషించింది.

మయన్మార్‌తో మణిపూర్ సుమారు 390 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును కలిగివుంది. ఈ సరిహద్దులో కంచె వేసిన ప్రాంతం 10 కిలోమీటర్లు మాత్రమే. చొరబాట్లకు కుకీ–జో తెగలు కారణమనీ,

మణిపూర్‌లో తెగల మధ్య కొట్లాటను ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ స్వయంగా ఎగదోశారన్న ఆరోపణలు వచ్చిన తరువాత పరిస్థితి మలుపు తిరిగింది. ఫిబ్రవరి 9న ఆయన రాజీనామా అనంతరం, ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించారు.


ఎన్. బీరేన్ సింగ్

మణిపూర్‌లో కేవలం మెయితీ, కుకీ రెండు తెగలే లేవు. హమార్, వైఫీ, గాంగ్టే, కోమ్, చిరు, ఆనల్, మారింగ్ తెగలూ ఉన్నాయి. వేర్వేరు తెగలు ఉన్న ఇలాంటి రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను ఏర్పరచడం మేలు.

అందువల్లనే రాష్ట్రంలో అశాంతి పెరిగిపోతోందనీ బీజేపీ ఆరోపిస్తుంటే... ఆ తెగల ప్రతినిధులు మాత్రం ఘర్షణలను ఎగదోసేందుకు బీరేన్ సింగ్ ఈ చొరబాట్లను ఒక నెపంగా వాడుకున్నారని ఆరోపిస్తున్నారు. మయన్మార్ సరిహద్దులో మొత్తం కంచె వేయడం భౌగోళికంగా అసంభవమని తెలిసినా, అవినీతి ఆర్థికశాస్త్రంలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలున్నాయి.

స్వపరిపాలనే మార్గం

ఈ ప్రాంతంలో మత్తుమందుల రవాణా విచ్చలవిడిగా కొనసాగేందుకు మయన్మార్, థాయ్‌ల్యాండ్ సరిహద్దులు అంత సురక్షితంగా లేకపోవడమే కారణం. అక్రమ రవాణా, మత్తుమందుల వ్యాపారాలతో వచ్చే ఆదాయం సహజంగానే ఆయా ప్రాంతాల్లో అధికారంలో ఉన్న పార్టీలకు వెళ్తుంది. మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ వీటికి అతీతంగా పనిచేస్తుందని అనుకోలేము.

వేర్వేరు తెగలు ఉన్న మణిపూర్ వంటి రాష్ట్రాల్లో సమాఖ్య తరహా పాలన, స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం మేలని నేను చాలాకాలంగా సూచిస్తూ ఉన్నాను. ఈ ఏర్పాట్ల వల్ల వేర్వేరు స్థాయిల్లో స్వపరిపాలనకు మార్గం ఏర్పడుతుంది. మణిపూర్‌లో కేవలం రెండు తెగలు మాత్రమే లేవు. హమార్, వైఫీ, గాంగ్టే, కోమ్, చిరు, ఆనల్, మారింగ్ తెగలూ ఉన్నాయి. కానీ మోదీ ప్రభుత్వం, బీజేపీ రెండూ తమకు రాజకీయంగా లాభం ఉంటే తప్ప స్వపరిపాలన వ్యవస్థల ఏర్పాటుకు అనుకూలంగా ఉండవు. ప్రకృతి వనరులు, అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న పర్వత ప్రాంతాల్లో కుకీలు ఎక్కువగా ఉంటారు. వీరికి స్వపరిపాలన మార్గం చూపితే అక్కడ కేంద్ర ప్రభుత్వానికి దగ్గరైన కార్పొరేట్ కంపెనీల ఆటలు చెల్లవు. దశాబ్ద కాలం అధికారంలో ఉన్నప్పటికీ మణిపూర్‌లాంటి సంక్షోభాలు తలెత్తిన ప్రతి సందర్భంలోనూ బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తూంటుంది. అయితే కాషాయ పార్టీ స్వయంగా కొట్లాటలకు ఆజ్యం పోసిన సందర్భంలో మాత్రం ఈ విమర్శలకు విలువ ఉండదు. అన్నింటికీ మించి అందరం అడగాల్సిన ప్రశ్న ఒకటి ఉంది... ఈ కల్లోలం నుంచి మణిపూర్ బయటపడే రోజు ఎప్పుడొస్తుంది?

వ్యాసకర్త పొలిటికల్ సైంటిస్ట్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

యూరప్ బాధ్యత



నాటో సభ్యత్వం ఇక ఉక్రెయిన్‌కు రాదని అర్థమైపోయింది కాబట్టి, అది మనుగడ సాగించడానికి ఉన్న ఏకైక వాస్తవిక మార్గం అణ్వాయుధాలు పొందడం. అమెరికా వెనకడుగు వేసిన నేపథ్యంలో, ఆ బాధ్యత యూరప్‌లో ఆ శక్తి ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల మీద పడుతుంది.

– వెలీనా త్చకరోవా, అంతర్జాతీయ వ్యవహారాల వ్యాఖ్యాత

వృద్ధిపై దృష్టి



నేను ఐటీ మనిషిని కాదు, కానీ ఒక విషయం చెప్పగలను. చైనీయుల్లా లెనోవో లేదా డీప్‌సీక్ లాంటి కృత్రిమ మేధను వృద్ధి చేయకుండా భారతీయులు కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా ఉంటూ, ఇతరుల కోసం పనిచేయడం కొనసాగిస్తూ పోతే భారత ఆర్థిక వ్యవస్థ సగానికి సగం పడిపోతుంది.

– ఫ్రాంకోయిస్ గోచే, ఫ్రెంచ్ ఇండియన్ జర్నలిస్ట్

మంచికి పోతే...



జనాభా విపరీతంగా పెరగకుండా దక్షిణాది రాష్ట్రాలు భారతదేశాన్ని కాపాడాయి. అది చేసినందుకు వాటికి ప్రతిఫలం దక్కాలిగానీ, శిక్ష పడకూడదు.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్సియల్ ప్లానర్

సహాయకారి



ఓ మంచి వార్త: గాజాలోకి 800 ట్రక్కుల ‘ఎయిడ్’ (సహాయం) వచ్చింది. పదహారు నెలల్లో ఇదే అతి పెద్దది. ఇలా సహాయం వస్తూనే ఉండాలి. బంధితులు అందరూ విడుదల కావాలి.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ కార్యకర్త

ఒక్కరి కోసం...



దక్షిణాఫ్రికాలోని కొన్ని గ్రామాల్లో ఎవరైనా తప్పు చేసినప్పుడు, జనం వాళ్ల చుట్టూ చేరి తప్పుచేసినవాళ్ల మంచితనాన్ని గుర్తుచేస్తారు. తప్పు చేసినవారికి సహాయం అవసరమనీ, సిగ్గు పడేలా చేయడం కంటే ఐక్యత మరింతగా బాగు చేస్తుందనీ వాళ్ల నమ్మకం. దీన్నే ‘ఉబంటు’ అంటారు. ఒక్కరి కోసం అందరు నిలబడటం!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

మానవాళి మనుగడ



మానవాళికి అవసరమైనంత స్థాయిలో ఉండే నైతిక, మేధా, సౌందర్య, సాంస్కృతికత దాని ఆధ్యాత్మికతను ఏర్పరుస్తుంది. అది మానవీయ నాగరికతను సృష్టించడానికీ, సుదూర భవిష్యత్తు కోసం మరింత పట్టుదలతో కృషి చేయడానికీ వీలు కల్పిస్తుంది.

– జాఫర్ మీర్జో, రచయిత


ఇది వేరే!



నేను ఏళ్ల తరబడి చిరుధాన్యాల ఆహారానికి మద్దతిస్తున్నాను. కానీ రాగులను బెల్లం ద్రావకంతో కలిపి ‘హాట్ చాకొలేట్’ అనడాన్ని మాత్రం ఒప్పుకోలేను.

– నందితా అయ్యర్, కాలమిస్ట్

ప్రేమ



ఏ సంబంధమూ లేని
మన మనసుల్ని కలిపే
ఒక అపురూప శక్తి ప్రేమ!

గుండె నుండి గుండె వరకు
తరంగంలా ప్రవహించే
వలపు తడి ప్రేమ!

ఒక్క చిరునవ్వుతో
అందమైన విశ్వాన్ని సృష్టించే
అద్భుత శక్తి ప్రేమ!

– చిత్రాడ కిశోర్ కుమార్

ప్రేమ వల

తెలియని వల ఏదో
అకస్మాత్తుగా పట్టి బంధిస్తుంది
అలా చిక్కుకోవడమే
అదృష్టమనిపిస్తుంది
మాటలూ, నవ్వులూ, ఆశ్చర్యాలూ
చిత్రంగా కట్టి పడేస్తుంటాయి!
ఇద్దరిలో ప్రతి ఒక్కరికీ
ఒకరికొకరు ఆయువు పట్టనిపిస్తుంది
కాలం మలుపు తిరిగినపుడు
దుఃఖం అలంకరించుకుని వస్తుంది
మనసు నది మధ్యలోన
అలల ఉధృతి పెరిగి పోతుంది

ప్రేమలో మునిగి ఉన్నప్పుడు
రూపాలు చంద్రబింబంలా ఉంటాయి
కానీ విఫలమైనప్పుడు
మచ్చలు మాత్రమే మిగిలుంటాయి
ఆత్మా దేహాలుగా మసలిన ఇద్దరూ
ఒకరికొకరు విడిపోయినపుడు
నిండు పున్నమి వెన్నెల కూడా
అమావాస్య చీకట్లో కలిసినట్లుంటుంది
సప్త సముద్రాలను దాటిన వారైనా
విరహ మడుగు దాటలేక పోతారు

– ర్యాలి ప్రసాద్
(నేడు ప్రేమికుల దినోత్సవం)

మానవత్వంతో వ్యవహరించాలి!

డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలు ఎల్లప్పుడూ జాత్యహంకారంతో, ద్వంద్వ నీతితో, మానవ గౌరవాన్ని పూర్తిగా విస్మరించే ధోరణితో ముడిపడ్డవే. విద్య, ఉద్యోగం, మంచి భవిష్యత్తు కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులను అవమానకరంగా వెనక్కి పంపింది. వీళ్లంతా నేరస్తులు కాదు. ఆ దేశం అక్రమ వలసదార్ల వల్ల భారీ లాభాలు గడించింది. వలసదార్ల రంగు నలుపైనా, చట్టం అక్రమ వలసదార్లని చెప్పినా, వారి సాంకేతిక నైపుణ్యం అమెరికన్ కార్పొరేట్లకి అంటరానిది కాదు. ట్రంప్ సర్కార్ వచ్చాక మన వాళ్ళను క్రిమినల్స్‌లాగా వేటాడి నిర్బంధించింది. సంకెళ్ళతో అమెరికా సైనిక విమానాల్లో కుక్కి అమృతసర్‌లో దింపేసి వెళ్ళింది. అది ఆ 104 మందికే కాదు మొత్తం 140 కోట్ల భారతీయులకూ అవమానమే!

అమెరికా నుంచి భారత్‌కు చేరుకున్న వారిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. వారి దీన గాథలు వింటే కడుపు తరుక్కుపోతుంది. ఏజంట్ల మాటలకు మోసపోయి లక్షలు చెల్లించి వెళ్లిన వీరు అమెరికా భూమిపై అడుగు పెట్టడానికి పడిన పాట్లు వర్ణనాతీతం. మైళ్ల కొద్దీ కాలినడక, చిన్నబోటులో ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణించి అమెరికా గడ్డపై కాలు పెట్టడం, ఆ వెంటనే వీరిని అదుపులోకి తీసుకున్న అధికారులు చీకటి గదుల్లో బంధించడం... వీరి ప్రస్థానంలో మరపురాని ఘట్టాలు. అక్కడ వేలాది మంది పంజాబీ యువకులూ, పిల్లలూ కనిపించారనీ, అందరిదీ ఒకటే దుఃస్థితి అనీ తిరిగివచ్చిన వారు చెబుతున్నారు.

ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లిన విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తే తప్ప



అక్కడ జీవించే పరిస్థితి లేదు. అమెరికా పంపేందుకు ఇక్కడ బ్యాంకుల ద్వారా రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అప్పు చేసి ఇంకా కొంత మంది ఆస్తులు తాకట్టు పెట్టి విదేశాలకు పంపించారు. చదువు పూర్తయిన తర్వాత కూడా ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) పూర్తి చేసి ఏదో ఒక కంపెనీలో పార్ట్ టైం జాబ్ చేస్తూ కొంతలో కొంత మిగుల్చుకుని తల్లిదండ్రులకు పంపేవారు. ఇక్కడి తల్లిదండ్రులు వారి పిల్లల కోసం చేసిన అప్పులు తీర్చడానికి ఆ డబ్బులు జమచేస్తూ ఉంటారు. చదువు కోసం వెళ్లిన వారు కూడా ఏదో ఒక పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ తల్లిదండ్రులకు భారం కాకుండా చూసుకునే వారు. కానీ ఇప్పుడు విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగాలు విద్యా సంస్థలు, యూనివర్సిటీ క్యాంపస్‌ల బయట చేయడానికి వీలు లేదన్న నిబంధనను గట్టిగా అమలు చేయడానికి ప్రయత్నిస్తుండడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు నెలకు రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకూ పంపించాల్సి వస్తోంది. అట్లాంటా, ఒహాయో, క్యాలిఫోర్నియా, న్యూజెర్సీ, న్యూయార్క్, చికాగో, డల్లాస్‌లలో తెలుగు విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. ఇది ఒక సమస్య అయితే ఓపీటీ పూర్తయిన తర్వాత ఏ ఉద్యోగం దొరక్క అమెరికాలో ఏదో ఒక పని చేసుకుంటూ జీవించే వారిపై ట్రంప్ ప్రభుత్వం కక్షకట్టింది. అక్కడ ఒత్తిడిలో ఉన్న యువత ఫోన్లు ఎత్తకపోతే కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వారు ఏ ఆపదలో ఇరుక్కుపోయారో అనే ఆందోళన ఇందుకు కారణం. ఇది కేవలం భారతీయులకు, భారత దేశానికి చెందిన సమస్యే కాదు. ఎన్నో ప్రపంచ దేశాల సమస్య. అందుకే ట్రంప్ దుందుడుకు విధానాలపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా మానవత్వంతో వ్యవహరించాలి.

– వెంకటేష్, పీడీఎస్‌యూ
మొబైల్ : 73966 95586

స్నేహం – బంధుత్వం

ఇరువురు వ్యక్తుల మధ్య స్నేహం ఒక్కనాటి ముచ్చటతో వృద్ధి పొంది స్థిరపడేదిగా ఉండదు. ఏదో ఒక సందర్భంలో ఏర్పడిన ప్రథమ పరిచయం, ఆ తరువాత మరి కొన్ని సందర్భాలలో వారు కలుసుకుని కొనసాగిస్తే వృద్ధి చెందడం మొదలవుతుంది. అలా వృద్ధి చెందడం మొదలైన మరి కొన్నాళ్ళకు గాని పరిచయాలు స్నేహాలుగా మారే దారిలో కుదురుకోవు. అలా కుదురుకున్న తరువాత కూడా, ఒక పరిచయం స్థిరమైన స్నేహంగా మారడానికి మరి కొంత సమయం పడుతుంది. బంధుత్వాల విషయంలో సైతం ఇదే సూత్రం దాదాపుగా పనిచేస్తుంది. అయితే స్థిరపడడం అన్న స్థితి బంధుత్వానికి ప్రత్యేకంగా ఉండదు. కొనసాగించడం, కొనసాగించకపోవడం అన్నవి బంధుత్వం విషయంలో కుదరవు. ఇష్టమున్నా లేకున్నా ఇరువురు వ్యక్తుల మధ్య, ఆ వ్యక్తులకు సంబంధించిన కుటుంబాల మధ్య బంధుత్వం కొనసాగుతుంది. స్నేహ, బంధుత్వాల విషయంలో సహాయ సహకారాలు ఒకరి నుండి ఒకరు పొందడం ఎంతగా కొనసాగితే, అంతగా అవి వృద్ధిచెందుతాయి.

తే. ఓడగట్టిన దూలమై యుండవలయు / మీకు మాకును నెనరైన మిత్రభావ / మింటికిన్ వచ్చుచుం బోవు చుంట మేలుం

‘ఓడకు కట్టిన దూలము’ అనే నానుడి ఇరువురు వ్యక్తుల మధ్య గాఢ స్నేహాన్ని, విడదీయరాని అనుబంధాన్ని సూచించడానికి పూర్వ కాలం జన సామాన్యం సంభాషణలలో విరివిగా వాడబడిన నానుడి అనడానికి పద్య సాహిత్యంలో అది దక్కించుకున్న స్థానం నిదర్శనం. ఓడకు కట్టిన దూలం ఓడతోనే ఎంత దూరమైనా ప్రయాణిస్తుంది. కష్టసుఖాలన్నిటిలో తోడుగా ఉండడం విడదీయరాని స్నేహానికి మూలసూత్రం. ఈ సూత్రానికి ‘ఓడకు కట్టిన దూలం’ ఒక గొప్ప ప్రతీక. సముద్రంలో ఓడ ప్రయాణం సాఫీగా సాగుతున్నప్పుడు, ఓడలా సాఫీగానే దూలం కూడా ఎంత దూరమైనా ప్రయాణిస్తుంది. తుపానులో చిక్కుకుని కష్టాలలో పడినప్పుడు, ఓడతో పాటు దూలం కూడా కష్టపడుతుంది. ఇరువురు వ్యక్తుల మధ్య స్నేహం, బంధుత్వం అలా ఉండాలని ‘ఓడకు కట్టిన దూలం’ ప్రతీకలో వ్యక్తమవుతుంది. స్నేహితులైనా, బంధువులైనా ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ ఉండడం మేలును కలగజేస్తుంది. బంధం నిలబడడానికి ఈ రాకపోకలు ఎంతగానో ఉపకరిస్తాయి అని తెనాలి రామకృష్ణకవి ‘ఉద్భటారాధ్య చరిత్రం’ ద్వితీయాశ్వాసంలోని పై పద్యంలో చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నాంపల్లి కోర్టుకు మంత్రి కొండా సురేఖ



సిటీ కోర్టులు: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్)లో జరిగింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే నాగార్జునతోపాటు సాక్షుల వాంగ్మూలం రికార్డు చేసుకున్న కోర్టు, ప్రతివాది అయిన మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. మంత్రి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని సూచించింది. అయితే గతంలో అసెంబ్లీ సమావేశాలు, ఇతర కారణాల నేపథ్యంలో ఆమె కోర్టుకు రాలేకపోయారు. గురువారం జరిగిన విచారణకు ఆమె కోర్టు ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు.. వ్యక్తిగత బాండ్‌తోపాటు రూ.10 వేల పూచీకత్తును సమర్పించాలని మంత్రికి సూచించింది. తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- చంద్రుగొండ కేజీబీవీలో కలకలం

చంద్రుగొండ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం వసతిగృహంలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హాస్టల్ లో.. ఈనెల 11వ తేదీ రాత్రి నిద్రపోతున్న పదో తరగతి విద్యార్థినులు కాకటి స్వశ్చిత, గోపిక కాళ్లపై ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని విద్యార్థినులు బుధవారం ఉదయం స్పెషలాఫీసర్ కవితకు తెలియజేయగా.. ప్రభుత్వ ఆస్పత్రిలో వారికి చికిత్స చేయించారు. అయితే, విషయం బయటకు చెప్పొద్దని హెచ్చరించినట్లు తెలిసింది. కానీ తల్లిదండ్రులకు తెలియడంతో.. వారు చేసిన ఫిర్యాదుపై గురువారం ఎంఈవో సత్యనారాయణ హాస్టల్‌ను తనిఖీ చేశారు.

అప్పులు తీర్చలేక ఆత్మాహుతి

- భార్య, కూతురికీ నిప్పంటించేందుకు యత్నం



మల్లేశం

కొండపాక(గజ్వేల్): అప్పులు తీర్చే మార్గం లేక ఒక వ్యక్తి తన ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మాహుతికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మంగోల్‌లో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన పాట్లోళ్ల మల్లేశం (35)కు వ్యవసాయ భూమి లేదు. అప్పులు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దాన్ని ఇతరుల వ్యవసాయ పనుల కోసం ఉపయోగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై.. కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. ఈనెల 10న రాత్రి భార్య నీలతో గొడవ పడి ఇంట్లోని డీజిల్‌ను ఆమెపై, కూతురిపై పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. దీంతో భార్య.. కూతురిని తీసుకుని బయటకు పారిపోయింది. అనంతరం మల్లేశం ఒంటిపై డీజిల్‌ను పోసుకొని నిప్పంటించుకోవడంతో.. భార్యతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పేశారు. వెంటనే మల్లేశంను అంబులెన్సులో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో.. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రూపాయి వెలవెల.. వంటనూనె సలసల

రూపాయి విలువ తగ్గుదలతో పెరుగుతున్న ధరలు

నూనెల దిగుమతిపై భారీగా సుంకం విధిస్తున్న కేంద్రం.. నెలరోజుల్లో లీటర్‌పై 10 నుంచి 15 శాతం పెరిగిన భారం



సాక్షి, హైదరాబాద్

అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గుతుండడంతో దేశీయంగా వంటనూనెల ధరలకు రెక్కలొస్తున్నాయి. జనవరి 24వ తేదీ నుంచి రూపాయి విలువ భారీగా పడిపోవటంతో, వంటనూనెల ధరల్లోనూ మార్పులు వచ్చాయి. రాష్ట్రంలో 20 రోజుల క్రితం ధరలతో పోల్చితే ప్రస్తుతం నూనెల ధరలు 10 నుంచి 15 శాతం పెరిగాయి. మూడేళ్ల క్రితం రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు వంట నూనె ధరలు భారీగా పెరిగాయి. లీటర్ సన్‌ఫ్లవర్ నూనె రూ.200 వరకు చేరింది. పామాయిల్ ధరలు కూడా అప్పుడు భారీగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవటంతో ధరలు దిగివచ్చినప్పటికీ.. లీటర్ నూనె ధర ఆయా కంపెనీల విలువను బట్టి రూ.125 పైనే కొనసాగింది. గత ఏడాది సెప్టెంబర్‌లో కేంద్రం నూనెలపై దిగుమతి సుంకాన్ని భారీగా పెంచింది. సన్‌ఫ్లవర్, సోయాబీన్ ముడి నూనెలపై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి ఏకంగా 27.5 శాతానికి పెంచింది. రిఫైన్డ్ నూనెలపై సుంకాన్ని 13.7 శాతం నుంచి 35.7 శాతానికి పెంచింది. దీంతో మరోసారి దేశంలో వంటనూనెల ధరలకు రెక్కలొచ్చాయి. రూపాయి మారకం విలువ పడిపోతుండటంతో 20 రోజుల క్రితం వరకు రిటైల్ మార్కెట్‌లో రూ.135 ఉన్న లీటర్ వంటనూనె ధర.. ప్రస్తుతం రూ.150 దాటింది.

60 శాతం దిగుమతే..

మనదేశంలో వినియోగించే వంటనూనెలో 60 శాతానికి పైగా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. నవంబర్ నుంచి ఆ తర్వాతి ఏడాది అక్టోబర్ వరకు నూనె సంవత్సరంగా అంతర్జాతీయంగా పేర్కొంటారు. గత నూనె సంవత్సరంలో అత్యధికంగా 164.7 లక్షల మెట్రిక్ టన్నుల నూనెను భారత్ దిగుమతి చేసుకుంది. ఇందుకోసం రూ.1,38,424 కోట్లను వెచ్చించింది. భారత్‌కు నూనెను ఎగుమతి చేసే దేశాల్లో ఇండోనేషియా, అర్జెంటీనా మొదటి రెండు స్థానాల్లో ఉండగా, పామాయిల్‌ను మలేషియా అధికంగా ఎగుమతి చేస్తోంది. బ్రెజిల్ నుంచి సోయాబీన్, రష్యా నుంచి క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్, ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ నూనెను దిగుమతి చేసుకుంటున్నాం. దిగుమతి చేసుకున్న నూనెలకు డాలర్ల రూపంలో చెల్లిస్తుండడంతో ఆ ప్రభావం రిటైల్ నూనెల మార్కెట్‌పై పడుతోంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్ నూనెల ధరలు ఆయా కంపెనీలను బట్టి రూ.150 నుంచి రూ.170 వరకు ఉన్నాయి. కాగా దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో ఐదు నెలల కనిష్ట స్థాయి 4.31 శాతానికి తగ్గింది. ఇది 2024 డిసెంబర్‌లో 5.22 శాతం ఉండగా, ఏడాది క్రితం 5.1 శాతంగా ఉంది.

రామగుండం ఎన్టీపీసీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న సీజీఎం చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి రెండు స్వర్ణశక్తి అవార్డులు లభించాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో గురువారం నిర్వహించిన ఇండియన్ పవర్ స్టేషన్స్ సదస్సులో.. సంస్థ సీఎండీ గురుదీప్‌సింగ్ నుంచి రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ సామంత అవార్డులు అందుకున్నారు. హిందీ భాషను విస్తృతంగా ప్రచారం చేయడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్వర్ణశక్తి–2023, 24 రాజభాష అవార్డు, విద్యుదుత్పత్తిలో ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అవార్డులు అందుకున్నట్లు అధికారులు వివరించారు.

3 'ఎమ్మెల్సీ'ల బరిలో 90 మంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఈ నెల 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 10న పూర్తయిన విషయం తెలిసిందే. స్క్రూటినీ అనంతరం మూడు స్థానాల్లో మొత్తం 90 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వరంగల్–ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మెదక్– నిజామాబాద్– కరీంనగర్– ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానంలో 56 మంది, ఉపాధ్యాయుల నియోజకవర్గ స్థానంలో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

సచివాలయంలో రెయిలింగ్ కూలడంపై కోమటిరెడ్డి ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ భవనం దక్షిణం వైపున ఐదో అంతస్తు నుంచి బుధవారం రెయిలింగ్ పట్టి కూలడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 1,200 కోట్లతో కట్టిన భవనంలో అప్పుడే ఇలాంటి ఘటనలు జరగడం ఏంటని భవన నిర్మాణం చేసిన షాపూర్‌జీ పల్లోంజి కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై వివరణ ఇచ్చేందుకు గురువారం మంత్రి కోమటిరెడ్డిని షాపూర్‌జీ పల్లోంజి కంపెనీ ప్రతినిధులు కలిశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని, ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి వారికి సూచనలు చేశారు. పెచ్చులూడనున్న ప్రాంతాలను పసిగట్టాలని, పగుళ్లను గుర్తించాలని ఆదేశించారు. మరోవైపు రెయిలింగ్ పట్టి కూలిపోయి 24 గంటలైనా బిల్డింగ్ ఇంజనీర్లు నివేదిక ఇవ్వకపోవడంపై ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్ సీరియస్ అయ్యారు. శుక్రవారంలోగా పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయ నిర్మాణంలో లోపాలు, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో చెప్పాలని సూచించారు.

మెగావాట్‌కు వ్యయం రూ.16.7 కోట్లు

- రూ.13,360 కోట్లతో రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రానికి అంచనాలు
- డీపీఆర్‌ను ఆమోదించిన జెన్‌కో పాలక మండలి
- దేశంలోనే అత్యధిక అంచనా వ్యయం అంటున్న అధికారవర్గాలు

సాక్షి, హైదరాబాద్: రామగుండంలో 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) పాలక మండలి పచ్చజెండా ఊపింది. రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా అధ్యక్షతన గురువారం విద్యుత్ సౌధలో సమావేశమైన జెన్‌కో పాలక మండలి.. ఈ మేరకు డీపీఆర్‌ను ఆమోదించింది. మెగావాట్‌కు రూ.16.7 కోట్ల చొప్పున 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించడానికి రూ.13,360 కోట్ల అంచనాతో డీపీఆర్ రూపొందించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. రామగుండంలో జెన్‌కోకి చెందిన 62.5 మెగావాట్ల థర్మల్ బీ స్టేషన్ కాలం చెల్లడంతో గతేడాది మూసేశారు. దీని స్థానంలోనే కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. దీనిని సింగరేణి, జెన్‌కో ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మిస్తామని గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించగా, పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మిస్తామని ఇటీవల భట్టి హామీ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

యాదాద్రి, భద్రాద్రి కంటే ఎక్కువే..

రామగుండం విద్యుత్ కేంద్రం నిర్మాణానికి మెగావాట్‌కు రూ.16.7 కోట్లతో రూపొందించిన అంచనాలు దేశంలోనే ఇప్పటి వరకు అత్యధికమని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక శాసనసభలో విద్యుత్‌పై పెట్టిన శ్వేతపత్రం ప్రకారం.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మెగావాట్‌కు వ్యయం రూ.6.27 కోట్ల చొప్పున 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రూ.25,009 కోట్లతో అంచనాలను సిద్ధం చేయగా, నిర్మాణ దశలో ఖర్చు మెగావాట్‌కి రూ.8.64 కోట్లకు పెరిగి మొత్తం వ్యయం రూ.34,543 కోట్లకు ఎగబాకింది. ఇక మెగావాట్‌కి రూ.6.75 కోట్లు చొప్పున 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి డీపీఆర్‌ను సిద్ధం చేయగా, నిర్మాణం పూర్తయ్యే సరికి వ్యయం మెగావాట్‌కి రూ.9.74 కోట్లకు పెరిగింది. ఈ లెక్కన రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం పూర్తయ్యే సరికి మెగావాట్‌కి రూ.20 కోట్లకు మించిపోవచ్చని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. దీని అంచనా వ్యయం ప్రాథమిక దశలోనే అసాధారణంగా ఉండడంతో నిర్మాణం పూర్తయ్యే సరికి మరింతగా పెరిగి ప్రజలపై భారం పడే అవకాశాలున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనిట్ విద్యుత్ ధర రూ.10కి మించి తుందని చెబుతున్నారు.

ఇసుక రీచ్‌లపై పర్యవేక్షక బృందాలు

- లారీల ఓవర్ లోడింగ్‌ను అరికట్టాలి
- సమీక్షలో గనులశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: ఇసుక తవ్వకాలు, తరలింపు, విక్రయాలకు సంబంధించి రీచ్‌లవారీగా పర్యవేక్షణకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ ఆదేశించారు. రీచ్‌లు, స్టాక్ యార్డులకు మధ్య లారీలను అనుమతించకూడదని స్పష్టం చేశారు. స్టాక్ యార్డుల వద్దకు అనుమతులు ఉన్న లారీలను మాత్రమే అనుమతించాలని, ఓవర్ లోడింగ్ జరగకుండా చూడాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) కార్యాలయంలో గురువారం ఇసుక తవ్వకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బల్క్‌గా కేటాయించిన ఇసుకను తరలించే విషయంలో ఎలాంటి కాల పరిమితి లేదని శ్రీధర్ తెలిపారు. శుక్రవారం నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థను నిరంతరం తెరిచే ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశం అనంతరం రోడ్లు భవనాలు, నీటిపారుదల, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారులతోనూ శ్రీధర్ సమావేశమయ్యారు. ఆయా విభాగాలకు ఈ ఏడాది మార్చి 31 నాటికి అవసరమయ్యే ఇసుక పరిమాణంతోపాటు 2025–26వ సంవత్సరంలో ప్రాజెక్టులవారీగా ఎంత మొత్తంలో ఇసుక అవసరం అనే వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో గనుల శాఖ డైరెక్టర్ శశాంక్, టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

- బీసీ సంఘాల ప్రతినిధుల విన్నపం



మహేశ్‌గౌడ్, పొన్నం ప్రభాకర్‌లను సత్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, చిరంజీవులు

సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. గురువారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్ గౌడ్, ఈరవత్రి అనిల్, బీసీ సంఘాల నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, వినయ్ కుమార్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, దాసు సురేశ్ తదితరులు సమావేశమయ్యారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని వారికి.. ఈ నెల 16 నుండి 28 తేదీల మధ్య అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

25న బెంగళూరులో ఓబీసీ జాతీయస్థాయి సదస్సు: కృష్ణయ్య

ఈ నెల 25న బెంగళూరులో ఓబీసీ జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి గురువారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు బలవన్మరణం

మిర్యాలగూడ టౌన్: అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లోకేశ్ తెలిపిన వివరాలు.. ఎర్రకాలువ తండాకు చెందిన నానావత్ హర్యా (50) ఎకరం 10 గుంటల భూమిలో సేద్యం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీనికి తోడు ఇటీవల కూతురు వివాహానికి అప్పు తీసుకురావడంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. అంతేకాకుండా పొలానికి నీరు సరిగా అందకపోవడంతో పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో హర్యా మనస్తాపానికి గురయ్యాడు. అత్తగారి ఇంటి వద్ద ఉన్న కూతురు కోసం అల్లుడికి ఫోన్ చేశాడు. బిడ్డని చూడాలని ఉందని.. తీసుకురమ్మని చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. ఏం జరిగిందో కాసేపటికే పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగ్‌పూర్ హైవే 'ప్రైవేటు పరం'

- టీఓటీ పద్ధతిలో రూ.6,661 కోట్లకు అప్పగించిన ఎన్‌హెచ్‌ఏఐ
- గతంలో ఓఆర్‌ఆర్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై దుమారం

సాక్షి, హైదరాబాద్: నిధుల సమీకరణే లక్ష్యంగా భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) తెలంగాణలోని ఓ జాతీయ రహదారిని ప్రైవేటుపరం చేసింది. రోడ్డు మీద ఉన్న టోల్ బూత్‌ల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయటం ద్వారా నిర్ధారిత కాలానికి టోల్ వసూలు అంచనా మేరకు లెక్కగట్టి మొత్తాన్ని ఒకేసారి వసూలు చేసుకునేందుకు ప్రారంభించిన టీఓటీ (టోలింగ్, ఆపరేషన్, మెయింటెనెన్స్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఓ జాతీయ రహదారిని ప్రైవేటుకు అప్పగించింది. టెండర్ పద్ధతిలో ఆ రోడ్డు బాధ్యతను పొందిన సంస్థ గురువారం అర్ధరాత్రి నుంచి దానిపై టోల్ వసూలు ప్రారంభించింది.

20 ఏళ్ల కాలానికి...: హైదరాబాద్–నాగ్‌పూర్ (ఎన్‌హెచ్ 44) జాతీయ రహదారి ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహణలో ఉంది. 251 కి.మీ. నిడివి గల ఈ రోడ్డును తాజాగా టీఓటీ పద్ధతిలో ప్రైవేటు సంస్థకు అప్పగించింది. గత సెప్టెంబరులో టెండరు పిలవగా, నార్త్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఆ సంస్థ వచ్చే 20 ఏళ్లపాటు ఆ రోడ్డు నిర్వహణను పర్యవేక్షిస్తుంది. ఈ రోడ్డుపై ఆరు టోల్ ప్లాజాలుండగా, ఒకటి ఇప్పటికే ప్రైవేటు ఆధీనంలో ఉంది. మిగతా ఐదు టోల్‌బూత్‌లను ఎన్‌హెచ్‌ఏఐ ఇప్పుడు టీఓటీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించింది. వచ్చే 20 ఏళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి టీఓటీ మొత్తంగా ఆ సంస్థ రూ.6,661 కోట్లను ఎన్‌హెచ్‌ఏఐకి ఈనెల 12న జమచేసింది. ఇక టోల్ వసూలు బాధ్యత ప్రైవేటు సంస్థ చేపడుతుంది. ఈ 20 ఏళ్లపాటు రోడ్డు నిర్వహణ బాధ్యత ఆ సంస్థదే. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే తరహాలో ఔటర్ రింగురోడ్డు (ఓఆర్‌ఆర్)ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఆ నిర్ణయం పెద్ద వివాదాస్పదమైంది. ప్రైవేటు సంస్థ చెల్లించిన మొత్తం కంటే టోల్ ఆదాయం చాలా ఎక్కువగా ఉంటుందని వైరి పక్షాలు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. కాగా, ప్రైవేటు సంస్థలు కేంద్రం నిర్ధారించిన మేరకే టోల్ వసూలు చేయాల్సి ఉంటుందని, సొంతంగా టోల్ ధరలను సవరించుకునే అధికారం వాటికి ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. కానీ, చాలా సంస్థలు, ఆశించిన స్థాయిలో వాహన సంచారం లేనందున తమకు నష్టం వస్తోందనే సాకుతో టోల్ పెంచుకునేందుకు ప్రతిపాదిస్తుండటం గమనార్హం.

ముగ్గురు అదనపు జడ్జీల శాశ్వత హోదాకు కేంద్రం ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయగా, రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ ముగ్గురు న్యాయ మూర్తులు 2023, జూలై 31న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన విషయం తెలిసిందే. కాగా, శాశ్వత న్యాయ మూర్తులుగా జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్, జస్టిస్ కె.సుజన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

మీరు అడిగినన్ని ఇళ్లు ఇవ్వం

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంపై భారం తగ్గుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి గరిష్టంగా రూ.5 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించినందున, ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర చొప్పున ఖర్చు తగ్గుతుంది. కానీ, కేంద్రం దేశంలోని మొత్తం పట్టణ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 4 శాతమని తేల్చింది. ఈ లెక్కన రాష్ట్రానికి 4 లక్షల యూనిట్లు, రూ.6 వేల కోట్లు రానున్నాయి. ఇదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం అధికంగా ఉంటుంది. కేంద్రం నుంచి నిధులు బాగా తగ్గనుండటంతో, సొంతంగా నిధులు సమీకరించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీంతో కేంద్రంపై మళ్లీ ఒత్తిడి పెంచి మనసు మార్చాలని భావిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో..

ఇక గ్రామీణ ప్రాంతాల్లో 2 కోట్ల ఇళ్లను నిర్మించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా,. తెలంగాణకు సంవత్సరానికి లక్షన్నర వరకు మంజూరయ్యే అవకాశం ఉంది. కానీ, వీటి లెక్కలను మాత్రం కేంద్రం ఇంకా తేల్చలేదు. అర్బన్ యూనిట్లతో పోలిస్తే ఇవి రెట్టింపు సంఖ్యలో మంజూరవుతాయని రాష్ట్రం అంచనా వేస్తోంది. వీటి యూనిట్ కాస్ట్ తక్కువ అయినందున, వాటి వల్ల రాష్ట్ర ఖజానాకు అంతగా ఉపయోగం ఉండదు.

చాలా రాష్ట్రాల్లో రూ.2.5 లక్షలే..: చాలా రాష్ట్రాల్లో పేదల ఇళ్ల నిర్మాణ పథకం యూనిట్ కాస్ట్ రూ.రెండున్నర లక్షలుగా ఉంటోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే.. కేంద్రం ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర ఇస్తుంటే, మిగతా మొత్తాన్ని రాష్ట్రం భరిస్తే సరిపోయేది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా ఖరారు చేసింది. పట్టణ ప్రాంత ఇళ్ల యూనిట్ కాస్ట్‌ను కేంద్రం రూ.2.25 లక్షలకు పెంచుతుందని తొలుత ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యూనిట్ కాస్ట్‌లో 45% కేంద్రమే భరించినట్టవుతుందని భావించింది. కానీ, కేంద్రం ఆ యూనిట్ కాస్ట్‌ను పెంచకుండా రూ.లక్షన్నరనే కొనసాగించి తొలి షాక్ ఇవ్వగా, ఇప్పుడు యూనిట్ల సంఖ్యను తగ్గించి రెండో షాక్ ఇచ్చింది. కాగా, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రం వద్ద పలుకుబడి ఉపయోగించి ఈ యూనిట్ల సంఖ్యను పెంచేలా చూడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

సుప్త చేతనావస్థలో అసెంబ్లీ • కేంద్రం నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ: జాతుల వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. రాష్ట్ర అసెంబ్లీని సుప్త చేతనావస్థలో ఉంచుతూ కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రాజకీయ అనిశ్చితి నడుమ 9వ తేదీన బీజేపీకి చెందిన సీఎం బిరేన్ సింగ్ పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అసెంబ్లీ గడువు 2027 వరకు ఉంది. అయితే, దాదాపు 21 నెలలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న హింసలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. 'గవర్నర్ అజయ్ భల్లా నుంచి అందిన నివేదికతోపాటు, ఇతర సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్న మీదట, భారత రాజ్యాంగానికి లోబడి అక్కడ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందనే నిర్ణయానికి వచ్చాను. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను అనుసరించి రాష్ట్ర పరిపాలన బాధ్యతలను గవర్నర్‌కు అప్పగిస్తున్నాను'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. బిరేన్ రాజీనామా అనంతరం సీఎం అభ్యర్థిత్వం విషయంలో బీజేపీ ఎమ్మెల్యేల్లో ఏకాభిప్రాయం కొరవడింది. అదే సమయంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంటూ కాంగ్రెస్ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఇలా ఉండగా, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చిన నేపథ్యంలో భద్రతా బలగాలు హై అలెర్ట్ ప్రకటించాయి. నిషేధిత ఉగ్ర ముఠాలు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. రాజధాని ఇంఫాల్‌లో అస్సాం రైఫిల్స్, పారా మిలటరీ బలగాలు ఫ్లాగ్ మార్చ్ చేపట్టనున్నాయి. ముఖ్యంగా ఇంఫాల్ లోయలో విధుల్లో ఉన్న బలగాలు అప్రమత్తమయ్యాయి.

11వ సారి రాష్ట్రపతి పాలన

1951లో మణిపూర్ అవతరించాక రాజ్యాంగంలోని 356ను అనుసరించి రాష్ట్రపతి పాలన విధించడం ఇది 11వ సారి. చిట్టచివరి సారిగా 2001 జూన్ 2న మొదలైన రాష్ట్రపతి పాలన 277 రోజుల తర్వాత 2002 మార్చి 6న ముగిసింది. మళ్లీ 23 సంవత్సరాల అనంతరం మణిపూర్ ప్రజలు రాష్ట్రపతి పాలన కిందికి వచ్చినట్లయింది.

ఘర్షణల నీడన

ఇంఫాల్ లోయలో మెజారిటీ మైతేయి, కుకీ తెగల మధ్య 2023 మేలో మొదలైన హింసాత్మక ఘర్షణల్లో ఇప్పటి వరకు 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. ఈ పరిస్థితుల్లో అక్కడ రాజకీయ పరమైన శూన్యత ఆవరించింది. రాష్ట్రంలో హింసను అదుపు చేసి, ప్రశాంతత నెలకొల్పడంలో కేంద్రం, రాష్ట్రం విఫలమయ్యాయంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి చేస్తోంది. సీఎం బిరేన్ సింగ్ రాజీనామాకు సైతం పట్టుబట్టింది. గత నవంబర్‌లో సంకీర్ణంలోని కొన్రాడ్ సంగ్మాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలున్న నేషనల్ పీపుల్స్ పార్టీ ప్రభుత్వం నుంచి వైదొలగింది. అసెంబ్లీలోని మొత్తం 60 సీట్లకుగాను అధికార బీజేపీకి 32 మంది సభ్యుల బలముంది. అయితే, వీరిపై రాజకీయ పరమైన ఒత్తిళ్లతో పాటు ప్రజాగ్రహాన్నీ చవిచూస్తున్నారు. బీజేపీకి చెందిన 32 మందికిగాను 12 మంది నాయకత్వాన్ని మార్చాల్సిందేనంటూ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. తాజా మాజీ సీఎం బిరేన్ సింగ్ హింసను ప్రేరేపించారంటూ ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ అందుకు ఆడియో టేపులను బయటపెట్టింది. ఈ టేపులు అసలైనవేనంటూ ఫోరెన్సిక్ ల్యాబ్ సైతం ధ్రువీకరించి సుప్రీంకోర్టుకు నివేదించడం ఈ పరిస్థితిని మరింత దిగజార్చింది. దీంతో, సీఎం పదవికి బిరేన్ రాజీనామా చేశారు. రాష్ట్రపతి పాలనపై కాంగ్రెస్ స్పందించింది. 'మేం 20 నెలలుగా చేస్తున్న డిమాండ్ నెరవేరింది. మణిపూర్ రాష్ట్రపతి పాలన కిందికి వచ్చింది'అని పేర్కొంది.

నియంత్రణ రేఖ వద్ద పాక్ కాల్పులు!

- భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టినట్లు వార్తలు
- అందులో వాస్తవం లేదన్న భారత సైన్యం
- ఎల్‌ఓసీ వద్ద పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడి

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ జవాన్లు ఉల్లంఘించినట్లు వార్తలు రావడం కలకలం సృష్టించింది. జమ్మూకశ్మీర్‌లో పూంచ్ జిల్లాలోని మెంధార్ సెక్టార్‌లో బుధవారం రాత్రి పాకిస్తాన్ సైనికులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా కాల్పులు జరపగా, భారత జవాన్లు గట్టిగా తిప్పికొట్టారని, పాక్ సైన్యానికి భారీగా ప్రాణనష్టం వాటిల్లిందని కొన్ని ప్రసార మాధ్యమాలు వెల్లడించాయి. అయితే, ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని భారత సైనికాధికారులు గురువారం స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఎల్‌ఓసీ వద్ద కాల్పుల విరమణ ఒప్పందం యథాతథంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడించారు. ఎల్‌ఓసీ సమీపంలోని ఐఈడీ పేలుడు సంభవించినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి చిన్నచిన్న ఘటనలు సాధారణమేనని స్పష్టంచేశారు. ఇరుపక్షాల మధ్య కాల్పులు గానీ, భారీ ఆయుధాల వినియోగం గానీ జరగలేదని తేల్చిచెప్పారు. నియంత్రణ రేఖ వద్ద భారత సైనిక బలగాలు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నాయని సైనికాధికారులు తెలియజేశారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని 2021 ఫిబ్రవరి 25న నవీకరించారు. అప్పటి నుంచి ఎల్‌ఓసీ వద్ద కాల్పులు చోటుచేసుకున్న ఉదంతాలు అంతగా లేవు. అరుదుగా కాల్పులు జరిగినా వాటి తీవ్రత తక్కువే. ఇరుపక్షాలు ఒప్పందానికి కట్టుబడి ఉంటున్నాయి.

రక్షణ, భద్రతలపై ఫలవంతమైన చర్చలు

అమెరికా భద్రతా సలహాదారు మైకేల్ వాల్జ్‌తో మోదీ భేటీ

తులసి గబార్డ్‌తోనూ సమావేశం

వాషింగ్టన్: అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జ్‌తో ప్రధాని మోదీ గురువారం భేటీ అయ్యారు. రక్షణ, సాంకేతికత, భద్రత వంటి అంశాలపై వారు చర్చించారు. మైఖేల్ వాల్జ్‌జీతో ఫలవంతమైన చర్చ జరిగిందని 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు. భారత్‌కు ఆయన గొప్ప స్నేహితుడు అని కొనియాడారు. భారత్– అమెరికా సంబంధాల్లో రక్షణ, సాంకేతికత, భద్రత.. అత్యంత ముఖ్యమైన కోణాలని, వీటిపై తమ మధ్య ఫలప్రదమైన చర్చ జరిగిందని మోదీ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సెమీకండక్టర్స్, అంతరిక్ష రంగంలో పరస్పర సహకారానికి ఎన్నో అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ భేటీలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సైతం పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన ముగించుకున్న మోదీ స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 5.30 గంటలకు అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.కి చేరుకున్నారు. ప్రవాస భారతీయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం, మోదీ మోదీ అంటూ నినదించారు. చలి వణికిస్తున్నా, వర్షం పడుతున్నా లెక్కచేయకుండా మోదీకి స్వాగతం పలకడానికి తరలివచ్చారు. నగరం నడిబొడ్డున ఉన్న చరిత్రాత్మక బ్లెయిర్ హౌస్‌లో మోదీ బస చేశారు. రాజధానిలో అడుగుపెట్టిన తర్వాత మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత్–అమెరికా మధ్య సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం కోసం ఆసక్తి ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. భారత్, అమెరికా ప్రయోజనాలు కాపాడడంతోపాటు మన భూగోళానికి మంచి జరిగేలా పని చేస్తామన్నారు.

భారత్-అమెరికా బంధానికి మద్దతుదారు తులసి

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో 'డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్'గా నియమితులైన హిందూ–అమెరికన్ తులసి గబార్డ్‌తో మోదీ సమావేశమయ్యారు. బ్లెయిర్ హౌస్‌లో ఈ భేటీ జరిగింది. భారత్–అమెరికా సంబంధాలపై వారు చర్చించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, సైబర్ సెక్యూరిటీలో ఇంటెలిజెన్స్ సహకారం మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నారు. రెండు దేశాల మధ్య స్నేహం మరింత బలపడాలని తులసి గబార్డ్ కోరుకుంటున్నారని మోదీ చెప్పారు. భారత్–అమెరికా బంధానికి ఆమె గట్టి మద్దతుదారు అని పేర్కొన్నారు. 'డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్'గా అత్యున్నత పదవి చేపట్టినందుకు తులసి గబార్డ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ప్రధాని మోదీ రెండు రోజులపాటు అమెరికాలో పర్యటిస్తారు. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయన సమావేశమవుతారు. ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ట్రంప్ 'అమెరికా ఫస్టు' అనే విధానంతో ముందుకెళ్తూ అక్రమ వలసలపై కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ భేటీపై ఆసక్తి నెలకొంది. ప్రధానంగా భారతీయ అక్రమ వలసదార్లపై కరుణ చూపేలా తన మిత్రుడైన ట్రంప్‌ను మోదీ ఒప్పిస్తారా? అనే చర్చ సాగుతోంది. భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచక తప్పదని ట్రంప్ ఇప్పటికే సంకేతాలిచ్చారు. టారిఫ్‌ల మోత మోగించకుండా ఉపశమనం లభించేలా చూడడం ఇప్పుడు మోదీ ముందున్న కర్తవ్యం అని నిపుణులు చెబుతున్నారు.



తులసి గబార్డ్‌తో ప్రధాని మోదీ



మైకేల్ వాల్జ్‌తో ప్రధాని మోదీ చర్చలు

త్వరలో అమెరికా నుంచి మరో 487 మంది వలసదారులు

న్యూఢిల్లీ: మరో 487 మంది అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం వెనక్కి పంపించనుందని కేంద్రం శుక్రవారం వెల్లడించింది. ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన వలసదారుల ఏరివేతలో భాగంగా మొదటి విడతగా ఈ నెల 5న 104 మంది అక్రమ వలసదారులతో కూడిన అమెరికా వైమానిక దళ ప్రత్యేక విమానం అమృతసర్‌కు రావడం తెలిసిందే. భారతీయులుగా భావిస్తున్న మరో 487 మందిని గుర్తించిన అమెరికా అధికారులు వెనక్కి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. మరికొంతమందికి సంబంధించిన సమాచారం అమెరికా అధికారులు వెల్లడించనందున అక్రమ వలసదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధికారులు పంపించిన 487 మంది వలసదారుల పేర్లు, ఇతర వివరాల జాబితాను పరిశీలిస్తున్నామని చెప్పారు. మొదటి విడతలో పంపించిన 104 మందిలో పంజాబ్, హరియాణాలకు చెందిన వారు అత్యధికులుండటం తెలిసిందే. తమను వెనక్కి పంపే సమయంలో అమెరికా అధికారులు విమానంలో సుదీర్ఘ ప్రయాణ సమయంలో నేరస్తుల మాదిరిగా చేతులు, కాళ్లకు బేడీలు వేసి ఉంచారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అమెరికా అమెరికాకు ఆందోళన తెలుపుతామన్నారు.

షెడ్యూల్ ప్రకారమే బందీలను విడుదల చేస్తాం

హమాస్ ప్రకటన

కైరో: ఇజ్రాయెల్ బందీల విడుదల విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదని హమాస్ తేల్చిచెప్పింది. ముందుగా ఖరారు చేసిన ప్రణాళిక ప్రకారమే బందీలకు విముక్తి కల్పిస్తామని స్పష్టంచేసింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు విషయంలో ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులు తమతో చెప్పారని వెల్లడించింది. ఈ మేరకు హమాస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిప్రకారం చూస్తే మరో ముగ్గురు బందీలు శనివారం విడుదల కాబోతున్నారు. ప్రస్తుతానికి కాల్పుల విరమణ ఒప్పందం యథాతథంగా కొనసాగుతుందని హమాస్ స్పష్టమైన సంకేతాలిచ్చింది. హమాస్ ప్రకటనపై ఇజ్రాయెల్ ఇంకా స్పందించలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించిన నిబంధనలను ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని హమాస్ కొద్దిరోజుల క్రితం ఆరోపించిన సంగతి తెలిసిందే. గాజాలో షెల్టర్లు నిర్మించుకొనేందుకు, విదేశాల నుంచి మానవతా సాయం సరఫరాకు అనుమతి ఇవ్వకపోతే బందీల విడుదలను ఆలస్యం చేస్తామని ప్రకటించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. షెడ్యూల్ ప్రకారం బందీలను విడిచిపెట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, గాజాపై మళ్లీ దాడులు ప్రారంభమవుతాయని హమాస్‌ను హెచ్చరించారు. దీంతో హమాస్ మిలిటెంట్లు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. హమాస్ ఇప్పటిదాకా 21 మంది బందీలను విడిచిపెట్టింది. అందుకు ప్రతిగా ఇజ్రాయెల్ ప్రభుత్వం 730 మంది పాలస్తీనా ఖైదీలను జైళ్ల నుంచి విడుదల చేసింది.

సమానంగా వడ్డిస్తాం

టారిఫ్‌లపై ట్రంప్ ఉత్తర్వు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం కీలక నిర్ణయం తీసుకొన్నారు. దిగుమతి సుంకాలకు సంబంధించి.. ఆయా దేశాలపై వారితో సమానంగా టారిఫ్‌లు విధించే ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఉత్పత్తులపై వివిధ దేశాలు ఎంతమొత్తంలో దిగుమతి సుంకాలు విధిస్తున్నాయో.. అంతే మొత్తంలో ఆయా దేశాల ఎగుమతులపై తాము దిగుమతి సుంకాలు విధిస్తామని స్పష్టం చేశారు. ట్రంప్ నిర్ణయం.. అమెరికాతో అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావాన్నే చూపనుంది. భారత్‌పైనా దీని ప్రభావం తీవ్రంగానే ఉండే అవకాశాలున్నాయి. 'ఈ రోజు ఎంతో ముఖ్యమైనది. వారితో సమానంగా వడ్డించే సమయం వచ్చింది' అని ట్రంప్ అంతకుముందు తన సొంత సోషల్‌మీడియా సంస్థ 'ట్రూత్ సోషల్'లో గురువారం పేర్కొన్నారు. అమెరికాకు ఎగుమతులు చేసే దేశాలకు ట్రంప్ తాజా నిర్ణయం మింగుడుపడనిదే. భారీగా సుంకాలు విధిస్తే.. మార్కెట్‌లో ధరలు పెంచాల్సి ఉంటుంది. అప్పుడు ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీపడే విషయంలో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటాయి.

ద్రవ్యోల్బణం తగ్గింపే మా లక్ష్యం

పౌరులపై ఆర్థికభారం పడనీయం • రాజ్యసభలో మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం కట్టడికే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని, పెరిగిన ధరల భారం పౌరులపై పడకుండా చూసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సాధారణ బడ్జెట్‌పై చర్చలో భాగంగా గురువారం రాజ్యసభలో ఆమె ప్రసంగించారు. ''వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 5.22 శాతంగా ఉంటే జనవరికల్లా దానిని 4.31 శాతానికి తగ్గించాం. భారతీయ రిజర్వ్ బ్యాంక్ లక్ష్యాలకు తగ్గట్లుగా ఇప్పుడు ద్రవ్యోల్బణం 4 శాతానికి దిగొస్తోంది'' అని మంత్రి నిర్మల అన్నారు. ఈ సందర్భంగా పలువురు విపక్ష నేతలు మంత్రి ప్రసంగానికి అడ్డు తగిలారు. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని విపక్ష సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా విపక్ష, అధికార ఎన్‌డీఏ సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మోదీ సర్కార్ ఏ ఒక్క రాష్ట్రం పట్ల వివక్ష చూపలేదని నిర్మల బదులిచ్చారు. అయినా విపక్ష సభ్యులు మంత్రి సమాధానంతో సంతృప్తి చెందలేదు. తర్వాత పలు విపక్ష పార్టీల సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. తర్వాత మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

అంతర్జాతీయంగా అనిశ్చితి

''అభివృద్ధిని పరుగుపెట్టించే లక్ష్యంతో బడ్జెట్‌కు తుదిరూపునిచ్చాం. సమ్మిళిత అభివృద్ధికి బడ్జెట్ భరోసానిస్తుంది. ప్రైవేట్ రంగానికి పెట్టుబడుల ఊతం అందిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మౌలిక వసతుల కల్పన కోసం మూలధన వ్యయంలో పెట్టుబడుల పెంపుదల ఉంటుందేగానీ తగ్గుదల ఉండబోదు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు, ప్రతికూల సవాళ్ల మధ్య బడ్జెట్ రూపకల్పన జరిగింది. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా కొన్ని రంగాలకు నిధుల కేటాయింపులు తగ్గాయి. పరిస్థితులు మారుతున్నా అత్యంత కచ్చితత్వంతో ముందస్తు బడ్జెట్ అంచనాలు వేశాం. దేశ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తున్నాం. అంతర్జాతీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతుండటంతో ఎల్లప్పుడూ ఒకే వ్యూహం పనికిరాదు. అనిశ్చితి రాజ్యమేలుతుండటంతో మన దిగుమతులపై దాని పెను ప్రభావం కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అస్తవ్యస్త ధోరణి మన ఆర్థికాభివృద్ధి పథంలో అవరోధంగా మారుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా టమాటా, ఉల్లి, బంగాళా దుంప చివరకు పప్పు ధాన్యాల ధరల్లోనూ తీవ్ర హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. అననుకూల వాతావరణం కారణంగా దిగుబడులు తెగ్గోసుకుపోవడంతో ఆహార ద్రవ్యోల్బణం కట్టుతప్పుతోంది. సరుకు రవాణాగొలుసుల్లో ఏవైనా ఆటంకాలుంటే వెంటనే కేంద్ర మంత్రుల బృందం రంగంలోకి దిగి సమయానికి విదేశీ దిగుమతులు వచ్చేలా చూస్తోంది'' అని నిర్మల తన ప్రసంగాన్ని ముగించారు. ఆ తర్వాత బడ్జెట్ తొలిసెషన్‌లో భాగంగా రాజ్యసభను వాయిదావేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటించారు. మార్చి పదో తేదీ ఉదయం 11 గంటలకు మళ్లీ రాజ్యసభ కార్యకలాపాలు మొదలుకానున్నాయని ఆయన చెప్పారు.



మా ప్రమేయం లేని ఒప్పందాలను అంగీకరించం: జెలెన్‌స్కీ



కెమెల్‌నిత్‌స్కీ (ఉక్రెయిన్): యుద్ధ విరమణపై తమ ప్రమేయం లేని ఎలాంటి చర్చలు తమకు ఆమోదయోగ్యం కాదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. వాటిని తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధ విరమణ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్లో మాట్లాడిన విషయం తెలిసిందే. తర్వాత ఆయన జెలెన్‌స్కీతోనూ చర్చలు జరిపారు. చర్చలకు చొరవ తీసుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించాక.. జెలెన్‌స్కీ గురువారం దీనిపై తొలిసారిగా స్పందించారు. 'ప్రతీది పుతిన్ ప్రణాళిక ప్రకారం జరగడానికి వీల్లేదు. దీన్ని మేము అంగీకరించం, అనుమతించం' అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఒక స్వతంత్ర దేశంగా మా ప్రమేయం లేని ఎలాంటి చర్చలూ మాకు ఆమోదయోగ్యం కాదని మా మిత్రదేశాలకు స్పష్టం చేస్తున్నాని తెలిపారు. శాంతి చర్చలకు ఉక్రెయిన్, యూరప్‌లను దూరంగా పెట్టడం సబబు కాదని నాటో దేశాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం అసాధ్యమని, రష్యా ఆక్రమిత భూభాగాలను ఉక్రెయిన్ వదులుకోవాల్సి ఉంటుందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ బుధవారం వ్యాఖ్యానించడంతో.. నాటో దేశాలు చర్చలు ఏకపక్షంగా ఉంటాయేమోనని ఆందోళన చెందుతున్నాయి. ఉక్రెయిన్‌కు అన్యాయం చేస్తున్నారనే వాదనను హెగ్సెత్ గురువారం ఖండించారు. 'ఉక్రెయిన్ ప్రమేయం లేకుండా ఉక్రెయిన్ గురించి చర్చలు ఉండకూడదు. ఉక్రెయిన్ వాదనకు చర్చల్లో ప్రాధాన్యం దక్కాలి' అని బ్రిటన్ రక్షణమంత్రి జాన్ హీలి అన్నారు.



మ్యూనిక్‌లో ఘటనకు కారణమైన కారు, చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

జనంపైకి కారు

28 మందికి గాయాలు

- జర్మనీలోని మ్యూనిక్‌లో ఘటన
- నిందితుడు అఫ్గాన్ శరణార్థి

మ్యూనిక్: ఓ దుండగుడు గుమికూడిన జనంపైకి వేగంగా కారు నడిపాడు. ఘటనలో చిన్నారులు సహా 28 మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. పోలీసులు కాల్పులు జరిపి నిందితుడిని పట్టుకున్నారు. అతడు 24 ఏళ్ల అఫ్గానిస్తాన్ శరణార్థి అని తెలిపారు. ఈ అనూహ్య ఘటన గురువారం జర్మనీలో బవేరియా రాష్ట్ర రాజధాని మ్యూనిక్‌లో చోటు చేసుకుంది. జర్మనీ ప్రభుత్వ రంగ చైల్డ్‌కేర్ సర్వీసెస్‌కు చెందిన ఉద్యోగులు నిరసనలో భాగంగా గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో మ్యూనిక్‌లోని సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుమిగూడి ఉన్నారు. అదే సమయంలో పోలీస్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఓ కారు వెనుక నుంచి వేగంగా వచ్చి గుమిగూడిన వారిపైకి దూసుకెళ్లింది. దీంతో, షాక్‌కు గురైన జనం కేకలు వేస్తూ చెల్లాచెదురయ్యారు. కారు కింద నలిగిపోయి గాయపడిన వారితో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. వెంటనే స్పందించిన పోలీసులు కారు నడుపుతున్న వ్యక్తిపై కాల్పులు జరిపి అతడిని అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి తరలించారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లుగా చెబుతున్నారు. పోలీస్ విభాగం డైరెక్టర్ క్రిస్టియన్ హూబర్ మీడియాతో మాట్లాడుతూ ఘటనలో 28 మందికి గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి మాత్రం విషమంగా ఉందన్నారు. ఘాతుకానికి పాల్పడిన వ్యక్తి అఫ్గానిస్తాన్‌కు చెందిన 24 ఏళ్ల శరణార్థి అని వెల్లడించారు. పాత నేరస్తుడని, దొంగతనాలు, డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులతో ఇతడికి సంబంధముందని వెల్లడించారు. శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర అత్యున్నత స్థాయి అధికారులు పాల్గొనే ప్రతిష్టాత్మక మ్యూనిక్ సెక్యూరిటీ సదస్సు జరిగే వేదికకు కేవలం మైలు దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

పార్లమెంట్‌లో 'వక్ఫ్' జేపీసీ నివేదిక

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షం
- తమ అభ్యంతరాలను నివేదికలో చేర్చలేదని ఆగ్రహం
- ఫేక్ రిపోర్టును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్
- ఉభయ సభల్లో గందరగోళం
- ఉభయ సభలు వచ్చే నెల 10వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు–2024పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టింది. ఈ నివేదికపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఇది ఫేక్ రిపోర్టు అంటూ మండిపడ్డాయి. వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అభ్యంతరాలను నివేదికలో చేర్చలేదని, దీన్ని అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాయి. నివేదికను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని తేల్చిచెప్పాయి. విపక్ష సభ్యులు నినాదాలు, నిరసనలు, అధికారపక్ష సభ్యుల ఎదురుదాడితో ఉభయసభలు దద్దరిల్లాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. జేపీసీ నివేదికను లోక్‌సభలో కమిటీ చైర్మన్, బీజేపీ సభ్యుడు జగదాంబికా పాల్ ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యులు పెద్దఎత్తున కేకలు వేస్తూ నివేదికను వ్యతిరేకించారు. వారిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అసహనం వ్యక్తం చేశారు. విపక్షాల అభ్యంతరాలను నివేదికలో చేర్చడానికి తాము అంగీకరిస్తున్నామని, దీనిపై నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. గుజరాత్‌లో కీలక ప్రాజెక్టును బడా పారిశ్రామికవేత్తకు అప్పగించడాన్ని నిరసిస్తూ విపక్షాలు ఆందోళనకు దిగడంతో సభ ఒకసారి వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత వక్ఫ్ సవరణ బిల్లుపై జేపీసీ నివేదికను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. జగదాంబికా పాల్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. సభను వచ్చే నెల 10వ తేదీ దాకా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

తప్పుడు ఆరోపణలు చేయొద్దు: రిజిజు

వక్ఫ్ సవరణ బిల్లుపై జేపీసీ నివేదికను బీజేపీ ఎంపీ, కమిటీ సభ్యుడు మేధా విశ్రామ్ కులకర్ణి రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని బిగ్గరగా నినాదాలు చేశారు. ఫేక్ రిపోర్టును తాము అంగీకరించబోమని తేల్చిచెప్పారు. కొందరు ఎంపీలు చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లారు. జేపీసీ నివేదికను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అభ్యంతరాలను జేపీసీ నివేదిక నుంచి తొలగించారని ఆరోపించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. నివేదిక మొత్తం సభ ముందు ఉందని, అందులో ఏదీ తొలగించలేదని అన్నారు. కావాలంటే పరిశీలించుకోవాలని సూచించారు. తప్పుడు ఆరోపణలు చేయొద్దని, సభను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. విపక్షాల తీరును కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జె.పి.నడ్డా సైతం తప్పుపట్టారు. సభలో అలజడి సృష్టిస్తున్న సమీరుల్ ఇస్లామ్, నదీముల్ హక్, ఎం.మొహమ్మద్ అబ్దుల్లాపై చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నిరసనలు, నినాదాలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పలుమార్లు వాయిదా వేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తొలి సెషన్ గురువారం ముగిసింది. రాజ్యసభ మార్చి 10వ తేదీకి వాయిదా పడింది. బడ్జెట్ సమావేశాల రెండో సెషన్ మార్చి 10న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 4వ తేదీ దాకా కొనసాగుతుంది.

సెలక్ట్ కమిటీకి ఐటీ బిల్లు

నూతన ఆదాయపు పన్ను బిల్లు–2025ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తొలుత ఈ బిల్లును విపక్షసభ్యులు వ్యతిరేకించారు. కానీ, బిల్లును ప్రవేశపెట్టేందుకు ఒక తీర్మానాన్ని మూజు వాణి ఓటుతో సభ ఆమోదించడంతో మార్గం సుగమమైంది. కొత్త ఐటీ బిల్లును లోక్‌సభ సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను నిర్మలా సీతారామన్ కోరారు. ఈ బిల్లుపై సెలక్ట్ కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సెషన్ తొలిరోజున సభకు సమర్పించనుంది.

నిందితుల్ని జైల్లోనే ఉంచడానికి పీఎంఎల్‌ఏ కేసులా?

ఈడీ తీరుపై సుప్రీంకోర్టు అసహనం



న్యూఢిల్లీ: నిందితులను జైలులో ఉంచడానికి మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ)ను ఉపయోగిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. వరకట్న చట్టం మాదిరిగా పీఎంఎల్‌ఏ నిబంధనలను కూడా దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాజీ ఎక్సైజ్ అధికారి అరుణ్ పతి త్రిపాఠీకి బుధవారం బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. త్రిపాఠీపై చేసిన ఆరోపణలను ఛత్తీస్‌గఢ్ హైకోర్టు కొట్టివేసిన తర్వాత కూడా జైలులోనే ఉంచడంపై విస్మయం వ్యక్తం చేసింది. 'ఓ వ్యక్తిని జైలులో ఉంచేందుకు పీఎంఎల్‌ఏను వాడుకోరాదు. ఆరోపణలను కోర్టు కొట్టివేసిన తర్వాత కూడా ఆయన్ను విడుదల చేయకుండా జైలులో ఉంచడాన్ని ఏమనాలి?. సెక్షన్ 498ఏ కింద పెళ్లయిన మహిళలు భర్త, అతడి కుటుంబీకులపై కట్నం వేధింపుల కేసులు ఎడాపెడా పెట్టినట్లే పీఎంఎల్‌ఏను కూడా దుర్వినియోగం చేయాలనుకుంటున్నారా?'అంటూ తలంటింది. ఇందుకు కారణమైన అధికారులకు సమన్లు జారీ చేస్తామంది. అయితే, సాంకేతికపరమైన కారణాలతో నేరగాళ్లకు బెయిలివ్వడం సరికాదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ఈడీ తరఫున వాదించారు.



బిరోల్.. కేరాఫ్ క్రిమినల్స్!
బిహార్ రాష్ట్రం బిరోల్ గ్రామం నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖియా కమ్యూనిటీకి చెందిన వారు వివిధ నగరాలకు వలస వెళ్లి దొంగతనాలకు పాల్పడుతుంటారు. -8లో



ట్రూ హార్ట్స్.. వన్ ఆర్ట్..
వాలెంటైన్స్ డే సందర్భంగా కొన్ని ప్రేమ జంటలను పలకరించినప్పుడు.. తమ రెండు హృదయాలను ఒకటి చేసిన కళాత్మక జ్ఞాపకాలను నెమరువేసుకున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36.0/19.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

రూ. 40 కోట్లు దోచేశారు.. 20 గంటల్లో దొరికేశారు!

కేడియా ఆయిల్స్ యజమాని ఇంట్లో చోరీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు

3,300 క్యారెట్ల వజ్రాలు సహా సొత్తు అపహరణ
- 20 గంటల్లోనే కేసు ఛేదించిన నగర పోలీసులు
- నాగ్‌పూర్‌లో ముగ్గురు నిందితుల పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో:

నగరంలోని నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే కేడియా ఆయిల్స్ కంపెనీ యజమాని రోహిత్ కేడియా ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు నిందితులు దాదాపు రూ.40 కోట్ల విలువైన సొత్తు దోచుకుపోగా... అత్యంత వేగంగా స్పందించిన పోలీసులు 20 గంటల్లో వారిని పట్టుకున్నారు. ఈ నిందితుల్లో ఒకరు గతేడాది దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో స్నేహలత దేవిని చంపి, రూ.కోటి విలువైన సొత్తు దోపిడీకి పాల్పడిన కేసులో వాంటెడ్‌గా ఉన్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. తూర్పు మండల డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీలు అందె శ్రీనివాసరావు, జె.నర్సయ్యలతో కలిసి గురువారం ఐసీసీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్వాల్ వివరాలు వెల్లడించారు.

కుమార్తె పెళ్లి పనుల కోసం..

రాజేంద్రనగర్‌లో కేడియా ఆయిల్స్ కంపెనీ నిర్వహిస్తున్న రోహిత్ కేడియా హిమాయత్ నగర్‌లో నివసిస్తున్నారు. ఆయన కుటుంబం వద్ద దాదాపు 20 మంది పనివాళ్లు ఉన్నారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉండే వీరి ఇంటి ప్రాంగణంలోనే పనివాళ్ల కోసం మూడంతస్తుల భవనం నిర్మించారు. రోహిత్ ఇంట్లో బిహార్‌లోని బిరోల్ గ్రామానికి చెందిన సుశీల్ ముఖియా రెండేళ్ల పాటు పని చేసి ఏడాది క్రితం మానేశాడు. ఇటీవల రోహిత్ కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో పాటు దుబాయ్‌లో డెస్టినేషన్ మ్యారేజ్ చేయాలని నిర్ణయించారు. పెళ్లి పనుల కోసం సహాయంగా ఉండటానికి సుశీల్‌ను సంప్రదించిన రోహిత్ 15 రోజుల క్రితం పిలిపించారు. ఇదే ఇంట్లో పని చేసే పశ్చిమ బెంగాల్ మహిళ బసంతి ఆర్హికి ఇతడితో గతంలోనే వివాహేతర సంబంధం ఉంది.

నేరగాడితో గతంలో ఉన్న పరిచయంతో..

సుశీల్‌తో పాటు బసంతి సైతం మిగిలిన పనివాళ్లతో కలిసి రోహిత్ ఇంటి ప్రాంగణంలోని భవనంలోనే ఉంటున్నారు. కుమార్తె వివాహం కోసం రోహిత్ ఫ్యామిలీ మొత్తం గత వారం దుబాయ్ వెళ్లింది. ఇదే అదనుగా భావించిన సుశీల్.. ఆ ఇంటిని దోచేయడానికి ఢిల్లీలో ఉండే తన స్నేహితుడు మోల్పు ముఖియాను నగరానికి పిలిపించాడు. గత ఏడాది దోమలగూడ పరిధిలో స్నేహలత అనే వృద్ధురాలిని హత్య చేసిన బిహారీలు రూ.కోటి సొత్తు దోచుకుపోయారు. ఈ కేసులో ఆమె ఇంట్లో పని చేసే మహేష్ ముఖియాతో పాటు మోల్పు, రాహుల్ నిందితులుగా ఉన్నారు. దోపిడీ జరిగిన ఎనిమిది నెలలకు మహేష్ చిక్కినా.. మిగిలిన ఇద్దరూ పరారీలోనే ఉండిపోయారు. మోల్పు నేర చరిత్ర తెలిసిన సుశీల్ తాజా నేరం కోసం ఢిల్లీ తలదాచుకున్న అతడిని పిలిపించాడు. వీరిద్దరూ కలిసి మంగళవారం తెల్లవారుజామున సర్వెంట్స్ బిల్డింగ్ నుంచి రోహిత్ ఇంట్లోకి ప్రవేశించారు. అల్మారాలు, లాకర్లు పగులకొట్టి 710 గ్రాముల వజ్రాలతో కూడిన ఆభరణాలు, 1.4 కేజీల స్వర్ణాభరణాలు, రూ.19.63 లక్షలు, 24 దేశాల కరెన్సీ, 215 గ్రాముల వెండి అపహరించారు.



వివరాలు వెల్లడిస్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

ఆదాయపు పన్ను శాఖకు సమాచారం ఇస్తాం

రోహిత్ కేడియా ఇంటి నుంచి చోరీ అయిన సొత్తులో వజ్రాలే 3,300 క్యారెట్లు ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఒక్కో క్యారెట్ రూ.1.12 లక్షలు పలుకుతోంది. ఈ ప్రకారం చూస్తే వీటి విలువే రూ.37 కోట్ల వరకు ఉంది. వీటితో పాటు భారీగా విదేశీ కరెన్సీ, బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. సొత్తు మొత్తం రికవరీ చేసి వీడియో కాల్ ద్వారా దుబాయ్‌లో ఉన్న యజమానికి చూపించి ఖరారు చేసుకున్నాం. భారీ సొత్తు చోరీ, రికవరీపై ఆదాయపు పన్ను శాఖకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించాం. నగదు, సొత్తును యజమాని వారి వద్ద డిక్లేర్ చేశారా? లేదా? అనేది ఆ అధికారుల విచారణలో వెలుగులోకి వస్తుంది.
– సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ

మూడు నగరాలకు ప్రత్యేక బృందాలు...

మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రోహిత్ ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని రోహిత్ మేనేజర్ అభయ్ కేడియా గుర్తించారు. వెంటనే నారాయణగూడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ కేసును ఛేదించడానికి నారాయణగూడ పోలీసు, టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా నిందితులు ముగ్గురూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లారని, అక్కడ నుంచి ఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కారని గుర్తించారు. దీంతో మూడు ప్రత్యేక బృందాలు భోపాల్, నాగ్‌పూర్, పట్నాలకు వెళ్లి కాపుకాశాయి. డీసీపీ బాలస్వామి మహారాష్ట్ర పోలీసులతో తనకు ఉన్న పరిచయాలను వినియోగించి ఈ నిందితుల సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. నగర పోలీసులు, అక్కడి జీఆర్పీ అధికారులతో కలిసి సోదాలు చేశారు. ముగ్గురు నిందితులతో పాటు చోరీ సొత్తు మొత్తం స్వాధీనం చేసుకుని నగరానికి తీసుకువచ్చారు.

ఇద్దరు యువకులను బలిగొన్న రోడ్డు ప్రమాదం

హస్తినాపురం: ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన ఎకుమల్ల చరణ్ (25) కారు మెకానిక్. నగర శివారులోని హయత్‌నగర్‌లో నివసిస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కె.పవన్ (24) కారు మెకానిక్‌గా పని చేస్తూ హయత్‌నగర్‌లోని సామానగర్‌లో నివాసం ఉంటున్నాడు. చరణ్, పవన్ ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్‌బీనగర్‌కు వెళ్లి తిరిగి హయత్‌నగర్‌కు వస్తుండగా.. గురువారం తెల్లవారుజామున 1.15 గంటలకు ఆటోనగర్ వద్ద బైక్ అదుపుతప్పి ఆగిఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్, పవన్ తలలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

ఇప్పటి వరకు 53 హోర్డింగుల తొలగింపు



అనుమతులు ఉంటే కూల్చివేయం: హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్న అక్రమ హోర్డింగ్స్ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 53 తొలగించినట్లు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) గురువారం ప్రకటించింది. మున్సిపల్ అధికారుల సమక్షంలోనే ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. తొలగించిన వాటిలో యూనిపోల్స్ 35, యూనిస్ట్రక్చర్స్ 4, ఇంటి పైకప్పులపై పెట్టిన హోర్డింగ్స్ 14 ఉన్నట్లు వివరించింది. శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న వాటిని సైతం హైడ్రా తొలగించింది. ఈ నేపథ్యంలో యాడ్ ఏజెన్సీల ప్రతినిధులు గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిశారు. అనుమతులున్న హోర్డింగ్స్ తొలగించబోమని ఆయన స్పష్టం చేశారు. కేవలం అనుమతులు లేని, అనుమతి గడువు ముగిసిపోయినా రెన్యువల్ చేయించుకోని వాటిని మాత్రమే తొలగిస్తున్నామన్నారు.

కొత్త తంటా!



వేరు కాపురాలు పెట్టిన దంపతుల కష్టాలు
- రేషన్ కార్డు దరఖాస్తుల కోసం తిప్పలు
- తల్లిదండ్రుల కార్డులో పేర్లు తొలగిస్తేనే అవకాశం
- సివిల్ సప్లయ్ సర్కిల్ కార్యాలయాలకు పరుగో పరుగు

అయిదేళ్ల క్రితం వివాహమైన రజితకు ఇద్దరు పిల్లలు. భర్త శ్రీనివాస్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. మాదన్నపేటలో నివాసం. ఈ కుటుంబానికి రేషన్ కార్డు లేదు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు స్వీకరిస్తుండటంతో మీ సేవ కేంద్రం ఆన్‌లైన్ ద్వారా నమోదుకు ప్రయత్నించారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఆధార్ నంబర్ కొట్టగానే ఇప్పటికే ఆహార భద్రత (రేషన్) కార్డు లబ్ధిదారుగా చూపించింది. భర్త శ్రీనివాస్ ఆధార్ నంబర్‌కు కూడా అదే పరిస్థితి ఎదురైంది. పెళ్లి కాకముందు వారు తల్లిదండ్రుల రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్నారు. ఆ కార్డుల్లో సభ్యులుగా తొలగిస్తే తప్ప కొత్తగా దరఖాస్తులకు సాధ్యం కాదని మీ సేవ సెంటర్ నిర్వాహకులు స్పష్టం చేశారు. దీంతో తల్లిదండ్రుల రేషన్ కార్డుల్లోంచి తమ పేర్లు తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పేర్లు తొలగించేంత వరకు కొత్త కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది ఒక రజిత, శ్రీనివాస్ దంపతులకు ఎదురైన సమస్య కాదు.. నగరంలో కొత్త కాపురం పెట్టిన అన్ని కుటుంబాల పరిస్థితి ఇలాగే ఉంది.

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా వివాహమై వేరుపడిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల కోసం తిప్పలు తప్పడం లేదు. తల్లిదండ్రుల కుటుంబాల రేషన్ కార్డుల నుంచి వీరి పేర్లు తొలగిస్తే కానీ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. మీ సేవ ద్వారా కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా.. ఇప్పటికే ఎఫ్ఎస్‌సీ లబ్ధిదారులని ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో పేర్లు తొలగించేందుకు, దరఖాస్తు చేసుకునేందుకు రెవెన్యూ, సివిల్ సప్లయ్ సర్కిల్ ఆఫీసులకు బారులు తీరుతున్నారు. అయినా పాత కార్డుల నుంచి తక్షణ పేర్ల తొలగింపునకు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవైపు కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తు ప్రతులను సమర్పించేందుకు సర్కిల్ ఆఫీస్‌లకు క్యూ కట్టడం, మరోవైపు పాత కార్డులో పేర్ల తొలగింపునకు దరఖాస్తులు వస్తుండటంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది.

నాలుగేళ్ల తర్వాత అవకాశం..

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నాలుగేళ్ల తర్వాత అవకాశం లభించింది. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అంటూనే పదేళ్లలో మొక్కుబడిగానే జారీ చేసి చేతులు దులుపుకొంది. వాస్తవంగా నాలుగేళ్ల క్రితం కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే సివిల్ సప్లయ్ వెబ్‌సైట్‌లో ఎఫ్ఎస్‌సీ లాగిన్‌ను నిలిపివేసింది. అప్పటి నుంచి దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు లేకుండాపోయింది. అంతకు ముందు పెండింగ్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి కొన్ని కార్డులను ఆమోదించి మెజారిటీ దరఖాస్తులను తిరస్కరించింది. తాజాగా దరఖాస్తు చేసుకునే లాగిన్ పునరుద్ధరించడంతో కొత్త కుటుంబాలు ఆసక్తి కనబర్చుతున్నా.. తల్లిదండ్రుల పాత కార్డులో లబ్ధిదారులుగా పేర్లు ఉండటం సమస్యగా తయారైంది. మరోవైపు కొత్త కార్డులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి. దీంతో తల్లిదండ్రుల కార్డుల్లో పేర్లు తొలగించుకుంటే కొత్త కార్డులు మంజూరయ్యే వరకు పరిస్థితేంటనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. రేషన్‌కార్డుతో ఆరోగ్య శ్రీ,ఇతర సంక్షేమ పథకాలు ముడి పడి ఉండటంతో తల్లిదండ్రుల పాత కార్డులో పేర్లు తొలగించుకునేందుకు కొన్ని కొత్త కుటుంబాలు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

పేర్లను తొలగిస్తాం

కొత్తగా ఏర్పడిన కుటుంబాలు వారి పేర్లు తల్లిదండ్రుల పాత కార్డులోంచి తొలగించేందుకు స్థానిక సివిల్ సప్లయ్ సర్కిల్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు మూడు రోజుల వ్యవధిలో పాత కార్డులోని సదరు సభ్యుడి పేరును తొలగించేలా చర్యలు చేపట్టాం. పేర్ల తొలగింపు అనంతరం కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
– దేవినేని దీప్తి, ఇన్‌చార్జి డీఎస్వో, హైదరాబాద్

ఐ లవ్ యూ అన్నాడు.. అఘాయిత్యానికి పాల్పడ్డాడు

బంజారాహిల్స్: నిన్ను ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు.. సర్‌ప్రైజ్ చేస్తానంటూ హోటల్ గదికి తీసుకెళ్లాడు. శుక్రవారం వాలెంటైన్స్ డే కదా.. ఇదిగో గులాబీ పువ్వు తీసుకో అంటూ ఆమెకు ఇచ్చాడు. ఆపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బంజారాహిల్స్ ఠాణా పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఓ ఫర్నిచర్ షాపులో ఖాజామోహినుద్దీన్ అనే వ్యక్తి మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలే ఓ వివాహిత ఈ షాపులో సేల్స్ గర్ల్‌గా చేరింది. మరుసటి రోజు నుంచి ఖాజా మోహినుద్దీన్ నిన్ను ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటపడసాగాడు. తనకు ఇప్పటికే వివాహమైందని చెప్పగా భర్త నుంచి విడాకులు తీసుకోవాలని సూచించాడు. దీంతో ఖాజా మోహినుద్దీన్ ప్రేమను ఆమె అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఖాజామొహినుద్దీన్ నీకు సర్‌ప్రైజ్ అంటూ బుధవారం ఆమెను బంజారాహిల్స్‌లోని ఓ హోటల్ గదికి తీసుకెళ్లాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత గులాబీ పువ్వు ఇచ్చి ఐ లవ్ యూ అని చెప్పాడు. మాయమాటలతో లోబర్చుకుని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు ఖాజామోహినుద్దీన్ భార్యల పేరుతో వేర్వేరు నంబర్లతో బాధితురాలికి ఫోన్‌లో బెదిరింపులు రాసాగాయి. ఖాజాకు దూరంగా ఉండాలని.. అతడిని పెళ్లి చేసుకుంటే నీ అంతు చూస్తామంటూ హెచ్చరించసాగారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మహిళ.. ఖాజామోహినుద్దీన్‌తో పాటు ఈ వ్యవహారానికంతటికీ కారకుడైన తజ్‌ముల్ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమ పేరుతో తనపై అత్యాచారానికి పాల్పడంతో పాటు తనను మానసికంగా హింసించి.. ఆత్మహత్యా యత్నానికి సైతం ఉసిగొల్పారని, హత్య చేస్తానని బెదిరిస్తున్న నిందితులిద్దరిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిథేన్.. మితిమీరెన్!

నగర వాతావరణంలో ప్రమాదకర స్థాయిలో విష వాయువులు



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరంలో మిథేన్ స్థాయి ప్రమాదకరంగా మారుతోంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందని అర్బన్ క్లైమేట్ అనే సైన్స్ జర్నల్ అధ్యయనంలో తేలింది. ఈ పరిస్థితులకు ప్రధానంగా నగరంలో పెరుగుతున్న పారిశ్రామికీకరణ, కలుషిత జలాలకు నిలయమైన మూసీ నది, హుస్సేన్ సాగర్, జవహర్‌నగర్ డంపింగ్ యార్డులే కారణమని స్పష్టం చేసింది. గాలి ఉష్ణోగ్రత, జన సాంద్రత, భూ వినియోగం, పట్టణీకరణ వంటి అంశాలను కొలమానంగా తీసుకొని నిర్వహించిన అధ్యయనంలో దేశంలో అధిక మిథేన్ ఉత్పత్తి చేస్తున్న నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది.

పెరిగిన మిథేన్ ఉద్గారాలు..

హైదరాబాద్‌లో మిథేన్ స్థాయి 2019లో సుమారు 1,880 పార్ట్స్ పర్ బిలియన్ (పీపీబీ) ఉండగా.. 2023 నాటికి 1,970 పీపీబీకి చేరింది. వాతావరణ వేడిని ట్రాప్ చేయడంలో కార్బన్ డయాక్సైడ్ కంటే మిథేన్ 25 రెట్లు ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. మిథేన్ ఉత్పత్తిలో దేశంలోని పెద్ద నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్‌లతో పోలిస్తే హైదరాబాద్‌లో మిథేన్ సాంద్రత ఎక్కువగా ఉందని తేలింది. సమగ్రమైన మిథేన్ పర్యవేక్షణ, నియంత్రణల కొరత కనిపిస్తోందని జైపూర్‌లోని మాలవ్యా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది.

అత్యంత ప్రభావిత ప్రాంతాలివే..

నగరంలోని రాజేంద్రనగర్, ఫలక్‌నుమా, మెహిదీపట్నం, చార్మినార్, కార్వాన్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడలో మిథేన్ స్థాయి అధికంగా ఉంది. నగరంలో పారిశ్రామికీకరణ, వ్యర్థాల నిర్వహణ, మిథేన్ పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మూసీ నది, హుస్సేన్‌సాగర్, జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు ఈ పరిస్థితికి ప్రధాన కారణమని అధ్యయనంలో తేలింది. నగరంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, శివార్లలోని షాద్‌నగర్‌లో మిథేన్ వైవిధ్యాలపై దృష్టి సారించింది. 2013 నుంచి 2022 మధ్య ఈ గ్యాస్ స్థాయిలలో స్థిరమైన పెరుగుదల ఉందని గుర్తించింది. మిథేన్ ఉత్పత్తి నగరంలోనే కాకుండా శివారు ప్రాంతాల్లోనూ పెరుగుదల కనిపించడం ఆందోళన కలిగించే అంశం.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

మిథేన్ ప్రభావంతో గాలిలో నాణ్యత తగ్గిపోతుంది. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల్లో వాయు మార్గాలు దెబ్బతింటాయి. ఉబ్బసం రావడానికి కారణమవుతుంది. గర్భిణులు నెలలు నిండకముందే ప్రసవించడం, గుండె సంబంధిత వ్యాధులు, మరణాల రేటును పెంచుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్వామి వివేకానంద నగర పర్యటన ఓ మైలురాయి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్‌పేట్: స్వామి వివేకానంద 1893 ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాద్ నగర పర్యటన సనాతన ధర్మం, రామకృష్ణ మిషన్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వామి వివేకానంద నగర పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించిన సందర్భంగా గురువారం ఇదే కళాశాల సొసైటీ, రామకృష్ణమఠం సంయుక్తంగా యూత్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా గవర్నర్ మాట్లాడుతూ.. అమెరికాలోని చికాగోలో జరిగిన విశ్వమత సభలో స్వామి వివేకానంద ప్రసంగానికి మహబూబ్ కాలేజ్‌లో చేసిన ప్రసంగం నాంది అని అన్నారు. చికాగో ప్రసంగంలో పురాణాలు, అనుష్ఠాన వేదాంతం గురించి స్వామి వివేకానంద చెప్పారని పేర్కొన్నారు.

ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత భారత్‌ను విశ్వ గురువుగా చేయగలదని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. స్వామి వివేకానంద కలలను యువత సాకారం చేయాలని పిలుపునిచ్చారు. రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. వివేకానంద బోధనలు చదివితే ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్ కళాశాల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పీఎల్ శ్రీనివాస్, ఎస్వీఐటీ చైర్మన్ ప్రేమ్ నారాయణ చైర్మన్, ఉపాధ్యక్షులు నరేష్, ఎంపీ రవీంద్రనాథ్, భగవత్ వారణాసి కార్యదర్శి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




స్వామి వివేకానంద విగ్రహానికి హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అంతర్జాతీయ ప్రమాణాలతో.. కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధి

- ఫ్లై ఓవర్లకు గ్రీన్‌సిగ్నల్
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న కోర్ అర్బన్ ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను కోర్ అర్బన్ ఏరియా మొత్తం నిర్వహించాలని సూచించారు. గురువారం మున్సిపల్ పరిపాలన, జీహెచ్ఎంసీ తదితర విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. నగరంలో గృహాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. తద్వారా నివాస ప్రాంతాలకు మౌలిక సదుపాయాల విషయంలో అవసరాలకు తగిన విధంగా ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన 7 కూడళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే వీటికి టెండర్లను పిలవాలని ఆదేశించారు. భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని. సూచించారు. వీటిలో కేబీఆర్ పార్కు, ఖాజాగూడ, ఐఐఐటీ తదితర ప్రాంతాలున్నాయి.



ట్రాఫిక్ నియంత్రణకు గూగుల్ సహకారం..

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం ఆందోళనలు జరుగుతున్న ప్యారానగర్‌తో పాటు నగరంలో చెత్త సమస్యల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

17న గోదావరి నీటి సరఫరాకు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి తాగునీటి పథకం తొలిదశలోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద 3000 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు.. 900 ఎంఎం డయా వాల్వులు అమర్చనున్న నేపథ్యంలో ఈ నెల 17న ఉదయం 6 గంటల నుంచి 24 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గురువారం జలమండలి ఒక ప్రకటనలో పేర్కొంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..

ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్‌రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భరత్ నగర్, మోతీ నగర్, గాయత్రినగర్, బాబా నగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, హస్మత్ పేట్, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజుల రామారం, సూరారం, ఆదర్శ్ నగర్, భగత్ సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ, అల్వాల్, ఫాదర్ బాలయ్య నగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం. డిఫెన్స్ కాలనీ, వాజ్ పేయ్ నగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతమ్ నగర్, సాయినాథపుర, చర్లపల్లి, సాయిబాబా నగర్, రాధికా. కొండాపూర్, మాదాపూర్ (కొన్ని ప్రాంతాలు), హఫీజ్ పేట్, మియాపూర్, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం, ఎంఈఎస్, త్రిశూల్ లైన్, గన్ రాక్, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీనగర్ ఎయిమ్స్, ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేరు (భువనగిరి), ఘన్‌పూర్ (మేడ్చల్, శామీర్ పేట్)లకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి ప్రకటించింది.

పోలీసు కస్టడీకి మస్తాన్‌సాయి



నిందితుడు మస్తాన్‌సాయి

మణికొండ: యువతుల నగ్న వీడియోలు, డ్రగ్స్, బెదిరింపులు, హత్యాయత్నం కేసులో చంచల్‌గూడ జైలు రిమాండ్ ఖైదీగా ఉన్న మస్తాన్‌సాయిని నార్సింగి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. సాయంత్రం అతడిని నార్సింగి పీఎస్‌కు తీసుకు వచ్చిన పోలీసులు అతడిపై లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నారు. మస్తాన్ సాయికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారి వివరాలు, అతను నగ్న వీడియోలు తీసేందుకు కారణాలు, వాటిని అడ్డు పెట్టుకుని చేసిన బ్లాక్ మెయిల్‌ల వివరాలను రాబడుతున్నారు. లావణ్య పోలీసులకు అందించిన హార్డ్ డెస్క్‌లో ఉన్న వీడియోలపై ప్రశ్నించినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం వరకు అతను పోలీసు కస్టడీలో ఉండనున్నారు. అప్పటిలోగా అతడి నుంచి కేసుకు సంబంధించి పూర్తి వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆమెతో చనువుగా ఉన్న వీడియోలు వెలుగులోకి రావడంతో అతడిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారులతో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

రాజ్‌తరుణ్‌కు క్షమాపణలు చెబుతున్నా: లావణ్య

సినీహీరో రాజ్‌తరుణ్‌కు కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలని ఉందని.. తన జీవితాన్ని కోల్పోయానని.. హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో సన్నిహితంగా ఉన్నాడన్న అనుమానంతోనే తాను గతంలో రాజ్‌తరుణ్‌పై కేసు పెట్టానని లావణ్య పేర్కొంది. గురువారం ఆమె తన నివాసంలో న్యాయవాది నాగూర్‌బాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాను జైలులో ఉన్నప్పుడు అందిన తప్పుడు సమాచారంతో పొరపాటు జరిగిందన్నారు. మస్తాన్‌సాయి అతని తల్లితండ్రులు తనను చంపేస్తారని, గతంలో అతను మూడుసార్లు దాడి చేశాడన్నారు. మస్తాన్‌సాయి తీసిన నగ్న వీడియోల్లో 44మంది యువతులు ఉన్నారని, వారిలో 15 మంది యువతులకు తెలియకుండా తీసిన వీడియోలు ఉన్నట్లు తెలిపింది. హార్డ్ డిస్క్‌లో 250లకు పైగా వీడియోలు ఉన్నట్లు పేర్కొంది. మస్తాన్‌సాయి తాను చేసిన తప్పులనుంచి తప్పించుకోలేదని, ఇకనైనా అతను ఇలాంటి చర్యలను మానుకోవాలని సూచించింది. అతని ఒత్తిడి తట్టుకోలేక నలుగురు యువతులు ఇతర దేశాల్లో తలదాచుకుంటున్నారని తెలిపింది. ఆమె తరఫు న్యాయవాది నాగూర్‌బాబు మాట్లాడుతూ వీడియోలను లావణ్య లీక్ చేయ లేదని, లావణ్యకు సంబంధించిన వీడియోలను లీక్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మస్తాన్ సాయి కొన్ని వీడియోలను వేరే వ్యక్తుల వద్ద దాచినట్లు తెలిసిందని, పోలీసులు వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. గుంటూరులో లావణ్య పెట్టిన కేసులో ఇప్పటి వరకు మస్తాన్‌సాయిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన ప్రశ్నించారు.

పరువు నష్టం కేసులో సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

తదుపరి విచారణ ఫిబ్రవరి 19కి వాయిదా

సిటీ కోర్టులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ప్రజలను రెచ్చగొట్టే ఆరోపణలు చేయడంతోపాటు వారికి తప్పుడు సంకేతాలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిపై కింద కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

బిరోల్.. కేరాఫ్ క్రిమినల్స్!

- నేపాల్ సరిహద్దుల్లోని బిహార్ గ్రామమిది
- అక్కడి వారిలో అత్యధికులు ముఖియాలే
- పని మనుషులుగా చేరి పుట్టిముంచే నైజం
- దేశ వ్యాప్తంగా వీరిపై కేసులున్నట్లు గుర్తింపు
- అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేస్తాం: సిటీ సీపీ



పోలీసుల అదుపులో మోల్హు, వెనుక బసంతి

సాక్షి, సిటీబ్యూరో: బీహార్ రాష్ట్రం మధుబని జిల్లాలో ఉన్న బిరోల్ గ్రామం... నేపాల్ సరిహద్దులకు కేవలం 35 కిమీ దూరంలో ఉన్న ఈ ఊరు నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్. ప్రధానంగా ముఖియా కమ్యూనిటీకి చెందిన వారు దేశ వ్యాప్తంగా వివిధ నగరాలకు వలస వెళ్లి... సెక్యూరిటీ గార్డులు, పని వాళ్లుగా చేరతారు. నమ్మకంగా ఉంటూ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతుంటారు. అవసరం అనుకుంటే హత్యలు చేయడానికీ వెనుకాడరు. గత ఏడాది జనవరి 31న దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో స్నేహలత అనే మహిళను దారుణంగా హత్య చేసిన రూ.కోటి సొత్తు, తాజాగా హిమాయత్‌నగర్‌లో రోహిత్ కేడియా ఇంటి నుంచి రూ.40 కోట్ల సొత్తు దోచుకుపోయిన వారు ఈ గ్రామస్తులేనని, ఓ నిందితుడు ఈ రెండు కేసుల్లోనూ ఉన్నట్లు హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం పేర్కొన్నారు.

వారందరి మధ్యా ఓ నెట్‌వర్క్...

బిరోల్ గ్రామానికి చెందిన నేరగాళ్లు, ఆ తరహా ఆలోచన ఉన్న వారి మధ్య ఓ నెట్‌వర్క్ ఉంటుందని పోలీసులు గుర్తించారు. వీరందరూ దేశంలోని వివిధ నగరాల్లో పని చేస్తున్నప్పటికీ సంప్రదింపులు జరుపుతూ, సమాచార మార్పిడి చేసుకుంటూ ఉంటారు. స్నేహలత కేసులో నిందితుడిగా ఉన్న మహేష్ కుమార్ ముఖియా అప్పట్లో ఆ దోపిడీకి పథకం వేశాడు. నేరం చేయడానికి తన గ్రామం నుంచే నేరచరితుడైన మోల్హు ముఖియాను పిలిపించుకున్నాడు. ఆ నేరం తర్వాత మోల్హు ఢిల్లీలో తలదాచుకున్నాడు. తాజాగా రోహిత్ కేడియా ఇంటిని టార్గెట్ చేసిన పని వాళ్లు సుశీల్... ఢిల్లీలో ఉన్న మోల్హునే పిలిపించుకుని ఈ నేరం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. సాధారణంగా వీరు నేరం చేసిన తర్వాత అంతా కలిసి ఉండరు. సొత్తు తీసుకుని ఎవరికి వారుగా వేర్వేరు ప్రాంతాలకు లేదా నేపాల్ వెళ్లిపోతారు. అందుకే స్నేహలత కేసులో ఇప్పటి వరకు ఇద్దరు నిందితులు చిక్కినా సొత్తు రికవరీ కాలేదు.

సర్వెంట్స్ వెరిఫికేషన్‌ను పట్టించుకోవట్లేదు:

ఎవరైనా ఇంట్లో పని వాళ్లను నియమించుకునే ముందుకు కచ్చితంగా సర్వెంట్స్ వెరిఫికేషన్ చేయించుకోండి. వారి వివరాలను స్థానిక పోలీసులు అందిస్తే... శ్రమైనా ఈ ప్రక్రియను ఉచితంగా పూర్తి చేసి ఇస్తాం. అయితే ఇప్పటికీ అత్యధికులు ఈ విషయం పట్టించుకోవట్లేదు. ఈ కారణంగానే అనేక నేరాలు జరుగుతున్నాయి. రోహిత్ కేడియా సంబంధీకులు ఎవరైనా తమ ఇంటికి మోల్హు వచ్చిన వెంటనే అతడి వివరాలు ఇచ్చి ఉంటే.. అతడు వాంటెడ్ అనే విషయం తెలిసి, ఈ నేరం జరగకుండా ఉండేది. బిరోల్‌కు చెందిన ముఖియాలు దేశ వ్యాప్తంగా నేరాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అన్ని రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేస్తాం.

– సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ

ఆర్‌టీవీ రవిప్రకాశ్ కేసు వాయిదా

తదుపరి విచారణ 19కి వాయిదా

సిటీ కోర్టులు : ఆర్‌టీవీ న్యూస్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్, ఎడిటర్ రవిప్రకాశ్‌పై సిటీ సివిల్‌కోర్టులో యూరోఎగ్జిమ్ బ్యాంకు రూ.100 కోట్ల పరువు దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై గురువారం సిటీ సివిల్ కోర్టులోని 9వ అదనపు చీఫ్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో వాది, ప్రతివాది వాదనలు వినిపించాల్సి ఉండగా ఇరు పక్షాల తరుపునా సిద్ధంగా లేకపోవడంతో విచారణను ఈనెల 19కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు సూచించింది. ఆర్‌టీవీ రవి ప్రకాశ్ జూలై 14, 2024న ప్రసారం చేసిన వీడియోలో తమ బ్యాంకును దొంగ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్‌అని, ఫేక్ బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చిందంటూ తీవ్ర ఆరోపణలు చేసినట్లు యూరో ఎగ్జిమ్ పరువు నష్టం దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా తమ బ్యాంక్‌కు మంచి పేరుందని, అలాంటి తమ బ్యాంకుకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా ఎలాంటి ధృవీకరణ, నిజ నిర్ధారణ లేకుండా వీడియోలు ప్రచురించి తమ పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యాలు చేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ బ్యాంకును దొంగ బ్యాంకుగా చిత్రీకరించినందుకు రూ.100 కోట్లకు దావా దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ కేసులో వాదనలు వినిపించకపోవడంతో కోర్టు వాయిదా వేసింది.

విచారణకు ఎంపీ అనిల్ కుమార్ గైర్హాజరు

పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది కె.నరేందర్

తదుపరి విచారణ 27కు వాయిదా

సిటీ కోర్టులు : 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌పై నమోదైన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు ఆయన గైర్హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఆయన హాజరు కాకపోతున్నారని అతడి తరుపు న్యాయవాది నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను ఫిబ్రవరి 27కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు సూచించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌యాదవ్ తన అభిమానులు, కార్యకర్తలతో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా అడిక్‌మెట్ నుంచి రాంనగర్ గుండు వరకు సమారు 100 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారని, అంతేకాకుండా రోడ్డుపై టపాకులు కాల్చడంతో పరిసర ప్రాంతాల వారికి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిందని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు మరో నలుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణ గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో జరుగగా ఏ-4 భూపేశ్ హాజరుకాగా మిగతా వారు గైర్హాజరయ్యారు. విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి ఫిబ్రవరికి 27కు వాయిదా వేసింది.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకన్న నాయక్

సైదాబాద్: దావత్ ఇస్తానని తీసుకెళ్లి ఓ యువకుడిపై దాడి చేసి అతడి నుంచి నగదు, నగలు లాక్కెళ్లిన ఘటనలో సైదాబాద్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకన్న నాయక్ వివరాలు వెల్లడించారు. ఎల్‌సీహెచ్ కాలనీకి చెందిన గోవర్ధనాచారి ఈనెల 9న తన బైక్ రిపేరు చేయించుకునేందుకు సమీపంలోని మెకానిక్ షాప్‌నకు వెళ్లాడు.అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ అపరిచిత వ్యక్తి గోవర్ధన్‌తో చుట్టంలా పరిచయం చేసుకుని మాటలు కలిపాడు. అనంతరం తన పుట్టినరోజని దావత్ ఇస్తానంటూ సమీపంలోని మద్యం దుకాణానికి తీసుకెళ్లాడు. అక్కడ మద్యం సేవించిన అనంతరం సదరు యువకుడు బర్త్‌డే గిఫ్టు ఇవ్వాలని గోవర్ధన్‌తో వాగ్వాదానికి దిగాడు. అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్, బంగారు ఉంగరం లాక్కెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సైదాబాద్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పాత నేరస్తుడైన మాల తిరుపాల్‌గా గుర్తించారు. కర్నూల్ జిల్లా, నల్లచెలిమకు చెందిన తిరుపాల్ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి సెల్‌ఫోన్, అరతులం బంగారు ఉంగరం, బైక్ స్వాధీనం చేసుకున్నారు. తిరుపాల్ గతంలోనూ సైదాబాద్, ఎల్‌బీ నగర్, చైతన్యపురి, ఘట్‌కేసర్ పీఎస్‌ల పరిధిలో పలు నేరాలు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలెడ్జి సిటీలో బీఎండబ్ల్యూ కారు బీభత్సం

నాలుగు కార్లు, నాలుగు బైక్‌లు ధ్వంసం



ధ్వంసమైన వాహనాలు

గచ్చిబౌలి: రాయదుర్గం నాలెడ్జి సిటీలో బుధవారం అర్ధరాత్రి ఓ బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. మద్యంలో మత్తులో ఓ యువకుడు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలను ఢీ కొట్టాడు. వివరాలిలా ఉన్నాయి. పుప్పాలగూడ మై హోం అవతార్‌లో నివాసం ఉంటున్న అఖిల్(25) అనే యువకుడు బుధవారం రాత్రి 12 గంటల సమయంలో మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారులో అతివేగంగా వస్తూ బీభత్సం సృష్టించాడు. ట్రాన్స్‌కో ఆఫీస్ రోడ్డులో రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నాలుగు కార్లు, నాలుగు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న వాహనదారులు దీనిని చూసి తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ప్రమాదానికి కారణమైన యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 115 బీఏసీగా నిర్ధారణ అయ్యిందని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ జీహెచ్.వెంకన్న తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ధ్వంసమైన వాహనాల విషయమై ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి



నిందితుడు పాషా..

కుషాయిగూడ: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి రోడ్డుపై వెళుతున్న యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయిలు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, బొబ్బిలికి చెందిన కునుకు మహేష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుషాయిగూడలోని రిషిక హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి అతను పద్మావతి కాలనీలో నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడ అరుణ్, కిరణ్ అనే యువకులతో పాషా అనే వ్యక్తి గొడవ పడుతున్నాడు. మద్యం మత్తులో తూగుతున్న పాషా తనకు పరిచయస్తులైన అరుణ్, కిరణ్‌లను మద్యం తాగించాలని, లేదా డబ్బులు ఇవ్వాలని గొడవ పడుతున్నాడు. అందుకు వారు నిరాకరించడంతో ఆగ్రహానికిలోనైన పాషా పక్కనే ఉన్న తన ఇంట్లోకి వెళ్లి కూరగాయాల కత్తి తీసుకువచ్చాడు. అప్పటికే అరుణ్, కిరణ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మహేష్‌ను వారి మిత్రుడై ఉంటాడని భావించిన పాషా అతడిపై రాయితో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న కత్తితో కడుపు, వీపుపై పొడిచాడు. అతడిని అడ్డుకున్న స్థానికులు గాయపడిన మహేష్‌ను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువు వెంకటేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడు పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సాయిలు తెలిపారు. న్యాయమూర్తి అతడికి 14 రోజుల జ్యుడిషియల్ విధించినట్లు తెలిపారు.

కుంభమేళాకు వెళ్తూ.. అనంత లోకాలకు

- లారీని ఢీకొన్న కారు
- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు
- బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో ఘటన



లారీ వెనుక భాగంలో చొచ్చుకుపోయిన కారు

బాల్కొండ: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా వెళ్లేందుకు గురువారం హైదరాబాద్ నుంచి ఆరుగురు ప్రయాణికులతో బయలు దేరిన కారు ప్రమాదవశాత్తు లారీని ఢీకొట్టింది. నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలం, చిట్టాపూర్ హైవే 44పై చోటు చేసుకున్న ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా. ఐదుగురు గాయపడ్డారు. బాల్కొండ ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్, చింతల్‌కు చెందిన పోతు రమేష్, చంద్రశేఖర్ చారి, వనం శ్రీనివాస్, రజనీకాంత్, పోతు సాయివిశాల్, వనం సంపత్ రాణా కారులో మహా కుంభమేళాకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారుకు చేరుకోగా ముందున్న లారీని ఓవర్ టేక్ చేసేందుకు కారును ఎడమవైపు తిప్పారు.

అదేసమయంలో లారీ కూడా ఒక్కసారిగా ఎడమ వైపు తిరగడంతో కారు లారీ వెనుక భాగంలోకి చొచ్చుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వనం సంపత్ రాణా (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపాలని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అధికారులను ఆదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం జిల్లా అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు అడ్డుకట్ట వేస్తేనే మద్యం అమ్మకాలు పెరుగుతాయన్నారు.గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై కూడా నిఘా పెంచాలన్నారు. పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను వెంటనే డిస్పోజల్ కమిటీ అనుమతి తీసుకుని కాల్చివేయాలన్నారు. జనవరిలో 197 కేసుల్లో 149 మందిని అరెస్టు చేసి 7904 కేజీల బెల్లం, 81.72 కేజీల గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పట్టుకున్నందుకు సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, ఫయాజుద్దీన్, నవీన్, విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఇద్దరి రిమాండ్

మొయినాబాద్: రామరాజ్యం సైన్యం పేరుతో చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి కేసులో మొయినాబాద్ పోలీసులు గురువారం మరో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ వేగవంతం చేసిన పోలీసులు రంగరాజన్‌పై జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న నిందితులందరినీ పట్టుకోవడానికి గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసి చేసి రిమాండ్‌కు తరలించగా తాజాగా మరో ఇద్దరిని రిమాండ్ చేశారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన లక్ష్మణ్, వెంకటేశ్వర్లును బుధవారం వారి సొంత జిల్లాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం వారిని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



శివాజీ మృత దేహం

హయత్‌నగర్: బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... నాగారం ప్రాంతానికి చెందిన పత్తిపాటి శివాజీ(26) వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం రాత్రి అతను హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వైపు స్కూటీపై బయలుదేరాడు. పెద్దఅంబర్‌పేట్ సమీపంలోని నూతన ఫ్లైవర్‌పై నుంచి వెళుతుండగా ఏ-1 బేకరీ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. శివాజీ సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

- రాచకొండ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- రెండు రోజుల్లో 71 కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: ఇసుక అక్రమ రవాణాపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేపట్టే వారిపై పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల్లో 71 కేసులు నమోదు చేశారు. ఎల్బీనగర్ జోన్‌లో 26, మల్కాజిగిరిలో 23, యాదాద్రి– భువనగిరిలో 10, మహేశ్వరం జోన్ 12 కేసులు నమోదు చేశారు. నాలుగు జోన్ల పరిధిలో 107 మందిపై 71 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 44 ఇసుక డంపులలోని రూ.58.72 లక్షల విలువైన 3,762 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. 9 లారీలు, 5 టిప్పర్లు, ఒక మినీ వ్యాన్, 8 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కొడతారనే భయంతో...

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



ఆనంద్(ఫైల్)

హయత్‌నగర్: తనతో గొడవ పడిన వ్యక్తులు ఇంటికి రావడంతో కొడతారని భయపడి ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెద్దఅంబర్‌పేట్, సూర్యవంశీ కాలనీకి చెందిన గుంజ నరసింహ కుమారుడు ఆనంద్(16) క్యాటరింగ్ పని చేసేవాడు. తనకు క్యాటరింగ్ డబ్బులు రావాల్సి ఉండడంతో మంగళవారం సమీపంలోని భారతి కిరాణా దుకాణానికి వెళ్లిన ఆనంద్ భారతి కుమారుడు విఘ్నేష్‌ను డబ్బుల విషయమై ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అదేరోజు విఘ్నేష్ తన అనుచరులతో కలిసి ఆనంద్ ఇంటికి వెళ్లాడు. వారిని చూసి బయపడిన ఆనంద్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. బుధవారం అతడి తల్లి శాంతమ్మ ఎంత పిలిచినా ఆనంద్ తలుపులు తెరవకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆనంద్ ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: భరత్‌నగర్, సీతారామయ్య టవర్స్ 11 కేవీ ఫీడర్ల జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీ రోడ్, లక్ష్మీకళా థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్విని హెయిర్ ఆయిల్ లైన్, సీతారామయ్య టవర్స్, న్యూశాస్త్రినగర్, హేమావతినగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

డాన్‌బాస్కోలో రక్తదాన శిబిరం


శిబిరంలో స్కూల్ సిబ్బంది

శ్రీనగర్‌కాలనీ: రోటరీ బ్లడ్‌బ్యాంక్, డాన్‌బాస్కోల డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని డాన్ బాస్కో స్కూల్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రిన్సిపాల్ థామస్ అక్వినాస్ ఎనర్జీ డ్రింగ్, ఫ్రూట్స్ అందజేశారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌ఓడీ బీరం బాలరాజ్, సోషల్ క్లబ్ ఇన్‌చార్జి రవి, రేణుక, స్టూడెంట్ అధ్యక్షుడు దినేశ్, కార్యదర్శి సైఫ్ ఉల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారిణికి సత్కారం

లిబర్టీ: యువ క్రికెట్ క్రీడాకారిణి ధృతి కేసరిని పలువురు ప్రముఖులు గురువారం సత్కరించారు. బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సత్కారం చేసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ క్రికెట్ క్రీడాకారులు అజారుద్దీన్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడి చర్యలు తగవు



లిబర్టీ: అమెరికాలోని విదేశీయులపై అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విదేశీయులపై అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మానవ హక్కులకు అంతర్జాతీయ న్యాయ సూత్రాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్ జాతీయ నేత కె.యాదవరెడ్డి, జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, కేపీఎల్, జి.నాగేశ్వర్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ పాఠశాలలో ముగిసిన క్రీడాపోటీలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈఓ రోహిణి

పంజగుట్ట: రాజ్‌భవన్ పాఠశాలలో క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ ఆర్.రోహిణి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరుశాతం పెంచుతూ ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. అనంతరం పాఠశాలలో చదివి జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ, ఉపాధ్యాయులు గోపాల్, పీర్‌కొండ, సురేందర్, సునీత, మాలతి, లత, రాజు విశ్వనాథ్ ఉన్నారు.

రేపు ఎస్పీఆర్‌హిల్స్‌లో సేవాలాల్ జయంతి

హాజరుకానున్న కేంద్ర,రాష్ట్ర మంత్రులు

రహమత్‌నగర్: ఫిబ్రవరి 15న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతికి ఎస్పీఆర్‌హిల్స్‌లోని సేవాలాల్ ఆలయం ముస్తాబైంది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న బంజారాలు ఉండగా ఇందిరానగర్ ఫేజ్-1 బస్తీలోని సబ్‌స్టేషన్ పక్కనే ఆలయాన్ని నిర్మించారు. శనివారం జరిగే ప్రత్యేక పూజల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు నాయకులు పాల్గొననున్నారు.

మురుగు ముప్పు లేకుండా..!

రోడ్డు నంబర్-12 రహదారిలో భారీ సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి కసరత్తు

- రూ.4 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు
- 3 రోజులుగా కొనసాగుతున్న సర్వే

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)కు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తరచూగా వస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సమీక్షా సమావేశాలు ఎక్కువగా ఇందులోనే జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డులో పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీతో పాటు జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా యేటా వర్షాకాలంతో పాటు మాములు రోజుల్లోనూ ఈ రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లుతుంటుంది. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు 30 ఏళ్ల క్రితం వేసిన సీవరేజీ పైప్‌లైన్ కావడం మరోవైపు పెరిగిన నివాసాలు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లకు అనుగుణంగా సీవరేజీ పైప్‌లైన్ లేకపోవడంతో మ్యాన్ హోళ్ల నుంచి మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్డంతా అధ్వాన్నంగా మారుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జలమండలి భారీ సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్ రోడ్డునంబర్-12 ప్రధాన రహదారిలో శ్రీనివాసా కన్‌స్ట్రక్షన్స్ నుంచి సితార హోటల్ వరకు మినిస్టర్ క్వార్టర్స్, కమాన్ మీదుగా 450 డయా పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు.


బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లో సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

రూ.4 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు..

రూ.4 కోట్ల వ్యయంతో ఈ పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా రూపుదిద్దుకున్నాయి. అయితే ఈ రోడ్డులో పైప్‌లైన్ వేసేముందు ఎత్తు, వంపులు ఇతర సమస్యలపై సంబంధిత ఏజెన్సీ సర్వే ప్రారంభించింది. మూడు రోజులుగా ముమ్మరంగా సర్వే కొనసాగుతోంది. రోడ్డు తవ్వకాల్లో ఎక్కడెక్కడ అడ్డంకులు ఉన్నాయో

అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీకి లేఖ..

పైప్‌లైన్ నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ జలమండలి ఇటీవలే జీహెచ్‌ఎంసీకి, అలాగే పైప్‌లైన్ నిర్మాణం జరిగే రోజుల్లో ట్రాఫిక్ సమస్య సైతం తలెత్తకుండా చూడాలని ట్రాఫిక్ ఉన్నతాధికారులకు కూడా లేఖలు రాసింది. జీహెచ్‌ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే అగ్రసేన్ చౌరస్తా నుంచి విరించి చౌరస్తా వరకు 2 కిలోమీటర్ల మేర డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య పూర్తిగా పరిష్కారం కానున్నది.

ఐఎంసీ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై నాలెడ్జ్ టెస్ట్


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఐఎంసీ కళాశాలలో గురువారం కేంద్ర బడ్జెట్‌పై నాలెడ్జ్ టెస్ట్ నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్, వాసవి క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్ట్‌లో డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే టెస్ట్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన డి.తిరుమలేశ్ (ఐఎంసీ కళాశాల) మొదటి బహుమతిగా రూ. 3 వేలు, ఎస్ కల్యాణ్ రాజ్ (నిజాం కళాశాల) ద్వితీయ బహుమతి రూ.2వేలు, కావ్య (నిజాం కాలేజ్) తృతీయ బహుమతిగా రూ.1000, ప్రోత్సాహక బహుమతిగా ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ హైదరాబాద్ కోశాధికారి ప్రదీప్, బిజినెస్ స్కూల్ సభ్యుడు అఖిల్, వైస్ ప్రిన్సిపాళ్లు సంతోషి, తిరుమలరావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతగా ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల


షీల్డ్‌తో ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల బాలికల జట్టు

బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ స్కూల్ జిల్లాస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు విద్యార్థినులను అభినందించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. మెరుగైన శిక్షణ ఇచ్చిన పీడీతో పాటు ప్రోత్సహించిన టీచర్లు సుజాత, శారద సేవలను వారు కొనియాడారు.

కుల గణనలో బీసీలకు అన్యాయం చేస్తే సహించం


అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: సర్వే పేరిట బీసీలను మరోసారి మోసం చేయాలని చూస్తే సహించేది లేదని బీసీ సాధికారత సంఘం గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదామి భూమన్న యాదవ్‌తో కలిసి హాజరై మాట్లాడుతూ.. ఆధార్, ఓటర్ కార్డు, విద్యార్థుల సంఖ్య కలిపి రాష్ట్రంలో 4.25 కోట్ల జనాభా ఉండగా కేవలం 3.64 ఉన్నట్లు చూపడంతోనే ప్రభుత్వ ద్వంద్వవైఖరి స్పష్టమౌతుందన్నారు. రాష్ట్రంలో 80 శాతం బీసీలు ఉంటే దానిని 46 శాతానికి తీసుకువచ్చారని సుమారు 25 లక్షల మంది బీసీలను జనాభా లెక్కల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల్లో 3.1 శాతం మిగిలిన వారికి కులగణన చేపడతామని పేర్కొంటున్నారని పారదర్శకంగా ఉండాలని కోరారు. బీసీలకు అన్యాయం చేస్తే స్థానికసంస్థల ఎన్నికల్లో తమ తడాకా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కొత్త లక్ష్మణ్ పటేల్, బి.శంకర్, చలపతిరావు, పి.వాసు, బత్తుల సిద్ధేశ్వర్, బేరి రాంచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న గచ్చిబౌలిలో రన్ ఫర్ హియరింగ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: వినికిడి సమస్యపై అవగాహన కల్పించేందుకు మౌర్య ఫౌండేషన్, మైక్రో ఈఎన్‌టీ ఆసుపత్రిల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 2న గచ్చిబౌలిలో 'డేసిబుల్ డాష్-2025- రన్ ఫర్ హియరింగ్' పేరుతో 2కే, 5కే, 10కే రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పంజగుట్ట సిటీసెంటర్ మాల్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఈఎన్‌టీ సర్జన్, మౌర్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రకాశ్, ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అశ్విని అమరేశ్వర్, రంగారెడ్డి జిల్లా, లోక్ అదాలత్ న్యాయమూర్తి అమితారాణి, డాక్టర్ సొనాలి చతుర్వేది గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రన్‌తో పాటు వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి మైక్రోకేర్ ఈఎన్‌టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి కేపీహెచ్‌బీ, జూబ్లీహిల్స్ బ్రాంచిల్లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు మార్చి 3 నుంచి 10 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భారతి, డాక్టర్ శ్రీపూజ, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం రావాలి'

సాక్షి సిటీబ్యూరో: అన్ని రంగాల్లో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం రావాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీతార కుష్బూ పేర్కొన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విభిన్న రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళలకు భారత్ కె అస్మోల్ ఆధ్వర్యంలో అవార్డులతో సన్మానించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సినీతార కుష్బూ ముఖ్య అతిథులుగా విచ్చేసి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఖుష్బూ మాట్లాడుతూ.. మహిళల దుస్తులను బట్టి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయొద్దన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ డాక్టర్ మహమ్మద్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

'మాల కులస్తులకు 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



పంజగుట్ట: ఎస్సీ కులాల సర్వే చేపట్టి మాల కులస్తులకు 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. వెంటనే రీ సర్వే చేసి దానిప్రకారం మాలలు ఉన్న ఎస్సీ గ్రూప్-3 కి 8 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. తమ జాతికి అన్యాయం జరుగుతున్నా నోరుమెదపకుండా ఉన్న మాల ఎమ్మెల్యేలు వెంటనే వారి పదవికి రాజీనామా చేయాలని లేకుంటే ఈనెల 15 నుంచి మాల ఎమ్మెల్యేలు, ఉప ముఖ్యమంత్రి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు ప్రచారం జరుగుతోందని ఆ బంద్‌కు మాల సంఘాల జేఏసీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్ బూర్గుల వెంకటేశ్, రమేశ్, మన్నె శ్రీధర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరళ, ప్రధాన కార్యదర్శి రమ, భానుప్రకాశ్, బి.ఆనంద్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు చెక్

బంజారాహిల్స్: నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా బంజారాహిల్స్ రోడ్డునంబర్-1లోని నిమ్స్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 12.5 ఎంవీఏ సిస్టంను టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషార్రఫ్ ఫారూఖీ గురువారం ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 8ఎంవీఏ సిస్టం మాత్రమే ఉండగా దీని కెపాసిటీని 12.5 ఎంవీఏగా మార్చారు. దీనివల్ల పంజగుట్ట, ద్వారకాపురికాలనీ, బంజారాహిల్స్ రోడ్డునంబర్-1, బంజారాహిల్స్, రెయిన్‌బో, స్టార్ ఆస్పత్రులు, జలగం వెంగళరావు పార్కు తదితర ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ చిలకమర్రి చక్రపాణి, ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ పి.హనుమంతరెడ్డి, ఏడీఈ రమేశ్‌బాబు, ఏఈ వై.రమేశ్‌కుమార్, లైన్స్ ఎస్ఈ దిలీప్‌కుమార్, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ క్లౌ రయ్య తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి యోగా సాధనపై శిక్షణ తరగతులు

కాచిగూడ: ఆనంద మార్గ ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 3 రోజుల పాటు సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలోని ఆనంద మార్గ్ ఆశ్రమంలో యోగా సాధనపై శిక్షణ తరగతులు, సెమినార్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు ఆచార్య సంపూర్ణానంద్ అవధూత, అచార్య రాజేశ్ ఆనంద్ అవధూత, ఆచార్య దివ్యేస్‌మీసానంద్ అవధూత, ఎ.హనుమంతు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగాసనాలు నేర్పిస్తారన్నారు. అలాగే 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు కోరిక, నిర్లిప్తత, వ్యక్తీకరణ, ప్రతీక, నీటి సంరక్షణ, ప్రాథమిక విధులు, ప్రభాత సంగీతం, సామాజిక అంశాలు, హ్యూమనిజం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

నేడు సైబర్ నేరాలపై అవగాహన

లక్డీకాపూల్: రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘ భవనంలో సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వినయ సాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌నగర్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ స్థిత ప్రజ్ఞ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


గౌతంరెడ్డి

వెంగళరావునగర్ : యువకుడు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన గౌతంరెడ్డి తల్లిదండ్రులు తన చిన్నప్పుడే మృతిచెందారు. దాంతో నగరంలోని యూసుఫ్‌గూడలో ఉంటున్న తన బాబాయి పోషిస్తున్నాడు. ఇటీవల అందరూ కలిసి చేర్యాలకు వెళ్లి వచ్చారు. గతేడాది డిసెంబర్ 27న గౌతంరెడ్డి జీపీఏ హోల్డర్ అయిన సుధాకర్‌రెడ్డితో కలిసి నగరంలోని ఓ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఇద్దరూ కలిసి యూసుఫ్‌గూడకు వచ్చారు. సుధాకర్‌రెడ్డి బోరబండకు వెళ్లగా గౌతంరెడ్డి మాత్రం యూసుఫ్‌గూడలోని తన ఇంటికి వెళ్లలేదు. అయితే ఈ ఏడాది జనవరి 14న తన బంధువులతో మాట్లాడాడు. మళ్లీ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దాంతో అతని ఆచూకీ కోసం తాత శ్రీనివాస్‌రెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి..


నరేందర్

ఫిలింనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విరాట్‌నగర్‌లో నివసించే చిక్కోర్ల నరేందర్ (22) ఇంటర్ సెకండియర్ చదువుతూ బ్లింకిట్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 7న తండ్రి బాలకృష్ణయ్య, తల్లి జయమ్మ విధుల్లోకి వెళ్లే క్రమంలో కాలేజీకి ఎప్పుడు పోతావని కుమారుడిని ప్రశ్నించారు. కొద్దిసేపట్లో వెళ్తానని నరేందర్ చెప్పగా వాళ్లు విధులకు వెళ్లిపోయారు. కొద్దిసేపటికే విధుల్లో ఉన్న జయమ్మకు బ్యాంక్ నుంచి, పోస్టాఫీసు నుంచి వేర్వేరుగా రూ.11 వేలు డ్రా అయినట్లుగా మెసేజ్ వచ్చింది. వెంటనే ఆమె భర్తకు ఫోన్ చేయగా ఇంటికి వెళ్లిన బాలకృష్ణయ్యకు తాళం కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఏటీఎం కార్డులు కనిపించలేదు. వెంటనే కొడుకుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. రెండు రోజుల పాటు పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 8712568961 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

భవనంపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

రహమత్‌నగర్ : మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగానగర్‌లో నివాసించే మహ్మద్ అబరార్ ఇలాహీ (24) డిగ్రీ పూర్తి చేశాడు. కొంతకాలంగా అతని మానసికస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో ఈనెల 11 అబరార్ కనిపించడం లేదంటూ అతని బంధువులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా అబరార్ తాను నివసించే భవనంపై నుంచి పక్కన ఉన్న భవనం పైకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

'నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిది'



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

పంజగుట్ట: నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిందని అఖిల భారత నోటా రాజ్యాంగ ముసాయిదా సభ చైర్మన్ పి.సౌద అరుణ్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014లో నోటాకు కూడా గుర్తు ఉండాలని తానే న్యాయస్థానంలో పిల్ వేశానని దీంతో నోటాకు గుర్తు కేటాయించారని గుర్తుచేశారు. 2032లో దేశంలో సుమారు 100 నియోజకవర్గాల్లో నోటా మొదటి స్థానంలో వచ్చే అవకాశం ఉందన్నారు. నోటా మొదటిస్థానంలో ఉంటే ఎన్నికలు రద్దు చేసి తిరిగి నిర్వహిస్తే ఆ ఖర్చుకూడా ప్రజలపైనే పడుతుందన్నారు. అందుకే ద్వితీయ స్థానంలో వచ్చిన వ్యక్తికి సగం అధికారం నోటా కమిటీకి సగం అధికారం ఇస్తే ఇద్దరూ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతారని పేర్కొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

లిబర్టీ: దేశం కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకోవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో సరోజినినాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధురరాలిగా, కవయిత్రిగా సరోజినినాయుడు పేరు పొందారని కొనియాడారు. సమావేశంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాస్‌రావు, రేవంత్, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

రహమత్‌నగర్: భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. డివిజన్‌లోని ఎస్పీఆర్‌హిల్స్‌లో గురువారం జూబ్లీ హిల్స్ జోన్ సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ స్వామి హాజరై మాట్లాడుతూ.. 60 ఏండ్లు దాటిన ప్రతి కార్మికుడికి నెలకు రూ 5 వేల పెన్షన్ అందించాలన్నారు. అనంతరం లేబర్ ఇన్స్‌రెన్స్ కార్డులను కార్మికులకు అందజేశారు. డివిజన్ సీఐటీయూ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దేవాదాస్, బాలయ్య, భాగ్యరాజ్, నరసింహ, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం'

పంజగుట్ట: కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి దూదిపాల విజయ్‌పాల్ రెడ్డి, లీగల్‌అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో డి.పి.రెడ్డి, ఎస్.రామస్వామి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇటీవల జరిగిన పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన నూతన కార్యవర్గం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

కుళ్లిన చికెన్‌తో ఫ్రై

రెండు, మూడు నెలలుగా చికెన్ నిల్వలు

- కల్లు కాంపౌండ్, వైన్‌షాపులు, బార్లకు సరఫరా
- రెండు షాపులు సీజ్





కుళ్లిన చికెన్ సరఫరా చేస్తున్న రవి

రసూల్‌పురా: బయట దొరికే చికెన్ ఫ్రై అంటే కొందరు లొట్టలేసుకుంటూ తింటారు.. అది ఎప్పటిది?.. వాడిన నూనె ఏంటి..?.. ఏ ప్రదేశంలో తింటున్నాం.. అనేవి అస్సలు పట్టించుకోరు. ఎందుకంటే కలర్‌ఫుల్‌గా కనిపిస్తూ నోరూరిస్తుంది.. ఇక కల్లు కాంపౌండ్లు, మద్యం దుకాణాలు, బార్లలో అయితే.. ఆలోచించకుండా కొందరు తినేస్తారు. ఈ బలహీనతే కొందరికి ఆదాయంగా మారింది. తినేవాళ్లు ఉన్నన్ని రోజులు ఇలాంటి వాళ్లు ఉంటారు. అసలేం జరిగిందంటే.. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు సంయుక్తంగా గురువారం రెండు చికెన్ షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో అధికారులు రెండు, మూడు నెలల నుంచి నిల్వ చేసిన 600 కిలోల కుళ్ళిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ చికెన్‌ను కల్లు కాంపౌండ్, బార్లు, వైన్‌షాపులకు విక్రయిస్తున్నారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అన్నానగర్‌లో రవి గత ఆరు నెలలుగా, అర్జున్‌నగర్‌లోని భాస్కర్ గత రెండేళ్లుగా చికెన్ నిల్వచేసి కల్లుకాంపౌండ్, బార్లు, వైన్‌షాపులకు సరఫరా చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో దాడులు చేసి చికెన్ స్వాధీనం చేసుకున్నారు. బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ మాట్లాడుతూ.. రవి, భాస్కర్‌ల షాపు సీజ్ చేశామని వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ నగర్‌లో రవి చికెన్ షాపు నిర్వహిస్తూ కుళ్లిన చికెన్ సప్లయ్ చేస్తుండగా షాపు సీజ్ చేశామని అయినా పద్ధతి మార్చుకోకుండా అన్నానగర్‌లో షట్టర్ తీసుకుని నిల్వ చేసిన చికెన్ తక్కువ ధరకు సప్లయ్ చేస్తున్నాడని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు యాక్టు ప్రకారం ఈ ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘హోం’ గడవని గార్డులు!

మూడు నెలలుగా ప్రతి నెలా జీతాలు ఆలస్యమే

- చెక్ బౌన్స్ చిక్కులతో ప్రతి ఒక్కరూ సతమతం
- పరీక్షల సీజన్ కావడంతో స్కూలు ఫీజుల పరేషాన్



సాక్షి, సిటీబ్యూరో: హోంగార్డు... పేరుకు పోలీసు విభాగంలో పని చేస్తున్నా వీరికి స్వచ్ఛంద సేవతో సమానం. పని చేసిన రోజులకు మాత్రమే రోజుకు రూ.921 చొప్పున అందుకోవాల్సిందే. అయితే గడిచిన మూడు నెలలుగా ప్రతి నెలా జీతం ఆలస్యంగా వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు కేవలం చెక్ బౌన్సులు, సిబిల్ స్కోర్ ఇబ్బందులే ఉండేవని... ఈసారి పరీక్షల సీజన్ కావడంతో పిల్లల స్కూలు ఫీజుల భారం కూడా పడిందని హోంగార్డులు వాపోతున్నారు. సాధారణంగా ప్రతి నెలా హోంగార్డులకు నాలుగైదు తేదీల్లో జీతం పడుతుంటుంది. ఈనెల మాత్రం గురువారం (13వ తేదీ) అకౌంట్‌లో పడింది. వీళ్ల పని చేస్తున్న విభాగాల నుంచి అటెండెన్స్ హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ జీతం బిల్లులు తయారై కమిషనర్ ఆఫీస్‌కు చేరిన తర్వాతే జీతం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గరిష్టంగా ఐదో తేదీ లోపు జీతం వారి ఖాతాల్లో పడుతుండేది. దీంతో వివిధ రకాలైన నెల వారీ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపుల (ఈఎంఐ) తేదీని అత్యధిక శాతం హోంగార్డులు ఆరేడు తేదీలుగా ఎంపిక చేసుకున్నారు. అప్పటికీ వీరి ఖాతాలో సరిపడ నగదు లేకుండా ఈఎంఐ కట్ కాకపోవడంతో పాటు చెక్ బౌన్స్ అవుతుంది. గత ఏడాది డిసెంబర్‌తో (నవంబర్ నెల జీతం) పాటు గత నెల్లోనూ (డిసెంబర్ జీతం) హోంగార్డులకు జీతం ఎనిమిదో తేదీన పడింది. దీని ప్రభావంతో అనేక మంది ఈఎంఐలకు సంబంధించిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. ఫలితంగా తమ సిబిల్ స్కోరు దెబ్బతినిందని ఉన్నతాధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ వీరిది అరణ్యరోదనే అయింది. జనవరి నెల జీతం మాత్రం గురువారం (13వ తేదీ) నాటికీ హోంగార్డుల ఖాతాల్లో పడింది. ఏడాదిలో రెండుమూడుసార్లు జీతం ఆలస్యం కావడంతో ఇంటి యజమానులతో పాటు పాలు, పచారీ సరుకుల వారి నుంచి చివాట్లు తప్పట్లేదని హోంగార్డులు వాపోతున్నారు. అయితే ఈ నెల్లో మాత్రం కొత్త చిక్కు వచ్చిందని హోంగార్డులు వాపోతున్నారు. దాదాపు ప్రతి హోంగార్డు సంతానం వివిధ రకాలైన విద్యల్ని అభ్యసిస్తోంది. హోంగార్డుల్లో అత్యధికులు సకాలంలో స్కూలు, కాలేజీ ఫీజులు చెల్లించలేక ఇబ్బందిపడేవారే. ప్రతి సందర్భంలోనూ ఆయా విద్యా సంస్థల యజమానుల్ని కలిసి గడువు కోరడం వీరికి పరిపాటిగా మారింది. అయితే ఇది పరీక్షల సీజన్ కావడంతో హోంగార్డులకు కొత్త చిక్కువచ్చి పడింది. కచ్చితంగా ఫీజు బకాయి మొత్తం చెల్లిస్తేనే హాల్ టిక్కెట్లు ఇవ్వడం, పరీక్షలు రాయడానికి అనుమతించడం స్కూలు యాజమాన్యాలకు పరిపాటి. ఫిబ్రవరిలోనే ఆయా స్కూలు ఫీజులతో పాటు పరీక్ష ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి కీలక సమయంలో సైతం జీతాల ఆలస్యం కావడంతో హోంగార్డులతో పాటు వారి పిల్లలూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తమ ఉన్నతాధికారులు, తాము పని చేస్తున్న అధికారుల వద్ద అప్పుగా నగదు తీసుకుని ఫీజుల గండం గట్టెక్కించుకుంటుండగా.. మరికొందరు వడ్డీ వ్యాపారులను, ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. తమకు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం మాట అటుంచి కనీసం ప్రతి నెలా నిర్ణీత తేదీకి జీతం పడేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని హోంగార్డులు కోరుతున్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్
- దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ హోం మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ రచించిన విజయ తెలంగాణ పుస్తకావిష్కరణ కార్యక్రమం నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో సాయంత్రం 4 గంటలకు
- విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో కవి, విమర్శకులు డాక్టర్ బిక్కి కృష్ణ రాసిన వాన వెలిశాక, మార్మిక నది, కాలం నది ఒడ్డున, ప్రకృతి-పర్యావరణ కవితా సంపుటాల ఆవిష్కరణ చిక్కడపల్లిలోని సిటీ కల్చరల్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు, సాయంత్రం 6 గంటలకు కవి సమ్మేళనం

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న వివిధ పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల తేదీలలో మార్పులు చేసినట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ. శశికాంత్ గురువారం తెలిపారు. ఈ నెల 18న ప్రారంభం కానున్న 3వ సెమిస్టర్ పేపర్-1 పరీక్షను 19వ తేదీకి, 19న జరగాల్సిన 1వ సెమిస్టర్ పేపర్-2ను 20వ తేదీకి, 20వ తేదీన జరగాల్సిన 3వ సెమిస్టర్ పేపర్-2ను 21వ తేదీకి, 22న జరగాల్సిన పేపర్-3ని మార్చి 7కు, 25న జరగాల్సిన పేపర్-4ను 10కి వాయిదా వేసినట్లు తెలిపారు. మిగతా సెమిస్టర్ పరీక్షల తేదీలు యథాతథంగా నిర్వహిస్తామన్నారు.

మంత్రి కొండా సురేఖకు సత్కారం



మంత్రిని సత్కరిస్తున్న తెలంగాణ ఇండస్ట్రీస్ రికవరీ సాల్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ముషీరాబాద్: రాష్ట్రంలో రికవరీ సాల్వెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని స్వాగతిస్తూ తెలగాణ ఇండస్ట్రీస్ రికవరీ సాల్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం మంత్రి కొండా సురేఖను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పాత శివకుమార్, కార్యదర్శి మురళి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 33 రికవరీ సాల్వెంట్ పరిశ్రమలను రద్దు చేసిందని, దీంతో తాము ఉపాధి కోల్పోయామన్నారు. తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ కమిషనర్, ఉన్నతాధికారులకు విన్నవించగా వారు స్పందించారని అన్నారు. దీంతో తమ పరిశ్రమలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు.

భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి



ప్రసంగిస్తున్న ఆచార్య వాసుదేవ్‌జీ

గోల్కొండ: ఒత్తిడిని జయింతి..భావోద్వేగాలను అదుపులో ఉంచుకొని తీసుకునే నిర్ణయాల వల్ల విజయం సాధ్యమవుతుందని దేవ్ ఫౌండేషన్‌కు చెందిన ఆచార్య వాసుదేవ్‌జీ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కొన్ని సమయాల్లో యువతులు బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారని అందువల్లే వారు విజయాలు సాధిస్తారన్నారు. దేశ, విదేశాల్లో రాజకీయ, శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక రంగాలలో విజయం సాధించి ఆదర్శంగా నిలిచిన మహిళలు అనేకమంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎం.మాధవీ లత పాల్గొన్నారు.

అమర వీరులను స్మరించుకుందాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

సుల్తాన్ బజార్: ఫిబ్రవరి 14 అంటే కేవలం వాలంటైన్స్ డే మాత్రమే కాదని దేశ రక్షణలో వీర మరణం పొందిన పుల్వామ అమర వీరుల సంస్మరణ దినమని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నేతలు పేర్కొన్నారు. గురువారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దివస్ పోస్టర్‌ను ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. వీరమరణం పొందిన జవాన్ల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జవాన్ల ఆత్మకు శాంతి చేకూరేలా క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తూ 14న అమరవీరులను స్మరించుకుందామని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. వాలంటైన్స్ డే వంటి పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండాలని యువతకు విజ్ఞప్తి చేశారు.నాయకులు మోహన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలోని లోపాలను సరిదిద్దాలి



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ చట్టరూపం దాల్చక ముందే వర్గీకరణలోని లోపాలను సరిదిద్దాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మిత అయ్యాల్వార్ సంఘం అధ్యక్షుడు యంద్రపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీలలోని అన్ని కులాలలకు తహసీల్దార్ ద్వారా కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీల్లోకి కొన్ని కులాలకు తహసీల్దార్ ద్వారా, చాలా కులాలకు ఆర్డీవో ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయడం సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ ఇబ్బందులను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశం నేతకాని, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో హిప్ ఆర్థోస్కోపి లైవ్ సర్జరీ



లైవ్ సర్జరీలో పాల్గొన్న డాక్టర్లు

గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఓ యువతికి గురువారం హిప్ ఆర్థోస్కోపి లైవ్ సర్జరీ నిర్వహించారు. గురువారం ఆర్థోపెడిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ బీ వాలియా ఆధ్వర్యంలో ఈ సర్జరీ జరిగింది. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తిమ్మారెడ్డి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ కృపాల్‌సింగ్, నిమ్స్ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.ఎస్ఐ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ యువతి తుంటికి గాయం కావడంతో విజయవంతంగా సర్జరీ పూర్తి చేశారు. అనంతరం ఫోరెన్సిక్ విభాగం సహకారంతో ఓ మృతదేహానికి ఆపరేషన్ నిర్వహించి లైవ్ డెమో ద్వారా జూనియర్ డాక్టర్లకు ప్రత్యక్షంగా వివరించారు. ఇలాంటి లైవ్ సర్జరీ తెలంగాణాలో మొట్టమొదటి సారి నిర్వహించినట్లు డాక్టర్ బి వాలియా తెలిపారు. గాంధీ ఆర్‌ఎంవో డాక్టర్ శేషాద్రి, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘అపార్’ రూపకల్పనలో ఓపెన్ వర్సిటీకి గుర్తింపు

బంజారాహిల్స్: విద్యార్థులకు ఆపార్ ఐడీలను రూపొందించడంలో జాతీయస్థాయిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గుర్తింపు పొందడం గర్వకారణమని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ సంచాలకులు దేవసేన అన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 75 శాతం విద్యార్థులకు అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ క్రియేట్ చేశామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆపార్ ఐడీ ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. తాము ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్లామో గురువారం సాయంత్రం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ రోహిత్ త్రిపాఠి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఆధ్యాత్మిక గ్రంథాల అందజేత



కేటీఆర్‌కు గ్రంథాలను అందజేస్తున్న మంతటి వెంకటయ్య

బంజారాహిల్స్: ప్రబోధ, సుబోధ, త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్ కర్నూల్ కమిటీ శాఖ సభ్యులు మంతటి వెంకటయ్య బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తమ గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు తాడిపత్రిలో ప్రబోధాశ్రమం నెలకొల్పి భగవద్గీత ప్రచారంలో అనేక మంది హిందువులు పాల్గొనేటట్లు చేయడం గొప్ప విషయమన్నారు.

దైవ సన్నిధానంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి మహాస్వామి

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానంలో హంపీ విరూపాక్ష విద్యారణ భారతి మహాస్వామి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామీజి మహాసంస్థాన పీఠార్చన, అనుగ్రహ భాషణం, ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి పరుచూరి గోపాలకృష్ణ, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ట్రంప్ తీరు గర్హనీయం’



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐప్సో నాయకులు

కవాడిగూడ: అమెరికాలోని విదేశీయుల పట్ల ట్రంప్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గర్హనీయమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమెరికాలో కొందరు అక్రమంగా ఉండడంతో పాటు పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారంటూ సైనిక విమానాలలో అవమానకర పద్ధతిలో వారి దేశాలకు పంపడాన్ని తీవ్రంగా ఖండించారు. గురువారం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐప్సో జాతీయ నేత యాదవరెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ..అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసినప్పటినుంచి అంతర్జాతీయ సమాజంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమెరికా తన తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర నాయకులు ఉమామహేష్, శ్రీనివాస్, రవికిరణ్ పాల్గొన్నారు.

అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. బాధితులు ధైర్యం చేసి కేసు నమోదు చేయడమే కష్టంగా ఉంటుందని అలాంటి సమయంలో వారిని ఇబ్బంది పెట్టకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి.. కుల ధ్రువీకరణ పత్రాలు వారం రోజులలోగా మంజూరు చేయాలని ఆదేశించారు. బాధితులకు త్వరగా న్యాయం అందేలా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, అడిషనల్ డీసీపీ మనోహర్, సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కోటజి, ఆర్డీఓలు సాయిరాం, రామకష్ణ, ఏసీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీహబ్‌లో ‘ఏజెన్సీ అడ్డా’ పుస్తకావిష్కరణ



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో 'ఏజెన్సీ అడ్డా' పేరిట ప్రచురించిన పుస్తకాన్ని గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత అర్చనా పురోహిత్, ఏజెన్సీ అడ్డా సహ వ్యవస్థాపకులు ఉపాసన పురోహిత్, జాగ్గల్ సంస్థ సీఈఓ శివకుమార్, టీహబ్ మాజీ సీఈఓ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్యానల్ చర్చలో టీహబ్ మాజీ సీఈఓ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టార్టప్‌ల సంస్కృతి పెరుగుతోందని, వారికి తగిన ప్రోత్సాహం కల్పిస్తే ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు స్టార్టప్‌ల ప్రతినిధులు, ఏజెన్సీఅడ్డా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ నర్సింగరావు

మణికొండ: గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో గురువారం మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్, రీసర్చ్ అడ్వైజర్ డాక్టర్ టి. నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు నవీన సాంకేతికతను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు అంది వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని తమ శక్తి మేరకు దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, రీసెర్చ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఫణిరాజ్ పాల్గొన్నారు.

సమతాకుంభ్ వేడుకల్లో హరీశ్‌రావు



హరీష్‌రావుకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని సమతామూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతా కుంభ్ వార్షికోత్సవంలో మాజీ మంత్రి టి.హరీష్‌రావు పాల్గొన్నారు. చినజీయర్‌స్వామి ఆయనకు తీర్థప్రసాదాలు, మంగళశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-బరాత్

సాక్షి, సిటీబ్యూరో: ముస్లింలు గురువారం రాత్రి షబ్-ఏ-బరాత్ (జగనేకీ రాత్)ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని అన్ని మసీదుల్లో సామూహికంగా ఇషా నమాజ్ నిర్వహించారు. పలు మసీదుల్లో మతగురువులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. ఇక చారిత్రక మక్కా మసీదులో బరాత్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నాంపల్లి దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. బరాత్ రాత్రిని పురస్కరించుకొని ముస్లిం సోదరులు తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక దువాలు చేశారు.

16న సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32వ సర్ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షను జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో నిర్వహించింది. దేశ వ్యాప్తంగా నిర్వహించిన 32వ జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఫిబ్రవరి 16న పబ్లిక్ గార్డెన్స్ లలితా కళా తోరణంలో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం చేయనున్నామని సుచిరిండియా ఫౌండేషన్ నిర్వహకులు డా.లయన్ కిరణ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటుడు రావు రమేష్ తదితరులు హాజరవుతారన్నారు.

అప్పుడు తిరస్కరించాం..ఇప్పుడు స్వాగతిస్తున్నాం

కులగణన రీ సర్వే నిర్ణయంపై బీసీ సంఘాల నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

లక్డీకాపూల్ : ‘బీసీ కులగణనను అపుడు తిరస్కరించాం.. ఇపుడు స్వాగతిస్తున్నాం’ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కులగణన తప్పులతడక అని ఆధారాలు చూపామని పేర్కొంటూ ప్రభుత్వం స్పందించి రీ సర్వే చేయడానికి సమాయత్తం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లక్డీకాపూల్‌లోని అశోక హోటల్‌లో గురువారం బీసీ సంఘాలు, బీసీ మేధావుల మీడియా సమావేశం జరిగింది. జాతీయ వడ్డెర సంఘం చైర్మన్, బీసీ సంఘం కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాజుల మాట్లాడుతూ.. కుల గణన పేరిట బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కులగణనలో శాస్త్రీయ విధానాన్ని పాటించలేదన్నారు. ఇందుకు తమ వాటా కోసం వీధి పోరాటాలతో పాటు న్యాయపోరాటాలను సైతం చేశామన్నారు. ఈ నెల16 నుంచి జరిగే కులగణన రీ సర్వేకి తగిన ప్రాచుర్యం కల్పించాలని, 15 రోజుల ఈ ప్రక్రియను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు మాట్లాడుతూ.. కులగణనను రాజకీయం చేయొద్దని హితవు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని న్యాయబద్ధంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు తాడూరి శ్రీనివాస్, సురేష్, నగేష్, గణేష్, శ్రీకాంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.





బిల్డర్లతో బేరసారాలకు అవకాశం..
రాయితీలు పొందే వీలు

మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న బిల్డర్ ప్రాజెక్ట్‌లను ఎంచుకోవాలి	అభివృద్ధికి అవకాశాలున్న ప్రాంతాల్లో ఇల్లు కొనడం బెటర్

మార్కెట్ పడిపోతున్నప్పుడు కొనడం. పెరుగుతున్నప్పుడు అమ్మటమే లాభసాటి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ చేసే పని! ఇదే సూత్రం రియల్ ఎస్టేట్‌కూ వర్తిస్తుంది. ప్రతికూల సమయంలో కొనుగోలు చేస్తే రేటు కలిసి వస్తుంది. మార్కెట్ బాగున్నప్పుడు విక్రయిస్తే రాబడి రెండింతలవుతుంది. హోమ్ బయ్యర్ నుంచి ఇన్వెస్టర్‌గా ఎదగాలంటే చేయాల్సిందిదే. స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు మాదిరిగానే స్థిరాస్తి రంగానికి కూడా కండీషన్స్ అప్లై అనేది ఉంటుంది. ప్రాంతం ఎంపిక మొదలు డెవలపర్ ట్రాక్ రికార్డ్, ఆర్థిక పరిస్థితి, ప్రాంతం అభివృద్ధి అవకాశాలు, ప్రాజెక్ట్‌లోని వసతులు వరకు అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని కొనుగోలు చేయాలి. అప్పుడే పెట్టుబడికి తగిన ప్రతిఫలాలను అందుకోవడం సాధ్యం.

–సాక్షి, సిటీబ్యూరో

మార్కెట్ బాలేనప్పుడు
కొనుడే కరెక్ట్!

అభివృద్ధిని ముందుగానే అంచనా వేయాలి..

ప్రాంతం అభివృద్ధిని ముందుగా అంచనా వేయగలిగితే దాని ప్రతిఫలాలను వంద శాతం ఆస్వాదించవచ్చు. మెరుగైన మౌలిక వసతులు, భద్రత, కనెక్టివిటీ, నిత్యావసరాలు, అందుబాటు ధర వంటి వాటిని సమీక్షించుకొని ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆయా అంశాల్లో బాచుపల్లి, దుండిగల్, మల్లంపేట, బౌరంపేట ప్రాంతాలు హాట్ డెస్టినేషన్. ఎందుకంటే.. 200 అడుగుల రోడ్లు, ఫ్లై ఓవర్, స్కైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పైగా ఓఆర్ఆర్ దుండిగల్ ఎగ్జిట్ మాత్రమే కాకుండా మల్లంపేట వద్ద మరో ఎగ్జిట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటితో ఇతర జిల్లా కేంద్రాలు, పలు ప్రాంతాలతో కనెక్టివిటీ పెరిగింది.

- కనెక్టివిటీ ఇబ్బందుల కారణంగా గతంలో ఆఫీసుకు దగ్గరలో ఉండే ప్రాజెక్ట్‌లలో కొనుగోలు చేసేందుకే కస్టమర్లు మొగ్గు చూపేవాళ్లు. కానీ, ఇప్పుడు మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, స్కైవేలు, ఓఆర్ఆర్, లింక్ రోడ్లు వంటి వాటితో కనెక్టివిటీ మెరుగైంది. దీంతో ప్రధాన నగరంలోని బడ్జెట్‌తోనే 5–6 కి.మీ. దూరమైనా సరే పెద్ద సైజు అపార్ట్‌మెంట్ లేదా విల్లా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

భూమి ధర మేరకే నిర్ణయం...

శివారు ప్రాంతాల్లో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయంటే దానర్థం రేట్లు పడిపోయాయని కాదు. గత 3–4 ఏళ్లుగా స్థలాల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రస్తుతం స్థిరంగా నిలిచిపోయాయి. భూమి ధరను బట్టే ఓపెన్ ప్లాట్, అపార్ట్‌మెంట్, విల్లా వంటి ప్రాజెక్ట్ చేయాలని బిల్డర్లు నిర్ణయించుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త డెవలపర్ ల్యాండ్ కొని, ప్రాజెక్ట్ చేసే పరిస్థితి లేదు. ఒకవేళ ఉన్నా గతంలో స్థల సమీకరణ చేసిన డెవలపర్లు నిర్మించే ప్రాజెక్ట్‌లతో పోలిస్తే ధరలు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు బాచుపల్లిలో రెండేళ్ల క్రితం ఎకరం రూ.12–13 కోట్లకు కొనుగోలు చేసిన ప్రణీత్ గ్రూప్ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తోంది. చదరపు అడుగుకు రూ.5,500 చొప్పున విక్రయిస్తోంది. ఇప్పుడిదే ప్రాంతంలో ఎకరం రూ.20 కోట్లు–25 కోట్లుగా ఉంది. ఇలాంటి చోట కొత్త బిల్డర్ నిర్మించే ప్రాజెక్ట్‌లో ధర చదరపు అడుగుకు రూ.7 వేలు ఉంటే తప్ప గిట్టుబాటుకాని పరిస్థితి. దీంతో ధర తక్కువగా ఉన్న చోట కొనుగోలు చేయడమే కస్టమర్లకు లాభం. పైగా తుది దశకు చేరుకున్న పాత ప్రాజెక్ట్‌ల్లో కొనుగోలు చేస్తే గృహ ప్రవేశం చేసేయొచ్చు.

రేపటి అవసరాన్ని గుర్తించి కొనాలి..

- ప్రతికూల సమయంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనడమే ఉత్తమమని చాలామంది సలహా ఇస్తుంటారు. కానీ, ఒడిదుడుకుల మార్కెట్‌లో అమ్మకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేసే సామర్థ్యం ఉందా అని ఆలోచించాలి. అందుకే ప్రతికూలంలోనూ బిల్డర్ ట్రాక్ రికార్డ్, ఆర్థిక సామర్థ్యం, గతంలో డెలివరీ చేసిన ప్రాజెక్ట్‌లు వంటి అంశాలను చూసి రెండేళ్లలో పూర్తయ్యే ప్రాజెక్ట్‌లో కొనుగోలు చేసినా నష్టం ఏమీ ఉండదు. పైగా రెడీ టు ఆక్యుపైతో పోలిస్తే వీటిల్లో ధర తక్కువగా ఉంటుంది. విస్తీర్ణం, ఇతరత్రా అంశాలపై బిల్డర్‌తో బేరసారాలు చేసే అవకాశం కూడా ఉంటుంది.
- భవిష్యత్తు అవసరాన్ని గుర్తించి వినియోగదారులు గృహాలను కొనుగోలు చేయాలి. చాలామంది ప్రస్తుతం సంపాదించే ఆదాయానికి పరిమితమై నిర్ణయం తీసుకుంటారు. కానీ, రేపటి రోజున ఆదాయ సామర్థ్యం పెరగొచ్చు. పెద్ద ఇళ్ల అవసరం ఏర్పడొచ్చు. అందుకే ఈ రోజు 2 బీహెచ్‌కే కొనేచోట 2–3 ఏళ్లలో డెలివరీ చేసే ప్రాజెక్ట్‌లో 2.5 బీహెచ్‌కే కొనుగోలు చేయడం ఉత్తమం. పైగా నిర్మాణంలో ఉంటుంది కాబట్టి 2 బీహెచ్‌కే ధరకే వస్తుంది.





లగ్జరీ గృహాల ధరల్లో భారీ వృద్ధి

విలాసం

- గత ఐదేళ్లలో 42 శాతం పెరిగిన ఇళ్ల విలువ
- దేశంలోనే రికార్డు సాధించిన హైదరాబాద్
- 2018లో ధర చదరపు అడుగుకు రూ.7,450 : ప్రస్తుతం రూ.10,580
- 23 శాతంతో మధ్య తరగతి ఇళ్ల ధరల వృద్ధిలోనూ నగరమే టాప్
- అందుబాటు ఇళ్ల రేట్ల పెరుగుదల్లో 16 శాతంతో రెండోస్థానం
- అనరాక్ గ్రూప్ తాజాగా చేసిన అధ్యయనంలో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కొత్త రికార్డులను సృష్టిస్తోంది. కోకాపేట, మోకిల పరిధిలో రికార్డుస్థాయిలో భూములు అమ్ముడుపోగా.. తాజాగా లగ్జరీ గృహాల ధరల వృద్ధిలో మరో మైలు రాయిని చేరుకుంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో విలాసవంతమైన ఇళ్ల ధరలు 42 శాతం మేర పెరిగాయి. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే ఈ ప్రీమియం యూనిట్ల రేట్లు గత ఐదేళ్లలో హైదరాబాద్‌లో రికార్డు స్థాయిలో పెరిగాయని అనరాక్ గ్రూప్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. నివేదికలోని పలు కీలకాంశాలివే..

- హైదరాబాద్‌లో 2018లో విలాసవంతమైన ఇళ్ల ధరలు చదరపు అడుగుకు రూ.7,450గా ఉండగా.. 2024 నాటికి ఏకంగా రూ.10,580కి పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ముంబై నగరాల్లో లగ్జరీ ఇళ్ల ధరలు 27 శాతం మేర పెరిగాయి. కోవిడ్ అనంతరం లగ్జరీ గృహాల సరఫరా, డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి కారణమని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరి తెలిపారు. 2018లో బెంగళూరులో ప్రీమియం ఇళ్ల ధరలు చ.అ.కు రూ.10,210గా ఉండగా.. ఇప్పుడది రూ.12,970కి పెరిగింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో రూ.23,119 నుంచి రూ.29,260కి చేరింది.

విభాగాలవారీగా ధరల వృద్ధి ఇలా.. (శాతంలో..)

నగరం	రూ.40 లక్షలు లోపు	రూ.40 లక్షల నుంచి కోటిన్నర	రూ.కోటిన్నరపైన..
ఎన్సీఆర్	19	17	22
కోల్‌కతా	14	17	12
ఎంఎంఆర్	15	17	27
పుణె	12	15	19
హైదరాబాద్	16	23	42
చెన్నై	15	16	15
బెంగళూరు	13	20	27

ఎన్సీఆర్- నేషనల్ క్యాపిటల్ రీజియన్
ఎంఎంఆర్- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్

దేశంలోని సగటు..

2018 నుంచి 2024 నాటికి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో సరసమైన గృహాల విలువలు సగటున 15 శాతం మేర పెరిగితే.. విలాసవంతమైన గృహాల విలువ 24 శాతం వృద్ధి నమోదైంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర కలిగిన ఇళ్ల ధరలు చ.అ.కు సగటున 2018లో 12,400గా ఉండగా.. 2024 నాటికి 15,350కి పెరిగాయి.

అందుబాటు గృహాల్లో 15 శాతం..

ఏడు ప్రధాన నగరాల్లో రూ.40 లక్షలలోపు ధర ఉండే సరసమైన గృహాల విలువలు 15 శాతం మేర పెరిగాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.3,750గా ఉండగా.. ఇప్పుడది రూ.4,310కి పెరిగింది. అఫర్డబుల్ కేటగిరీలో ఎన్సీఆర్‌లో అత్యధికంగా 19 శాతం మేర ధరలు పెరిగాయి. ఈ విభాగపు ధరల వృద్ధిలో హైదరాబాద్‌ది రెండో స్థానం. ఐదేళ్లలో మన నగరంలో 16 శాతం మేర ధరలు పెరిగాయి. అందుబాటు గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.4 వేలుగా ఉంది. ఐదేళ్ల కాలంలో టాప్–7 నగరాల్లో రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర మధ్య ధర ఉండే మధ్య తరగతి విభాగంలోని ఇళ్ల విలువల్లో 18 శాతం మేర వృద్ధి చెందాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.6,050లుగా ఉండగా.. ఇప్పుడది రూ.7,120కి పెరిగింది. ఈ విభాగంలోనూ అత్యధికంగా 23 శాతం ధరల వృద్ధి హైదరాబాద్‌లోనే నమోదైంది. మన నగరంలో మిడ్‌సైజ్ గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.5,780గా ఉంది.



- స్టార్ హోటళ్లను తలపించేలా విడిది సౌకర్యాలు
- పర్యాటకులను ఆకర్షించేలా ఆధునిక వసతులు
- వేసవి సెలవుల నేపథ్యంలో డిమాండ్

టూరిస్ట్ ఇళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల్లో సేద తీరడానికి పలు కుటుంబాలు పర్యాటక ప్రదేశాలకు వెళ్తుంటాయి. కానీ, అక్కడి వసతి ఎలా? హోటళ్లలో ఉండాలంటే.. కాస్త ఖర్చు ఎక్కువే. నచ్చిన వంట వండుకోలేం. సరైన ఆతిథ్యాన్ని స్వీకరించలేం. వాళ్లు పెట్టినవాటిలో నుంచి ఎంపిక చేసుకొని తినాలి. దీనికి పరిష్కారం చూపించేవే పర్యాటక విడిదులు. స్టార్ హోటళ్లను తలదన్నేలా ఆధునిక వసతులు అందించడమే ఈ టూరిస్ట్ ఇళ్ల ప్రత్యేకత.

ఇళ్లు.. హోం స్టేలుగా!

భాగ్యనగరం అంటేనే చక్కని ఆతిథ్యానికి చిరునామా. అందుకే విదేశీ పర్యాటకులు ఇక్కడి ఆత్మీయత, ఆతిథ్యానికి ముగ్ధులవుతుంటారు. ఈ ఆనందాన్ని ద్విగుణీకృతం చేసేందుకు పర్యాటక శాఖ హోం స్టే పథకం ప్రవేశపెట్టింది. ఇదే తరహాలో పలు ప్రైవేట్ సంస్థలూ సేవలందిస్తున్నాయి. నగరంలోని గృహ యజమానులు తమ ఇళ్లను అద్దెకు ఇచ్చే బదులుగా ఇలా హోంస్టే సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఆకట్టుకునేలా గృహాలను తీర్చిదిద్ది, అన్ని సౌకర్యాలు కల్పించి, పర్యాటకులకు తాత్కాలికంగా కిరాయికి ఇస్తున్నారు.

అన్ని రకాల వసతులు..

ఎయిర్ బీఎన్‌బీ, వీఆర్బో, బుకింగ్.కామ్, మేక్ మై ట్రిప్, ట్రావెల్ స్టేషన్, హోమ్ టుగో వంటి సంస్థలు హోం స్టే సేవలను అందిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, తీర్థయాత్రలు అన్నిచోట్లా టూరిస్ట్ ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. కిచెన్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి అన్ని రకాల వసతులు ఈ హోం స్టేలలో ఉంటాయి. సౌకర్యాలను బట్టి అద్దె ఒక రాత్రికి రూ.5 వేల నుంచి ఉంటాయి. ఆయా పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న హోం స్టేల వివరాలను సంస్థలు తమ వెబ్‌సైట్లలో పొందుపరుస్తున్నాయి. వారికి అనువైన వసతిని వెతుక్కోవచ్చు. ఇందులోనే ధరలను కూడా నిర్ణయిస్తారు. వండి వడ్డించే భోజనం వివరాలు కూడా ఉంటాయి. విమానాశ్రయం నుంచి నేరుగా బస చేసే ఇంటికి వచ్చి ఆతిథ్యాన్ని అందుకోవచ్చు.

బాబుతోనే సీఐడీ అటాచ్‌మెంట్!

'కరకట్ట బంగ్లా' సాక్షిగా మ్యాచ్ ఫిక్సింగ్ | అటాచ్‌మెంట్ పొడిగింపు కోరని దర్యాప్తు సంస్థ

- పైగా సీఎం అధికారిక నివాసంగా గుర్తింపునకు తోడ్పాటు
- గత ఏడాది జూన్ నుంచి ఆ బంగ్లానే అధికారిక నివాసమని గుర్తింపు
- గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కూడా అధికారిక నివాసం అదే
- ఈ మేరకు గుర్తిస్తూ తాజాగా రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ
- సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదేశాలు
- ఎఫ్‌టీఎల్ పరిధి దాటి నిర్మించిన బంగ్లా సీఎం నివాసమా?
- అసైన్డ్ భూములు, ఐఆర్ఆర్ కేసులో గతంలో ఆ బంగ్లా అటాచ్
- చంద్రబాబుపై అవినీతి కేసులను నీరుగార్చేలా సీఐడీ అడుగులు



సాక్షి, అమరావతి : 'అవినీతి కేసుల్లో ప్రధాన నిందితుడు చంద్రబాబుతోనే మాకు అటాచ్‌మెంట్.. అంతేతప్ప, అవినీతితో కొల్లగొట్టిన ఆస్తుల అటాచ్‌మెంట్ గురించి మాత్రం పట్టించుకోం..' అన్నట్లుంది రాష్ట్రంలో ప్రస్తుతం సీఐడీ పరిస్థితి. చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చే కుట్రను సీఐడీ వేగవంతం చేస్తోంది. ఇప్పటికే ఈ కేసుల్లో అబద్ధపు వాంగ్మూలాల కోసం సాక్షులను వేధిస్తున్న సీఐడీ.. మరోవైపు ఆ కేసుల్లో గతంలో అటాచ్ చేసిన ఆస్తులను నిందితులకు ఏకపక్షంగా ధారాదత్తం చేసేస్తోంది. గతంలో సీఐడీ అటాచ్ చేసిన కరకట్ట బంగ్లాను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా ప్రకటించింది. అంతేకాకుండా గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వ్యవహరించినప్పుడు కూడా కరకట్ట బంగ్లానే ఆయన అధికారిక నివాసంగా కూడా గుర్తిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం న్యాయ నిపుణులను సైతం విస్మయ పరుస్తోంది. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేసి నిర్మించిన భవనాన్ని తన అధికారిక నివాసంగా సీఎం ప్రకటించడం విస్తుగొలుపుతోంది. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతిలో అసైన్డ్ భూములు కొల్లగొట్టిన కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసుల్లో చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఆ కేసుల్లో ఆయన ఏ1గా సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కేసులు నమోదు చేయడంతోపాటు విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. చంద్రబాబు తన సన్నిహితుడు లింగమనేని రమేశ్‌తో కలిసి భారీ భూ దోపిడీకి పాల్పడినట్లు కీలక ఆధారాలు సేకరించింది. ఆ క్విడ్ ప్రో కో కుట్రలో భాగంగానే లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన కరకట్ట బంగ్లా చంద్రబాబుకు ఇచ్చినట్లు నిగ్గు తేల్చింది. అందుకే ఆ బంగ్లాను సీఐడీ అటాచ్ చేసింది. ఆ మేరకు న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ కూడా దాఖలు చేసింది. గడువు ఏడాది పూర్తయిన తర్వాత దర్యాప్తు నిబంధనల మేరకు సీఐడీ కరకట్ట బంగ్లా అటాచ్‌మెంట్ గడువు పొడిగించాలని న్యాయస్థానాన్ని కోరాలి. ఎందుకంటే ఆ కేసులు ఇంకా కోర్టు విచారణలో ఉన్నాయి కాబట్టి. అలాగే, చంద్రబాబు బెయిల్ రద్దు కోసం సీఐడీ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు విచారణ కొనసాగుతోంది. కానీ, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఐడీ ప్లేటు ఫిరాయించింది. చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చడమే లక్ష్యంగా డీజీపీ, సీఐడీ చీఫ్‌లు వ్యవహరిస్తున్నారు. అందుకే కరకట్ట బంగ్లా అటాచ్‌మెంట్ గడువు పొడిగించాలని సీఐడీ న్యాయస్థానాన్ని కోరలేదు. దీంతో కరకట్ట బంగ్లాను సీఎం చంద్రబాబు అధికారిక నివాసంగా గుర్తిస్తూ ప్రభుత్వం గత నెల ఉత్తర్వులు జారీ చేసింది. అది కూడా గత ఏడాది జూన్ 12 నుంచి.. అంటే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా గుర్తిస్తున్నట్లు పేర్కొంది. దీనిబట్టి ప్రధాన నిందితుడు చంద్రబాబుతో సీఐడీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు స్పష్టమవుతోంది.

న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన

టీడీపీ కూటమి ప్రభుత్వం తాజాగా మరోసారి నిబంధనలను ఉల్లంఘించింది. 2014–19 మధ్య చంద్రబాబు ప్రతిపక్ష నేతగా వ్యవహరించినప్పుడు ఆయన అధికారిక నివాసంగా కరకట్ట బంగ్లాను గుర్తిస్తూ తాజాగా అంటే బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ బంగ్లాను అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ గతంలో న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించింది. 2023 జూన్‌లో అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ కరకట్ట బంగ్లా యాజమాన్య హక్కులు, అధికారిక గుర్తింపు తదితర విషయాల్లో ఎలాంటి మార్పులు, సవరణలు చేయడానికి వీల్లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం గత కాలం నుంచి.. అంటే అటాచ్‌మెంట్‌లో ఉన్నప్పటి నుంచి వర్తించేలా కరకట్ట బంగ్లాను అధికారిక నివాసంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కచ్చితంగా న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సాధారణ పరిపాలన శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్నారు. కరకట్ట బంగ్లాను అధికారిక నివాసంగా గుర్తిస్తూ ఆ శాఖే రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. అంటే చంద్రబాబే స్వయంగా న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి మరీ ఉత్తర్వులు జారీ చేసినట్టేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు.

బాబు, లింగమనేని పిల్లి మొగ్గలు

- రాజధాని అమరావతిలో భారీ భూ దోపిడీ సందర్భంగా జరిగిన క్విడ్ ప్రో కో లో భాగంగానే కరకట్ట బంగ్లాను లింగమనేని కుటుంబం చంద్రబాబుకు ఇచ్చింది. దీనిపై సీఐడీ విచారణలో లింగమనేని పొంతనలేని సమాధానాలు చెప్పి అడ్డంగా దొరికిపోయారు.
- మొదట ఆ బంగ్లా సీఎం నివాసం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చినట్లు ఆయన విచారణలో చెప్పారు. మరి ఉచితంగా ఇస్తే సీఎంగా చంద్రబాబు తన అధికారిక నివాసానికి ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) ఎలా తీసుకున్నారు? ప్రజాధనాన్ని ఎలా డ్రా చేసుకున్నారు? అని సీఐడీ ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలారు.
- దీంతో ఆ తర్వాత విచారణలో లింగమనేని ప్లేటు మార్చారు. రాజధాని నిర్మాణం కోసం భూ సమీకరణ కింద ఆ కరకట్ట బంగ్లాను 'సీఆర్‌డీఏ'కు ఇచ్చినట్లు చెప్పారు. మరి భూ సమీకరణ కింద ఇస్తే.. అందుకు ప్రతిఫలంగా మీకు సీఆర్‌డీఏ ఎక్కడ ప్లాట్లు కేటాయించిందని ప్రశ్నించగా లింగమనేని నోట మళ్లీ మాట రాలేదు. భూ సమీకరణ కింద ఇస్తే అది ప్రభుత్వ ఆస్తి అవుతుంది. మరి అప్పటి సీఎం చంద్రబాబు తన అధికారిక నివాసానికి హెచ్‌ఆర్‌ఏ ఎలా తీసుకున్నారు? ప్రజాధనాన్ని ఎలా డ్రా చేసుకున్నారని ప్రశ్నించేసరికి ఆయన నుంచి సౌండ్ లేదు.
- ఈ నేపథ్యంలో.. లింగమనేని రమేశ్ మరో కట్టుకథను తెరపైకి తెచ్చారు. ఆ కరకట్ట బంగ్లాను చంద్రబాబుకు అద్దెకిచ్చానని చెప్పారు. మరి అద్దెకిస్తే ఆ అద్దె ఆదాయాన్ని ఆదాయ పన్ను రిటర్న్‌లో ఎక్కడ చూపించారని సీఐడీ ప్రశ్నించడంతో ఆయన బిక్క మొహం వేశారు. ఎందుకంటే.. ఆయన తన ఆదాయ పన్ను రిటర్న్‌లలో ఎక్కడా కరకట్ట బంగ్లాను అద్దెకిచ్చినట్లుగా వెల్లడించలేదు. కారణం.. ఆయన కరకట్ట బంగ్లాను చంద్రబాబుకు అద్దెకివ్వనేలేదు.

న్యాయస్థానం ఆదేశాలన్నా లెక్కేలేదు

అసలు విషయం ఏమిటంటే.. క్విడ్ ప్రో కో కుట్రలో భాగంగానే లింగమనేని రమేశ్ కుటుంబం చంద్రబాబుకు కరకట్ట బంగ్లాను సమర్పించింది. లింగమనేని రమేశ్ కుటుంబంతో కలిసి చంద్రబాబు, నారాయణ అమరావతిలో అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలో అక్రమాలకు పాల్పడి లింగమనేని రమేశ్ కుటుంబం భూముల విలువ భారీగా పెరిగేటట్లు చేశారు. అందుకు ఆ భూముల్లో వాటాతో పాటు కొసరుగా చంద్రబాబుకు కరకట్ట బంగ్లా దక్కింది. ఇదిలా ఉండగా.. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఆ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. నదీ పరివాహక ప్రాంతం పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ మేరకు కఠిన చట్టాలు చేశారు. కానీ, ఆ చట్టాలను అమలు చేయాల్సిన ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ కూడా చంద్రబాబు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. ఎఫ్‌టీఎల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మించిన కరకట్ట బంగ్లాను తన అధికారిక నివాసంగా చేసుకున్నారు. అంటే నదీ పరివాహక ప్రాంతాల పరిరక్షణ తనకు ఏమాత్రం పట్టదని స్పష్టంగా ప్రకటించినట్లే. కరకట్ట బంగ్లా అటాచ్‌మెంట్‌కు అనుమతినిస్తూ న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను కూడా ప్రస్తుత చంద్ర బాబు ప్రభుత్వం నిర్భీతిగా ఉల్లంఘించింది. అటాచ్‌మెంట్‌లో ఉన్న ఈ బంగ్లా గుర్తింపు, వాస్తవ పరిస్థితిలో ఎలాంటి మార్పులు చేయకూడదన్న న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానాల ఆదేశాలంటే ఏమాత్రం లెక్కలేనట్టు వ్యవహరించింది.

సుప్రీంకోర్టు ఎదుట న్యాయవాదులతో మంత్రి ఉత్తమ్



కృష్ణా జలాలపై విచారణ 27కి వాయిదా

- ప్రాధాన్యాంశంగా విచారిస్తామన్న సుప్రీంకోర్టు
- తమ తరఫున అఫిడవిట్ సమర్పించామని తెలిపిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల వివాదానికి సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 27కు వాయిదా వేసింది. నదీ జలాలకు సంబంధించిన కేసుల్లో వాదనలను ఒకేసారి వినడం సరైనదని, కనీసం రెండు గంటలపాటు వాదనలకు సమయం పట్టే అవకాశమున్నందున 27న సమగ్రంగా, ప్రాధాన్యాంశంగా విచారిస్తామని చెప్పింది. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం కొత్త విధి విధానాలు (టీఓఆర్) ప్రతిపాదిస్తూ 2023 అక్టోబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా తమకు వాదనలు వినిపించడానికి ఒక్కొక్కరికి కనీసం గంట సమయం కావాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించింది మీరే కదా అంటూ కేంద్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది ఖాద్రిని ధర్మాసనం ప్రశ్నించింది. తాము చట్టప్రకారం చేశామని, రెండు రాష్ట్రాల మధ్య రెఫరీలాగా పని చేస్తున్నామని ఖాద్రి వివరించారు. అయితే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిందని కేంద్ర ప్రభుత్వం తరఫున మరో న్యాయవాది ఐశ్వర్య భాటి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ కేసులో వాదనలను వచ్చేవారం వింటామని ధర్మాసనం చెప్పగా... ఈనెల 19న కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ జరగనుందని ఇరుపక్షాల న్యాయవాదులు తెలిపారు. ట్రిబ్యునల్ విచారణ పూర్తయిన వారం తర్వాత సుప్రీంకోర్టులో వాదనలు వినిపించడానికి అనుమతించాలని న్యాయవాదులు కోరారు. ట్రిబ్యునల్ విచారణ పూర్తయిన పది రోజుల తర్వాత అయితే బాగుంటుందని ఏపీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలపగా, తెలంగాణ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. రోహత్గీకి అవకాశం ఇస్తే ఏళ్ల తరబడి విచారణను పొడిగిస్తారన్నారు. కౌన్సెల్ మారారన్న ప్రతిసారీ ఇలా సమయం పొడిగించడం సాధారణమైపోయిందని రోహత్గీని ఉద్దేశించి మరో న్యాయవాది పేర్కొన్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న జస్టిస్ సూర్యకాంత్.. సాధారణంగానే ఇలాంటి వ్యవహారాల్లో విచారణకు సమయం పడుతుందని తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టంతోపాటు గతంలోని అంతర్రాష్ట్ర నదీ జలాల పంపిణీకి సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించాల్సి ఉంటుందని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తమ వాదనలకు సంబంధించిన బ్రీఫ్ నోట్ ఈనెల 25న ఇస్తామని రోహత్గీ తెలిపారు. దీంతో తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు.

కోర్టుకు వచ్చిన మంత్రి ఉత్తమ్

కృష్ణా జలాల పంపిణీపై కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు వచ్చారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్నారు. అనంతరం తదుపరి విచారణ సందర్భంగా ప్రస్తావించాల్సిన అంశాలపై అధికారులు, న్యాయవాదులతో చర్చించారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను సాధించుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులన్నింటికీ అధికారిక కేటాయింపులు దక్కేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన కేంద్ర జల సంఘం చైర్మన్ ఎంకే సిన్హాతో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం ఇవ్వాల్సిన అనుమతులపై చర్చించారు.

సినిమాలపై సింగిల్ జడ్జి ఆదేశాలతో నష్టపోతాం

- 11 గంటల తర్వాత చిన్నారులను అనుమతించవద్దనడం సరికాదు
- సినిమా ప్రదర్శనలపై హైకోర్టులో 'మల్టీప్లెక్స్' అప్పీల్

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు పిల్లలను ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లలో ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. అన్ని వర్గాలతో చర్చించిన తర్వాత చర్యలు చేపట్టాలని సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. ఆ ఆదేశాలు అప్పుడే అమల్లోకి వచ్చాయని పేర్కొంది. ఈ అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 'మల్టీప్లెక్స్' తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'గేమ్‌ఛేంజర్ సినిమా ప్రత్యేక షోలకు, టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. జనవరి 10న వేకువజామున 4 గంటల నుంచి 6 షోలకు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్‌రాజ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. వేళాపాళా లేని ప్రదర్శనలు పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయంటూ.. రాత్రి 11 గంటల తర్వాత చిన్నారులను థియేటర్లకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్‌లో 'మల్టీప్లెక్స్' ప్రతివాదిగా లేదు. ఈ ఆదేశాలను పునఃపరిశీలించాలి' అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి వద్ద ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. పిటిషన్‌లో ఇంకా తుది ఉత్తర్వులు వెలువడలేదని, ఈ దశలో జోక్యం చేసుకోలేమని చెప్పింది. దీంతో అప్పీల్ ఉపసంహరణకు అవకాశం ఇవ్వాలని సీనియర్ న్యాయవాది కోరగా, దీనికి ధర్మాసనం అనుమతించింది.

ఇంట్లో నిద్రిస్తుండగా.. వల్లభనేని వంశీ అరెస్టు

హైదరాబాద్ రాయదుర్గంలోని తన నివాసంలో అదుపులోకి..

సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు గురువారం ఉదయం హైదరాబాద్‌లో నాటకీయ పరిణామాల మధ్య అరెస్టుచేశారు. ఉదయం ఏడు గంటలకు ఆయన్ను అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేశారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై బీఎన్ఎస్ క్లాజ్ 140 (1), 308, 351 (3) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. అంతకుముందు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏడీసీపీ రామకృష్ణ తన బృందంతో హుటాహుటిన హైదరాబాద్ చేరుకుని వంశీ కోసం గాలింపు చేపట్టారు. రాయదుర్గం మైహోం భుజాలోని తన ఇంట్లో నిద్రిస్తున్నట్లు తెలుసుకుని వారు అక్కడకెళ్లి వంశీకి బీఎన్ఎస్ 47 (1) నోటీసును అందించి ఉన్నపళంగా అరెస్టుచేశారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో గురువారం మధ్యాహ్నం విజయవాడకు తీసుకొచ్చారు.



కొద్దిసేపు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఉంచి, అనంతరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ కేసు విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న సెంట్రల్ ఏసీపీ కె. దామోదరరావుతో పాటు లా అండ్ ఆర్డర్ ఏడీసీపీ జి. రామకృష్ణ రాత్రి తొమ్మిది గంటల వరకు వంశీని సుదీర్ఘంగా విచారించారు. అనంతరం.. వైద్య పరీక్షల నిమిత్తం ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు.. వంశీ అనుచరులైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన ఏలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్ (35), కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన నిమ్మ లక్ష్మీపతి (35)లను కూడా పటమట పోలీసులు గురువారం రాత్రి అరెస్టుచేశారు. వైద్య పరీక్షల నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్

జర్నలిస్ట్‌పై దాడి కేసులో ఊరటనిచ్చిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మంచు మోహన్‌బాబుకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. 2024 డిసెంబర్ 10న జల్‌పల్లిలోని తన ఇంటి వద్ద మీడియా ప్రతినిధిపై దాడి చేసిన ఘటనలో మోహన్‌బాబుపై కేసు నమోదైంది. తొలుత బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తరువాత న్యాయ సలహా మేరకు హత్యాయత్నం సెక్షన్ 109ను జోడించారు. తర్వాత ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాన్షు ధులియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. సీసీ ఫుటేజీని ఎందుకు తొలగించారు, మీ కుమారుడిపై ఎందుకు ఫిర్యాదు చేశారు? జర్నలిస్ట్‌పై ఎందుకు దాడి చేశారు? అని ప్రశ్నించింది. దీనిపై మోహన్‌బాబు తరఫు న్యాయవాది స్పందిస్తూ.. 'ఈ దాడి ఉద్దేశపూర్వకమైనది కాదు. ఆస్పత్రికి వెళ్లి మోహన్‌బాబు జర్నలిస్టును పరామర్శించి వ్యక్తిగతంగా క్షమాపణ సైతం చెప్పారు. జర్నలిస్టుకు నష్ట పరిహారం చెల్లించేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు' అని చెప్పారు. పిటిషనర్ గతంలో ఎంపీగా ఉన్నారని, యూనివర్సిటీని నడుపుతున్నారని, పద్మశ్రీ అవార్డు గ్రహీతని చెప్పారు. పోలీసుల విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

క్షయ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: క్షయవ్యాధి రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. 'ని–క్షయ్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో 8 ఫార్మా కంపెనీల ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ప్రభు త్వం నిర్దేశించిన 9 జిల్లాలలో ఈ ఫార్మా కంపెనీలు క్షయ బాధితులకు రూ. 2.80 కోట్ల విలువైన ఫుడ్ బాస్కెట్ల (కిట్స్)ను అంది స్తున్నందుకు మంత్రి వారిని అభినందించారు. క్షయ బాధితులకు చికిత్స కాలంలో 8 ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులతో న్యూట్రిషన్ కిట్స్ ను అందిస్తుండగా, ప్రభు త్వం ఉచితంగా చికిత్స, మందులు, ప్రతి నెలా వెయ్యి రూపా యల నగదును అందిస్తున్నట్లు చెప్పారు.

వీరరాఘవరెడ్డిపై కేసులో మీ వైఖరేంటి?

పోలీసులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌పై దాడి కేసులో ట్రయల్ కోర్టు రిమాండ్‌కు ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ నిందితుడు వీరరాఘవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వైఖరి తెలియజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. తనపై తప్పుడు కేసు పెట్టి, ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేశారని.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ వీరరాఘవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన గురువారం విచారణ చేపట్టారు. పోలీసులకు నోటీసులు జారీ చేశారు.

కౌంటర్ కోసం ఎన్నాళ్లు ఆగాలి?

కాళేశ్వరం కేసులో ప్రతివాదిపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు నిర్మాణాల్లో అక్రమాలే కారణమని, దీనికి సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై దర్యాప్తు చేయాలంటూ దాఖలైన ప్రైవేట్ పిటిషన్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ గతంలో ఇచ్చి న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరో సారి పొడిగించింది. కౌంటర్ దాఖలు చేయని ప్రతివాదిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకా ఎన్నాళ్లు ఆగాలి.. ఓ సంవత్సరం సమయం కావాలా అని గట్టిగా ప్రశ్నించింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు, తుది ఉత్తర్వులు, రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను చదువుకుని రావాలని న్యాయవాదులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు.

కీలక పదవులు ఎవరికో?!

మొదటి పేజీ తరువాయి



వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించారు. ఎమ్మెల్యే కోటాలో జగ్గారెడ్డికి అవకాశం కల్పించారు. అయితే ఈసారి బీసీ వర్గాలకు చెందిన నాయకుడు అధ్యక్షుడిగా ఉండడంతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన నలుగురు నాయకులకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ రేసులో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ (ఎస్టీ) పేరు దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. మరోవైపు ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాగరిగారి ప్రీతం, అద్దంకి దయాకర్, రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, మైనార్టీ కోటాలో ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, నాంపల్లి నియోజకవర్గ నేత ఫిరోజ్‌ఖాన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌లలో ఒకరికి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం ఇస్తే మరొకరికి అధికారిక పదవి వస్తుందని తెలుస్తోంది. ఇదే సామాజిక వర్గానికి చెందిన నేత షబ్బీర్ అలీని ఎమ్మెల్సీగా ఎంపిక చేసి ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటారనే చర్చ జరుగుతోంది. ఈ కోణంలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు సామాజికవర్గాల వారీగా రెండేసి చొప్పున పేర్లు ఢిల్లీకి పంపినట్టు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాకు ఒకటి లేదా రెండు 'వైస్'లు

వర్కింగ్ ప్రెసిడెంట్‌లతో పాటు పీసీసీ ఉపాధ్యక్ష పదవులకు కూడా డిమాండ్ కనిపిస్తోంది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో పీసీసీలో ముఖ్య హోదా అయిన వైస్ ప్రెసిడెంట్ పదవి వచ్చినా బాగానే ఉంటుందనే ఆలోచనలో చాలామంది కాంగ్రెస్ నేతలున్నారు. ఈ పదవులను పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇవ్వాలని తొలుత భావించినా సామాజిక, ప్రాంతీయ సమీకరణలు కుదరకపోవడంతో ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. కొన్ని జిల్లాల్లో సమీకరణలను బట్టి రెండు పదవులను కూడా ఇచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇక ప్రధాన కార్యదర్శి పదవులకు కూడా ఇదే సూత్రాన్ని వర్తింపజేయనున్నారు. ప్రస్తుతమున్న 33 జిల్లాలకు జిల్లాకో ప్రధాన కార్యదర్శిని నియమించాలని అనుకున్నా ఉపాధ్యక్షుల తరహాలోనే ఉమ్మడి జిల్లాకు ఒకటి లేదా అవసరాన్ని బట్టి రెండు పదవులు ఇవ్వాలని నిర్ణయించారు.

సీనియర్ 'వైస్' లేనట్లే..

గతంలో ఉన్న సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హోదా ఈసారి ఉండదని, ఆ హోదాలో ఉన్న ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి లాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులను ముఖ్యమైన కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమిస్తారని తెలుస్తోంది. అధికార ప్రతినిధుల విషయానికి వస్తే గతంలో కాకుండా 10 మంది వరకే పరిమితం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ జాబితాలో ఈసారి ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా ఉండే అవకాశముందని అంటున్నారు. కాగా పీసీసీ కార్యవర్గాన్ని ఏఐసీసీ త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

ప్రచార కమిటీ చైర్మన్ నియామకం ఇప్పుడా.. తర్వాతా?

పీసీసీ అధ్యక్షుడిగా బీసీ ఉన్నందున ఈసారి రెడ్డి సామాజిక వర్గానికి టీపీసీసీలో కీలకమైన ప్రచార కమిటీ చైర్మన్ పోస్టు ఇవ్వనున్నట్లు సమాచారం. గతంలో రేవంత్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బీసీ వర్గాలకు చెందిన మధుయాష్కీ గౌడ్‌ను ఈ పదవిలో నియమించారు. ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన మహేశ్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నందున యాష్కీకి సముచిత పదవి ఇచ్చి ప్రచార కమిటీ చైర్మన్ స్థానాన్ని రెడ్డి సామాజిక వర్గానికి అప్పగిస్తారని అంటున్నారు. ఈ పోస్టు రేసులో మొదటి నుంచి ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేరు మాత్రమే వినిపిస్తుండడం గమనార్హం. అయితే ఈ పదవిని ఇప్పుడే భర్తీ చేయాలా? లేక స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతా అన్న విషయంలో అధిష్టానం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

కోడి పందేల కేసులో ఎమ్మెల్సీ పోచంపల్లికి నోటీసులు

- ఫామ్‌హౌస్ యజమానిగా వివరణ ఇస్తానన్న శ్రీనివాస్‌రెడ్డి
- దాడి జరిగిన రోజు రూ.కోట్లు మాయమయ్యాయని వదంతులు

మొయినాబాద్: నగర శివారులోని వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కోడిపందేల కేసులో భూయజమాని, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి గురువారం మొయినాబాద్ పోలీసులు నోటీసులు అందజేశారు. కేసు విచారణలో భాగంగా పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. మొయినాబాద్ మండలం తోల్‌కట్ట లోని శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో మంగళవారం రాత్రి ఏపీకి చెందిన శివకుమార్‌వర్మ కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే 64 మందిని అదుపులోకి తీసుకున్నారు. తప్పించుకున్న వారి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

రూ. లక్షల్లో చూపించారని...!

కోడి పందేల కేసులో రూ.కోట్లలో నగదు పట్టుకున్న పోలీసులు రూ.లక్షల్లో మాత్రమే దొరికినట్టు చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసుల దాడి విషయాన్ని తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఫామ్‌హౌస్ వద్దకు చేరుకోగా గేటు వద్దే ఆపేశారు. మాయం చేసిన నగదును వాటర్ బాటిళ్ల కోసం తీసుకొచ్చిన కాటన్లలో నింపి ఆటోలో తరలించినట్టు సమాచారం. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు.. ఉన్నతాధికా రుల కనుసైగల్లోనే నగదును మాయం చేసినట్టు తెలుస్తోంది.

నా ప్రమేయం లేదు

తన వ్యవసాయ భూమిలో కోడి పందేలు నిర్వహించారనే కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మీడియాలో వస్తున్న కథనాలపై గురువారం ఆయన వివరణ ఇచ్చారు. 2018లో తాను భూమిని కొనుగోలు చేశానని.. ఆ తర్వాత తన మేనల్లుడు జ్ఞాన్‌దేవ్‌రెడ్డి ఆ భూమిని వర్రా రమేష్‌కుమార్‌రెడ్డికి కౌలుకు ఇచ్చారని తెలిపారు. ఆయన వెంకటపతిరాజుకు లీజుకు ఇచ్చినట్టు తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. భూమి యజమానిని తానే అయినందున పోలీసులు నోటీసులు ఇచ్చారని, పూర్తి అంశాలతో వివరణ ఇస్తానని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం చేస్తున్న వారికి లీగల్ నోటీసులు పంపిస్తానన్నారు.

విచారణ పేరుతో చితకబాదిన పోలీసులు?

- నిందితుని తలకు తీవ్ర గాయాలు
- ఎస్పీకి కుటుంబ సభ్యుల ఫిర్యాదు

నల్లగొండ: విచారణ పేరుతో నిందితుడిని పోలీసులు చితకబాదిన సంఘటన నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గుడిపల్లి మండల కేంద్రంలో ఈ నెల 9న పోషంరెడ్డి నారాయణరెడ్డి తన వ్యవసాయ పొలంలో హత్యకు గురయ్యాడు. దీంతో గుడిపల్లి పోలీసులు కేసులో అనుమానితులైన కత్తుల వెంకటయ్య, ముండ్ల వినోద్‌ను విచారణ నిమిత్తం గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బుధవారం రాత్రి నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లగా.. జడ్జి అందుబాటులో లేకపోవడంతో గురువారం కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో వినోద్‌ను కుటుంబ సభ్యులు చూసి అతన్ని పోలీసులు కొట్టినట్టు అనుమానించారు. విచారణలో భాగంగా పోలీసులు వినోద్‌ను కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ స్పందిస్తూ.. ఈ ఘటనపై దేవరకొండ అడిషనల్ ఎస్పీ మౌనికను విచారణాధికారిగా నియమించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 14-2-2025

ఆకాశమంత ప్రేమ

నేడు వాలెంటైన్స్ డే

అగ్ని దహించదు... వరద ముంచెత్తదు
పెనుగాలి పెకలించదు
ప్రేమ అచంచలం... అజేయం
హృదయపు నాలుగు కవాటాలకు
స్పందన ప్రేమ
మనసుకు సంజీవని ప్రేమ
ప్రేమ ఉండును... ప్రేమే ఉండును.


రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ

ప్రేమకు శ్వాస విశ్వాసమే – రకుల్

"ఒక బంధం బలంగా సాగాలంటే ప్రేమ మాత్రమే సరిపోదు.. నమ్మకమూ ఉండాలి. ప్రేమకు శ్వాస విశ్వాసమే" అంటున్నారు రకుల్ ప్రీత్ సింగ్. జీవితంలో తాను అద్భుతమైన 'ఫేజ్'లో ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఆ ఆనందానికి కారణం జీవిత భాగస్వామి జాకీ భగ్నానీ. బాలీవుడ్ నటుడు–నిర్మాత జాకీ భగ్నానీ, రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. 2021లో ఈ ఇద్దరూ తమ ప్రేమ గురించి బయట పెట్టారు. 2024 ఫిబ్రవరి 21న పెళ్లి చేసుకున్నారు. **నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో రకుల్ స్పెషల్ చిట్ చాట్ ...**

✿ మీరు, జాకీ ప్రేమలో ఉన్నప్పుడు జరుపుకున్న వాటిలో మరచిపోలేని 'ప్రేమికుల దినోత్సవం' గురించి చెబుతారా?

మా ఇద్దరి కాంబినేషన్ (జాకీ నిర్మాత–రకుల్ హీరోయిన్)లో వచ్చిన మొదటి సినిమా 'కఠ్‌పుతలీ' (2022). ఆ సినిమా అప్పుడే మేం ఫస్ట్ వేలంటైన్స్ డే జరుపుకున్నాం. మా డేటింగ్ మొదలైంది అప్పుడప్పుడే. ఓ హోటల్‌లోని గ్రీన్‌హౌస్ ఏరియాని జాకీ క్యాండిల్ లైట్ డిన్నర్‌కి తగ్గట్టుగా మార్పించాడు. ఒకవైపు గిటారిస్ట్‌లు పాడుతుంటే ఆ పాటలు వింటూ, ఆరోగ్యకరమైన విందుని ఆస్వాదించాం. జాకీ నా కోసం గులాబీ పువ్వులు, పుష్ప గుచ్ఛాలు ఇచ్చాడు. అదొక అందమైన, ఆహ్లాదకరమైన రోజు. సో.. నాకెప్పటికీ ఆ వాలంటైన్స్ డే గుర్తుండి పోతుంది.

✿ ఓ జంట మధ్య బలమైన బంధం ఉండాలంటే మీరు ఇచ్చే సలహాలు?

పెద్ద టిప్ ఏంటంటే 'నమ్మకం'. ఒకరి పట్ల మరొకరికి పూర్తి నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే బలమైన బంధానికి పునాది వేస్తుంది. రిలేషన్‌షిప్‌లో మంచి ఫ్రెండ్‌షిప్ ఉండటం చాలా ముఖ్యం. ఎప్పుడైతే భాగస్వామిలో మంచి ఫ్రెండ్‌ని చూస్తామో, అప్పుడు ఆ బంధం బలంగా ఉంటుంది. ఎవరికైనా జీవితం చాలా సునాయాసంగా సాగాలి... ఒత్తిడిగా కాదు. హ్యాపీగా సాగాలంటే నమ్మకం, విశ్వాసం, స్నేహం ముఖ్యం.

✿ మీ 'బెటర్‌హాఫ్' జాకీ భగ్నానీ గురించి కొన్ని మాటలు...

జాకీ నా జీవిత భాగస్వామి కావడం నిజంగా నా అదృష్టం.. తను నా సోల్‌మేట్ కావడం ఆనందం. మా ఇద్దరి ఆలోచనలు దాదాపు ఒకే విధంగా ఉంటాయి. మా ఇద్దరికీ ఉన్న పెద్ద తేడా ఏంటంటే నేను చాలా 'హైపర్', తను చాలా 'కూల్'. నా హైపర్‌ని జాకీ ఎప్పుడూ విమర్శించింది లేదు సరికదా... పొగుడుతుంటాడు. అయినా ఒకరు హైపర్... మరొకరు కూల్... ఇలా ఉండటం కూడా బాగుంటుంది. బ్యాలెన్స్ అవుతుంది (నవ్వుతూ). నా పార్ట్‌నర్‌లో నేను బెస్ట్ ఫ్రెండ్‌ని చూశాను. మేం ఇద్దరం ఏ విషయం గురించైనా చాలా ఓపెన్‌గా మాట్లాడుకుంటాం. ఏం చేయాలన్నా చేస్తాం. ఇక మేం ఒకరికొకరం ఇచ్చుకునే సపోర్ట్ చాలా గొప్పగా ఉంటుంది. అలాగే మేం మా పార్ట్‌నర్ కోసం మారాల్సిన అవసరం రాలేదు. పెళ్లికి ముందెలా ఉన్నామో ఆ తర్వాతా అలానే ఉన్నాం. అందుకే మేం ఇద్దరం అదృష్టవంతులం అంటాను.

✿ అయితే పెళ్లి తర్వాత మీరు మారాల్సిన అవసరం రాలేదంటారా?

ఏ మార్పూ లేదు. అసలు ఒకరి జీవితం పెళ్లి కారణంగా ఎందుకు మారాలి? పెళ్లి తర్వాత జీవితం మెరుగవ్వాలి. నా లైఫ్ బెటర్ అయింది. పెళ్లికి ముందు నాకు నచ్చిన పనులు చేసినట్లే ఇప్పుడూ చేస్తున్నాను. ఫీలింగ్స్‌ని దాచేయకుండా షేర్ చేసుకునేంత స్వేచ్ఛ నా సోల్‌మేట్‌తో ఉంది. అందుకే జీవితం అందంగా, ఆనందంగా ఉంది. అర్థం చేసుకునే జీవిత భాగస్వామి లభించడం ఓ అదృష్టం. అర్థం చేసుకునే వ్యక్తి పక్కన ఉన్నప్పుడు జీవితంలోని ఆ దశ అద్భుతంగా ఉంటుంది.

– డి.జి. భవాని



కొత్త తరం ప్రేమలు

జెన్‌జెడ్ ప్రేమలు

జమానా మారినా ప్రేమకు అర్థం మారదు! కానీ ఇప్పుడు ప్రేమ కూడా ఆన్‌లైన్‌కి చేరి.. ఆ బంధం కూడా ట్రెండింగ్ అయ్యి.. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్‌లాగా రోజుకో కొత్త రిలేషన్‌షిప్ లాంచ్ అవుతోంది!

బ్రెడ్‌క్రంబింగ్.. అవతలి వ్యక్తి పట్ల ఇంట్రెస్ట్.. ఫీలింగ్స్ ఉన్నట్లు, ఆ రిలేషన్‌షిప్ కోసం ఎంతో సమయం వెచ్చిస్తున్నట్లు నటించడమే బ్రెడ్‌క్రంబింగ్. అటెన్షన్ కోసం, అవతలి వాళ్ల మీద నియంత్రణ కోసం ఈ డ్రామా ఆడతారు.

✿ ✿ ✿

రోచింగ్.. ఒకరికి తెలియకుండా మరొకరితో ఏకకాలంలో అనేకమందితో రిలేషన్‌లో ఉండటం. అయితే దీన్ని జెన్ జీ చీటింగ్‌గా భావించడం లేదు. సీక్రసీ అంటోందంతే!

✿ ✿ ✿

బెంచింగ్.. అవతలి వ్యక్తిని మరోవైపు కదలనివ్వకుండా.. అలాగని తమ నుంచి కమిట్‌మెంట్ ఇవ్వకుండా, సీరియస్‌నెస్ చూపించకుండా అప్పుడప్పుడు ఫోన్‌లు, మెసేజ్‌లు చేస్తూ అవతలివాళ్లను కట్టిపడేయడమే బెంచింగ్.

✿ ✿ ✿

కాన్షస్ డేటింగ్.. చుట్టూ తిరిగే వాళ్లలో ఒకరిని ఎంచుకోకుండా.. నీ వ్యక్తిత్వాన్ని గౌరవించి, నిన్ను నిన్నుగా ఇష్టపడుతూ జీవితాంతం తోడుగా, నమ్మకంగా ఉండే వ్యక్తిని వెదుక్కోవడమే కాన్షస్ డేటింగ్!

✿ ✿ ✿

కఫింగ్.. చలికాలం, సెలవులు, వాలంటైన్స్ వీక్.. ఇలా ప్రత్యేక సమయం, సందర్భాల్లో డేటింగ్ చేయడాన్ని కఫింగ్ అంటున్నారు.

✿ ✿ ✿

డ్రై డేటింగ్.. ఆల్కహాల్ ఫ్రీ డేట్ అన్నమాట. అంటే డేటింగ్‌కి వెళ్లినప్పుడు ఆల్కహాల్ తీసుకోరు. సింగిల్స్, రిలేషన్‌షిప్‌లో ఉన్న వాళ్లు.. అందరూ ఈ డ్రై డేట్స్‌కి ప్రాధాన్యమిస్తున్నారు. సింగిల్స్ అయితే తమకు కాబోయే పార్ట్‌నర్ మందు ప్రభావానికి లోనుకాకుండా సహజంగా ఎలా ప్రవర్తిస్తాడు/ ప్రవర్తిస్తుంది అని తెలుసుకోవడానికి, అదివరకే రిలేషన్‌షిప్‌లో ఉన్నవాళ్లయితే తమ అనుభవాలు, మంచి చెడులను చర్చించుకోవడానికి ఈ డ్రై డేట్స్‌ని ప్రిఫర్ చేస్తున్నారు.

✿ ✿ ✿

కిటెన్‌ఫిషింగ్.. వ్యక్తిగత విషయాలకు సంబంధించి అబద్ధాలాడుతూ అవతలి వాళ్లను నమ్మించడం లేదా మోసపరచుకోవడం. ఉదాహరణకు వయసును తగ్గించి, జీతాన్ని పెంచి చెప్పడం, సన్నగా ఉన్నప్పటి ఫొటోలు అప్‌లోడ్ చేయడం, ఇంజినీరింగ్ డిప్లమా చేసి, డిగ్రీ చేశానని నమ్మించడం లాంటివన్నమాట.

✿ ✿ ✿

లవ్ బాంబింగ్.. వ్యక్తిత్వంతో కాకుండా మాటలు, కానుకలు, అటెన్షన్‌తో అవతలి వ్యక్తిని గుక్క తిప్పుకోనివ్వకుండా చేయడం

✿ ✿ ✿

సిట్యుయేషన్‌షిప్.. ఇది ఫ్రెండ్‌షిప్‌కి ఎక్కువ.. రిలేషన్‌షిప్‌కి తక్కువ! అటాచ్‌మెంట్ ఉంటుంది. కానీ కమిట్‌మెంట్ ఉండదు.

✿ ✿ ✿

నానోషిప్.. పెళ్లిళ్లు, ఫంక్షన్లు, క్లబ్‌లు, పబ్‌లలో చూపులు కలిసి.. నవ్వులు విరిసి.. ఫ్లర్టింగ్ మొదలై.. అక్కడే ముగిసి అదొక తీయటి జ్ఞాపకంలా మిగిలిపోయేది!

ఇంకా..

ఒక బంధంలో ఉంటూనే మరొకరితో రిలేషన్ మెయిన్‌టెయిన్ చేసే 'ఓపెన్ కాస్టింగ్', సరిహద్దులకతీతంగా చేసే డిజిటల్ డేటింగ్ 'వండర్ లవ్' లేదా 'డేటింగ్ నోమాడ్', వాట్సాప్ మెసేజెస్ తో మాత్రమే రిలేషన్‌షిప్‌లో ఉండే 'టెక్స్‌టేషన్‌షిప్'లాంటి బంధాలు, ఫోన్‌కాల్స్.. మెసేజెలను మెల్లగా తగ్గిస్తూ బంధం నుంచి వైదొలిగే 'ఫేడింగ్', ఏ సమాచారం లేకుండా హఠాత్తుగా భాగస్వామితో కమ్యూనికేషన్‌ను కట్ చేసుకోవడం, వాళ్ల జీవితంలోంచి అదృశ్యమైపోయే 'ఘోస్టింగ్' లాంటి అప్రకటిత బ్రేకప్‌లు, జీవితంలోంచి వెళ్లిపోయినా.. సోషల్ మీడియాలో పార్ట్‌నర్ చేసే పోస్ట్‌లను వెదుకుతూ లైక్స్ కొట్టే 'హంటింగ్' లాంటి గూఢచర్యాలూ ఉన్నాయి. ఇవన్నీ ఈ తరం ఫాలో అవుతున్న 'లవ్‌షిప్స్'!

పారదర్శకంగా ఉండాలి

ప్రేమించే వాళ్ల స్థాయిని కాకుండా మన స్తత్వాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని, అన్ని విషయాలలో పారదర్శకంగా ఉండాలి. కుటుంబాలకు, కనీసం స్నేహితులకు కూడా చెప్పుకోలేని ప్రేమ బంధాలు చాలావరకు అబద్ధాల మీదే నిర్మితమై ఉంటాయి. నిజాయితీపరులైన ప్రేమికులను కులం, మతం వంటి కట్టుబాట్ల నుంచి రక్షించడానికి వివిధ చట్టాలు ఉన్నాయి. అలాగే ప్రేమ పేరుతో మోసం చేసే వారికీ కఠినమైన శిక్షలు ఉన్నాయి. ఆకర్షణకు లోనవకుండా భాగస్వామిని క్షుణ్ణంగా అర్థం చేసుకొని కమిట్ అవడం మంచిది.

– సుధేష్ణ మామిడి, హైకోర్టు న్యాయవాది

లవ్ బ్రేస్‌లెట్

మణికట్టుపై కనికట్టు

రెండు చేతులు కలిస్తే చప్పుడవుతుంది. రెండు మనసులు కలిస్తే ప్రేమవుతుంది. ఇద్దరు మనుషులు కలిస్తే సంపూర్ణ జీవితమవుతుంది. రెండు సగాలు ఒకటిగా అమరితే పరిపూర్ణత వస్తుంది. ఇలాంటి ఒక ఊహకు రూపమిస్తే లవ్ బ్రేస్‌లెట్ అయింది. లవ్ బ్రేస్‌లెట్ రూపుదిద్దుకుని యాభై ఏళ్లు దాటింది. న్యూయార్క్‌లో డిజైన్ అయిన ఈ బ్రేస్‌లెట్‌కు లండన్‌లో ఎక్కడలేని ఆదరణ వచ్చింది. ఇప్పటికీ నిత్యనూతనంగా మార్కెట్‌ను ఏలుతోంది. ప్రేమలాగానే అజరామరంగా ప్రేమికులను దగ్గర చేస్తూనే ఉంది.



సింబల్ ఆఫ్ లవ్

'ప్రేమ లేకపోతే జీవితమే లేదు. ప్రేమలేని జీవితం పెద్ద గుండుసున్న' అన్నాడు లవ్ బ్రేస్‌లెట్ రూపకర్త ఆల్డో సిపుల్లో. అతడు 1969లో ఈ డిజైన్ చేశాడు. ఓవల్ షేప్ బ్రేస్‌లెట్ ఇది. ఇంగ్లిష్ అక్షరం 'సి' ఆకారంలో ఉన్న రెండు అర్ధభాగాలను కలుపుతూ లాక్ చేయాలి. ఆ లాక్‌ను టైట్ చేయటానికి, ఓపెన్ చేయడానికి చిన్న స్క్రూడ్రైవర్‌ను పోలిన తాళం చెవి కూడా ఉంటుంది. 'ఒక 'సి' నువ్వు, ఒక 'సి' నేను... ఇద్దరం కలిస్తే అదే అందమైన బంధం' అని అబ్బాయి అమ్మాయి ఒకరికొకరు బాస చేసుకుని బ్రేస్‌లెట్‌ని మణికట్టుకు పెట్టి లాక్ చేస్తారు. 'మన ప్రేమ నిబద్ధతతో కూడినది, ఎప్పటికీ విడిపోకూడద'ని మాటలతో మనసును లాక్ చేసుకుంటారు.

ప్రేమ బంగారం

లవ్ బ్రేస్‌లెట్‌ని కార్టియర్ అనే ఆభరణాల తయారీ సంస్థ మార్కెట్‌లోకి తెచ్చింది. దాంతో దీనికి కార్టియర్ లవ్ బ్రేస్‌లెట్ అనే పేరు వాడుకలోకి వచ్చింది. మొదట్లో గోల్డ్ ప్లేటెడ్ బ్రేస్‌లెట్‌లతో మొదలు పెట్టారు. ఆ తర్వాత సాలిడ్ గోల్డ్ 18 క్యారట్‌లో, ప్లాటినమ్‌లో కూడా తయారవుతోంది. బంగారంలో ఎల్లో గోల్డ్, రోజ్ గోల్డ్, వైట్ గోల్డ్ షేడ్‌లలో వస్తోంది. బ్రేస్‌లెట్‌లో లాక్ గుర్తు ఉన్న చోట వజ్రాన్ని పోలిన రోడియం ఫినిషింగ్, అసలైన వజ్రాలు, ఇతర జాతిరాళ్లను పొదగడం వంటి మార్పులు కూడా సంతరించుకుంది. హాలీవుడ్ నటీనటులు ఎలిజబెత్ టేలర్, రిచర్డ్ బర్టన్, అలీ మ్యాక్‌గ్రావ్, స్టీవ్ మెక్‌క్వీన్‌లు ధరించడంతో ఇది పాపులర్ అయింది. ఈ లవ్ బ్రేస్‌లెట్‌లు ఎక్కడికక్కడ స్థానికంగా తయారవుతున్నాయి. ఈ విషయంలో కార్టియర్ కొన్ని కంపెనీల మీద కేసు కూడా పెట్టింది. కొద్దిపాటి మార్పులతో కీ లేకుండా నేరుగా ధరించే మోడల్స్ వచ్చాయి. మనదేశంలో కూడా బంగారు ఆభరణాల తయారీదారులు ఈ మోడల్‌ను చేస్తున్నారు. రోజ్‌గోల్డ్ షేడ్‌లో ఇతర లోహాలతో ఫ్యాన్సీ మార్కెట్‌లోనూ విరివిగా దొరుకుతున్నాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ లవ్ బ్రేస్‌లెట్ కోసం దుకాణాల్లో వాకబు చేసేవాళ్లు, ఆన్‌లైన్ లో ఈ కామర్స్ వెబ్‌సైట్‌లలో సెర్చ్ చేసే వాళ్ల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా ఏడాదికేడాదికీ మూడింతలు నాలుగింతలుగా పెరుగుతోంది. ఈ లవ్ బ్రేస్‌లెట్ కూడా ప్రేమలాగానే ప్రకాశిస్తోంది.

హాస్పిటల్‌లో బ్రేస్‌లెట్ 'కీ'

లవ్ బ్రేస్‌లెట్ ఎంతగా ప్రజాదరణ పొందిందో తెలిపే ఉదంతం ఒకటుంది. 1970–80లలో అమెరికాలోని హాస్పిటళ్లలో లవ్ బ్రేస్‌లెట్ తాళం చెవిని అందుబాటులో ఉంచేవారట. ఇంట్లో బ్రేస్‌లెట్ ధరించిన తర్వాత 'కీ'ని ఇంట్లో పెట్టి బయటకు వస్తారు. ప్రమాదవశాత్తూ లేదా మరేదైనా కారణాలతో హాస్పిటల్‌కి వచ్చిన పేషెంట్‌కి అవసరమైన పరీక్షలు చేయాల్సినప్పుడు ఒంటిమీదున్న లోహపు వస్తువులన్నింటినీ తొలగించాల్సి ఉంటుంది. లవ్ బ్రేస్‌లెట్ కీ కోసం ఇంటికి వెళ్లే పరిస్థితి ఉండదు. కాబట్టి హాస్పిటళ్లు లవ్ బ్రేస్‌లెట్ కీని సిద్ధంగా ఉంచేవి.

ఆన్‌లైన్ నుంచి అక్షింతల దాకా


ప్రదీప్, రైతా

ప్రేమను.. పెళ్లితో స్థిరపరచేది అదే! అయితే దానికి బాటలు వేసేవి మాత్రం పరస్పర నమ్మకం, గౌరవాలే!

అలాంటి లవ్ స్టోరే ఇది! దాదాపు ఏడేళ్ల పాటు ఒకరినొకరు చూసుకోకుండా పెళ్లితో ప్రేమను గెలిపించుకున్న ఆ జంటలోని అమ్మాయి.. రైతా, ఫిన్లండ్. అబ్బాయి .. ప్రదీప్, హైదరాబాద్.

ప్రేమకథా కాలం.. 1997..

స్కూలింగ్ పూర్తి చేసుకున్న రైతా ఫారిన్ లాంగ్వేజ్ కేటగిరీలో ఇంగ్లిష్ భాషను నేర్చుకుంటోంది. ఫ్లూయెన్సీ కోసం యాహూ చాట్‌లో చాటింగ్ స్టార్ట్ చేసింది. ఆన్‌లైన్‌లో ఒకరోజు ప్రదీప్ పరిచయం అయ్యాడు. సంభాషణలో ఆధ్యాత్మికం, తాత్వికం, మతపరమైన అంశాల నుంచి సామాజిక, రాజకీయ, పర్యావరణ విషయాలు, ప్రపంచ పౌరుల బాధ్యతలు వంటి వాటి మీద ప్రదీప్‌కున్న అవగాహనకు రైతా ముచ్చటపడింది. ప్రదీప్‌కూ రైతా పట్ల అదే భావన. నెమ్మదిగా స్నేహం పెరిగింది. వ్యక్తిగత వివరాలను పంచుకున్నారు. ప్రదీప్‌కి రైతా మీద ప్రేమ మొదలైంది. అప్పటికీ ఆ ఆన్‌లైన్ స్నేహం వయసు నాలుగేళ్లు. అప్పట్లో వెబ్‌కామ్స్ లేవు.. కాబట్టి ఒకరినొకరు చూసుకోలేదు. కనీసం ఫొటోలు కూడా ఎక్స్ఛేంజ్ చేసుకోలేదు. ఒక రోజు ప్రదీప్ మెయిల్ పెట్టాడు 'రకస్తాన్ సినువా (నువ్వంటే ఇష్టం).. నన్ను పెళ్లి చేసుకుంటావా?' అని. సంభ్రమాశ్చర్యాలు రైతాకు. ఎందుకంటే ఫిన్లండ్ లో అంత త్వరగా ఎవరూ పెళ్లి ప్రపోజల్ తీసుకురారు. అలాంటిది అబ్బాయి కనీసం తనను చూడనైనా చూడకుండా పెళ్లికి ప్రపోజ్ చేశాడు అని! ఓకే చెప్పింది. ఇద్దరిళ్లల్లో విషయం చెప్పేశారు. ప్రదీప్ జాతకంలో విదేశీ పిల్లే రాసి ఉందని, అదే జరగబోతోందని అతని తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పలేదు. కానీ రైతా వాళ్లింట్లోనే ఒప్పుకోలేదు. కారణం అక్కడ మీడియాలో ఇండియా గురించి ఉన్న వ్యతిరేక ప్రచారమే! వాళ్లను ఒప్పించే ప్రయత్నంలో.. ప్రదీప్‌ను చూస్తే ఒప్పుకుంటారు అన్న ఆశతో 'ఫిన్లండ్ రండి' అంది రైతా. వెంటనే వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే వీసా 'రిజెక్టయ్యింది. దాంతో 'నేనే హైదరాబాద్ వస్తాను' అంటూ అభయమిచ్చింది రైతా! 'ఎయ్ (.. వద్దు)' అన్నారు ఆమె తల్లిదండ్రులు. 'మిక్సీ (ఎందుకు)?' అడిగింది అమ్మాయి. 'ఇండియా సేఫ్ కాదు' స్పష్టం చేశారు. వాదించింది రైతా. అయినా ఒప్పుకోలేదు తల్లిదండ్రులు. ఈసారి ప్రదీప్ యూకేలో చదువును బహానా (సాకు)గా మలచుకున్నాడు. వీసా ఓకే అయింది. యూకే నుంచి తేలిగ్గానే ఫిన్లండ్‌కి వీసా దొరికింది. రైతా ఆనందానికి అవధుల్లేవు. పరిచయం అయిన ఏడేళ్లకు ఒకరినొకరు చూసుకోబోతున్నారు. ఆ క్షణం రానేవచ్చింది. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నాక ఇంకా నచ్చారు! రైతా తల్లిదండ్రులకూ నచ్చాడు ప్రదీప్! కానీ అమ్మాయి అక్కడికి వెళ్లి ఉండగలదా? అప్పటికీ ఇండియా మీద ఇంకా సానుకూలమైన అభిప్రాయానికి రాలేదు వాళ్లు. 'ఉంటాను' ధైర్యం చెప్పింది. ట్రయల్‌గా హైదరాబాద్‌ను విజిట్ చేసింది కూడా! ఇక్కడి సోషల్ లైఫ్‌ను ఇష్టపడింది. ప్రదీప్ తల్లిదండ్రులకూ రైతా చాలా నచ్చింది. రైతా కుటుంబం కూడా హైదరాబాద్ వచ్చి, ప్రదీప్ కుటుంబాన్ని కలిసింది. అలా ఏడేళ్ల వాళ్ల ప్రేమ ఇరు కుటుంబ సభ్యుల ఆమోదం, ఆశీర్వాదంతో ఏడడుగుల బంధమైంది. వాళ్ల పెళ్లికిప్పుడు ఇరవై ఏళ్లు. నలుగురు పిల్లలు. ప్రదీప్ కోసం రైతా శాకాహారిగా మారింది. తెలుగు నేర్చుకుంది. ప్రదీప్ జీవితంలోనే కాదు బిజినెస్‌లోనూ భాగస్వామైంది. ప్రదీప్ ఫీనిష్ నేర్చుకున్నాడు. తన కోసం ఆమె చేసుకున్న, చేసుకుంటున్న సర్దుబాట్లను అతను గుర్తిస్తాడు. అమె అభిప్రాయాలను గౌరవిస్తాడు. రైతా తల్లిదండ్రులు తన కూతురు చాలా అదృష్టవంతురాలని పొంగిపోతారు.

"మేమొక మాట అనుకున్నాం.. పెళ్లనే గొప్ప బంధంలోకి అడుగుపెడుతున్నాం. మన మధ్య వచ్చే ఏ తగవైనా మన రిలేషన్‌షిప్‌ని మరింత స్ట్రాంగ్ చేయాలి తప్ప వీక్ చేయకూడదు అని. దాన్నే ఆచరిస్తున్నాం!' అని చెబుతోంది రైతా.

– సరస్వతి రమ

మలి ప్రేమ

ఔను.. వాళ్లు ఇష్టపడ్డారు

ప్రేమికుల రోజంటే యువ హృదయాల గురించే మాట్లాడుకుంటారు. వారి ఆశలు, ఆనందాల గురించే ప్రస్తావిస్తుంటారు. మలివయసులో ఒంటరితనంతో బాధపడుతున్న పెద్దలు... తోడును కోల్పోయిన జీవితాల్లో వెలుగులు నింపడం గురించి ఆలోచిస్తున్నామా?!

తీరిక లేని మన జీవితాల్లో నుంచి వారిని దూరం పెడుతున్నాం సరే, వారి మదిలో దాగున్న ప్రేమలను, బాధలను అర్థం చేసుకుంటున్నామా?! ఆరుపదుల వయసులో మనసున మనసై బతుకున బతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ .. అని కోరుకుంటున్న ఒంటరి పెద్దల ప్రేమలనూ గౌరవిద్దామా...

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మలి వయసులో చిగురించిన తమ ప్రేమను ఫలప్రదం చేసుకున్న కొన్ని జంటల ప్రేమ కథల గురించి చెబుతున్నారు తోడూనీడా వ్యవస్థాపకురాలు రాజేశ్వరి.

మనసులో మాట పంచుకోవడానికి...

మలివయసు ప్రేమకథలు మనసుకు హత్తుకునేలా ఉంటాయి. తోడు–నీడ వేదికగా మలివయసు జంటలను కలుపుతున్నాను. ఆరుపదుల వయసు దాటినా, వారిలో అంతటి ప్రేమ ఉందా అనే ఆశ్చర్యమూ కలుగుతుంది. ఈరోజుల్లో పిల్లలు కూడా పెద్దల పెళ్లికి అంగీకరిస్తున్నారు. కానీ, ఇంకా సమాజం అంగీకరించడంలేదు. ఆ వయసు లో ప్రేమ–పెళ్లి అవసరమా? అంటున్నారు. మలివయసులో అనారోగ్యంగా ఉన్నప్పుడు ఏదో భయం, దిగులు ఆవరిస్తుంది. బాగోలేనప్పుడే మరొకరి అవసరం ఉంటుంది. ఇరవైల్లో చేసుకునేదే ప్రేమ పెళ్లి కాదు.. అరవైల్లోనూ ఎమోషనల్ రిలేషన్ కోరుకునేవారి సంఖ్య పెరుగుతోంది.



– రాజేశ్వరి, తోడు నీడ వ్యవస్థాపకురాలు

ప్రేమ, పెళ్లి విషయానికి వస్తే వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే అనేది ఇటీవల జరుగుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గౌహతిలోని ప్రమోద్ తాలూక్దార మెమోరియల్ వృద్ధాశ్రమంలో ఉంటున్న 71 ఏళ్ల పద్మేశ్వర్ గోలాకు పాటలు పాడటం హాబీ. ఆ వృద్ధాశ్రమంలో గోలా స్వరానికి మంత్రముగ్ధురాలైన 65 ఏళ్ల జయప్రభ బోరా అతన్ని ఇష్టపడింది. అతను ఆమెను 'జాన్' అని పిలుస్తాడు. ఆమె అతన్ని 'బాబు' అని పిలుస్తుంది. గోలాకు కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. జయప్రభకు మాత్రం పిల్లలున్నారు. భర్త ఎప్పుడో చనిపోయాడు. బోరా పిల్లలు, మనవలు కూడా ఈ అవ్వ–తాత పెళ్లి జరిపించి, వారి ఆనందంలో తామూ పాలు పంచుకున్నారు.


పద్మేశ్వర్ గోలా, జయప్రభ బోరా

సాయంగా మారిన ప్రేమ

రాజమండ్రి అర్బన్ నారాయణపురానికి చెందిన మాడుగుల మూర్తి వయసు 65 ఏళ్లు. నూడుల్స్ బండి నడుపుకునే చిరు వ్యాపారి. ఎప్పుడో కుటుంబాన్ని వదిలి బయటకు వచ్చేశాడు. ఆరోగ్యం సహకరించడం లేదు. ఒంటరిగా జీవించలేక స్థానికంగా ఉండే స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో చేరారు. ఆశ్రమంలోకి వచ్చాక కూడా ఎవరితోనూ మాట్లాడకుండా అనాసక్తంగా రోజులు గడుపుతుండేవారు. కడప జిల్లా కమ్మలగుంటకు చెందిన 68 ఏళ్ల గుజ్జుల రాములమ్మ అదే ఆశ్రమంలో కొన్నాళ్లుగా ఉంటున్నారు. ఆశ్రమంలో ఆరోగ్యం బాగోలేని వారికి తనకు చేతనైనంతలో సేవలు చేస్తుండేది. కొన్నినెలలుగా సేవలు అందిస్తున్న రాములమ్మతో మూర్తికి మానసిక బంధం ఏర్పడింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఆశ్రమ నిర్వాహకులను కలిసి, తమ మనసులో మాట చెప్పారు.

ప్రేమలకు వయసుతో పనిలేదు. మానసికంగా 'మాకోసం ఒకరున్నారు' అనే భావన జీవించడానికి కొత్త శక్తిని ఇస్తుంది. ఒంటరి పెద్దలు కోరుకుంటున్న జీవనాన్ని అందించడానికి వారి కుటుంబసభ్యులూ అండగా నిలవాల్సిన సమయమిది.

– నిర్మలారెడ్డి

మూర్తి, రాములమ్మ


సాయంగా ఉండాలనుకున్నాం..

అనారోగ్యంగా ఉండి, ఆసుపత్రికి వెళ్లాలన్నా అక్కడ మీతోపాటు ఎవరినైనా వచ్చారా..' అని డాక్టర్లు అడుగుతున్నారు. కొన్నాళ్లుగా నాకు సాయంగా రాములమ్మ ఉంటోంది. ఏ విషయంలోనైనా ఆమెకు సాయంగా నేనూ ఉంటాను అని చెప్పాను. ఇద్దరమూ ఒకరికి ఒకరం తోడుగా ఉందామనుకుని, పెళ్లి చేసుకోవాలనుకున్నాం. ఆశ్రమం వాళ్లు మమ్మల్ని అర్థం చేసుకున్నారు. అంతా కలిసి ఈ మధ్యే మా ఇద్దరికీ దండలు మార్చి, అందరి సమక్షంలో పెళ్లి చేశారు. ఇప్పుడు మాకు ఒకరున్నారనే తోడు, జీవనానికి భరోసా ఉంది.

– మూర్తి, రాములమ్మ

● యంగ్ టాలెంట్

కరాటే సిస్టర్స్

వారి ఇంటి పేరు ఏమిటో చాలామందికి తెలియదు. 'కరాటే సిస్టర్స్' అంటే మాత్రం ఠక్కున గుర్తు పడతారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన విశాఖపట్నంకు చెందిన కృష్ణప్రియ, జ్యోతి, సంగీత కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు గెల్చుకున్నారు. కర్రసాము, చెస్‌లోనూ రాణిస్తున్నారు...


● సంగీత ● జ్యోతి ● కృష్ణ ప్రియ

జీవీఎంసీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న రామారావు ముగ్గురు కుమార్తెలు సంగీత, కృష్ణప్రియ, జ్యోతి కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. విశాఖ మహా నగరంలోని పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్ఎంసీహెచ్)లో ఇంటర్మీడియట్ చదువుకుంటున్నారు. ఒక వైపు చదువు, మరోవైపు కరాటేలో ప్రావీణ్యం చూపుతున్నారు.

కృష్ణప్రియ (16) డబ్ల్యుఆర్ఐ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్-2017 పోటీలలో రజతం, ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-2018 పోటీల్లో స్వర్ణ, కాంస్య పతకాలు, నెట్‌షాడో కాన్ నేషనల్ ఛాంపియన్‌షిప్-2019 ఓపెన్ కరాటే పోటీలలో వెండి, కాంస్య పతకాలు, దక్షిణ భారత కరాటే ఛాంపియన్‌షిప్-2020 పోటీల్లో రజత, కాంస్య పతకాలు, 5వ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ 2022 పోటీలలో స్వర్ణ, వెండి పతకాలు, 13వ జాతీయ ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్-2022 పోటీలలో రజత, వెండి పతకాలు, 8వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు....ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పతకాలు సాధించింది.

ఈ నెలలో విశాఖలోని పోర్టు స్టేడియంలో జరిగిన 81వ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలలో ముగ్గురు సోదరీమణులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీలలో జ్యోతి బంగారు పతకం, వెండిపతకాలు, కృష్ణప్రియ ఏకంగా రెండు బంగారు పతకాలు, సంగీత వెండి, కాంస్య పతకాలు సాధించింది. విశాఖలో జరిగిన ఈ పోటీలలో విశాఖకు చెందిన ఈ ముగ్గురు సోదరీమణులు ఒకే వేదిక మీద సత్తా చాటి పతకాలు అందుకొని భేష్ అనిపించుకున్నారు.

'రామారావుకు నేనే కరాటేలో శిక్షణ ఇచ్చాను. 1989 నుంచి కరాటే అకాడమీ నిర్వహిస్తున్నాను. గత నాలుగు సంవత్సరాలుగా రామారావు ముగ్గురు కుమార్తెలకు కూడా కరాటేలో శిక్షణ ఇస్తున్నాను. ఈ ముగ్గురు పిల్లలకు కష్టపడే తత్వం ఉంది. మంచి భవిష్యత్ ఉంది' అంటున్నాడు కరాటే కోచ్ ఎల్లారావు.

'పిల్లలు సరదాగా కరాటే నేర్చుకుంటున్నారు అనుకున్నానుగానీ ఇంత పేరు తెచ్చుకుంటారు అనుకోలేదు. వారి విజయాలకు ఒక తండ్రిగా మురిసిపోతున్నాను. గర్విస్తున్నాను' అంటున్నాడు రామారావు.

కరాటే అంటే నిండైన ఆత్మవిశ్వాసం. ఇప్పుడు ఆ ఆత్మవిశ్వాసమే ముగ్గురు సోదరీమణులకు ఆభరణం.

వారు కరాటేలో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– దుక్కా మురళీకృష్ణారెడ్డి, సాక్షి, సీతమ్మధార, విశాఖపట్నం

● గేమింగ్

రణభేరీ మోగింది



కొండలు, కోనలు, లోయలు దాటి విజయ విహారం చేయాలని ఉందా? ఆయుధానికి పదును పెట్టి అదను చూసి శత్రువును నేలకూల్చాలని ఉందా?

అయితే మీకు 'అవౌడ్' స్వాగతం పలుకుతుంది. యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'అవౌడ్' ఈ నెల 18న విడుదల అవుతుంది. యోరా అనే ప్రపంచ నేపథ్యంలో సాగే ఈ 'అవౌడ్' ఫస్ట్ పర్సన్, థర్డ్ పర్సన్ గేమ్. పూర్తిగా ఓపెన్ వరల్డ్ గేమ్ కాని 'అవౌడ్'లో లార్జ్, ఎక్స్‌ప్లోరబుల్ జోన్స్ ఉంటాయి. గేమ్ ప్లే విషయానికి వస్తే శత్రువులను ఓడించడానికి ఆటగాళ్లు మాయాజాలం చేయవచ్చు. ఆయుధాలు పట్టవచ్చు. శత్రువులను ఇబ్బంది పెట్టే ఎన్నో దారులలో వెళ్లవచ్చు. రకరకాల నాన్-ప్లేయర్ క్యారెక్టర్స్‌తో ప్లేయర్స్ ఇంటరాక్ట్ కావచ్చు. తమ క్యారెక్టర్‌లకు సంబంధించిన టోన్‌ను షేప్ చేసుకోవచ్చు.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్5 ప్లాట్‌ఫామ్స్: విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్-ప్లేయర్

వాలెంటైన్స్ డే గురించి మేధోమథనం చేయడంలో యూత్‌కు సహాయపడడానికి జనరేటివ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎం)ను ఉపయోగించుకోవచ్చు. చాలామంది ప్రేమికుల దినోత్సవాన్ని విభిన్నంగా జరుపుకోవాలని ఆలోచిస్తారు. ఎంతగా ఆలోచించినా ఐడియాలు మనసుకు తట్టకపోవచ్చు. ఇలాంటి సందర్భాలలో హైలీ సక్సెస్‌ఫుల్



వాలెంటైన్స్‌డే ప్లానింగ్ కోసం ఏఐని భేషుగ్గా ఉపయోగించవచ్చు.

చాలామంది ప్రేమలేఖలకు సంబంధించిన కంటెంట్ రాయడానికి ఏ.ఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు.

స్వయంగా రాయడం కంటే ఏఐ టెక్నాలజీతో రాసిన ప్రేమలేఖలకు మంచి స్పందన వస్తుంది అంటున్నారు.

● ఏఐ ఫొటో ఎడిటర్ 'ఫొటోరూమ్'తో బ్యాక్‌గ్రౌండ్స్‌ను తొలగించి ఏఐ-జెనరేటెడ్ వాలెంటైన్స్ డే బ్యాక్‌డ్రాప్ ఎలిమెంట్స్‌ను జోడించవచ్చు. ● ఈరోజు వాలెంటైన్స్ డే టెంప్లెట్‌లకు బోలెడు డిమాండ్ ఉంటుంది. 'ఫోటోరూమ్'లోకి వెళితే మీకు నచ్చే టెంప్‌లెట్స్ ఎన్నో కనిపిస్తాయి.

● మ్యూజిక్ వరల్డ్



అమెరికన్ సింగర్ మోర్గాన్ వాలెన్ 'లవ్ సమ్‌బడీ' సూపర్ హిట్ అయింది. ఫస్ట్ టీజర్ నుంచే ఎంతో ఆసక్తి రేకెత్తించిన ఈ సాంగ్ 'బిల్‌బోర్డ్ హాట్ 100'లో మొదటి స్థానంలో నిలిచింది. హాట్ కంట్రీ సాంగ్స్, స్ట్రీమింగ్ సాంగ్స్, డిజిటల్ సాంగ్ సేల్స్ చార్ట్‌లోనూ టాప్‌లో నిలిచింది.'కొత్తగా ఉండాలనుకొని పాట రచనకు రెడీ అయ్యాం. మా ప్రయత్నంలో సఫలం అయ్యాం' అంటున్నాడు మోర్గాన్.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ పాటను ఒకసారి పాడుకుంటే బాగుంటుందేమో!

స్టార్ట్....

'ఐ జస్ట్ వాన్నా లవ్ సమ్‌బడీ/ హూ వోన్ట్ లీవ్ ఏ హోల్ ఇన్ మై హార్ట్ /ఐ జస్ట్ వాన్నా లవ్ సమ్‌బడీ/ దట్ డోన్ట్ వాంట్ మీ ఫాలెన్ అపార్ట్ అండ్ ఐ విల్ బి లక్కీ ఇఫ్ ఐ ఎవర్ ఫైండ్/ ఏ సమ్‌థింగ్ మోర్ దెన్ జస్ట్ ఏ క్రేజీ నైట్'

● ట్రెండ్

గ్రాఫిక్ గ్లామర్

గ్రాఫిక్ నవలలపై యూత్ ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ పోతుంది. గత అయిదు సంవత్సరాల కాలంలో గ్రాఫిక్ నవలల అమ్మకాల సంఖ్య రెట్టింపు అయింది. సరదా విషయాల నుంచి సామాజిక విషయాల వరకు ఎన్నో అంశాలపై గ్రాఫిక్ నవలలు వస్తున్నాయి.

గంట కంటే తక్కువ టైమ్‌లోనే ఈ పుస్తకాలను చదివే వీలు ఉండడం కూడా ఆదరణకు కారణం అవుతుంది.

'అదృష్టవశాత్తు మనం గ్రాఫిక్ నవలల స్వర్ణయుగంలో ఉంటున్నాం' అంటున్న ముంబైకి చెందిన రీతుకు ఫ్రెండ్ ద్వారా గ్రాఫిక్ నవలతో తొలి పరిచయం అయింది. ఇక అప్పటి నుంచి గ్రాఫిక్ నవలలు తన హాట్ ఫేవరెట్‌గా మారాయి.



గతంలో కంటే ఎక్కువమంది ఈ పుస్తకాలను చదవడానికి కారణం ఆర్ట్ ఫామ్ హద్దులను అధిగమించి సరికొత్త ఇలస్ట్రేషన్ స్టైల్స్‌తో పుస్తకాలను ముస్తాబు చేయడం.

'గ్రాఫిక్ నవలల క్రియేటివిటీకి ఆకాశమే హద్దు' అంటుంది యువ గ్రాఫిక్ నవల రచయిత్రి టోరీ షార్ప్.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

నోస్ ఇన్ ది ఎయిర్

ఇతరుల కంటే తామే గొప్ప అన్నట్లుగా ప్రవర్తించే వ్యక్తులు, ఇతరుల పట్ల ఆధిక్యతను ప్రదర్శించే వ్యక్తుల విషయంలో ఉపయోగించే మాట...నోస్ ఇన్ ది ఎయిర్.

ఉదా: హీ ఆల్వేస్ యాక్ట్స్ విత్ హిజ్ నోస్ ఇన్ ది ఎయిర్, యాజ్ ఇఫ్ ఆదర్స్ ఆర్ బినీత్ హిమ్

నో స్ప్రింగ్ చికెన్



ఎవరికైనా సరే, యవ్వనం శాశ్వతం కాదు. ఎవరూ శాశ్వతంగా చురుగ్గా ఉండలేరు. వయసు పరిమితులు ఉంటాయి అని చెప్పే సందర్భంలో వాడే మాట...నో స్ప్రింగ్ చికెన్.

ఉదా: హీ వాజ్ ఆల్వేస్ ఏ వైల్డ్ అండ్ క్రేజీ గై వెన్ హీ వాజ్ యంగర్, బట్ నౌ హీ ఇజ్ నో స్ప్రింగ్ చికెన్

యువర్స్

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఎస్25 ప్లస్



డిస్‌ప్లే: 6.70 అంగుళాలు బరువు: 190 గ్రా. రిజల్యూషన్: 1440×3120 పిక్సెల్స్ మెమోరీ: 256 జీబి 12జీబి ర్యామ్, 512 జీబి 12జీబి ర్యామ్ ఓఎస్: ఆండ్రాయిడ్ 15 ఫ్రంట్ కెమెరా: 12 ఎంపీ బ్యాటరీ: 4900 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ

హానర్ మ్యాజిక్ బుక్ ఆర్ట్ 14 స్నాప్‌డ్రాగన్

సైజ్: 14.6 అంగుళాలు
రిజల్యూషన్: 3120×2080 పిక్సెల్స్
బ్యాటరీ కెపాసిటీ: 60 డబ్ల్యూహెచ్
బరువు: 1.02కేజీ విడ్త్: 223.63 ఎంఎం





షావోమీ రెడ్‌మీ వాచ్ 5

డిస్‌ప్లే: 2.07 బ్యాటరీ: 24 రోజులు రిఫ్రెష్‌రేట్: 60 హెచ్‌జెడ్ ● ఇండిపెండెంట్ రికార్డర్ ● రౌండ్-ది-క్లాక్ హెల్త్ మానిటర్ ● 150 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ ● వాటర్ రెసిస్టెంట్

ఇన్‌స్టాగ్రామ్ టీన్ ఎకౌంట్స్



టీనేజర్‌లకు సురక్షితమైన ఆన్‌లైన్ వేదికను సృష్టించడమే లక్ష్యంగా మెటా మన దేశంలో ఇన్‌స్టాగ్రామ్ టీన్ ఎకౌంట్స్‌ను అధికారికంగా ప్రారంభించింది. బిల్ట్-ఇన్ ప్రైవసీ సెట్టింగ్స్, పేరెంటల్ కంట్రోల్స్ లాంటి కొత్త ఫీచర్‌లు యువ యూజర్‌లకు సురక్షితమైన డిజిటల్ అనుభవాన్ని అందిస్తాయి. మైనర్‌లు తమ వయసు తప్పుగా పేర్కొనకుండా నిరోధించడానికి ఏజ్ వెరిఫికేషన్ సిస్టమ్‌ను కూడా ప్రవేశపెట్టారు.

ఇన్‌స్టాగ్రామ్ టీన్ ఎకౌంట్స్: కీ సేఫ్టీ ఫీచర్స్
● ప్రైవేట్ ఎకౌంట్స్ ● మెసేజింగ్ రిస్ట్రిక్షన్స్ ● సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ ● లిమిటెడ్ ఇంటరాక్షన్స్ ● టైమ్ లిమిట్ రిమైండర్స్ ● స్లీప్ మోడ్

సాక్షి సినిమా

తల ట్రైలర్ బాగుంది

- అక్కినేని నాగార్జున


● రాగిన్ రాజు, నాగార్జున, 'అమ్మ' రాజశేఖర్, శ్రీనివాస గౌడ్

''తల' చిత్రం ట్రైలర్ చాలా బాగుంది. 'అమ్మ' రాజశేఖర్ డైరెక్షన్ చాలా ఆసక్తిగా ఉంది. ఈ సినిమాలో హీరోగా నటించిన తన కుమారుడు రాగిన్ రాజ్ పెద్ద హీరో అవుతాడనిపిస్తోంది. ఈ చిత్రం తప్పకుండా మంచి విజయం సాధించాలి. నిర్మాత శ్రీనివాస్ గౌడ్‌కు ఆల్ ది వెరీ బెస్ట్'' అని హీరో అక్కినేని నాగార్జున అన్నారు. 'రణం' మూవీ ఫేమ్ 'అమ్మ' రాజశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'తల'. ఈ మూవీలో ఆయన తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా, అంకిత నాన్సర్ హీరోయిన్‌గా నటించారు. రోహిత్, ఎస్తేర్ నోరోన్హా, 'సత్యం' రాజేశ్, రాజీవ్ కనకాల, ఇంద్రజ, విజ్జీ చంద్రశేఖర్ కీలక పాత్రల్లో నటించారు. పి. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. 'అమ్మ' రాజశేఖర్ వైఫ్ రాధ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా నేడు తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా తొలి టికెట్‌ని అక్కినేని నాగార్జున కొనుగోలు చేసి, యూనిట్‌ని అభినందించారు. ''నాగార్జునగారు 'తల' మొదటి టికెట్‌ను కొనడం మా సినిమా సాధించబోతోన్న పెద్ద విజయానికి చిహ్నం. మా సినిమాని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని 'అమ్మ' రాజశేఖర్ అన్నారు.

యాక్షన్... థ్రిల్


● సుమంత్ ప్రభాస్

తొలి చిత్రం 'మేం ఫేమస్'తో నటుడిగా–దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా ద్వితీయ చిత్రం తెరకెక్కుతోంది. సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. రేలంగి, భీమవరం, సకినేటిపల్లి లంక వంటి లొకేషన్స్‌తో పాటు అంతర్వేది ఆలయ ప్రాంగణంలో రెండో షెడ్యూల్ పూర్తి చేశాం. ఈ షెడ్యూల్‌లో హై ఎనర్జీ ఆటో రేస్ సీక్వెన్స్, ఇంటెన్స్ యాక్షన్ సీన్ చిత్రీకరించాం. ఈ సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్లింగ్ సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తాయి. ఈ నెలాఖరులో ప్రారంభించే మూడో షెడ్యూల్‌లో పాటలు, ఇతర కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: సాయి సంతోష్, సంగీతం: నాగ వంశీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధులిక


● హను రాఘవపూడి, అనుపమ్ ఖేర్, ప్రభాస్

ఓ యోధుడి పోరాటం

హీరో ప్రభాస్ వరుస పాన్ ఇండియా సినిమాలు చూస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారు. 'సలార్, కల్కి 2898 ఏడీ' వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'సీతారామం' వంటి హిట్ సినిమా తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సీనియర్ స్టార్స్ మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి వారు కీలక పాత్రలు పోషిస్తుండగా తాజాగా ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ఈ ప్రాజెక్టులో జాయిన్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించడంతో పాటు ప్రభాస్, హను రాఘవపూడిలతో అనుపమ్ ఖేర్ ఉన్న ఫొటోల్ని విడుదల చేశారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''1940 హిస్టారికల్ ఫిక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రూపొందుతోంది. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి పోరాటం చేసే ఓ యోధుడి కథగా ఉండబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఇండియన్ సినిమా బాహుబలి ప్రభాస్‌తో నా 544వ చిత్రాన్ని ప్రకటించినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి అద్భుత ప్రతిభావంతుడైన హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీస్ వారు అద్భుతంగా నిర్మిస్తున్నారు'' అంటూ అనుపమ్ ఖేర్ షేర్ చేశారు. ఈ చిత్రానికి కెమేరా: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

బాపు అరుదైన సినిమా - రానా దగ్గుబాటి

రెగ్యులర్‌కి భిన్నంగా ఉండే 'బాపు' లాంటి సినిమాలు రావడం చాలా అరుదు. ఒక సంస్కృతిని చూపించే ఇలాంటి చిత్రాన్ని చూసేందుకు ప్రేక్షకుల్లా నేను కూడా ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బాపు'. దయా దర్శకత్వంలో కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది.



● దయా, బ్రహ్మాజీ, రానా, తిరువీర్

హైదరాబాద్‌లో నిర్వహించిన 'బాపు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి రానా దగ్గుబాటి, నటుడు తిరువీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరువీర్ మాట్లాడుతూ– ''బాపు' ట్రైలర్‌లో మట్టివాసన కనిపించింది. దయాగారు చాలా మంచి సినిమా తీశారు'' అన్నారు. ''మన కుటుంబంలోని పాత్రలు ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ మూవీని అందరం ప్రోత్సహిద్దాం'' అని దర్శక-నిర్మాత 'మధుర' శ్రీధర్ పేర్కొన్నారు. ''బాపు' మంచి కంటెంట్ ఉన్న సినిమా. ఈ చిత్రానికి మంచి పేరు రావాలి'' అన్నారు బ్రహ్మాజీ. ''మా చిత్రాన్ని అందరూ థియేటర్స్‌లో చూడాలి'' అని దయా కోరారు. ''నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా 'బాపు'' అన్నారు సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్.

వాలెంటైన్స్ డే

వెండితెరే ప్రేమలేఖ

'ప్రేమ కోసమై వలలో పడెనె పాపం పసివాడు' అని 'పాతాళభైరవి' సినిమా ప్రేమను వినిపించినా మన వారు తలకెక్కించుకోలేదు. 'మల్లీశ్వరి', 'దేవదాసు' ప్రేమకథల ట్రెండ్‌ను కొనసాగించలేదు. 1965 తర్వాతే ప్రేమ అనే మాట వెండితెర మీద ఎక్కువగా వినిపించింది. 1980ల నాటికి ప్రేమ సినీ ప్రేక్షకుల బ్లడ్‌గ్రూపుల్లో ఒకటిగా స్థిరపడింది. 'మరో చరిత్ర' ఇందుకు ఒక కారణమైతే 'ప్రేమాభిషేకం' మరో కారణం. వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమరీలు ఫ్లాష్‌బ్యాక్.


● 'మరో చరిత్ర'లో సరిత, కమల్‌హాసన్

'మనసు గతి ఇంతే...' అని ఆత్రేయ రాశాడుగాని 'ప్రేమ గతి ఇంతే' అని రాయలేదు. తెలుగు సినిమాల్లో చాలా కాలం ప్రేమకు బదులుగా 'మనసు', 'మమత' అనే మాటలే ఉండేవి. 'మూగ మనసులు', 'తేనె మనసులు'... ప్రేమ కథలే. వాటిని 'మూగ ప్రేమలు', 'తేనె ప్రేమలు' అనలేదు.

'మల్లీశ్వరి' కళాత్మక ప్రేమకథ. కానీ దాని సెట్టింగ్ వర్తమానంలో లేదు. 'పాతాళభైరవి' ప్రేమ కథే. అయితే అది జానపద కథై కూచుంది. 'దేవదాసు'కు మించిన ప్రేమ కథ ఏముంది? ఇది వర్తమానంలో ఉన్నా సందేశం పరమ చేదైన నిషా కావడంతో 'ప్రేమ' మాటెత్తితే ఎక్కడ కుర్రాళ్లు దేవదాసులైపోతారోనని జనం దడుచుకునేవారు. తెలుగు సినిమా రంగం తన కథల్లో కుటుంబంలో ఉండే ప్రేమ గురించి, దాని చుట్టూ ఉండే డ్రామా గురించి ఎక్కువ శ్రద్ధ పెట్టింది. దానికి కారణం ఇద్దరు సూపర్‌స్టార్‌లు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు భిన్న పాత్రలు, కథాంశాలతో ముందుకు సాగుతుండటమే. అదీగాక 'పెద్దలు కుదిర్చే పెళ్లి' అనే భావన చాలా గట్టిగా ఉన్న కాలంలో ప్రేమను పదేపదే చెప్పడం కుదిరే పని కాదు. 1965లో 'ప్రేమించి చూడు' అనే టైటిల్ పెడితే పలకడానికి సంకోచించిన ఆడపిల్లలు ఉన్నారు. ఆ మాటెత్తితే చిర్రుబుర్రుమన్న పెద్దలు ఉన్నారు. తమిళంలో హిట్ అయిన ఈ సినిమా అంత స్థాయిలో తెలుగులో ఆడలేదు. 'ప్రేమ నగర్' (1971) అంటే 'ప్రేమసౌధం' కాబట్టి చెల్లుబాటయ్యింది. తాజ్ మహల్ కాలం నుంచి ప్రేమసౌధాలు ఉన్నవే. అంటే వెండితెర మీద నుంచి ప్రేక్షకుల్లోకి ప్రేమ అంగీకారం పొందాలంటే చాలా కాలం పట్టింది.

దశ మార్చిన 'మరో చరిత్ర'

వయసులో ఉన్న అమ్మాయి, అబ్బాయి... అదే వయసు హీరో హీరోయిన్లు... వారు ప్రేమలో పడ్డారు... జనం ఆశ్చర్యపోయారు. విగ్గులు, మేకప్ అవసరం లేని హీరో, హీరోయిన్లు కావడం వల్ల వారి ప్రేమ కాలానికి తగినట్టుగా ఉండటం వల్ల అందులోని సవాళ్లను వారు అసహజంగా కాకుండా సహజంగా ఎదుర్కొన్నారు కనుక 'ప్రేమచరిత్ర' (1978) సూపర్‌హిట్ అయ్యింది. ఇది తెలుగు ప్రేక్షకులకు ప్రేమరోగాన్ని గట్టిగా అంటించింది. 1981లో మూడు సినిమాలు 'ప్రేమాభిషేకం'. 'సీతాకోక చిలుక', 'ముద్ద మందారం'... తెలుగు నేల మీద ప్రేమదుమారం రేపాయి. ఈ సంవత్సరంతో తెలుగు సినిమాల్లో ప్రేమ ఒక గట్టి ఫార్ములాగా స్థిరపడింది. అయితే తమిళం నుంచి డబ్ అయిన 'ప్రేమ సాగరం' (1983) పై సినిమాల్లో లేని 'కాలేజీ'ని ఆకర్షణీయమైన పాత్రగా ప్రవేశపెట్టి కాలేజీ కుర్రాళ్లను ఐడెంటిఫై అయ్యేలా చేసుకోవడంతో తమిళంలో ఎంత పెద్ద హిట్టయ్యిందో తెలుగులో కూడా అంతే పెద్ద హిట్టయ్యింది. ఇక ప్రేమ కథల జైత్రయాత్ర తెలుగులో మొదలైంది.

గీతాంజలి

ఆ తర్వాత అందరు హీరోలు ఏదో ఒక ప్రేమ కథలో నటించారు. లేదా ప్రేమ కథాంశాలు వారికి లాభించాయి. చిరంజీవి 'ఖైదీ' (1983), బాలకృష్ణ 'సాహసమే జీవితం' (1984), నాగార్జున 'మజ్నూ' (1987), వెంకటేశ్ 'ప్రేమ' (1989).... ఈ వరుసలో మణిరత్నం 'గీతాంజలి' (1989) ప్రేమ నిప్పులోన కాలదు.. నీటిలోన నానదు అని నిరూపించింది.


● 'ప్రేమాభిషేకం'లో శ్రీదేవి, ఏఎన్నార్

కొత్త పాయింటే సక్సెస్

అన్నీ ప్రేమ కథలే. కానీ కొత్త పాయింట్ చెప్పినప్పుడల్లా హిట్ అయ్యాయి. 'చంటి' (1991), 'గులాబీ' (1996), తొలిప్రేమ (1998) ఇవన్నీ హిట్ అవగా 2000 సంవత్సరంలో వచ్చిన 'నువ్వే కావాలి'... స్నేహితుల మధ్య కూడా ప్రేమ ఉండొచ్చు అని చెప్పి సూపర్ హిట్టయ్యింది. కొత్త తరం హీరోలు వచ్చాక నాటి నుంచి నేటి వరకు ఎన్నో హిట్ ప్రేమ కథలు ప్రేక్షకుల మధ్యకు వచ్చాయి. 'జయం', 'నువ్వు నేను', 'మనసంతా నువ్వే', 'నువ్వు నాకు నచ్చావ్', 'ఖుషీ', 'బొమ్మరిల్లు', 'అర్జున్ రెడ్డి', 'ఫిదా', 'గీత గోవిందం', 'ఉప్పెన'. 'సీతారామం', 'నిన్ను కోరి'... ఇప్పుడు 'తండేల్' వరకు ప్రేమ కథకు తిరుగు లేదని నిరూపించాయి.

నిజమే... ప్రేమ ఎంత మధురం.

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	32	76,139
నిఫ్టీ ▼	14	23,031

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,810	▲ 156
డోజోన్స్	44,482	▲ 114
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,765	▼ 43
డాక్స్	22,612	▲ 464
షాంఘై	3,304	▼ 14
నికాయ్	39,461	▲ 496

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	85,748	▲ 903
బంగారం (99.5 స్వచ్ఛత)	85,405	▲ 900
వెండి (కిలో)	95,549	▲ 1,360

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.06	88.74
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.85	110.86
€	యూరో	ఎస్‌బీఐ	88.08	92.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	45.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.05	55.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.04	66.72
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.27	23.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.77	24.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.86

క్విక్ కామర్స్ ఏఐ రైడ్!

పదే పది నిమిషాల్లో డెలివరీతో రప్పా రప్పా దూసుకుపోతున్న క్విక్ కామర్స్ దిగ్గజాలు... దీని కోసం అధునాతన టెక్నాలజీని విరివిగా వాడేసుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతికతల దన్నుతో కస్టమర్ల ఆర్డర్ ధోరణులు, ప్రోడక్ట్ ప్రాధాన్యతలు, ఏ సమయంలో ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారనే అంశాలను అధ్యయనం చేయడం, డార్క్ స్టోర్ నుంచి గమ్యస్థానికి అత్యంత వేగవంతమైన రూట్‌ను ఎంచుకోవడం వంటివన్నీ చకచకా చక్కబెట్టేస్తున్నాయి. - సాక్షి, బిజినెస్ డెస్క్



10 నిమిషాల ఇన్‌స్టంట్ డెలివరీకి టెక్నాలజీ దన్ను | రియల్ టైమ్ డేటాతో కచ్చితమైన డెలివరీ టైమ్ చెప్పేస్తున్న ఏఐ | డార్క్ స్టోర్లలో నిల్వల సరైన నిర్వహణ

క్విక్ కామర్స్ దిగ్గజాలైన బ్లింకిట్, బిగ్‌బాస్కెట్ నౌ, జెప్టో లేదంటే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్... చెప్పింది చెప్పినట్లుగా పది నిమిషాలలోపే ఆర్డర్లను అంతవేగంగా ఎలా డెలివరీ చేసేస్తున్నాయో తెలుసా? ఇప్పటికే తమ వద్దనున్న వినియోగదారుల డేటాను ఏఐతో సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారానే ఇదంతా సాధ్యమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. తగినంత కస్టమర్ సమాచారం ఉన్న క్విక్ కామ్ కంపెనీలకు ఏఐ వరప్రదాయినిగా మారుతోంది. వినియోగదారుల కొనుగోలు స్వభావం నుంచి వారు ఎంత విరివిగా ఆర్డర్ చేస్తున్నారు, ఏయే ఉత్పత్తులను ఎక్కువగా కొంటున్నారు వంటివన్నీ ఏఐ టూల్స్ రియల్ టైమ్‌లో విశ్లేషించి అందిస్తున్నాయి. అంతేకాదు దగ్గరలో ఉన్న డార్క్ స్టోర్ (క్విక్ కామ్ కంపెనీలు ప్రోడక్టులను నిల్వ ఉంచుకునే చిన్నపాటి గిడ్డంగులు) నుంచి ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో, అలాగే పెద్దగా రద్దీ లేనప్పుడు గమ్యస్థానానికి అత్యంత వేగంగా చేరుకునే రూట్‌ను కూడా అధ్యయనం చేసి ఈ ఏఐ టూల్స్ నేరుగా డెలివరీ బాయ్‌కు చేరవేస్తున్నాయి.

అంతా క్షణాల్లో...

జెప్టో వంటి కీలక క్విక్ కామ్ సంస్థలు ఉపయోగిస్తున్న తెరవెనుక (బ్యాకెండ్) టెక్నాలజీ... ఏకకాలంలో పికర్స్, ప్యాకర్స్, ఇంకా రైడర్లను రియల్‌టైమ్‌లో కనెక్ట్ చేస్తోంది. ఒకసారి యాప్‌లో ఆర్డర్ కన్ఫర్మ్ అవ్వగానే, ఈ సిస్టమ్‌లోని అందరూ అనుసంధానమైపోతారు. ఆర్డర్‌ను పిక్ చేయడం, డిస్పాచ్ చేయడం 2 నిమిషాల్లోపే జరిగిపోతుంది. ఆపై ట్రాఫిక్, ఇంధన మైలేజీ, వాహన టెలీమెట్రీ, ప్రయాణ సమయాల చరిత్ర, దూరం వంటి డేటాను ఉపయోగించుకుని రియల్ టైమ్ రూటింగ్ తగిన రూట్లను సూచిస్తుంది. దీనివల్ల ఆర్డర్‌ను డెలివరీ పార్టనర్ ఎంత సమయంలో కస్టమర్ చెంతకు చేర్చగలరనే అంచనా ట్రావెల్ టైమ్ (ఈటీఏ)ను పక్కాగా పేర్కొంటుంది. దీని ప్రకారం సగటున 8 నిమిషాల్లోపే ఆర్డర్ డెలివరీ జరిగేందుకు వీలవుతోందని నిపుణులు చెబుతున్నారు. 340కి పైగా డార్క్ స్టోర్లున్న జెప్టో గతేడాది డెలివరీ దూరం 1.7 కిలోమీటర్లు కాగా, ఇప్పుడిది 1.5 కిలోమీటర్లకు తగ్గించుకుంది. అంతేకాదు, 3–4 సెకెన్లలో చెకవుట్ అయ్యే విధంగా అధునాతన టెక్నాలజీలు వినియోగించే పేమెంట్ గేట్‌వే సర్వీసులను కంపెనీ వాడుకుంటోంది. ఇక బీబీనౌ విషయానికొస్తే, ఆర్డర్ ఏ డార్క్ స్టోర్‌కు వెళ్తుందో నిర్ణయించడానికి ముందే టెక్నాలజీ రంగంలోకి దిగుతుంది. ఉదాహరణకు సదరు ప్రాంతంలో ఉన్న రైల్వే ట్రాక్‌లు, పీక్, నాన్-పీక్ టైమ్‌లో ట్రాఫిక్, రోడ్డు స్థితిగతులు, ఇప్పటిదాకా కస్టమర్ షాపింగ్ ధోరణులు, వయస్సు, ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి పలు డేటా పాయింట్‌లను పరిగణనలోకి తీసుకుంటామని బిగ్‌బాస్కెట్ సీఓఓ టీకే బాలకుమార్ చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా బీబీనౌ రోజుకు 5 లక్షల పైగా ఆర్డర్లను ప్రాసెస్ చేస్తోంది.

- జెప్టో డార్క్ స్టోర్ నుంచి ప్రస్తుత డెలివరీ దూరం 1.5 కిలోమీటర్లు; యాప్‌లో ఆర్డర్ చెకవుట్ సమయం 3–4 సెకన్లు.
- ఆర్డర్లను తగిన డార్క్ స్టోర్లకు కేటాయించేందుకు బీబీనౌ జియో స్పేషియల్ డేటాను వినియోగిస్తోంది.
- పికర్లు, ప్యాకర్లు, రైడర్లను అత్యంత వేగంగా కనెక్ట్ చేయడానికి జెప్టో ఏఐ ఆల్గోరిథమ్స్ దోహదం చేస్తున్నాయి.
- యూజర్ల అభిరుచులను బట్టి ఉత్పత్తులను సిఫార్సు చేయడంలో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ డేటా ఎనలిటిక్స్‌ది కీలక పాత్ర.

వృథాకు చెక్..

డిమాండ్‌ను అంచనా వేయడానికి దాదాపు అన్ని క్విక్ కామ్ సంస్థలూ ఏఐ అల్గోరిథమ్స్, మెషీన్ లెర్నింగ్ మోడల్స్ ప్రయోజనాన్ని వాడుకుంటున్నాయి. దీనివల్ల ప్రోడక్ట్ నిల్వలను సరిగ్గా నిర్వహించేందుకు, వృథాను అరికట్టేందుకు వాటికి వీలు చిక్కుతోంది. అంతేగాకుండా, డార్క్ స్టోర్లలో ఉత్పత్తుల నిల్వలను నిరంతరం పర్యవేక్షించేందుకు క్విక్ కామ్ సంస్థలు రియల్ టైమ్ డేటాను కూడా ఎఫ్‌ఎంసీజీ కంపెనీలతో పంచుకుంటున్నాయి. పలు ఈ–కామర్స్ సంస్థల వృద్ధిలో కీలకంగా నిలుస్తున్న డేటా ఎనలిటిక్స్ క్విక్ కామ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఉదాహరణకు, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షాపింగ్ అభిరుచులు, ప్రాధాన్యతల ఆధారంగా ఒక్కో కస్టమర్‌కు ఒక్కోలాంటి యూజర్ అనుభూతిని అందించేందుకు డేటా ఎనలిటిక్స్‌ను సద్వినియోగం చేసుకుంటోంది. 'ఇలాంటి నిర్దిష్ట (టార్గెటెడ్) విధానం వల్ల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను సిఫార్సు చేయడానికి వీలవుతుంది. అలాగే కస్టమర్లు ఏదైనా ఉత్పత్తిని కొనుగోలు చేసే అవకాశాలను పెంచుతుంది' అని ఈ–కామర్స్ నిపుణులు సోమ్‌దత్తా సింగ్ అభిప్రాయపడ్డారు.

బంగారం మళ్లీ రూ.88,000 పైకి

- 10 గ్రాముల ధర 140 ప్లస్
- వెండి కేజీ రేటు రూ.800 అప్



న్యూఢిల్లీ: బంగారం మరోసారి రూ.88,000 మార్క్‌ను అధిగమించింది. గురువారం ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ.140 లాభపడి రూ.88,100కు చేరుకుంది. బుధవారం రూ.87,960 వద్ద ముగియడం గమనార్హం. 99.5 స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.140 లాభపడి రూ.87,700కు చేరింది. వెండి ధర కిలోకి రూ.800 పెరిగి రూ.98,000 మార్క్‌ను చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల అమలుకు సమయం దగ్గరపడుతుండడంతో బంగారానికి తిరిగి డిమాండ్ ఏర్పడినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ నెల 10 గ్రాముల బంగారం డెలివరీ కాంట్రాక్ట్ రూ.364 పెరిగి రూ.85,845కి చేరుకుంది. అంతర్జాతీయంగా మార్కెట్లోనూ బంగారం ఔన్స్‌కు 19 డాలర్లు లాభపడి 2,948 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

యూఎస్‌ఏలో స్టాండర్డ్ గ్లాస్ కంపెనీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇటీవలే ఐపీవోకు వచ్చిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ యూఎస్‌ఏలో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఎగుమతులను పటిష్టం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ ఎండీ నాగేశ్వర రావు కందుల తెలిపారు. 1,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఎస్2 యూనిట్-5లో ఈ నెలలోనే కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. కాగా, డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితంతో పోలిస్తే 27.4% ఎగసి రూ.16 కోట్లు దక్కించుకుంది. టర్నోవర్ రూ.138 కోట్ల నుంచి రూ.143 కోట్లకు పెరిగింది.

ఒడిదుడుకుల ట్రేడింగ్... స్వల్ప నష్టాలు



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఐటీ, బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 32 పాయింట్లు కోల్పోయి 76,139 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 14 పాయింట్లు పతనమై 23,031 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. నిఫ్టీ వీక్లీ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో తీవ్ర ఒడిదుడులకు లోనయ్యాయి. ట్రేడింగ్‌లో అధిక సమయం లాభాల్లో కదలాడాయి. సెన్సెక్స్ 76,765–76,013 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 23,236 వద్ద గరిష్టాన్ని, 22,992 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఫార్మా, మెటల్, ఫైనాన్స్, విద్యుత్, టెలికం షేర్లుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అమెరికా జనవరి ద్రవ్యోల్బణం అంచనాలకు మించడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలు రేకెత్తాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- నాట్కో షేరు 20% నష్టంతో రూ.973 వద్ద లోయర్ సర్క్యూట్ తాకి అక్కడే ముగిసింది. డిసెంబర్ క్వార్టర్‌లో లాభం 38% క్షీణతతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది.

భారత్ ఏఐకి అనుకూలం

- దేశీ ఫౌండేషన్ మోడల్స్‌కు మద్దతుగా ఉంటాం
- గూగుల్ గ్లోబల్ హెడ్ భాటియా వెల్లడి



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధికి భారత్‌లో అనువైన పరిస్థితులు ఉన్నాయని టెక్ దిగ్గజం గూగుల్ గ్లోబల్ హెడ్ (గవర్నమెంట్ అఫైర్స్, పబ్లిక్ పాలసీ) కరణ్ భాటియా తెలిపారు. దేశీయంగా ఫౌండేషన్ మోడల్స్‌ను రూపొందించుకోవాలన్న భారత్ ఆకాంక్షలను సాకారం చేసేందుకు గూగుల్ తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సర్వే ప్రకారం ఎకానమీపై ఏఐ సానుకూల ప్రభావాలు అంతర్జాతీయ సగటుతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువగా ఉంటాయని వెల్లడైనట్లు భాటియా చెప్పారు. దేశీయంగా పలు భాషలు ఉన్నందున స్థానిక పరిస్థితులకు అనుగుణమైన సాధనాలను రూపొందించడం కోసం దేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. వీటి రూపకల్పనలో గూగుల్ కూడా ముఖ్యపాత్ర పోషించగలదని వివరించారు.ఇప్పటికే ఐఐఎస్‌సీతో కలిసి 'ప్రాజెక్ట్ వాణి'పై పని చేస్తున్నామని, గూగుల్ ట్రాన్స్‌లేట్‌ను ప్రవేశపెట్టామని భాటియా వివరించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
స్పోర్ట్స్ టెక్నాలజీ మార్కెట్ @ రూ. 49,500 కోట్లు | హిండాల్కో లాభం హైజంప్

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

డెల్‌రే బీచ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో రిత్విక్ చౌదరీ (భారత్)-నికోలస్ బారింటోస్ (కొలంబియా) ద్వయం 7-6 (7/4), 7-6 (7/5)తో రొంబోలి-జొర్మాన్ (బ్రెజిల్) జంటపై గెలిచింది. 1 గంట 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బారింటోస్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రెండు జోడీలు తమ సర్వీస్‌ను ఒక్కోసారి కోల్పోయాయి. రెండు సెట్‌లలో టైబ్రేక్‌లో రిత్విక్-బారింటోస్ ద్వయం పైచేయి సాధించింది. ఇదే టోర్నీలో ఆడుతున్న శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) జంట కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ బాలాజీ-వరేలా ద్వయం 3-6, 6-2, 10-4తో లెర్నర్ టియెన్-ఈథన్ క్విన్ (అమెరికా) జంటపై గెలిచింది.



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో ఆష్లీ గార్డ్‌నర్, దీప్తి శర్మ, మెగ్ లానింగ్, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్

ధనాధన్ సమరం

నేటి నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ టి20 టోర్నీ

తొలి పోరులో బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ 'ఢీ'	మార్చి 15న ముంబైలో ఫైనల్	రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్రీడాభిమానులను అలరించేందుకు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో సీజన్‌కు శుక్రవారం తెరలేవనుంది. నెల రోజుల పాటు సాగనున్న ఈ సమరంలో 5 జట్లు 22 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. సీనియర్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు సత్తా చాటేందుకు సిద్ధమవుతుండగా... సీజన్ ఆరంభ పోరులో శుక్రవారం గుజరాత్ జెయింట్స్ జట్టుతో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఆడనుంది.

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ మూడో సీజన్‌కు వేళయింది. తొలి రెండు సీజన్‌లలో మెరిపించిన పలువురు యువతారలు ఆ తర్వాత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో మరోసారి ఎమర్జింగ్ క్రికెటర్లకు తమ ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు అవకాశం లభించనుంది. గత సీజన్ మాదిరిగానే ఈసారీ ఐదు జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు ముగిశాక పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టుకు నేరుగా ఫైనల్ బెర్త్ లభిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ ద్వారా రెండో ఫైనలిస్ట్‌ను నిర్ణయిస్తారు.

- బెంగళూరుకు గాయాల బెడద వేధిస్తోంది. గతేడాది టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన సోఫీ డివైన్ తోపాటు కేట్ క్రాస్, స్పిన్నర్ ఆశ శోభన గాయాలతో టోర్నీ నుంచి వైదొలిగారు.
- పేలవ ఫామ్‌తో జాతీయ జట్టులో చోటు కోల్పోయిన భారత ఓపెనర్ షఫాలీ వర్మ, పేసర్ అరుంధతి రెడ్డి డబ్ల్యూపీఎల్‌లో రాణించి తిరిగి టీమిండియాకు ఎంపిక కావాలని చూస్తున్నారు. వీరిద్దరు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడుతున్నారు.
- గత రెండు పర్యాయాలు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. షఫాలీ వర్మ, మెగ్ లానింగ్, జెమీమా రోడ్రిగ్స్, అనాబెల్ సదర్లాండ్, మరిన్ కాప్, శిఖా పాండే, అరుంధతి రెడ్డి, టిటాస్ సాధు, జెస్ జొనాసన్, రాధ యాదవ్‌తో క్యాపిటల్స్ బలంగా ఉంది.
- తొలి సీజన్‌లో విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుండగా... హేలీ మాథ్యూస్, యస్తిక భాటియా, నటాలియా స్కీవర్ బ్రంట్, అమేలియా కెర్ కీలకం కానున్నారు.
- గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ జట్లు కొత్త కెప్టెన్‌లతో బరిలోకి దిగుతున్నాయి. అలీసా హీలీ అందుబాటులో లేకపోవడంతో యూపీ వారియర్స్ జట్టుకు భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇక బెత్ మూనీ స్థానంలో ఆష్లీ గార్డ్‌నర్ గుజరాత్ జెయింట్స్ జట్టుకు సారథ్యం వహించనుంది. ఈ సీజన్‌లో మరో రెండు కొత్త (వడోదర, లక్నో) వేదికలపై కూడా మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

పాటీదార్‌కు పగ్గాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు కెప్టెన్‌గా రజత్ పాటీదార్ నియామకం

2021 సీజన్ నుంచి జట్టులో సభ్యుడు ● కోహ్లి నాయకత్వంపై యాజమాన్యం వెనుకంజ

బెంగళూరు: ఐపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 2025 సీజన్‌లో కొత్త కెప్టెన్ నాయకత్వంలో బరిలోకి దిగనుంది. విరాట్ కోహ్లి మరోసారి సారథ్య బాధ్యతలు చేపట్టవచ్చనే అభిమానుల ఆశలకు భిన్నంగా టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. దూకుడైన బ్యాటింగ్‌తో జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగిన రజత్ పాటీదార్‌ను కెప్టెన్‌గా నియమించింది. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సారథ్య వివరాలను ఆర్‌సీబీ ప్రకటించింది. గత మూడు సీజన్ల పాటు కెప్టెన్‌గా వ్యవహరించిన డు ప్లెసిస్‌ను వేలానికి ముందు టీమ్ విడుదల చేయడంతో కొత్త నాయకుడి ఎంపిక అనివార్యమైంది. వేలానికి ముందు జట్టు రిటైన్ చేసుకున్న ముగ్గురు ప్లేయర్లలో పాటీదార్ ఒకడు. అతడిని రూ.11 కోట్లకు ఆర్‌సీబీ తమతోనే కొనసాగించింది. 2021–2024 మధ్య ఆర్‌సీబీ తరఫున 27 మ్యాచ్‌లు ఆడిన పాటీదార్ 158.84 స్ట్రయిక్‌రేట్‌తో 799 పరుగులు సాధించాడు. ఇందులో 1 సెంచరీ, 7 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇప్పుడు తొలిసారి కెప్టెన్‌గా కూడా ఎంపిక చేసిన యాజమాన్యం పెద్ద బాధ్యతను అతనిపై పెట్టింది. ఐపీఎల్‌లో చరిత్రలో బెంగళూరుకు రజత్ ఎనిమిదో కెప్టెన్. గతంలో ఈ టీమ్‌కు ద్రవిడ్, పీటర్సన్, కుంబ్లే, వెటోరి, కోహ్లి, వాట్సన్, డుప్లెసిస్ సారథులుగా వ్యవహరించారు.

మెరుపు బ్యాటింగ్‌తో గుర్తింపు...

ఇండోర్‌కు చెందిన 32 ఏళ్ల పాటీదార్ దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2021 సీజన్‌లో తొలిసారి అతను ఐపీఎల్ ఆడే అవకాశం దక్కించుకున్నాడు. ఆ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లకే పరిమితమైన అతడిని 2022 సీజన్‌కు ముందు విడుదల చేసింది. అయితే లవ్‌నీత్ సిసోడియా అనూహ్యంగా గాయపడటంతో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా మళ్లీ జట్టులోకి వచ్చి చెలరేగిపోయాడు. మొత్తం 333 పరుగులు చేయగా... ఎలిమినేటర్ మ్యాచ్‌లో లక్నోపై 54 బంతుల్లో 112 పరుగులు బాదిన ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచింది. అయితే గాయం కారణంగా 2023 సీజన్‌కు పూర్తిగా దూరమైన అతను 2024లో తిరిగొచ్చి మెరుపు బ్యాటింగ్‌తో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2024 సీజన్‌లో 15 మ్యాచ్‌లలో 395 పరుగులు సాధించిన అతను 33 సిక్సర్లు బాదాడు. అదే ఏడాది ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే టోర్నీల్లో తొలిసారి మధ్యప్రదేశ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం పాటీదార్‌కు ఉంది. ముస్తాక్ అలీ టోర్నీలో 186.08 స్ట్రయిక్‌రేట్‌తో 428 పరుగులు చేసిన అతను జట్టును ఫైనల్ వరకు చేర్చాడు.



పాటీదార్‌కు టీమ్ క్యాప్ అందజేస్తున్న ఆర్‌సీబీ ఉపాధ్యక్షుడు రాజేశ్ మీనన్

కెప్టెన్‌గా ఎందుకు...

ఐపీఎల్‌లో కెప్టెన్‌గా ఎంపిక చేసేందుకు మేనేజ్‌మెంట్ ముందుగా చూసేది అన్ని మ్యాచ్‌లలో కచ్చితంగా తుది జట్టులో ఉండే ఆటగాడి గురించే. అది కూడా భారత ఆటగాడైతే మరీ మంచిది. గతంలో విదేశీయులను కెప్టెన్‌గా చేసి అతను విఫలమవుతున్నా కొనసాగించి దాదాపు పది మందితోనే ఆడినట్లుగా టీమ్‌లు ఇబ్బంది పడిన ఘటనలు చాలా ఉన్నాయి. అలా చూస్తే విరాట్ కోహ్లి తర్వాత జట్టులో ప్రధాన బ్యాటర్ అయిన పాటీదార్ మినహా మరో ప్రత్యామ్నాయం ఆర్‌సీబీ వద్ద లేకపోయింది. కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, పడిక్కల్‌లతో పోలిస్తే ఇది మెరుగైన నిర్ణయమే. భారత్ తరఫున 3 టెస్టులు, ఒకే ఒక వన్డే ఆడిన రజత్‌కు వ్యక్తిగతంగా స్టార్ ఆటగాడిలా గుర్తింపు లేకపోయినా అతనిపై యాజమాన్యం నమ్మకం ఉంచింది. 'రజత్ ఎంపికకు ఎన్నో కారణాలు ఉన్నాయి. అతని నెమ్మదైన స్వభావం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండే తీరు, కెప్టెన్సీకి పనికొచ్చే లక్షణం. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో అతని ప్రతిభ, పట్టుదల ఎలాంటివో మధ్యప్రదేశ్ కెప్టెన్‌గా దగ్గరి నుంచి చూశాం. సహచరులతో కలిసిపోవడం, వారికి అండగా నిలిచే తత్వం కూడా మంచి సారథికి ఉండాల్సిన మరో లక్షణం' అని ఆర్‌సీబీ హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ అన్నాడు. మరోవైపు కోహ్లికి మళ్లీ కెప్టెన్సీ ఇచ్చే విషయంపై చర్చించామన్న టీమ్ డైరెక్టర్ మో బొబాట్... ఎందుకు వద్దనుకున్నారనే ప్రశ్నపై తగిన సమాధానం ఇవ్వలేదు. కోహ్లి స్థాయి ఆటగాడికి 'కెప్టెన్' అనే హోదా అవసరం లేదని, తన సహజ నాయకత్వ లక్షణాలు జట్టుకు ఉపయోగపడతాయని అతను వ్యాఖ్యానించాడు.



"రజత్‌కు నా అభినందనలు. నీ ఆటతో ఎంతో మంది ఫ్యాన్స్‌ను ఆకట్టుకున్న నువ్వు ఈ హోదాకు అర్హుడవు. నువ్వు జట్టును ముందుకు తీసుకెళ్లగలవనే నమ్మకం ఉంది. -కోహ్లి

గత ఏడాదే నాకు కెప్టెన్సీపై ఆసక్తి ఉందా అని అడిగారు. ఐపీఎల్‌కు ముందు రాష్ట్ర జట్టుకు కెప్టెన్సీ చేయాలనుకుంటున్నట్లు చెప్పాను. ఇప్పుడు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉంది. నేను హడావిడి చేసే తరహా వ్యక్తిని కాదు కానీ మ్యాచ్‌లలో పరిస్థితులపై అవగాహన ఉంది. ఆటగాళ్లకు అండగా నిలిచి ఫలితాలు రాబడతా. టీమ్‌లో ఉన్న ఇతర ఆటగాళ్ల అనుభవమూ నాకు పనికొస్తుంది. ఇక కోహ్లినుంచి ఎంతో నేర్చుకునే అవకాశం ఉంది. అతని ఆలోచనలు, వ్యూహాలు కచ్చితంగా ఉపయోగించుకుంటా. -రజత్ పాటీదార్"

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పంచాయతీల బలోపేతంలో మనమే టాప్

- సామర్థ్యం పెంపు విభాగంలో దేశంలో నంబర్ వన్
- 100 పాయింట్లకుగాను 86.19 పాయింట్ల సాధన
- పంచాయతీ డెవల్యూషన్ ఇండెక్స్‌లో కేంద్రం వెల్లడి
- అన్ని విభాగాల్లో కలిపి రాష్ట్రానికి 55.10 పాయింట్లు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీలకు స్వయం పాలన కల్పించి, సామర్థ్యం పెంచటంలో (కెపాసిటీ ఎన్‌హాన్స్‌మెంట్) తెలంగాణ రాష్ట్రం అత్యధిక పాయింట్లు సాధించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. తాజాగా కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పంచాయతీ డెవల్యూషన్ ఇండెక్స్ (పీడీఐ)పై విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు ప్రకటించింది. పంచాయతీలకు అధికారాలు, బాధ్యతల బదలాయింపుతోపాటు జవాబుదారీతనం పెంచటంలో రాష్ట్రాల పనితీరు ఆధారంగా కేంద్రం ర్యాంకులు ఇస్తోంది. ఇందులో వివిధ విభాగాలుంటాయి. సామర్థ్యం పెంపు విభాగంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. మొత్తం 100 పాయింట్లకుగాను 86.19 పాయింట్లతో ప్రథమ స్థానం దక్కించుకుంది. తమిళనాడు 84.29 పాయింట్లతో రెండో ర్యాంక్, గుజరాత్ 83.96 పాయింట్లతో మూడో ర్యాంక్ సాధించాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) ఈ నివేదికను రూపొందించింది. 2013–14 నుంచి 2021–22 వరకు దేశవ్యాప్తంగా పంచాయతీలకు అధికారాలు, బాధ్యతల బదలాయింపు 39.9 శాతం నుంచి 43.9 శాతానికి పెరిగినట్టు ఈ సంస్థ పేర్కొంది.

వివిధ విభాగాల్లో నంబర్ వన్‌గా నిలిచిన రాష్ట్రాలు

విభాగం	రాష్ట్రం
సామర్థ్యం పెంపు	తెలంగాణ
విధులు, కార్యకలాపాలు	తమిళనాడు
ఆర్థిక అంశాలు	కర్ణాటక
విధుల నిర్వహణ	గుజరాత్
జవాబుదారీతనం	కర్ణాటక

2024లో టాప్-5 పీడీఐ రాష్ట్రాలు

1.కర్ణాటక 3.తమిళనాడు
2.కేరళ 4.మహారాష్ట్ర
5.ఉత్తరప్రదేశ్

మహిళా జడ్జిపై చెప్పు విసిరిన విచారణ ఖైదీ

నిందితుడిని చితకబాదిన న్యాయవాదులు

రంగారెడ్డి కోర్టులు: పలు కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఓ నిందితుడికి ఇటీవల జగద్గిరిగుట్ట ఠాణాకి సంబంధించిన కేసులో మహిళా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. మరో కేసులో అదే నిందితుడ్ని జైలు అధికారులు గురువారం సదరు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కేసు విచారిస్తున్న న్యాయమూర్తిపై నిందితుడు చెప్పు విసురుతూ న్యాయవాదులను దుర్భాషలాడాడు. దీంతో న్యాయవాదులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. కోర్టులో ఇలాంటి ఘటనలు జరగడంపై జడ్జీలు, న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో ప్రేమ పేరిట వల వేస్తున్న సైబర్ మోసగాళ్లు.. అవతలి వ్యక్తి తమ అధీనంలోకి వచ్చినట్టు గుర్తించిన తర్వాత అసలు మోసానికి తెరతీస్తున్నారు. పలు వెబ్‌సైట్‌లు, డేటింగ్ యాప్‌లు, మ్యాట్రిమోని వెబ్‌సైట్లలోని సమాచారాన్ని సేకరిస్తున్న సైబర్ కేటుగాళ్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడి ఎదుటి వారికి వలపు వల వేస్తున్నారు.

ఇందుకోసం వారి అభిరుచులకు తగ్గట్టుగా వ్యవహరించి మోసాలకు తెర తీస్తున్నారు. నగరంలోని ఒక సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ సంస్థ పరిశోధనలో ఇవే అంశాలు వెల్లడయ్యాయి. ఇలాంటి మోసాలకు పాల్పడే వారంతా విదేశాల్లో ఉంటూ మోసాలు చేస్తున్నారు. ఒంటరిగా ఉండే వృద్ధులు, మిలిటరీ ఉద్యోగులు, యువత ఇలా పలువర్గాలను ఈ తరహా మోసాలకు టార్గెట్‌గా ఎంచుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు.

సాక్షి, హైదరాబాద్

- అమాయకులను టార్గెట్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు
- దేశవ్యాప్తంగా 400% పెరిగిన స్పామ్ కాల్స్, ఈ–మెయిల్స్
- ఆన్‌లైన్ రొమాన్స్‌లో 39% మంది సైబర్ మోసగాళ్లే
- ఆన్‌లైన్‌లో అపరిచితులను నమ్మొద్దని హెచ్చరిస్తున్న నిపుణులు



39 % సైబర్ నేరగాళ్లే..

ఆన్‌లైన్‌లో ప్రేమ కోసం పరితపిస్తూ కొందరు డేటింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లలో తమ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి ఆన్‌లైన్‌లో జత కుడుతున్న వారిలో 39 శాతం మంది అవతలి వ్యక్తులు సైబర్ నేరగాళ్లే అన్న విషయం ఓ పరిశోధనలో వెల్లడైంది. అదేవిధంగా ఆన్‌లైన్ ప్రేమ పేరిట స్పామ్ ఫోన్‌కాల్స్, ఈ–మెయిల్స్‌లో దేశవ్యాప్తంగా ఇటీవల 400% పెరుగుదల ఉన్నట్టు తేలింది. ఇలా ఆన్‌లైన్‌లో ప్రేమ పేరుతో మోసగించేందుకు సైబర్ కేటుగాళ్లు మాటువేసి సిద్ధంగా ఉంటున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లు, డేటింగ్‌యాప్‌ల నుంచి ఫొటోలు, వీడియోలు, ఇతర వివరాలు సేకరిస్తున్న సైబర్ నేరగాళ్లు.. ఏఐ టూల్స్‌ను వాడి తప్పుడు గుర్తింపులు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు.

చిక్కకపోతే వారాలు.. నెలలు కూడా..

ముందస్తుగానే ఎదుటి వారి వివరాలు, వారి అభిరుచులు, బలహీనతలు తెలుసుకుంటున్న సైబర్ నేరగాళ్లు ఏఐ టూల్స్‌ను వాడి అందుకు తగిన విధంగా మెసేజ్‌లు తయారు చేస్తున్నారు. ఇలాంటి మెసేజ్‌లతో ఎదుటి వ్యక్తుల్లో నమ్మకాన్ని పెంచేందుకు అవసరమైతే వారాలు, నెలలు కూడా ఓపికగా చాటింగ్ చేస్తున్నారు. ఇలా ఒకసారి నమ్మకం కుదిరిన తర్వాత అసలు మోసానికి తెరతీస్తున్నారు. 'నా ఆరోగ్యం బాగా లేదు..ఆసుపత్రికి వెళ్లేందుకు డబ్బు కావాలి, మా కుటుంబ సభ్యుడు ఒకరు ఆసుపత్రిలో ఉన్నారు.. కొంచెం డబ్బులు సర్దు..తిరిగి ఇచ్చేస్తా..' అని సెంటిమెంట్ డైలాగ్‌లతో ఎదుటి వారి నుంచి డబ్బులు దండుకుంటున్నారు. మరికొందరు సైబర్ నేరగాళ్లు అతి ప్రేమలు నటిస్తూ..నాకు తెలిసిన ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టు..నీకు మంచి లాభాలు వస్తాయని ఊదరగొడుతూ..డబ్బులు దండుకుంటున్నారు. ఇలా వారు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు పడగానే..దాన్ని క్రిప్టోకరెన్సీగా మార్చుకుంటున్నారు. 'మీకు ఖరీదైన గిఫ్ట్ పంపుతున్నాను..కస్టమ్స్ క్లియరెన్స్ ఫీజులు చెల్లించి ఆ బహుమతులు తీసుకో' అంటూ కూడా మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి మోసాలు డేటింగ్ యాప్‌లకే పరిమితం కావడం లేదు. మ్యాట్రిమోని వెబ్‌సైట్లలోనూ 78 శాతం వరకు మహిళల పేరిట ఫేక్ ప్రొఫైల్స్‌ను తయారు చేస్తున్నట్టు అధ్యయనం వెల్లడించింది.

అపరిచితులను ఆన్‌లైన్‌లో నమ్మొద్దు..

ఆన్‌లైన్‌లో పరిచయం అయి.. తర్వాత ఆర్థిక అవసరాలను చూపుతూ డబ్బు డిమాండ్ చేసే వారిని నమ్మవద్దని సైబర్ భద్రతా నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ స్నేహాల్లో చాలావరకు మోసపూరితమైనవేనని గ్రహించాలని వారు గుర్తు చేస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు తీసుకునేందుకు ప్రయత్నించినా..ట్రేడింగ్ యాప్‌లలో పెట్టుబడుల పేరిట ఒత్తిడి తెచ్చినా అది మోసమని గుర్తించాలని హెచ్చరిస్తున్నారు.

ఆస్తి కోసం ఆగిన అంత్యక్రియలు

నాలుగు రోజులుగా ఫ్రీజర్‌లోనే తండ్రి మృతదేహం

- భూమి కోసం కొడుకు పట్టు.. ససేమిరా అన్న సవతి తల్లి.. గ్రామ పెద్దల జోక్యంతో గురువారం రాత్రి భూమి రిజిస్ట్రేషన్
- ఆ తరువాతే అంత్యక్రియలు పూర్తి
- జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతులలో ఘటన


ఫ్రీజర్‌లో ఇంటి ఎదుట యాదగిరి మృతదేహం

కొడకండ్ల: ఆస్తుల ముందు పేగుబంధం చిన్నబోయింది. సవతి తల్లి పేరున ఉన్న భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేస్తేనే తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తానని కుమారుడు పట్టుబట్టడంతో 4 రోజులపాటు మృతదేహాన్ని ఫ్రీజర్‌లోనే ఉంచిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎలికట్టె యాదగిరికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య రేణుక కుమారుడు రమేశ్. రెండో భార్య పద్మకు కుమారుడు ఉపేందర్, కుమార్తె ఉన్నారు. యాదగిరికి గ్రామంలో 15 ఎకరాల భూమి ఉండగా.. 5 ఎకరాలు మొదటి భార్య కుమారుడైన రమేశ్‌కు, 5 ఎకరాలు రెండో భార్య కుమారుడైన ఉపేందర్‌కు పంచి, మిగిలిన ఐదు ఎకరాలు తనవద్దే ఉంచుకున్నాడు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలో ఉపేందర్ మైనర్ కావడంతో తల్లి పద్మ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. యాదగిరి తన పేరుపై ఉన్న ఐదెకరాల భూమిలో మూడెకరాలు అమ్మి కూతురు వివాహం చేసి, రెండెకరాలు కట్నం కింద కూతురు పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. మూడేళ్ల క్రితం కుమారుడు ఉపేందర్ మృతి చెందడంతో అతడి వాటాకు వచ్చిన ఐదెకరాల భూమిలో తల్లి పద్మ మూడు ఎకరాలు అమ్మి కూతురుకు హైదరాబాద్‌లో ఇల్లు కొనిచ్చింది. యాదగిరి అనారోగ్యంతో ఈ నెల 10న మృతి చెందాడు. ఈ క్రమంలో మొదటి భార్య కుమారుడైన రమేశ్.. పద్మ పేరుపై ఉన్న రెండెకరాల భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేయడంతో అంత్యక్రియలు ఆగిపోయాయి. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులు కల్పించుకొని పద్మ పేరుపై ఉన్న భూమిని రమేశ్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేందుకు గురువారం ఆమెను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. తనను బలవంతంగా తీసుకొచ్చారని పద్మ ఆరోపిస్తూ తల తిరిగి పడిపోవడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. దీంతో ఇరువురు గ్రామానికి వెళ్లిపోయారు. అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులు ఒత్తిడి తేవటంతో రమేశ్ కుటుంబసభ్యులు వాగ్వాదానికి దిగారు. చివరకు రాత్రి 7.30 గంటల సమయంలో ఇరువురి మధ్య అంగీకారం కుదిరి తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. పద్మ ఎకరన్నర భూమిని రమేశ్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయటంతో యాదగిరి అంత్యక్రియలు నిర్వహించారు.

కొత్తరకం 'కొయ్యబొమ్మ'కు పేటెంట్

- ఆట వస్తువుగా, అలంకరణగా, బోధన పరికరంగా వాడుకొనే అవకాశం
- ఎఫ్‌డీడీఐ అధ్యాపకుడు రాంబాబు బృందం ఆవిష్కరణ




రాంబాబు

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ ముప్పిడి రాంబాబు మరో పేటెంట్ సాధించారు. ఇప్పటికే 9 పేటెంట్లు సాధించిన ఆయన.. ఇళ్లలో అలంకరణ వస్తువుగా వాడుకునే అందమైన కొయ్యబొమ్మలకు రూపకల్పన చేసి పదో పేటెంట్ (డిజైన్ నంబర్ 433484-001 తరగతి -11-20) సాధించారు. పంగ లకర్రపై రెండు పక్షులు ఎదురెదురుగా కూర్చొని ఉండే ఈ బొమ్మ ప్లే స్కూల్, ప్రాథమిక స్థాయి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు టీచింగ్ లెసన్స్‌గానూ ఉపయోగపడుతుందని రాంబాబు తెలిపారు. ఎఫ్‌డీడీఐలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లెదర్ గూడ్స్ యాక్సెసరీస్ డిజైన్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఈయన.. గుజరాత్‌లోని నిర్మా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణకుమార్‌యాదవ్, ఎలైట్ ఇంటర్నేషనల్ స్కూల్–హైదరాబాద్ ప్రతినిధి వనజతో కలిసి ఈ పేటెంట్ పొందారు. రాంబాబు బృందాన్ని ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు మా బృందం 21 డిజైన్లను రూపొందించగా 10 డిజైన్లకు పేటెంట్లు లభించాయి. 2025లోనే మూడో డిజైన్‌కు పేటెంట్ లభించింది' అని తెలిపారు.

ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరతాం: భట్టి

- విద్యుత్ సంస్కరణల పథకంలో చేరికపై స్పష్టతనిచ్చిన ఉప ముఖ్యమంత్రి.. విద్యుత్‌పై మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక పునర్వ్యవస్థీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో రాష్ట్రం చేరనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం రాత్రి ప్రజాభవన్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యుత్ శాఖ తీసుకుంటున్న చర్యలను, సాధించిన పురోగతిని వివరించారు. కేంద్రం 2021 ఆగస్టు 17న ప్రవేశపెట్టిన ఆర్డీఎస్ఎస్ పథకంలో రాష్ట్రం చేరినా, కేంద్రం పెట్టే షరతుల్లో భాగంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించే ప్రసక్తే లేదన్నారు. రామగుండంలో తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తామని తెలిపారు. గతంలో తాము పేర్కొన్నట్టు ఇందులో సింగరేణి సంస్థ భాగస్వామ్యం ఉండదన్నారు. ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 16,877 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశామని, రాష్ట్రం 21,398 మెగావాట్ల గరిష్ట విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని కలిగి ఉండడంతో ఇబ్బంది ఉండదన్నారు. రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ 2030 నాటికి 24 వేల మెగావాట్లు, 2035 నాటికి 31,809 మెగావాట్లకు పెరగనుందని అంచనా వేశామని చెప్పారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను తీర్చేందుకుగాను ఇటీవల న్యూ ఎనర్జీ పాలసీని ప్రకటించామన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విద్యుత్ సబ్సిడీల కింద గతేడాది డిస్కంలకు 18,615 కోట్లను చెల్లించినట్టు భట్టి వెల్లడించారు.

సమ్మక్క గద్దెపైనుంచి అమ్మవారిని తీసుకొని గుడికి వెళ్తున్న పూజారులు



భక్తి శ్రద్ధలతో వనదేవతల జాతర

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేవతల మినీ జాతర భక్తి శ్రద్ధల మధ్య సందడిగా సాగుతోంది. బుధవారం రాత్రి మేడారం, కన్నెపల్లి ఆలయాల నుంచి అమ్మవార్లతో గద్దెలకు చేరుకున్న పూజారులు రాత్రంతా జాగారం చేశారు. గురువారం పొద్దుపొడవక ముందే గద్దెల వద్ద నుంచి పూజారులు అమ్మవార్లను తీసుకొని మేడారం, కన్నెపల్లి ఆలయాలకు తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల తాకిడికి అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అమ్మవార్లను దర్శించుకుని చీర, సారె, ఇతర కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యాధులు నయం చేస్తామని మోసాలు

- నకిలీ మందులు విక్రయిస్తున్న క్లినిక్‌లలో డీసీఏ సోదాలు
- రెండు నకిలీ క్లినిక్‌లపై కేసు



సాక్షి, హైదరాబాద్: కిడ్నీలో రాళ్లు కరిగిస్తామని, జ్వరం, ఒళ్లు నొప్పులు తగ్గించే మందులిస్తామని తప్పుడు ప్రకటనలిస్తూ.. నకిలీ ఔషధాలు విక్రయిస్తున్న క్లినిక్‌ల్లో సోదాలు నిర్వహించినట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డీజీ కమలాసన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుండిగల్, గండిమైసమ్మతోపాటు హనుమకొండ పట్టణాల్లో బుధవారం జరిపిన సోదాల్లో రెండు నకిలీ క్లినిక్‌లను గుర్తించినట్టు తెలిపారు. ఈ సోదాల్లో స్టోనినిల్ డీఎస్ సిరప్‌లు, మహాసుదర్శన్ కాదా.. అనే రెండు రకాల సిరప్‌లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిందితులపై డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అబ్జక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్) యాక్ట్ 1954 ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శుక్రవారం। 14-2-2025

రెడీ అవుతున్న
వరంగల్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్


పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్

తొలి రెండు అంతస్తుల్లో కార్యాలయాలు రెండు నెలల్లో అందుబాటులోకి..	సాధ్యమైనంత తొందరగా మిగిలిన అంతస్తుల పనులు	అత్యాధునిక సాంకేతికతతో మరింత పకడ్బందీగా శాంతిభద్రతలు	అన్ని విభాగాల కార్యాలయాలు ఇక్కడి నుంచే నిర్వహణ	కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో క్షేత్రస్థాయిలో మరింత నిఘా

సాక్షి, వరంగల్: శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. పెద్ద పెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయి. ఇదే సిద్ధాంతంతో హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల భవన నిర్మాణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దడమే కాకుండా ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ (సీసీటీవీ కెమెరాల అనుసంధానం) సెంటర్లు ఏర్పా టు చేసి నేర నియంత్రణపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. వరంగల్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనుల విషయంలో అనుకున్నంత శ్రద్ధ కనబరచలేదు. ఫలితంగా మరో మూడు నెలలైతే నిర్మాణ పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు అవుతుంది. ప్రస్తుతమున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎప్పటికప్పు డు పర్యవేక్షిస్తుండడంతో కొద్ది నెలల నుంచి పనుల్లో వేగిరం పెరిగింది. మరో రెండు నెలల్లో జీప్లస్ 5 అంతస్తులతో కూడిన భవనంలోని తొలి రెండు అంతస్తులను పూర్తిస్థాయి మౌలిక వసతులతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నారు. పూర్తిస్థాయి భవనం అందుబాటులోకి రావాలంటే ఈ ఏడాది ఆఖరు వరకు సమయం తీసుకునే అవకాశముందని కిందిస్థాయి పోలీసులు చెబుతున్నారు. ఇందులోనే కమిషనర్ కార్యాలయం, డీసీపీలు, అడిషనల్ డీసీపీ, అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, కాన్ఫరెన్స్‌హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సిటీ స్పెషల్ డిపార్ట్‌మెంట్లు ఉంటాయి.

ఇక్కడి నుంచే 'కమాండ్'..

పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కావాల్సిన డేటా సెంటర్ పరికరాలను జర్మనీ, బెల్జియం నుంచి తెప్పించనున్నారు. ఇక్కడి నుంచే అన్ని సీసీ కెమెరాలను పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తారు. ఇందుకు ఓ ఫ్లోర్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నారు. మూడు విభాగాలుగా సీసీటీవీ కెమెరాలను బిగించనున్నారు. సిటీ వైడ్ సర్వైలెన్స్‌తోపాటు కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలను అనుసంధానించనున్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని ప్రధాన కూడళ్లతోపాటు పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాలు అనుసంధానించడం ద్వారా ఎక్కడేం జరిగినా ఇట్టే తెలిసిపోతుంది. ఈ సెంటర్ ద్వారా ఏదైనా నేరం జరిగిన సందర్భంలో నిందితులను పట్టుకునేందుకు సమన్వయం చేసే వీలుంటుంది. శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. 2017 మే 29న రూ.50 కోట్ల వ్యయంతో వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత పనులు నింపాదిగా సాగడం, కరోనా రావడంతో కొన్ని నెలలపాటు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత పోలీస్ కమిషనర్లు తరుణ్‌జోషి, ఏవీ రంగనాథ్‌తోపాటు ప్రస్తుత పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాస్త దృష్టి సారించడంతో నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు వచ్చాయి. సాధ్యమైనంత తొందరలోనే తొలి రెండు అంతస్తుల్లో కార్యకలాపాలు ప్రారంభమవుతాయి'అని ఓ పోలీసు అధికారి తెలిపారు.

న్యాయమూర్తులకు పటిష్ట భద్రత కల్పించాలి

మహిళా న్యాయమూర్తిపై దాడిని ఖండించిన న్యాయమూర్తుల సంఘం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్ కోర్టులో మహిళా న్యాయమూర్తిపై ఒక నేరస్తుడు దాడి చేయడాన్ని తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కె.ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి అదనపు జిల్లా జడ్జి కె.ము రళీ మోహన్, వైస్ ప్రెసిడెంట్లు శ్రీసుదర్శన్, శ్రీవాణి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. విచారణ సందర్భంగా మహిళా జిల్లా, సెషన్స్ జడ్జిపై నిందితుడు దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ట్లు పేర్కొన్నారు. కరడుగట్టిన నేరస్తుల కేసులు నిత్యం విచారించే న్యాయమూర్తుల భద్రతకు ఉన్న తాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళా జడ్జి ఇటీవలే.. హత్యాయత్నం కేసులో సదరు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారని వెల్లడించారు. గురువారం ఇతర క్రిమినల్ కేసు విచారణ సందర్భంగా.. అకస్మా త్తుగా ఓపెన్ కోర్టులో మహిళా జడ్జిపై దాడి చేశాడని పేర్కొన్నారు. తనను శిక్షించినందుకు తీవ్ర పరిణా మాలు ఉంటాయని న్యాయమూర్తిని బెదిరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జ్యుడీషియల్ అధికా రులు ఎలాంటి భయం లేకుండా విధులు నిర్వహించేందుకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు.

విశ్వసనీయ మిత్రుడిగా రేడియో కొనసాగింది

- విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్వీ చంద్రవదన్
- పీఆర్‌సీఐలో ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, యువత, వృద్ధులకు విశ్వసనీయ మిత్రుడిగా రేడియో నిలిచిందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్‌వీ చంద్రవదన్ వ్యాఖ్యానించారు. గురువారం పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ)లో జరిగిన ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సామాజిక చైతన్యం, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంలో రేడియో ముఖ్యపాత్ర పోషిస్తుందనే అంశంపై మాట్లాడుతూ.. రేడియో వినోదం, సమాచారం, విద్య అందించే విశ్వసనీయ మాధ్యమంగా సమాజంలో ప్రాధాన్యత పొందిందని, అనేక అంశాలను ప్రజలకు చేరువ చేసిందని గుర్తు చేశారు. రేడియో ఘనతను పరిరక్షించేందుకు, దాని ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రఖ్యాత సముదాయ రేడియో నిపుణుడు ప్రొఫెసర్ వినోద్ పవరాల, ఆకాశవాణి హైదరాబాద్ హెచ్‌ఓడీ రమేశ్ సుంకసరి, పీఆర్‌సీఐ ఉపాధ్యక్షుడు రవీంద్రన్, మైకేల్ ఫ్రెడ్రిక్, పీఆర్‌సీఐ దక్షిణ ప్రాంతాధిపతి టీవీఎస్ నారాయణ తదితరులు మాట్లాడుతూ, రేడియోను ఆధునిక సాంకేతికతలతో సమన్వయం చేసుకుంటూ, దాని ప్రభావాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధికార ప్రతినిధి ముఖేశ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: సామాజికంగా వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబనకు జన్‌ధన్ ఖాతాలు, విశ్వకర్మ యోజన, ఉపాధి అవకాశాల కల్పన పథకాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ ముఖేశ్ కుమార్ పేర్కొన్నారు. జనధన్ యోజన ద్వారా వివిధ వర్గాలకు ఆర్థిక స్వావలంబన, విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఆయన గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ సమాజ సేవకుడు, హిందూ ధర్మ పరిరక్షకుడిగా జీవితాంతం సామాజిక సమానత్వం, అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేశారని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరురోజుల పాటు జిల్లా, మండల స్థాయిలో ఆయన బోధనలను ప్రచారం చేయనున్నట్లు వెల్లడించారు.



కిషన్‌రెడ్డికి మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కృతజ్ఞతలు

సాక్షి, న్యూఢిల్లీ: మాదిగల రిజర్వేషన్ పోరాటానికి తొలి నుంచీ సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) జాతీయ మాజీ అధ్యక్షుడు లింగస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు గురువారం ఢిల్లీలోని కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. వర్గీకరణపై సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసినప్పటి నుంచి.. తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందేవరకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అందించిన సహకారాన్ని మాదిగ జాతి మరువదని లింగస్వామి పేర్కొన్నారు.

నగరాన్ని తలదన్నేలా మునిపల్లి..

గేటెడ్ కమ్యూనిటీలా పల్లెటూరు

శుభ్రమైన రోడ్లు, పచ్చదనం, వీధులకు నంబర్లు .. ఆకట్టుకునే భవనాల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరాలు, పెద్ద పట్టణాల్లో గేటెడ్ కమ్యూనిటీ సంస్కృతి ఎక్కువగా కనిపిస్తోంది. కానీ నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామం గేటెడ్ కమ్యూనిటీ వాతావరణాన్ని తలపిస్తోంది. గ్రామంలోని ప్రధానమైన ప్రాంతంలో వెళ్తున్నప్పుడు.. నగరంలో ఉన్నామన్న భావన కలుగుతుంది. ఇక్కడ ప్రతి వీధికి నంబర్లు కేటాయించి బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ తారురోడ్లుగా వేశారు. రోడ్లన్నిటినీ పరిశుభ్రంగా ఉంచుతున్నారు. మొక్కలు, చెట్ల పెంపకం, నిర్వహణ ఆకట్టుకుంటోంది. గ్రామంలో భవనాలను నగరాల మాదిరిగా మంచి ఆర్కిటెక్చర్‌తో నిర్మించడం విశేషం. చాలా ఇళ్లకు సౌర విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు సొంతంగా తమ సంఘం కోసం భారీ భవనం నిర్మించుకున్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెలకు ఇచ్చారు. గ్రామంలో అన్నీ రైతు కుటుంబాలే అయినప్పటికీ.. పిల్లలను ఉన్నత విద్య చదివిస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి బాగా లోపలికి ఉన్న ఈ గ్రామం ఆద్యంతం గేటెడ్ కమ్యూనిటీని తలపిస్తూ ఆకట్టుకుంటోంది.


మునిపల్లి గ్రామంలో రైతుసంఘం భవనం


మునిపల్లిలోని పరిశుభ్రమైన రోడ్డు


సోలార్ ఫెన్సింగ్‌తోపాటు ఆకట్టుకునేలా భవనాలు


ఓ వీధిలోని రోడ్డు ఇది..


సహకారసంఘం ఆధ్వర్యంలోని షాపింగ్ కాంప్లెక్స్

సచివాలయంలో ఉచిత వైద్య శిబిరం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ ప్రారంభించారు. శిబిరంలో భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో ఐదు విభాగాల వైద్య నిపుణులు సహా 35 మందితో కూడిన బృందం.. 8 రకాల పరీక్షలు నిర్వహించింది. వైద్య శిబిరాన్ని నిర్వహించిన సచివాలయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్, కార్యవర్గ సభ్యులకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలతో రైతుల్లో గందరగోళం

బీఆర్‌ఎస్ నేత దూదిమెట్ల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రైతులు గందరగోళానికి గురవుతున్నారని బీఆర్‌ఎస్ నేత దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ఆరోపించారు. ఆయన గురువారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలు చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే వారికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

పుదుచ్చేరి పర్యటనకు రండి

ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డికి ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే తమ రాష్ట్రంలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను వచ్చే ఎన్నికల కోసం సిద్ధమయ్యేలా మార్గదర్శనం చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డిని.. ఆ రాష్ట్ర హోంశాఖ మాజీ మంత్రి కందస్వామి కోరారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన ప్రజాభవన్‌లో చిన్నారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కందస్వామి మాట్లాడుతూ.. పుదుచ్చేరి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చిన్నారెడ్డి అచ్చివచ్చిన నాయకుడన్నారు. ఆయన ఇన్‌చార్జిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలోనే తమ రాష్ట్రానికి రావాలని చిన్నారెడ్డిని ఆయన ఆహ్వానించారు. వీలున్నంత త్వరలోనే వస్తానని, పార్టీ కేడర్, లీడర్లతో సమావేశమవుతానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. భేటీలో టీపీసీసీ ఓబీసీ సెల్ సమన్వయకర్త విక్రమ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులివ్వాలి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య డిమాండ్

సాక్షి, హైదరాబాద్: త్వరలో ప్రవేశపెట్టబోయే 2025–26 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో.. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని బీజేపీ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యాశాఖాభివృద్ధికి, టీచర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని గురువారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు విద్యార్థులకు ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం, విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ చేసిన వాగ్దానం ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులు, ఇతర బకాయిలు విడుదల చేయాలని కోరారు.

కులగణన, వర్గీకరణపై కాంగ్రెస్ నేతలకు అవగాహన కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పార్టీ నాయకుల ద్వారా ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం ఈ అవగాహన కార్యక్రమం ఉద్దేశమని పార్టీ పేర్కొంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కులగణన జరిగిన తీరును, వర్గీకరణ ఉద్దేశాలను నాయకులకు వివరించాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఇతర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

నామినేషన్ తిరస్కరణ చెల్లదు

హైకోర్టులో 'ఎమ్మెల్సీ' అభ్యర్థి శ్రీహరి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ నియోజకవర్గం నుంచి పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు తన నామినేషన్ తిరస్కరణను సవాలు చేస్తూ అభ్యర్థి పోచబోయిన శ్రీహరి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం 2025, ఫిబ్రవరి 10న దాఖలు చేసిన నామినేషన్‌ను రూ.10 వేల సెక్యూరిటీ డిపాజిట్, ఫారమ్–26తో సహా సమర్పించానని శ్రీహరి పేర్కొన్నారు. దీనిపై మొదట సంబంధిత అధికారులు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదించారని, అయితే ఫిబ్రవరి 12న కరీంనగర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తన నామినేషన్‌ను తిరస్కరించారని చెప్పారు. అఫిడవిట్ సమర్పణలో వ్యత్యాసాలున్నాయంటూ తిరస్కరించినట్లు చెప్పారు. తిరస్కరణకు కారణాలు నిరాధారమైనవని, నామినేషన్ సమర్పణ సమయంలో ఇచ్చిన సూచనలకు విరుద్ధంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారిని ఆశ్రయించినట్లు వెల్లడించారు. పునఃపరిశీలన కోరినా అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానన్నారు. తన నామినేషన్‌ను ఆమోదించి, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్–2 నియోజకవర్గాలకు జరిగే గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

కుట్రపూరితంగానే తప్పుడు కులగణన

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉన్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తమ ప్రభుత్వ వైఫల్యాన్ని స్వయంగా అంగీకరించారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వ తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వం అన్నింటా అభాసుపాలవుతోందన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కనీసం సర్వేను కూడా సక్రమంగా చేయలేని ప్రభుత్వం మంచి పాలన ఎలా అందిస్తుందని ప్రశ్నించారు. కులగణనను కుట్రపూరితంగా తప్పుల తడకగా మార్చారని, అందుకే ప్రజల నుంచి రీసర్వే చేయాలనే డిమాండ్ బలంగా వచ్చిందని పేర్కొన్నారు. అయితే రీసర్వే పేరిట మరో నాలుగు పేజీలు జోడించి నామమాత్రంగా పూర్తి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సర్వేలో తప్పుల గురించి తాము మొదటి నుంచీ ఎత్తిచూపుతూ వస్తున్నా ప్రభుత్వం కనీసం సవరించుకునే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. నిపుణులతో డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, రీసర్వే చేస్తేనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధ్యమవుతుందని చెప్పారు.

'ఇందిరమ్మ ఇళ్ల' పేరుతో ఇసుక దందా

బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి పాలనలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక పేరుతో టన్నుల కొద్దీ ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. అక్రమ ఇసుక దందా పెరగడంతో రాష్ట్రానికి ఆదాయం తగ్గిందన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుకపై ఏటా రూ.800 కోట్ల మేర ఆదాయం వచ్చిందని, కాంగ్రెస్ హయాంలో రూ.200 కోట్ల మేర ఆదాయం తగ్గిందని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రావలసిన ఇసుక ఆదాయం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి జేబులోకి వెళ్తూ రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీతో పాటు కొన్ని ప్రాజెక్టుల దగ్గర నీళ్లు ఖాళీచేసి మరీ ఇసుక తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది పనులతో పాటు ప్రైవేట్ కన్సల్టెంట్ నియామకానికి రూ.92.20 కోట్లతో పరిపాలన అనుమతులను మంజూరు చేశారు.

రవాణా వాహనాలపై పరిమితులు ఉపసంహరించాలి

సాక్షి, అమరావతి: పన్నెండేళ్ల కాలం దాటిన రవాణా వాహనాలపై పరిమితులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర లారీ యజమానుల సంఘం కోరింది. లారీ యజమాని, డ్రైవర్ ఒకరే అయిన వారు ఈ నోటిఫికేషన్ అమలులోకి వస్తే ఉపాధి అవకాశాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అఖిలభారత మోటారు ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు, ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో కోరారు.

స్వామిమలైలో పవన్ పూజలు

సాక్షి, చెన్నై: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురువారం తంజావూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన స్వామిమలై మురుగన్ ఆలయం, ఆది కుంబేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ దక్షిణాదిలోని ఆలయాల సందర్శనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీన్లోభాగంగా గురువారం స్వామి మలైను సందర్శించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై చంద్రబాబు వైఖరి చెప్పాలి

సాక్షి, అమరావతి: వక్ఫ్ సవరణ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు పార్లమెంటులో ఈ బిల్లును వ్యతిరేకించకుంటే తగిన గుణపాఠం చెబుతామని గురువారం ఓ ప్రకటనలో తేల్చి చెప్పారు. వక్ఫ్ సవరణల పేరుతో ముస్లింల ఆస్తులను కబళించే దుర్మార్గపు చర్యలకు ఎన్డీఏ ప్రభుత్వం పాల్పడుతోందని తెలిపారు.

కోనసీమ ప్రభల తీర్థాన్ని రాష్ట్రోత్సవంగా ప్రకటించాలి

సాక్షి, అమరావతి: కోనసీమ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించాలని సృజనాత్మకత సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ప్రభల తీర్థ విశిష్టతను వివరించారు.

ఎస్ఏఎస్‌సీఐ కింద ఏపీకి రూ.172 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు రూ.172.35 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పర్యాటక శాఖ వెల్లడించింది. స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్ఏఎస్‌సీఐ), డెవలప్‌మెంట్ ఆఫ్ ఐకానిక్ టూరిజం సెంటర్స్ టు గ్లోబల్ స్కేల్ కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తాన్ని ఇచ్చినట్లు పేర్కొంది. గండికోట అభివృద్ధికి రూ.77.91 కోట్లు, అఖండ గోదావరి ప్రాజెక్టు కింద రూ.94.44 కోట్లు మంజూరు చేశామని వివరించింది.

రాష్ట్రంలో రాక్షస రాజ్యం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాక్షస రాజ్యం బుసలు కొడుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. వంశీ అరెస్టు అక్రమమని అన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని హౌస్ అరెస్టు సరైంది కాదని చెప్పారు. 'రాష్ట్రంలో రాతియుగం నాటి పాలన సాగుతోంది. కోర్టులు, చట్టాలు అంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదు. బాధితుల మీదనే తిరిగి కేసులు పెట్టే దారుణమైన పరిస్థితి ఏర్పడింది. కొందరు పోలీసులు చట్ట వ్యతిరేకంగా పని చేస్తున్నారు. మానవ హక్కులను కాలరాస్తున్నారు. గన్నవరంలో టీడీపీ ఆఫీసుపై దాడి చేసింది వారి పార్టీ కార్యకర్తలే. కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు పెట్టారు. తనతో తప్పుడు కేసు పెట్టించారని సత్యవర్ధన్ కోర్టులో జడ్జి ముందే చెప్పాడు. సత్యవర్ధన్ ఎస్సీ అని ఆయన్ని వేధిస్తున్నారు. అరెస్టులతో వైఎస్సార్‌సీపీని భయపెట్టలేరు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని నాశనం చేయొద్దు. చట్టాలు, రాజ్యాంగాన్ని గౌరవించండి' అని చంద్రశేఖర్ హితవు పలికారు.

రజనీ తదితరులపై కేసులో వివరాలు సమర్పించండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం..

సాక్షి అమరావతి: చిలకలూరిపేట పట్టణ పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజనీ, ఆమె పీఏలు నాగశెట్టి జయ ఫణీంద్ర, రామకృష్ణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై గురువారం విచారణ జరిపిన హైకోర్టు, పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

మన్యంలో.. గజ ఘీంకారం..!

- నాగావళి, వంశధార, జంఝావతి నదీతీరాల వెంబడి గజరాజుల తిష్ట
- తరచూ పంటలు, ఆస్తులు, ప్రజల ప్రాణాలకు నష్టం
- 3,500 ఎకరాల్లో పంటలకు దినదిన గండం
- రూ.కోట్లలో నష్టాలు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న మన్యం జిల్లా ప్రజలు
- ఎన్నికల ముందు గజరాజుల తరలింపునకు వాగ్దానం చేసిన కూటమి నేతలు



ఇటీవల భామిని మండలం ఘనసర వద్ద ఎమ్మెల్యే, అధికారుల ముందు బైఠాయించిన బాధిత రైతులు(ఫైల్)

పాలకొండ రూరల్/భామిని: మన్యం జిల్లాలో గజరాజుల ఘీంకారాలు నిత్యకృత్యమయ్యాయి. వీటి సంచారంతో ప్రజలు తమ ప్రాణాలు, పంటలు, ఆస్తులు కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. అడవుల రూపు కోల్పోతుండడంతో ఏనుగుల మనుగడ కష్టమై జనావాసాల వైపు దూసుకు వస్తున్నాయి. ఆహారం కోసం పంట పొలాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో సాగు పొలాలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఫలితం దక్కడం లేదు. మరోవైపు ఆస్తులు, ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఎన్నికల ముందు ఏనుగుల తరలింపుపై కూటమి నేతలు స్పష్టమైన హామీలిచ్చి...నేడు వాటిని మరవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి పరీవాహక ప్రాంతాల వెంబడి గజరాజులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిని కట్టడి చేసే క్రమంలో అధికారిక యత్నాలు ఆశించిన ఫలితం ఇవ్వడం లేదు. దీంతో బాధిత గ్రామాల ప్రజలు తమకు పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలని అటు ప్రజాప్రతినిధులను, ఇటు అధికారులను కోరుతున్నారు.

గ్రామాల్లో కునుకు కరువు

జిల్లాలో సువిశాలంగా విస్తరించి ఉన్న ఏజెన్సీ, నాగావళి, వంశధార, జంఝావతి నదీతీర పరివాహక ప్రాంతాల వెంబడి గజరాజుల గుంపులు తిష్ట వేసాయి. పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట పరిసరాల్లో నాలుగు ఏనుగులు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తున్నాయి. పార్వతీపురం రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలో కురుపాం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో నిత్యం సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపు అక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులు సేద్యం చేస్తున్న అరటి, బొప్పాయి, మొక్కజొన్న, చెరకు, వరి, పామాయిల్, కర్బూజ, మామిడి, జీడి పంటలతో పాటు ఇతర ఆహార, వాణిజ్య పంటలను నాశనం చేస్తున్నాయి. జిల్లా పరిధిలో సుమారు 3,500 ఎకరాల మేర పంటలు ఏనుగుల సంచారంతో తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రూ.కోట్లలో నష్టం సంభవిస్తున్నా... ఇందుకు సంబంధించిన పరిహారం నేటికీ అందించలేదు.

కుంకీ ఏనుగులు ఎక్కడ?

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనుగుల సమస్యను అధిగమించేందుకు తాము కట్టిబడి ఉన్నామని కూటమి నాయకులు బహిరంగ సభల్లో వెల్లడించారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాడు కుంకీ ఏనుగులు తీసుకువస్తామన్నారు. వాటి సహాయంతో ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపులు తరలింపునకు చర్యలు చేపడతామన్నారు. నేటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీ జంతి కొండ వద్ద ఎలిఫ్యాంట్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వ పెద్దల హామీలపై బాధితుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరణ మృదంగం

గజరాజుల సంచారంతో గడిచిన కొద్ది సంవత్సరాల్లో 13 మంది మృత్యువాత పడ్డారు. 12 పశువులు మృతి చెందినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీటితో పాటు వ్యవసాయ బోర్లు, పంపు షెడ్లు, పరికరాలను, డ్రిప్ పైపులను నాశనం చేసాయి.

పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలి...

ఇటీవల పాలకొండ నియోజకవర్గం భామిని మండలం ఘనసర వద్ద ఏనుగుల కారణంగా రైతులు నష్టపోయిన పంటలను అంచనా వేసేందుకు వచ్చిన అటవీ శాఖ అధికారుల వద్ద బాధిత రైతులు తీవ్రంగా స్పందించారు. తరచూ నష్టాల అంచనాలు నమోదు చేయడం తప్ప చేసేదీ ఏమీ లేదంటూ నినాదాలు చేసారు. తమకు పరిహారం వద్దని, శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, ఎమ్మెల్యే జయకృష్ణను చుట్టుముట్టారు. బైఠాయించి నిరసన తెలిపారు.

ఏనుగులు మళ్లీ వచ్చేశాయ్...

జియ్యమ్మవలస: మండలంలోని జోగిరాజుపేట, బట్లబద్ర, కన్నపుదొరవలస, వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలోకి గురువారం సాయంత్రం ఏనుగులు మళ్లీ వచ్చాయి. రాత్రి పూట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచించారు. ప్రస్తుతం జోగిరాజు పేట వద్ద ఉన్నాయని, రాత్రి సమయానికి బిత్రపాడు, బాసంగి తదితర పంట పొలాలలోకి వచ్చే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



గుచ్చిమి వద్ద స్థల పరిశీలన చేస్తున్న జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన

రెండెకరాల్లో జొన్న పంట నాశనం



నా సొంత భూమితో పాటు మరో ఎకరా భూమిని కౌలుకు తీసుకుని రెండెకరాల్లో మొక్కజొన్న సేద్యం చేపట్టాను. అప్పులు చేసి మదుపులు పెట్టాను. కుటుంబమంతా కష్టపడ్డాం. కీలక దశలో ఏనుగుల గుంపు దాడి చేయటంతో పూర్తిగా పంట నష్టపోయాను. నష్టపోయిన పంటను చూసేందుకు పొలంకు వెళ్లాలన్నా భయం వేస్తుంది. ఏ క్షణం ఏనుగులు దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటున్నాం. నష్ట పరిహారాలు ఎందుకు? ఈ ప్రాంతం నుంచి వాటిని తరలిస్తే మేలు.

– వలరౌతు లక్ష్మీనారాయణ, రైతు, ఘనసర, భామిని మండలం

నిరంతరం నిఘా

ఏనుగుల కదలికలపై మా సిబ్బంది నిరంతరం దృష్టి సారిస్తున్నారు. అవి సంచరించే పరిసరాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు గుచ్చిమి వద్ద ఏర్పాట్లు చేపట్టనున్నాం. ఇందుకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు వచ్చాయి. రూ.5 కోట్లతో సోలార్ కంచె, ట్రెంచులు, వెదురు వనాలు, నీటి సంపులు, ఇతర వసతులు ఏనుగుల కోసం సిద్ధం చేయాలని నిర్ణయించాం. తొలి దశలో రూ.కోటి నిధులుతో పనులు చేపడతాం. పంట నష్టాలకు సంబంధించి దాదాపు మూడు వేల మంది రైతులకు రూ.45లక్షలు వరకు జమ చేశాం. రెండు మూడు రోజుల్లో సదరు రైతుల ఖాతాకు ఈ మొత్తాలు పూర్తిగా జమ కాబడతాయి. కుంకీ ఏనుగులను తీసుకువచ్చే విధంగా అడుగులు పడుతున్నాయి.

– జీపీఏ ప్రసూన, అటవీ శాఖాధికారిణి

కౌలు రైతులకు పంట రుణాలపై కాకి లెక్కలు

పూర్తి వివరాలు బహిరంగ పర్చాలని కౌలు రైతుల సంఘం డిమాండ్



సాక్షి, అమరావతి: కౌలు రైతులకు పంట రుణాల విషయంలో కాకిలెక్కలతో బ్యాంకర్లు రైతులను మోసగిస్తున్నారని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏ కాటమయ్య, పి. జమలయ్య గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. అక్టోబర్ నాటికి 61వేల మందికి రూ.999 కోట్ల రుణాలిచ్చినట్లు చెప్పిన బ్యాంకర్లు, డిసెంబర్ నెలాఖరు నాటికి ఏకంగా 2.14 లక్షల మందికి రూ.3,826 కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కౌలు రైతులకు 2024 డిసెంబరు 31 నాటికి మొత్తం రూ.4వేల కోట్లు పంట రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, 96 శాతం లక్ష్యం సాధించామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఉదాహరణకు జనవరి18 నాటికి గుంటూరు జిల్లాలో 40వేల మందికి సీసీఆర్సీ కార్డులివ్వగా, కేవలం 5 వేల మందికి రూ.36 కోట్ల పంట రుణాలిచ్చామని బ్యాంకు అధికారులే తెలిపారని పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో జనవరి 17 నాటికి 68,090 మందికి కార్డులివ్వాలని లక్ష్యం పెట్టుకుని, 59,967 మందికి ఇచ్చారని, కేవలం 15వేలమందికి రూ.63 కోట్లు, ఏలూరు జిల్లాలో 64 873 కౌలు కార్డులివ్వగా, 22780 మందికి రూ.140 కోట్లు రుణాలు ఇచ్చారని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మందికి కౌలుగుర్తింపు కార్డులిస్తే 23 వేలమందికి రూ.105 కోట్లు, కృష్ణా జిల్లాలో 6వేల మందికి రూ.23 కోట్లు ఇచ్చారని తెలిపారు. అలాంటప్పుడు ఏ విధంగా 2.14 లక్షల మందికి 3,826 కోట్లు ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లాల వారీగా ఎంతమంది కౌలురైతులకు రుణాలు ఇచ్చారో ఆ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

'కోనసీమ'లో బర్డ్ ఫ్లూ కలవరం

- పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో గుడ్డు, చికెన్ నిలిపివేత



ముమ్మిడివరంలో నిల్వ మాంసాన్ని భూమిలో పాతిపెడుతున్న నగర పంచాయతీ సిబ్బంది

సాక్షి, అమలాపురం: తూర్పు గోదావరి జిల్లాలో మొదలైన బర్డ్ ఫ్లూ దెబ్బ కోనసీమ జిల్లాలోని కోళ్ల పెంపకందార్లను, అమ్మకందార్లను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ జిల్లాలో వైరస్ జాడ లేకున్నా అమ్మకాలపై ప్రభావం పడుతోంది. కోడి మాంసం, కోడి గుడ్డు అమ్మకాలను అధికారులు నిషేధించారు. దీంతో పాటు మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్డు ఇవ్వరాదని నిర్ణయించారు. జిల్లాలో 18 కమర్షియల్ పౌల్ట్రీ ఫామ్‌లు ఉండగా వీటిలో 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయి. వీటిలో 5 లక్షల వరకూ బ్రాయిలర్ ఫామ్‌లు కాగా, మిగిలినవి లేయర్ (గుడ్డు పెట్టే) కోళ్లు. జిల్లాలో రోజుకు 30 నుంచి 35 టన్నుల కోడి మాంసాన్ని వినియోగిస్తారని అంచనా. బర్డ్ ఫ్లూ పుణ్యమా అని జిల్లావ్యాప్తంగా కోడి మాంసం విక్రయాలు గురువారం నుంచి దాదాపు నిలిచిపోయాయి. ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకంలో కోడి గుడ్డు నిలిపివేయాలని జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు జిల్లా నలుమూలలా 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, ఇతర ప్రాంతాల నుంచి కోళ్లు రాకుండా అడ్డుకుంటున్నారు. ఇటు గుడ్డు ధర కూడా తగ్గనుంది. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్ల సరఫరా నిలిపివేయడంతో స్థానికంగా వినియోగం తగ్గి ఆ ప్రభావం ధరపై పడుతుందని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు.

'నిమ్మల' నియోజకవర్గంలో కాలువల్లో పూడికతీతకు రూ.37.63 కోట్లు

- జలవనరుల శాఖ పరిపాలన అనుమతి జారీ
- మిగతా ప్రాంతాల్లో కాలువల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్న డెల్టా రైతులు

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గంలో సాగునీటి కాలువల మరమ్మతులు, పూడికతీత వంటి 99 పనులు చేపట్టేందుకు రూ.37.63 కోట్లతో ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. గోదావరి పశ్చిమ డెల్టాలో అంతర్భాగంగా పాలకొల్లు నియోజకవర్గంలో డ్రైనేజీ విభాగం పరిధిలో 31 పనులు, గోదావరి పశ్చిమ డివిజన్ పరిధిలో 68 పనులు చేపట్టడానికి రూ.37.78 కోట్లు మంజూరు చేయాలని గత ఏడాది డిసెంబర్ 20న ఈఎన్‌సీ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. దాన్ని పరిశీలించిన ప్రభుత్వం 99 పనులు చేపట్టడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.37.63 కోట్లతో ఆ పనులు చేపట్టడానికి అనుమతిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి డెల్టా పరిధిలో 10.09 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువలు అస్తవ్యస్తంగా మారడం, పూడిక తీయకపోవడం, కనీసం గుర్రపుడెక్కను కూడా తొలగించకపోవడం వల్ల రబీ సీజన్‌లో ఆయకట్టుకు సక్రమంగా నీళ్లందకపోవడాన్ని గోదావరి డెల్టా రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేవలం మంత్రి నిమ్మల ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజవకర్గంలో మాత్రమే కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై గోదావరి డెల్టా రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో కాలువల మరమ్మతులు, పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు మాటేంటని ప్రశ్నిస్తున్నారు.

పీఎఫ్ అక్రమాలపై విచారణ చేపట్టండి: ఆప్టా

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా, మండలంలో పనిచేసే ఉపాధ్యాయల వేతనాల నుంచి తగ్గించిన పీఎఫ్ డబ్బులు... ఖాతాల్లో జమ కాలేదని, దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం (ఆప్టా) డిమాండ్ చేసింది. 2021 డిసెంబర్‌లో ఉపాధ్యాయుల వేతనాల నుంచి రూ.7,46,500 నగదు పీఎఫ్ కోసం మినహాయించినట్టు ఆప్టా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాశ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని కర్నూలు జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్‌కు జమ చేయాల్సి ఉన్నా అలా చేయలేదని, దీనిపై దర్యాప్తు చేయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్కూల్ కాంప్లెక్స్ సమయాల్లో మార్పు సరికాదు

స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ సమయాల్లో మార్పు సరికాదని, గతంలో ఉన్నట్టుగానే నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు వెళ్లడం కష్టంగా ఉంటోందని, సమావేశాలు ఉన్న రోజుల్లో పాఠశాలలకు పూర్తి స్థాయిలో సెలవు ప్రకటించాలని కోరారు.

సగం రోజు కాంప్లెక్స్ సమావేశాలతో ఉపయోగమేంటి? ఆపస్

ప్రతినెలా మూడో శనివారం సగం రోజు మాత్రమే స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్ నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఏకపక్షంగా ప్రకటించడం సరికాదని, దీనివల్ల ఉపయోగమేంటని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ ప్రశ్నించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అపోహలతో ఆందోళన వద్దు

- వలస పక్షులతోనే బర్డ్‌ఫ్లూ వ్యాధి
- ఉష్ణోగ్రతలు పెరిగితే వ్యాధి లక్షణాలు తగ్గుతాయి
- వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సీహెచ్. శ్రీలత

తిరుపతి సిటీ: బర్డ్‌ఫ్లూ వ్యాధితో ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, అప్రమత్తత, నివారణా చర్యలతో కట్టడి చేయవచ్చని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్. శ్రీలత తెలిపారు. గురువారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిని అవియన్ ఇన్ఫ్లుయన్జా అంటారని, శీతాకాలంలో తక్కువ ఉష్ణోగ్రతల్లో పక్షులు, కోళ్లకు ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కోళ్లలో శ్వాసకోశ లక్షణాలు కనిపిస్తాయని, వలస పక్షులతోనే వ్యాధి సంక్రమణ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. విదేశాల నుంచి వచ్చే వలస పక్షుల రెక్కలు నీళ్లలో పడి ఆ నీళ్లను కోళ్లు తాగడం వల్ల ఈ వ్యాధి అధికమవుతుందని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరిగితే వ్యాధి లక్షణాలు క్రమంగా తగ్గుముఖం పడతాయన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాధికి టీకా లేనందువల్ల నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. వ్యాధి సోకిన కోళ్ల ఫారాల నుంచి రవాణాను అరికట్టడం, పౌల్ట్రీల్లో పనిచేసే వ్యక్తులు పీపీఈ కిట్లను ఉపయోగించడం, మరణించిన కోళ్లను పూడ్చిపెట్టడం, విధిగా బ్లీచింగ్ వాడాలని సూచించారు.



ఆధ్యాత్మిక సమాచారం

ఘనంగా జన్మనక్షత్ర పూజలు

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని స్వామివారికి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున 2 గంటలకు ఆలయం తెరచి స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్టులకు, శివలింగానికి పంచామృతాలతో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

కోటప్పకొండ తిరునాళ్లకు సన్నద్ధంగా ఉండాలి



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన జరుగనున్న కోటప్పకొండ తిరునాళ్లకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. కొండ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ ప్రాంతాలు, స్నానాల ఘాట్‌లు, ప్రభలు నిలిపే స్థలం, బస్టాండ్‌లను ఐజీ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు.

మహాప్రసాదం.. వితరణకు సిద్ధం



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు. పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే సుమారు లక్ష మంది భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందించేందుకు ఉత్సవాల నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం గురువారం వేడుకగా జరిగింది. ఫిబ్రవరి 18 నుంచి 26వ తేదీ వరకు ఆలయంలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు.

గోవాడ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు



అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న గోవాడ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు చేయనున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానాన్ని గురువారం ఆయన సందర్శించారు. బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. తిరునాళ్లకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నారసింహునికి శ్రీపుష్పయాగోత్సవం



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలను స్మార్త ఆగమ యుక్తంగా, పాంచాహ్నిక దీక్షతో ఆలయ పండితులు, అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి నారసింహుడిని దర్శించుకున్నారు.

వైభవంగా ప్రణయ కలహోత్సవం



తిరుపతి కల్చరల్: గోవిందరాజ స్వామి వారి ఆలయంలో గురువారం ప్రణయ కలహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

సినిమా

తెలుగు చిత్రపరిశ్రమ వెండితెర ప్రేమతో నిండిపోనుంది. అరడజనుకు పైగా ప్రేమకథలు ఈ ఏడాది తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. మరి... ప్రేమించుకుందాం.. రా! అంటూ వెండితెర కోసం ప్రేమలో పడిన నటీనటుల గురించి ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మీరూ ఓ లుక్ వేయండి.


భాగ్యశ్రీ, రామ్


సంయుక్త, శర్వానంద్, సాక్షి వైద్య


రీతూ వర్మ, సందీప్ కిషన్


మృణాల్ ఠాకూర్, అడివి శేష్

ప్రేమించుకుందాం... రా

సాగర్ లవ్స్ మహాలక్ష్మి

సాగర్‌గా కాలేజీకి వెళ్తున్నారు రామ్. కాలేజీలో మహాలక్ష్మిని ప్రేమించాడు. మరి... సాగర్ లవ్ సక్సెస్ అయ్యిందా? అతని చదువు ఏమైంది? అన్న ఆసక్తికరమైన అంశాలను థియేటర్స్‌లో చూడాలి. రామ్ హీరోగా పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యూత్‌ఫుల్ డ్రామా రూపొందుతోంది. ఈ చిత్రంలో కాలేజీ స్టూడెంట్ సాగర్‌గా రామ్, మహాలక్ష్మీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రాజమండ్రిలో జరుగుతోంది. రామ్, భాగ్యశ్రీలతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

నారీ నారీ నడుమ మురారి

ఇద్దరు అమ్మాయిల ప్రేమలో శర్వానంద్ ఇరుక్కున్నారు. ఫైనల్‌గా ఏ అమ్మాయి ఈ హీరో ప్రేమను దక్కించుకుంది? అనే ప్రశ్నకు సమాధానం 'నారీ నారీ నడుమ మురారి' సినిమా చూసి తెలుసుకోవాలి. శర్వానంద్ హీరోగా, సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్న రొమాంటిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి'. 'సామజ వరగమన' మూవీతో హిట్ అందుకున్న రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది.

యాక్షన్ లవ్ స్టోరీ

'హలో, మిస్టర్ మజ్ను, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి లవ్‌స్టోరీ మూవీస్‌లో నటించి, ఆడియన్స్‌ను మెప్పించారు అక్కినేని అఖిల్. తాజాగా ఈ యంగ్ హీరో మరో లవ్‌స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తీసిన దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కించనున్న నెక్ట్స్ ఫిల్మ్‌లో అఖిల్ హీరోగా చేస్తున్నారని తెలిసింది. ఆల్రెడీ చిత్రీకరణ మొదలుపెట్టుకున్న ఈ యాక్షన్ లవ్‌స్టోరీ మూవీలో అఖిల్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో ఈ మూవీ తెరకెక్కనుందట. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థలు ఈ మూవీని నిర్మిస్తున్నాయని తెలిసింది. అయితే ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

లవ్వుకు లైఫ్ ఇద్దామా...

'లవ్వే లైఫ్ అందామా... లవ్వుకు లైఫ్ ఇద్దామా' అంటూ తన లవ్‌ను సూపర్బ్‌గా ప్రపోజ్ చేశారు సందీప్ కిషన్. మరి... సందీప్ లవ్‌స్టోరీ సక్సెస్ అయ్యిందా? ఎటువంటి సవాళ్లను ఎదుర్కొని సందీప్ తన లవ్‌ను సాధించుకున్నారు? అన్నది 'మజాకా' మూవీలో చూడాలి. సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీ 'మజాకా'. ఈ చిత్రంలో రావు రమేశ్, అన్షు కీలక పాత్రల్లో నటించారు. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. తండ్రీ కొడుకుల అనుబంధం, తండ్రి లవ్‌స్టోరీకి కొడుకు ఏ విధంగా హెల్ప్ చేశాడు? కొడుకు లవ్‌స్టోరీకి తండ్రి ఏ విధంగా సపోర్ట్ చేశాడు? అన్న అంశాల నేపథ్యంలో 'మజాకా' మూవీ ఉంటుందని సమాచారం.

ఇద్దరు అమ్మాయిల ప్రేమలో...

ఒక అబ్బాయిని ఇద్దరు అమ్మాయిలు ప్రేమిస్తారు. కానీ ఆ అబ్బాయి మాత్రం ఎవర్నీ ప్రేమించడు. మరి... ఆ ఇద్దరు అమ్మాయిలు ఆ అబ్బాయి ప్రేమకోసం ఏం చేశారు? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ మూవీ 'హాష్ ట్యాగ్ సింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజు దర్శకత్వంలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

ముక్కోణపు ప్రేమకథ

సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తెలుసు కదా'. ఈ ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టోరీలో 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా మారారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

మాజీ ప్రేమికుల కథ

కొంత కాలం ప్రేమించుకుని, విడిపోయిన తర్వాత మళ్లీ ఆ ప్రేమికులు కలుసుకోవాల్సి వస్తే? కలిసి ఓ క్రైమ్ చేయాల్సి వస్తే? ఎలా ఉంటుంది? అనే కథాంశంతో రూపొందుతున్న సినిమా 'డెకాయిట్: ఏ లవ్‌స్టోరీ'. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీలో విడిపోయిన ప్రేమికులుగా అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కనిపిస్తారు. ఈ సినిమాకు షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత శ్రుతీహాసన్‌ను తీసుకున్నారు. కొన్ని కారణాల వల్ల ఆమె ఈ సినిమా నుంచి తప్పుకోవడంతో ఆమె ప్లేస్‌లో మృణాల్ ఠాకూర్ ఫైనలైజ్ అయ్యారు.

ప్రేమ బాధ భయంకరం

'ప్రేమ చాలా గొప్పది... కానీ అది ఇచ్చే బాధే భయంకరంగా ఉంటుంది'' అంటున్నారు యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. ప్రేమకథా చిత్రం 'దిల్ రుబా' కోసమే కిరణ్ అబ్బవరం ఈ డైలాగ్ చెప్పారు. కిరణ్ అబ్బవరం హీరోగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీ 'దిల్ రుబా'. ఈ చిత్రంలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటించగా, నాజియా డేవిసన్ మరో లీడ్ రోల్‌లో నటించారు. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించారు. లవ్‌లో ఫెయిలై, మళ్లీ లవ్‌లో పడే ఓ కుర్రాడి కథగా 'దిల్ రుబా' చిత్రం రూపొందినట్లుగా తెలుస్తోంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం రిలీజ్ వాయిదా పడింది. మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే చాన్స్ ఉంది. అలాగే రవి నంబూరి అనే కొత్త దర్శకుడు తీస్తున్న లవ్ స్టోరీ మూవీలోనూ కిరణ్ అబ్బవరం హీరోగా నటించనున్నట్లుగా తెలిసింది. 'కలర్ ఫోటో' ఫేమ్ సాయి రాజేశ్ ఈ సినిమాకు కథ అందిస్తున్నారట.

ప్రేమలో సంఘర్షణ

ఓ కాలేజీ అమ్మాయి ప్రేమ, ఆ ప్రేమ కారణంగా ఆ యువతి ఎదుర్కొనే సంఘర్షణల నేపథ్యంలో రూపొందిన సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. హీరోయిన్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీలో, దీక్షిత్ శెట్టి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రేమలో సంఘర్షణకు గురయ్యే అమ్మాయి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

మిడిల్ క్లాస్ లవ్‌స్టోరీ

మిడిల్ క్లాస్ బాయ్ లవ్‌స్టోరీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాలంటున్నారు హీరో ఆనంద్ దేవరకొండ. '90స్' వెబ్ సిరీస్‌తో ఆడియన్స్‌ను అలరించిన ఆదిత్యా హాసన్ డైరెక్షన్‌లో ఓ లవ్‌స్టోరీ మూవీ రూపొందనుంది. ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించనుండగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో వస్తున్న ఈ మూవీపై అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాతో పాటు 'డ్యూయెట్' అనే మరో లవ్‌స్టోరీ ఫిల్మ్ కూడా చేస్తున్నారు ఆనంద్ దేవరకొండ. రితికా నాయక్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేసిన మిథున్ వరదరాజకృష్ణన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని కేజీ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

ప్రేమ తుఫాన్!

'ఎవరి తుఫాన్లు వారికి ఉంటాయి లోపల. కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు' అంటూ ఓ ఇంటెన్స్ లవ్ డైలాగ్ చెప్పారు హీరోయిన్ అనంతికా సనీల్‌కుమార్. 'మను' ఫేమ్ ఫణీంద్ర నర్సెట్టి డైరెక్షన్‌లో అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం '8 వసంతాలు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ ఇంటెన్స్ లవ్‌స్టోరీ సినిమాను నిర్మించారు. ప్రేమలో బ్రేక్ అప్ అయిన తర్వాత లైఫ్‌లో ఓ అమ్మాయి ఎలా మూవ్ ఆన్ అయ్యింది? అసలు ఆమె ప్రేమ ఎందుకు విఫలమైంది? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉండనున్నట్లుగా తెలుస్తోంది. రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్, రెబ్బా ప్రగడ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుంది.

తెలంగాణ లవ్‌స్టోరీ

'నీది నాది ఒకే కథ, విరాటపర్వం' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన వేణు ఉడుగుల నిర్మాతగా మారి, రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఖమ్మం-వరంగల్ సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న గ్రామీణ ప్రేమకథా చిత్రం ఇది. నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ సినిమా ఈ ప్రేమికుల రోజు సందర్భంగా రిలీజ్ కావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది.

వీరే కాదు... మరికొంతమంది హీరోలు–హీరోయిన్లు కూడా లవ్‌స్టోరీ మూవీస్ చేస్తున్నారు.

- ముసిమి శివాంజనేయులు


రష్మికా మందన్నా


అఖిల్


శ్రీవిష్ణు


ఆనంద్ దేవరకొండ


సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా


రుక్సర్, కిరణ్ అబ్బవరం


హను రెడ్డి, అనంతిక

ఓటీటీ | ఇది చూడొచ్చు

ప్రాణం లేని మనిషి ఈ సినిమా హీరో

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం జాలీ ఓ జిమ్ఖానా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



కదలని బొమ్మ చిత్రమైతే, కదిలే బొమ్మ ఓ విచిత్రం. అటువంటి విచిత్రానికి వినోదం తోడైతే అదే మనం చూసే సినిమా. సినిమాలలో దర్శకుడు తన కాల్పనిక ధోరణితో ఓ కథను అనుకొని ఆ కథకు అనుగుణంగా పాత్రలను సృష్టించి ఆ పాత్రలచే ప్రేక్షకులకు విచిత్ర వినోదాన్ని అందిస్తాడు. ప్రస్తుతం వచ్చే సినిమాలలో ఔరా అని అబ్బురపరిచే సినిమాలనుండి అయ్యో అనే సినిమాల వరకూ పుష్కలంగా ఉన్నాయి. సన్ నెక్ట్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'జాలీ ఓ జిమ్ఖానా' సినిమా ఔరా అనిపించే ఓ అద్భుతమని చెప్పాలి. ఈ సినిమాకి శక్తి చిదంబరం దర్శకత్వం వహించారు. ప్రముఖ కథానాయకుడు, కొరియోగ్రాఫర్ అలాగే దర్శకుడు అయిన ప్రభుదేవా ఈ సినిమాలోని ఓ ప్రధాన పాత్రలో నటించారు. ఇక అంతలా ఏముంది ఈ సినిమాలో... ఓసారి కథ గురించి చెప్పుకుందాం. భవానీ అనే అమ్మాయి తను చేసిన ఓ తప్పుకు ప్రాయశ్చిత్తంగా తన కథ చెప్పుకోడానికి ఓ చర్చిలోని ఫాదర్ దగ్గరకు రావడంతో ఈ సినిమా ప్రారంభమవుతుంది. తంగసామి తన కూతురు చెల్లమ్మ, మనవరాళ్లైన భవానీ, శివానీ, యాజినీతో ఓ హోటల్ నడుపుతుంటాడు. తెన్ కాశీకి చెందిన రాజకీయవేత్త అడైక్కలరాజ్‌తో హోటల్‌లో జరిగిన ఓ ఘర్షణ వల్ల తంగసామి తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవుతాడు. తంగసామి ఆపరేషన్ కోసం దాదాపు రూ. 25 లక్షల వరకు ఖర్చవుతుందని భవానీ అక్కచెల్లెళ్లకు చెబుతాడు డాక్టర్. అనూహ్యంగా ఆ డబ్బు భవానీ అకౌంట్‌లో డిపాజిట్ అయి, ఆపరేషన్ ఏ అవరోధం లేకుండా జరిగిపోతుంది. కానీ ఆ డబ్బు కోసం ఓ గ్యాంగ్ వీళ్ల వెంటపడి వేధిస్తూ ఉంటుంది. మరో పక్క ఇదే అడైక్కలరాజ్ ఓ కేస్ విషయమై న్యాయవాది పూన్‌గుండ్రన్‌తో పెద్ద విరోధం పెట్టుకొని ఉంటాడు. ఇంకో పక్క ఈ విషయం తెలిసిన తంగసామి హోటల్ విషయమై పూన్‌గుండ్రన్‌ని కలవమని భవానీ వాళ్లకి చెప్తాడు. భవానీ వాళ్ళు న్యాయవాదిని కలిసే సమయంలో అతను చనిపోయి ఓ హోటల్ గదిలో పడి ఉంటాడు. ప్రపంచానికి మాత్రం పూన్‌గుండ్రన్ బ్రతికే ఉన్న విషయం తెలుస్తుంది. మరి ఆడవాళ్లైన భవానీ అక్కచెల్లెళ్ళు న్యాయవాది శవంతో తమ సమస్యను ఎలా పరిష్కరించుకున్నారన్నదే ఈ 'జాలీ ఓ జిమ్ఖానా' సినిమా. ఈ సినిమా ప్రారంభం నుండే సరదా సరదాగా సాగిపోతుంది. అనూహ్యమైన మలుపులకు చక్కటి వినోదం మేళవించి ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేశారు దర్శకుడు. నాటి ఆడవాళ్లకు మాత్రమే సినిమాలోని అప్పటి నటుడు నగేశ్ నటించిన ఓ సన్నివేశం ఈ సినిమా కథకి ఓ స్ఫూర్తి అని చెప్పవచ్చు. సూపర్ ఎంటర్‌టైనర్ ఫర్ ది కంప్లీట్ ఫ్యామిలీ. వర్త్ టు వాచ్.

- ఇంటూరు హరికృష్ణ

కోలీవుడ్ ఎంట్రీ?



కోలీవుడ్‌లో జాన్వీ కపూర్ ఎంట్రీ గురించి అప్పుడప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. కానీ జాన్వీ ఇప్పటివరకు తమిళంలో ఒక్క ప్రాజెక్ట్ కూడా చేయలేదు. అయితే ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని, ఓ తమిళ వెబ్ సిరీస్‌లో నటించేందుకు జాన్వీ కపూర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళంలో 'కబాలి, తంగలాన్' వంటి సినిమాలను తీసిన దర్శకుడు పా. రంజిత్ ఓ తమిళ వెబ్ సిరీస్‌ను నిర్మించనున్నారు. ఈ వెబ్ సిరీస్‌లోనే జాన్వీ లీడ్ రోల్ చేయనున్నారట. తమిళ దర్శకుడు ఏ. సర్గుణం ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. సాధారణంగా పా. రంజిత్ డైరెక్షన్‌లోని సినిమాలైనా, నిర్మించే సినిమాల్లోనైనా, సమకాలీన అంశాల ప్రస్తావన ఉంటుంది. సో... జాన్వీతో రంజిత్ ఎలాంటి సబ్జెక్ట్‌ను డీల్ చేయనున్నారన్న టాపిక్ చర్చనీయాంశమైంది. ఇక ఈ సిరీస్‌లో జాన్వీ కపూర్ నటించనున్నారనే విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

డ్యాన్స్ ఐకాన్ 2 సరికొత్తగా ఉంటుంది

- ఓంకార్


ప్రకృతి, యశ్, ఓంకార్, మానస్

''నేను గతంలో 'ఆట, ఆట జూనియర్స్' వంటి డ్యాన్స్ షోస్‌కి హోస్ట్ చేశాను. కానీ 'డ్యాన్స్ ఐకాన్ 2- వైల్డ్ ఫైర్' మాత్రం ఇప్పటిదాకా వచ్చిన డ్యాన్స్ షోస్ అన్నింటిలో సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు ఒక రియల్ ఫీల్ ఇవ్వాలనే స్క్రిప్టెడ్‌గా చేయకుండా రియాల్టీ షో చేస్తున్నాం'' అని హోస్ట్ ఓంకార్ చెప్పారు. 'డ్యాన్స్ ఐకాన్' సీజన్ 1కు కొనసాగింపుగా 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 2- వైల్డ్ ఫైర్' నేటి నుంచి ఆహా ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. ఈ షోకి ఓంకార్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, శేఖర్ మాస్టర్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా సినిమాలకు ప్రివ్యూ, ప్రీమియర్స్ వేస్తుంటారు. కానీ మీడియా కోసం తొలిసారి ఒక డ్యాన్స్ రియాల్టీ షోకు సీక్రెట్ స్క్రీనింగ్ చేసింది ఆహా ఓటీటీ. సీక్రెట్ స్క్రీనింగ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఓంకార్ మాట్లాడుతూ– ''సాధారణంగా తెలుగు నుంచి కంటెస్టెంట్స్‌ను సెలెక్ట్ చేస్తుంటాం. కానీ, ఈసారి దేశవ్యాప్తంగా కంటెస్టెంట్స్‌ని ఆడిషన్ చేసి ఐదుమందిని తీసుకున్నాం. వారికి పోటీ ఇచ్చే సత్తా ఉన్న తెలుగు కంటెస్టెంట్స్‌ను ఇప్పుడు సెలెక్ట్ చేయబోతున్నాం. 'డ్యాన్స్ ఐకాన్ 1' విన్నర్ మన తెలుగువాళ్లే. మరింత కష్టమైన పోటీలో మనవాళ్ల ప్రతిభ చూపించాలనే ఇలా చేస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు 60 సెకన్ల డ్యాన్స్ వీడియో చేసి మాకు పంపిస్తే.. అది చూసి ఎంట్రీలను తీసుకుంటాం. ప్రతి శుక్రవారం 7 గంటలకు షో స్టార్ట్ అవుతుంది. షో పూర్తయ్యాక ప్రేక్షకుల నుంచి పోల్ నిర్వహిస్తాం. 100 పాయింట్స్‌లోపు ప్రేక్షకులు తమకు నచ్చినన్ని పాయింట్స్ ఇవ్వొచ్చు. ఆదివారం వరకు ఈ ఓటింగ్ కొనసాగుతుంది. ప్రతి వారం ఒక్కొక్కరు ఎలిమినేట్ అవుతుంటారు. కంటెస్టెంట్స్‌తో పాటు మెంటార్స్ కూడా ఎలిమినేట్ అవుతారు. అలాగే వైల్డ్ కార్డ్ ఎంట్రీస్ ఉంటాయి. మూడు నెలల పాటు 'డ్యాన్స్ ఐకాన్ 2 – వైల్డ్ ఫైర్'ని ప్రేక్షకులు ఎంజాయ్ చేయబోతున్నారు'' అని చెప్పారు. ఈ ప్రెస్‌మీట్‌లో మెంటార్స్ మానస్, యశ్ మాస్టర్, ప్రకృతి మాట్లాడారు.

బిజినెస్ రీల్

ఐపీవో సన్నాహాల్లో రైట్ వాటర్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- దేవ్ యాక్సిలరేటర్‌కు చెక్

న్యూఢిల్లీ: క్లీన్ టెక్నాలజీ కంపెనీ రైట్ వాటర్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 445 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 745 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. వాటర్ యాక్సెస్ యాక్సెలరేషన్ ఫండ్ ఎస్ఎల్‌పీ(డబ్ల్యూ2ఏఎఫ్)కు కంపెనీలో పెట్టుబడులున్నాయి. ఫండ్‌ను బెల్జియంలోని ఇన్‌ఫోఫిన్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 225 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తిప్పి పంపింది. కంపెనీ 2024 అక్టోబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది.

భారత్‌లో వెరింట్ ఇన్నోవేషన్ సెంటర్



న్యూఢిల్లీ: కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ ఆటోమేషన్ సేవల్లో ఉన్న యూఎస్ ఐటీ సంస్థ వెరింట్ భారత్‌లో తొలి గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. బెంగళూరులోని ఈ కేంద్రంలో దాదాపు 700 మంది సిబ్బంది ఉన్నట్టు కంపెనీ తెలిపింది. 2026 చివరి నాటికి ఈ సంఖ్య 1,000కి చేరనుంది. ఫార్చ్యూన్-100 జాబితాలోని 80కిపైగా కంపెనీలకు సేవలు అందిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.

టీవీఎస్ సప్లై చైన్‌లో మరింత వాటా

టీవీఎస్ మోటార్ చేతికి 1.52 శాతం వాటా

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ తాజాగా టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్‌లో అదనపు వాటా కొనుగోలు చేసింది. బీఎస్ఈ బల్క్ డీల్ గణాంకాల ప్రకారం 1.52 శాతం వాటాకు సమానమైన 67.10 లక్షల షేర్లను సొంతం చేసుకుంది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఇందుకు రూ. 107 కోట్లు వెచ్చించింది. ఒక్కో షేరుకీ రూ. 159.42 సగటు ధరలో వీటిని కొనుగోలు చేసింది. ఈ లావాదేవీ తదుపరి టీవీఎస్ సప్లై చైన్‌లో టీవీఎస్ మోటార్ వాటా 2.39 శాతం నుంచి 3.91 శాతానికి బలపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	136.41	3.12
SUNPHARMA	1,745.00	3.02
BAJAJFINSV	1,842.35	3
BAJFINANCE	8,401.00	2.28
CIPLA	1,474.80	1.77

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,237.45	-4.93
ADANIPORTS	1,107.90	-1.86
HEROMOTOCO	3,952.05	-1.59
INFY	1,840.65	-1.21
LT	3,255.00	-1.05

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,676
ఎన్ఎస్ఈ	84,395
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,67,562
ఎఫ్ఐఐ	- 2,790
డీఐఐ	+ 2,934

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.82 (రాత్రి 11.30కు)	$ 71.37 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.06 (రాత్రి 11.30కు)	$ 75.18 (క్రితం ముగింపు)

స్పోర్ట్స్ టెక్నాలజీ మార్కెట్ @ రూ. 49,500 కోట్లు

- 2029 నాటికి చేరిక
- 85 శాతం వృద్ధి
- ఎఫ్ఐఎఫ్ఎస్, డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా స్పోర్ట్స్ టెక్నాలజీ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. వచ్చే నాలుగేళ్లలో 85 శాతం వృద్ధి చెందనుంది. 2029 నాటికి రూ. 49,500 కోట్లకు చేరనుంది. ఫ్యాంటసీ గేమ్స్ సంస్థ ఎఫ్ఐఎఫ్ఎస్, డెలాయిట్ విడుదల చేసిన సంయుక్త నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయ స్పోర్ట్స్-టెక్ మార్కెట్ రూ. 26,700 కోట్ల స్థాయిలో ఉంది. యాప్‌లు, డివైజ్‌లు, సెన్సార్లు మొదలైనవి స్పోర్ట్స్ టెక్ కేటగిరీలోకి వస్తాయి. డిజిటల్ టెక్నాలజీల రాకతో క్రీడాకారులు పనితీరును మెరుగుపర్చుకునేందుకు అవసరమైన డేటాను అందించడంతో పాటు అభిమానులు కూడా క్రీడలను ఆస్వాదించేందుకు మరింత మెరుగైన అనుభూతిని అందించేందుకు వీలవుతోందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ప్రశాంత్ రావు తెలిపారు. దీంతో కొత్త వ్యాపార అవకాశాలు తెరపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామక్రమానికి ఫ్యాంటసీ స్పోర్ట్స్ సారథ్యం వహించగలదని ఆయన చెప్పారు. గణనీయంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా సానుకూల ప్రభావాలు కూడా చూపిస్తోందని వివరించారు. 2029 ఆర్థిక సంవత్సరం వరకు పరిశ్రమ ఏటా 7 శాతం మేర వృద్ధి చెందుతుందని, 2027 ఆర్థిక సంవత్సరం నాటికి 17,500 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తుందని ప్రశాంత్ రావు తెలిపారు. ఇటు క్రీడాకారులు, అటు అభిమానులకు మరో స్థాయిలో స్పోర్ట్స్ అనుభూతిని టెక్నాలజీ అందించగలదని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య తెలిపారు.

ఫ్యాంటసీ స్పోర్ట్స్‌పై జీఎస్‌టీ ఎఫెక్ట్..

ఫ్యాంటసీ స్పోర్ట్స్ విభాగంపై గ్యాంబ్లింగ్ ట్యాక్స్ రేట్ల స్థాయిలో 28 శాతం జీఎస్‌టీ విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం 10 శాతం మేర క్షీణించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. జీఎస్‌టీ దెబ్బతో ఫ్యాంటసీ స్పోర్ట్స్ కంపెనీల మార్జిన్లపై 50 శాతం మేర ప్రతికూల ప్రభావం పడుతోందని వివరించింది. జీఎస్‌టీ నిబంధనతో 2023లో ఈ విభాగంపై పెట్టుబడులు 90 శాతం పడిపోయాయని, 2024లో కొత్తగా పెట్టుబడులు రాలేదని నివేదిక పేర్కొంది.

భారతీయ ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత



వినియోగదారుల శాఖ కార్యదర్శి నిధి ఖరే

న్యూఢిల్లీ: భారతీయ ప్రమాణాల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాలను కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే కోరారు. మరిన్ని ఉత్పత్తులను నాణ్యత నియంత్రణ ఆదేశాల (క్యూసీవోలు) పరిధిలోకి తీసుకొచ్చే విషయమై వివిధ శాఖల మధ్య జరిగిన సమావేశంలో భాగంగా ఆమె ఈ పిలుపునిచ్చారు. 17 శాఖలు, విభాగాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. దేశీయ మార్కెట్ కోసం నాణ్యమైన ఉత్పత్తుల తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, అదే సమయంలో నాసిరకమైన దిగుమతులకు చెక్ పెట్టడం లక్ష్యంగా క్యూసీవోలను తీసుకొచ్చినట్టు ఆమె గుర్తు చేశారు. నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత, ప్రయోజనాలపై ఈ సమావేశంలో చర్చించారు. పలు ఉత్పత్తులకు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు అన్నవి ప్రజారోగ్యం, భద్రత పరిరక్షణకు భరోసానిస్తాయని నిధి ఖరే పేర్కొన్నారు. అంతగా ఒకే తరహా నాణ్యత ప్రమాణాలకు వీలు కల్పిస్తాయన్నారు. ఆట బొమ్మల పరిశ్రమపై ఇవి చూపించే సానుకూల ప్రభావాన్ని వివరించారు. పలు శాఖల పరిధిలో 628 ఉత్పత్తులను సైతం క్యూసీవోల పరిధిలోకి తీసుకురావడంపై ఈ సమావేశంలో చర్చించినట్టు వినియోగదారుల వ్యవహారాల శాఖ తన ప్రకటనలో తెలిపింది.

యూపీఎమ్‌కు టీసీఎస్ సేవలు

ఐటీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఏఐ మద్దతు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఫిన్‌లాండ్ సంస్థ యూపీఎమ్‌తో ఐటీ ట్రాన్స్‌ఫార్మేషన్ సేవలందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. రీసైక్లబుల్ ప్రాడక్టులను రూపొందించడంలో ప్రత్యేకత కలిగిన యూపీఎమ్ పునరుత్పాదక ఇంధన మెటీరియల్స్‌ను ముడిసరుకులుగా వినియోగిస్తోంది. 11 దేశాలలో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ 10.3 బిలియన్ యూరోల టర్నోవర్‌ను కలిగి ఉంది. యూపీఎమ్ వృద్ధికి డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సహకరించనున్నట్లు ఒప్పందం సందర్భంగా టీసీఎస్ పేర్కొంది. తద్వారా ఏఐ ఫస్ట్ ఆపరేటింగ్ మోడల్‌ను అందిపుచ్చుకోనున్నట్లు తెలియజేసింది. అయితే ఒప్పందం(కాంట్రాక్ట్) విలువను వెల్లడించలేదు. యూపీఎమ్ ఎంటర్‌ప్రైజ్ ఐటీ వేల్యూ చైన్‌ను పటిష్టపరిచే బాటలో ఏఐ ఆధారిత అటానమస్ ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్ ఇగ్నియోను వినియోగించనున్నట్లు టీసీఎస్ వెల్లడించింది. అంతేకాకుండా యూపీఎమ్‌కు చెందిన 15,800 మంది ఉద్యోగులు, మెషీన్ల మధ్య మరింత భాగస్వామ్యానికి ఏఐ ద్వారా మద్దతివ్వనుంది.

వాహన జోరుకు యూవీల తోడు



న్యూఢిల్లీ: తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన ప్యాసింజర్ వాహనాల సంఖ్య దేశవ్యాప్తంగా జనవరిలో 1.6 శాతం పెరిగి 3,99,386 యూనిట్లకు చేరుకున్నాయి. జనవరి నెలలో ఇప్పటి వరకు ఇదే అత్యధికం. యుటిలిటీ వాహనాలకు బలమైన డిమాండ్ ఈ వృద్ధికి కారణం అని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది. '2024 జనవరితో పోలిస్తే హోల్‌సేల్‌గా యూవీల విక్రయాలు గత నెలలో 6 శాతం అధికమై 2,12,995 యూనిట్లుగా ఉంది. ప్యాసింజర్ కార్స్ అమ్మకాలు స్థిరంగా 1,27,065 యూనిట్లు నమోదయ్యాయి. వ్యాన్స్ 6.4 శాతం క్షీణించి 11,250 యూనిట్లకు పడిపోయాయి. మారుతీ సుజుకీ 4 శాతం వృద్ధితో 1,73,599 యూనిట్లు, హ్యుండై మోటార్ 5 శాతం తగ్గి 54,003, మహీంద్రా 17.6 శాతం దూసుకెళ్లి 50,659 యూనిట్లు దక్కించుకున్నాయి. ద్విచక్ర వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు 2.1 శాతం పెరిగి 15,26,218 యూనిట్లుగా ఉంది. మోటార్‌సైకిళ్లు 3.1 శాతం తగ్గి 9,36,145, స్కూటర్స్ 12.4 శాతం పెరిగి 5,48,201, మోపెడ్స్ స్వల్పంగా తగ్గి 41,872 యూనిట్లకు చేరుకున్నాయి. త్రిచక్ర వాహనాలు 7.7 శాతం ఎగిసి 58,167 యూనిట్లను తాకాయి' అని వివరించింది.

అమెరికా షేల్ వెంచర్ నుంచి గెయిల్ నిష్క్రమణ

20 శాతం వాటాల విక్రయానికి బిడ్ల ఆహ్వానం




న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, ఆయిల్ ఇండియా బాటలోనే అమెరికాలోని షేల్ గ్యాస్ వెంచర్ నుంచి తప్పుకోవాలని ప్రభుత్వ రంగ గ్యాస్ దిగ్గజం గెయిల్ ఇండియా నిర్ణయించుకుంది. టెక్సాస్‌లోని ఈగిల్ ఫోర్డ్ షేల్ అసెట్స్‌లో తమకున్న 20 శాతం వాటాలను విక్రయించేందుకు బిడ్లను ఆహ్వానించింది. అమెరికాలో గ్యాస్ ధరలు చాలా తక్కువగా ఉండటం వల్ల పెద్దగా ఆదాయం రావడం లేదని, దీంతో వెంచర్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకుందని ఇండియా ఎనర్జీ వీక్ సమావేశాల సందర్భంగా కంపెనీ వర్గాలు ఈ విషయాలు వెల్లడించాయి. 2011 సెప్టెంబర్‌లో ఈగిల్ ఫోర్డ్ షేల్ వెంచర్‌లో గెయిల్ 95 మిలియన్ డాలర్లకు 20 శాతం వాటాలను కొనుగోలు చేసింది. తదుపరి అయిదేళ్లలో అసెట్‌ను అభివృద్ధి చేసేందుకు 300 మిలియన్ డాలర్లు అదనంగా వెచ్చించాలని భాగస్వామ్య సంస్థలు నిర్ణయించాయి. ప్రస్తుతం ఆ క్షేత్రం నుంచి ఈగిల్ ఫోర్డ్ రోజుకు 3,681 బ్యారెళ్ల చమురు, 5,368 ఘనపుటడుగుల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది.

మార్సెలస్ షేల్ బ్లాకుల్లో కొన్ని వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ దాదాపు దశాబ్దం తర్వాత 2021లో విక్రయించి తప్పుకుంది. ఆ మరుసటి ఏడాది 2022లో ఆయిల్ ఇండియా నియోబ్రారా షేల్ అసెట్‌లోని 20 శాతం వాటాను ఆయిల్ ఇండియా 25 మిలియన్ డాలర్లకు విక్రయించి, ప్రాజెక్టు నుంచి నిష్క్రమించింది.

శ్రీలంక పవర్ ప్రాజెక్టుల నుంచి అదానీ బైటికి

టారిఫ్‌లను సమీక్షించాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించడమే కారణం



న్యూఢిల్లీ: శ్రీలంకలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం టారిఫ్‌లను పునఃసమీక్షించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అక్కడ తలపెట్టిన రెండు పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) వైదొలిగింది. అయితే, శ్రీలంకలో పెట్టుబడులకు తమ సంస్థ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో ప్రభుత్వం కోరుకుంటే తప్పకుండా కలిసి పని చేస్తామని సంస్థ తెలిపింది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీలంకలోని మన్నార్, పూనెరిన్ ప్రాంతాల్లో దాదాపు 740 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏజీఈఎల్ 484 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలి. 2026 మధ్య నాటికి ఇవి పూర్తి కావాలి. అయితే, వీటితో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందంటూ పర్యావరణవేత్తల ఆందోళనలు చేపట్టి, లీగల్ కేసులు వేయడంతో ఈ ప్రాజెక్టులకు ప్రారంభం నుంచే అడ్డంకులు ఎదురయ్యాయి. ఇక గత ప్రభుత్వం ప్రతిపాదిత అదానీ విండ్ పవర్ ప్లాంటు నుంచి యూనిట్‌కు 0.0826 డాలర్ల ధరకు విద్యుత్ కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. కానీ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు రేటును యూనిట్‌కు 0.06 స్థాయికి తగ్గించేలా టారిఫ్‌లను పునఃసమీక్షించాలని జనవరిలో నిర్ణయించింది. ఇది ఆమోదయోగ్యమైన ధర కాకపోవడంతో ప్రాజెక్టుల నుంచి తప్పుకోవాలని ఏజీఈఎల్ నిర్ణయం తీసుకుంది. అయితే, అదానీ గ్రూప్ 700 మిలియన్ డాలర్లతో కొలంబోలో తలపెట్టిన పోర్టు అభివృద్ధి పనులు యథా ప్రకారం సాగనున్నాయి.

క్యూ3 ఫలితాలు

హిందాల్కో లాభం హైజంప్

రూ. 3,735 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ మెటల్ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 60 శాతం జంప్‌చేసి రూ. 3,735 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 2,331 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 53,088 కోట్ల నుంచి రూ. 58,899 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 49,761 కోట్ల నుంచి రూ. 53,563 కోట్లకు పెరిగాయి. ఫ్యాబ్రికేషన్ యూనిట్ హోమ్ బిల్ట్ టెక్ కొనుగోలు చర్చలు విఫలంకావడంతో అధికారికంగా లావాదేవీకి తెరదించినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. భరత్ గోయెంకాను ఏప్రిల్ 1నుంచి సీఎఫ్‌వోగా బోర్డు ఎంపిక చేసినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్ఈలో 0.5% బలపడి రూ. 602 వద్ద ముగిసింది.

కల్పతరు లాభం డౌన్

రూ. 140 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 3 శాతం క్షీణించి రూ. 140 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 144 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,910 కోట్ల నుంచి రూ. 5,743 కోట్లకు ఎగసింది. 2025 ఏప్రిల్ 1 నుంచి మనీష్ మోనాట్‌ను ఎండీ, సీఈవోగా మరో మూడేళ్ల కాలానికి బోర్డు తిరిగి ఎంపిక చేసినట్లు కంపెనీ పేర్కొంది. గ్రూప్ ప్రొక్యూర్‌మెంట్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ దీపక్ శర్మను ఈ నెల 13 నుంచి సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారిగా నియమించినట్లు తెలియజేసింది. క్యూ3లో మెరుగైన పనితీరు చూపినట్లు మనీష్ పేర్కొన్నారు. ఆదాయంలో 17 శాతం వృద్ధి, 8.4 శాతం ఇబిటా మార్జిన్లుసహా రూ. 22,600 కోట్ల విలువైన(ఎల్1సహా) ఆర్డర్లు సాధించినట్లు తెలియజేశారు. 2024 డిసెంబర్‌కల్లా ఆర్డర్‌బుక్ విలువ రూ. 61,429 కోట్లను తాకినట్లు వెల్లడించారు. నికర రుణ భారం రూ. 2,694 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో కల్పతరు షేరు బీఎస్ఈలో 2 శాతం ఎగసి రూ. 983 వద్ద ముగిసింది.

హెచ్‌సీసీకి తగ్గిన నష్టాలు

రూ. 39 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక రంగ సంస్థ హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ(హెచ్‌సీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా తగ్గి రూ. 39 కోట్లకు పరిమితమైంది. పన్ను మదింపులో మార్పులు ప్రభావం చూపాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 233 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,512 కోట్ల నుంచి రూ. 1,066 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,413 కోట్ల నుంచి రూ. 1,310 కోట్లకు తగ్గాయి. 2024 డిసెంబర్‌కల్లా ఆర్డర్‌బుక్ విలువ రూ. 9,758 కోట్లకు చేరింది. ఈ కాలంలో క్విప్ ద్వారా రూ. 600 కోట్లు సమీకరించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీసీ షేరు బీఎస్ఈలో ఫ్లాట్‌గా రూ. 28 వద్ద ముగిసింది.

శ్రీ రేణుకా షుగర్స్ నష్టాలు అప్

రూ. 204 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ శ్రీ రేణుకా షుగర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం పెరిగి రూ. 204 కోట్లకు చేరింది. ఆదాయం క్షీణించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 172 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 3,010 కోట్ల నుంచి రూ. 2,478 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,136 కోట్ల నుంచి రూ. 2,869 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో శ్రీ రేణుకా షేరు బీఎస్ఈలో 1శాతం పతనమై రూ. 32 వద్ద ముగిసింది.

సారేగామా లాభం అప్

రూ. 63 కోట్లు

కోల్‌కతా: మ్యూజిక్ లేబుల్ దిగ్గజం సారేగామా ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం ఎగసి రూ. 63 కోట్లను అధిగమించింది. మ్యూజిక్, ఈవెంట్ విభాగాలు ఇందుకు దోహదపడ్డాయి. మొత్తం ఆదాయం మరింత అధికంగా 137 శాతం జంప్‌చేసి రూ. 483 కోట్లను తాకింది. కాగా.. మ్యూజిక్ బిజినెస్ ఆదాయం రూ. 163 కోట్లకు పరిమితంకాగా.. ఈవెంట్స్ విభాగం టర్నోవర్ భారీగా ఎగసి రూ. 279 కోట్లకు చేరింది. తద్వారా ఆదాయంలో మ్యూజిక్ విభాగాన్ని వెనక్కి నెట్టింది. 2024-25 నుంచి 2026-27 మధ్యకాలంలో రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్ఎస్ఈలో 1.2% నష్టంతో రూ. 515 వద్ద ముగిసింది.

వ్యాపార ఏకీకరణకు హోండా, నిస్సాన్ నో

కంపెనీ సామర్థ్యాన్ని తగ్గించారు: నిస్సాన్

బాధ కలిగించే చర్యలు తప్పవు: హోండా



నిస్సాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మకొటొ ఉషీదా



హోండా చీఫ్ ఎగ్జిక్యూటివ్ తోషిహిరో మీబ్

టోక్యో: వ్యాపార ఏకీకరణపై చర్చలను ముగించినట్లు వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థలు హోండా, నిస్సాన్, మిత్సుబిషి గురువారం తెలిపాయి. అయితే ఎలక్ట్రిక్ వాహనాలు, అటానమస్ డ్రైవింగ్ వంటి స్మార్ట్ కార్ల అభివృద్ధిపై కలిసి పనిచేయడం కొనసాగిస్తామని ఈ మూడు సంస్థలు వెల్లడించాయి. 'చర్చలు జాయింట్ హోల్డింగ్ కంపెనీని ఏర్పాటు చేయాలన్న అంశంపై జరగాలి. కానీ హోండా అనుబంధ సంస్థగా నిస్సాన్‌ను మార్చాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రపంచ పోటీలో గెలవడానికి కంపెనీలను కలపాలి. కానీ నిస్సాన్ సామర్థ్యాన్ని గుర్తించడం లేదు. కాబట్టి నేను వారి ప్రతిపాదనను అంగీకరించలేను. హోండా లేకుండా నిస్సాన్ ఆర్థిక పునరుద్ధరణ లక్ష్యంగా పెట్టుకోబోతోంది' అని నిస్సాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మకొటొ ఉషీదా మీడియాకు వెల్లడించారు. నిర్ణయం తీసుకోవడాన్ని వేగవంతం చేయడానికి హోండా స్టాక్ స్వాప్‌ను సూచించిందని హోండా చీఫ్ ఎగ్జిక్యూటివ్ తోషిహిరో మీబ్ అన్నారు. 'నేను నిజంగా నిరాశ చెందాను. వ్యాపార అవకాశం గొప్పదని భావించాను. కానీ అది కార్యరూపం దాల్చాలంటే బాధ కలిగించే చర్యలు అవసరమని కూడా నాకు తెలుసు' అని వివరించారు.

నిస్సాన్‌లో ఫాక్స్‌కాన్‌కు వాటా?

హోండా మోటార్ కంపెనీ, నిస్సాన్ మోటార్ కార్పొరేషన్ సంయుక్త హోల్డింగ్ కంపెనీని ఏర్పాటు చేయడానికి చర్చలు జరపబోతున్నట్లు 2024 డిసెంబర్‌లో ప్రకటించాయి. ఆ గ్రూప్‌లో చేరడాన్ని పరిశీలిస్తున్నట్లు మిత్సుబిషి మోటార్స్ కార్పొరేషన్ వెల్లడించింది. 2025 జూన్ నాటికి ఒప్పందాన్ని ఖరారు చేసి.. ఆగస్టు కల్లా హోల్డింగ్ కంపెనీని ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నట్లు హోండా, నిస్సాన్ మొదట్లో తెలిపాయి. ఇదిలావుంటే హోండా, నిస్సాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయని జపాన్ మీడియా ఇటీవలి కాలంలో కథనాలు ప్రచురించింది. హోండాతో భాగస్వామ్యంలో ఒక చిన్న భాగస్వామిగా మారడానికి నిస్సాన్ నిరాకరించిందన్నది వార్తా కథనాల సారాంశం. నిస్సాన్‌లో వాటా తీసుకోవడాన్ని తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ పరిశీలిస్తోందన్న మీడియా ఊహాగానాల గురించి తనకు తెలియదని మీబ్ అన్నారు.

ఆర్థికంగా మెరుగ్గా హోండా..

హోండా ఆర్థికంగా చాలా మెరుగ్గా ఉంది. అలాగే ఉమ్మడి కార్యనిర్వాహక బృందంలో ముందంజలో ఉంది. 2024 ఏప్రిల్-డిసెంబర్ లాభాలు 7 శాతం తగ్గి 5 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు హోండా గురువారం నివేదించింది. మరోవైపు వాహన అమ్మకాలు పడిపోవడంతో జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నిస్సాన్ నష్టాలను ప్రకటించింది. దీని ఫలితంగా 9,000 మంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చింది. ఆ సమయంలో ఫలితాలకు బాధ్యత వహిస్తూ ఉషీదా తన వేతనంలో 50 శాతం కోత విధించుకున్నారు.

సాక్షి ప్లస్
శుక్రవారం । 14-2-2025

మన ఫీల్డింగ్ దుర్భేద్యం

ధోని శకానికి (సారథిగా) ముందు భారత్ అంటే పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ జట్టుగా పేరు గడించింది. దిగ్గజాలు సచిన్ మానియా, రాహుల్ ది వాల్, గంగూలీ శైలి అంతా బ్యాటింగ్ బలాన్ని, దీంతోనే జట్టు ఇమేజ్‌ను పెంచారు. 2007 మొట్టమొదటి టి20 ప్రపంచకప్‌తో 'మహేంద్ర'జాలం మొదలయ్యాక టీమిండియా అంటే బ్యాటింగ్, బౌలింగే కాదు... ఫీల్డింగ్, ఫిట్‌నెస్ ప్రాధాన్యమున్న జట్టుగా రూపాంతరం చెందింది. అటుపైనా అదే పవర్‌ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్ జట్టుగా కొనసాగుతోంది.

- ఆటగాళ్ల ప్రదర్శన సంతృప్తికరం
- క్యాచ్‌లు, రనౌట్లు అద్భుతం
- భారత ఫీల్డింగ్ కోచ్ దిలీప్ వ్యాఖ్య

అహ్మదాబాద్: సీనియరా... జూనియరా... కాదు! ఫిఫ్టీలు, సెంచరీలు చేయడమే ప్రధానం కాదు... ఫీల్డింగ్‌లో చురుగ్గా పది ఇరవై పరుగులు ఆపే ఆటగాళ్లు జట్టులో ఉండాలని ధోని నిక్కచ్చిగా సెలక్టర్లతో తన అభిప్రాయాన్ని చెప్పేవాడు. తనకు అవసరమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకునేవాడు. ఆది జట్టుపై పెను ప్రభావమే చూపింది. ఒకప్పుడు ఫీల్డింగ్ కోచే లేని జట్టుకు తదనంతరం ఫీల్డింగ్ కోచ్ ప్రాధాన్యమేమిటో తెలిసొచ్చింది. హైదరాబాద్‌కు చెందిన టి. దిలీప్ నైపుణ్యాన్ని మెచ్చిన మాజీ హెడ్ కోచ్ ద్రవిడ్ టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా చేస్తే... గంభీర్ వచ్చాక తన సహాయ బృందంలో మార్పులెన్నో చేసినా... దిలీప్‌ను మాత్రం మార్చలేదు. ఎందుకంటే అతని ప్రతిభ ఏంటో తెలిసిన గంభీర్ తన శిక్షణ బృందంలో కొనసాగిస్తున్నాడు. ఇంగ్లండ్‌తో ఇటీవలే ముగిసిన టి20, వన్డే ద్వైపాక్షిక సిరీస్‌లలో జట్టు ప్రదర్శనపై దిలీప్ సంతృప్తి వ్యక్తం చేశాడు. భారత ఆటగాళ్లు మైదానంలో కదిలిన తీరు, చురుకైన జోరు అద్భుతమని కితాబిచ్చాడు. పలు అంశాలపై దిలీప్ ఏమన్నాడో అతని మాటల్లోనే...

అన్నింటా మెరుగే

ఈ సిరీస్‌లలో భారత క్రికెటర్లు మైదానంలో ప్రత్యేకించి ఫీల్డింగ్‌లో పోషించిన పాత్ర అద్భుతం. ప్రత్యర్థి బ్యాటర్ల పరుగుల్ని నిరోధించడంలో, కీలకమైన క్యాచ్‌ల్ని అందుకోవడంలో, రనౌట్లు చేయడంలో ఆటగాళ్లు పాదరసంలా కదిలారు. మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి పుంజుకోకుండా ఎన్నో అవకాశాల్ని సృష్టించుకొని పట్టు సాధించిన తీరు బాగుంది. కీలకమైన దశల్లో ఆటగాళ్లు స్పందించిన విధానం మనమెంతో మెరుగని చాటింది.

అలసట, అలసత్వం లేనేలేదు

సిరీస్ ఆసాంతం ఆటగాళ్లు ఎంతో శ్రమించారు. అలసట ఎరుగని ప్రదర్శన చేశారు. ప్రత్యర్థి జట్టు త్వరత్వరగా వికెట్లు కోల్పోయినా... అలసత్వాన్ని దరిచేరనీయకుండా క్రమంగా తమ పట్టు పెంచారే తప్ప ఎక్కడా కోల్పోలేదు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా మెలిగారు. ఎక్కడా తగ్గలేదు. తమ వంతు పాత్ర సమర్థంగా పోషించారు. అందుకే రెండు సిరీస్‌లను ఆఖరుదాకా లాక్కు రాకుండా ఓ మ్యాచ్ ఉండగానే గెలిచారు. వన్డేల్లో అయితే సులువుగా క్లీన్‌స్వీప్ చేశారు.

అందరూ హీరోలే

ఈ రెండు సిరీస్‌ల ప్రదర్శనను గమనించిన నాకు... ఇందులో ఏ ఒక్కరికో క్రెడిట్ ఇవ్వలేమని తెలిసొచ్చింది. ఫలాన ఆటగాడు మెరుగు, ఫలాన ఆటగాడు తక్కువ అని వేలెత్తి చూపలేం. ఫీల్డింగ్‌లో అయితే అందరు హీరోలే! కొత్త సీమర్ హర్షిత్ రాణా నుంచి అనుభవజ్ఞులైన శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ వరకు అంతా బాగా ఆడారు. కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రతి ఒక్కరు పది పైచిలుకు పరుగుల్ని నిరోధించారనిపించింది. ఇంపాక్ట్ ఫీల్డర్ అంటూ ఉంటే మాత్రం శ్రేయస్ అయ్యరే! బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో అతని ఆటతీరు అసాధారణంగా ఉంది.


దిలీప్

'చాంపియన్స్'కు ముందు కరాచీ స్టేడియంలో...

కరాచీ: దశాబ్దాల తర్వాత పాకిస్తాన్ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీతో మెగా ఈవెంట్ ఆతిథ్య ముచ్చటకు సిద్ధమవుతున్న వేళ కరాచీలో నకిలీ అక్రిడిటేషన్ కార్డుతో ఓ వ్యక్తి స్టేడియంలోకి చొరబడే యత్నం అక్కడి భద్రతపై సందేహాల్ని లేవనెత్తేలా చేసింది. ఓ మీడియా ప్రతినిధిగా గుర్తింపు కార్డు, ఐసీసీ అక్రిడిటేషన్ కార్డులతో కరాచీ జాతీయ స్టేడియానికి వచ్చిన ఓ అపరిచితుడు... స్టేడియం ప్రధాన ద్వారం గుండా మైదానం లోపలికి ప్రవేశించే ప్రయత్నం చివరి నిమిషంలో భద్రతాధికారుల సమయస్ఫూర్తితో విఫలమైంది. తదనంతర విచారణలో పాకిస్తాన్‌కు చెందిన ముజమ్మిల్ ఖురేషీగా గుర్తించిన పోలీసులు అతన్ని అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి దర్యాప్తు చేపట్టారు. అతని వద్ద ఉన్న కెమెరామెన్, ఐసీసీ అక్రిడిటేషన్ కార్డులన్నీ నకిలీవని తమ పరిశీలనలో తేలిందని కరాచీ పోలీసులు తెలిపారు. పాక్‌లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు సన్నాహకంగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లు పాల్గొంటున్న ముక్కోణపు సిరీస్ సందర్భంగా ఈ ఉదంతం చోటుచేసుకుంది.

అఫ్రిది సహా ముగ్గురు పాక్ ఆటగాళ్లపై జరిమానా



కరాచీ: పాకిస్తాన్ క్రికెటర్లు షాహిన్ అఫ్రిది, సౌద్ షకీల్, కమ్రాన్ గులామ్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) జరిమానా విధించింది. ప్రస్తుతం సొంతగడ్డపై జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో అనుచితంగా ప్రవర్తించిన ముగ్గురు పాక్ ఆటగాళ్లపై ఐసీసీ చర్యలు చేపట్టింది. బుధవారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్ సందర్భంగా మాథ్యూ బ్రీట్జ్‌కి బ్యాటింగ్ చేస్తుండగా... 28వ ఓవర్‌లో అఫ్రిది అతన్ని దూషించాడు. దీంతో మ్యాచ్ రిఫరీ పాక్ సీమర్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించగా, మిగతా ఇద్దరు క్రికెటర్లు షకీల్, గులామ్‌లపై 20 శాతం జరిమానా విధించారు. వీళ్లిద్దరు సఫారీ సారథి బవుమా రనౌట్ అయినపుడు... బ్యాటర్‌కు సమీపించి మరీ అతిగా వేడుకలు చేసుకున్నారు. దీంతో ఐసీసీ జరిమానాలతో పాటు ముగ్గురి ఖాతాలో ఒక డిమెరిట్ పాయింట్‌ను జతచేసింది. అఫ్రిది ప్రవర్తనపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.



సాకేత్ జంట ఓటమి

న్యూఢిల్లీ: మనామా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు సాకేత్ మైనేని పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. బహ్రెయిన్ రాజధాని మనామాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్ (భారత్)-కొలిన్ సింక్లెయిర్ (నార్తర్న్ మరియానా ఐలాండ్స్) జోడీ 4-6, 6-7 (1/7)తో విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెడుంజెళియన్ (భారత్) జంట చేతిలో ఓడిపోయింది. హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్ (భారత్)-రే హో (చైనీస్ తైపీ) ద్వయం 6-7 (4/7), 3-6తో లియుటారెవిచ్ (బెలారస్)-సాంచెజ్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

కుటుంబసభ్యులు లేకుండానే...

చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు దుబాయ్ వెళ్లనున్న భారత జట్టు

న్యూఢిల్లీ: పాక్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్ని దుబాయ్‌లో ఆడేందుకు వెళ్లనున్న భారత జట్టు తమవెంట కుటుంబసభ్యులను తీసుకెళ్లడం లేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సిఫార్సుల మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇటీవలే కొత్త పాలసీని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిప్రకారం ఎన్నో ఏళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్‌లో స్టార్లు, దిగ్గజ హోదా పక్కనబెట్టి కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి తమ రాష్ట్ర జట్లకు ఆడిన సంగతి తెలిసిందే! అలాగే ఇప్పుడు తాజాగా విదేశీ ప్రయాణం విషయంలోనూ ఈ పాలసీ అమలవుతోంది. దుబాయ్‌లో ఈ నెల 20న బంగ్లాదేశ్, 23న పాకిస్తాన్, మార్చి 2న న్యూజిలాండ్‌లతో భారత్ లీగ్ దశ మ్యాచ్‌ల్ని ఆడనుంది. నాకౌట్ దశ, ఫైనల్స్ కలిపినా మార్చి 9న టోర్నీ ముగుస్తుంది. అంటే మూడు వారాల్లోపే ముగియనున్న ఈ టోర్నీ కోసం కొత్త నియమావళి ప్రకారం భార్యాబిడ్డలను అనుమతించరు. కొత్త పాలసీ ప్రకారం ఏదైనా విదేశీ పర్యటన 45 రోజులు, అంతకుమించి జరిగితేనే గరిష్టంగా రెండు వారాల పాటు కుటుంబసభ్యుల్ని క్రికెటర్ల వెంట వెళ్లేందుకు అనుమతిస్తారు. కానీ 8 దేశాలు ఆడే చాంపియన్స్ ట్రోఫీ కనీసం నెల రోజుల పాటైనా జరగకపోవడంతో దుబాయ్ స్టేడియంలో ఆట, ఇది పూర్తయ్యాక భార్యాబిడ్డలతో సరదాగా దుబాయ్ వీధుల్లో సయ్యాట ఆడేందుకు అవకాశం లేకుండా పోయింది. అలాగే స్టార్ ఆటగాళ్ల వెంట పరిమిత సంఖ్యలో అనుమతించే వ్యక్తిగత సిబ్బందికి జట్టు, కోచింగ్ సిబ్బంది బస చేసిన హోటల్‌లో కాకుండా వేరే హోటల్‌లో బస ఏర్పాట్లు చేస్తారు. గతంలో వ్యక్తిగత ట్రెయినర్, మేనేజర్, షెఫ్‌లకు కోచింగ్ బృందంలో కలిపి వసతి ఏర్పాటు చేసేవారు.

గత ఏడాది జింబాబ్వే పర్యటన సందర్భంగా కుటుంబసభ్యులతో భారత క్రికెటర్ శుబ్‌మన్ గిల్ (ఫైల్)



రాజస్తాన్ రాయల్స్ స్పిన్ కోచ్‌గా బహుతులే



జైపూర్: భారత మాజీ క్రికెటర్ సాయిరాజ్ బహుతులే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా మరోసారి నియమితుడయ్యాడు. జాతీయ జట్టు తరఫున 2 టెస్టులు, 8 వన్డేలు ఆడిన ఈ లెగ్‌స్పిన్నర్‌కు దేశవాళీల్లో ఆల్‌రౌండర్‌గా సుదీర్ఘ అనుభవం ఉంది. 2018 నుంచి 2021 మధ్య కాలంలో రాయల్స్ శిక్షణ బృందంలో ఉన్న సాయిరాజ్ బహుతులే... ఇప్పుడు తిరిగి రాహుల్ ద్రవిడ్ నేతృత్వంలోని శిక్షణ సిబ్బందిలో భాగం కానున్నాడు. 'ఆటగాడిగా, కోచ్‌గా సుదీర్ఘ అనుభవం ఉన్న బహుతులేను స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఎంపిక చేశాం. టీమిండియాతో పాటు, ముంబై, బెంగాల్, కేరళ వంటి జట్లకు శిక్షణ ఇచ్చిన అనుభవం అతని సొంతం. స్పిన్ బౌలింగ్‌పై బహుతులేకు ఉన్న అనుభవం యువ ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది' అని రాయల్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 'గతంలో సాయిరాజ్ బహుతులేతో కలిసి పని చేశాను. అతడి అనుభవం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయడంలో అతడు ఎప్పుడూ ముందుంటాడు' అని ద్రవిడ్ పేర్కొన్నాడు. బహుతులే స్పందిస్తూ... రాహుల్ ద్రవిడ్ ఆధ్వర్యంలో యువ ఆటగాళ్లతో కలిసి పనిచేసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించాడు.

ప్రొఫెషనల్ బాక్సర్‌గా అమిత్ పంఘాల్



న్యూఢిల్లీ: భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారనున్నాడు. ఈ మేరకు అమెరికాకు చెందిన క్రిటికల్ స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీతో 29 ఏళ్ల అమిత్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. హరియాణాకు చెందిన అమిత్ దేశం తరఫున 51 కేజీల విభాగంలో విజయవంతమైన బాక్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన ఏకైక భారత బాక్సర్‌గా రికార్డుల్లోకెక్కిన అమిత్ పంఘాల్... ఒలింపిక్స్ మినహా దాదాపు అన్ని ప్రధాన టోర్నీల్లో పతకాలు సాధించాడు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ అమిత్... ఆసియా క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్స్, కామన్వెల్త్ క్రీడల్లో పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన అమిత్... 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో ఓడాడు. భారత స్టార్, 2008 ఒలింపిక్స్ కాంస్య పతక విజేత విజేందర్ సింగ్... మన దేశం నుంచి ప్రొఫెషనల్‌గా మారిన తొలి బాక్సర్ కాగా... ఆ తర్వాత వికాస్ కృషన్, మన్‌దీప్ జాంగ్రా, నీరజ్ గోయట్ ప్రొఫెషనల్ బాట పట్టారు. ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత నిశాంత్ దేవ్ ఈ జాబితాలో చేరగా... ఇప్పుడు అమిత్ కూడా ప్రొఫెషనల్ అవతారం ఎత్తాడు.

భారత్ X జపాన్

- సెమీఫైనల్ బెర్త్ కోసం ఇరు జట్ల పోరు
- గెలిచిన జట్టుకు కాంస్యం ఖాయం
- చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియా చేతిలో టీమిండియా ఓటమి


పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ

కింగ్‌డావో (చైనా): ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కాంస్య పతకాన్ని నిలబెట్టుకునేందుకు విజయం దూరంలో నిలిచింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో జపాన్ జట్టుతో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంటుంది. గురువారం జరిగిన గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-3తో దక్షిణ కొరియా జట్టు చేతిలో పోరాడి ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం 21-11, 12-21, 15-21తో కి డాంగ్ జు-జియోంగ్ నా యున్ (కొరియా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ 9-21, 10-21తో సిమ్ యు జిన్ చేతిలో పరాజయం పాలైంది. దాంతో భారత్ 0-2తో వెనుకబడింది. మూడో మ్యాచ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్ 17-21, 21-18, 21-19తో చో జియోన్‌యోప్‌పై గెలుపొందాడు. నాలుగో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 19-21, 21-16, 21-11తో కిమ్ ఇన్ జి-కిమ్ యు జుంగ్ జంటను ఓడించడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-అర్జున్ జంట 14-21, 21-23తో జిన్ యోంగ్-నా సుంగ్ సెయోంగ్ జోడీ చేతిలో ఓడిపోవడంతో భారత ఓటమి ఖరారైంది.

రంజీ సెమీఫైనల్ పోరుకు యశస్వి జైస్వాల్

విదర్భతో మ్యాచ్‌లో పాల్గొనే ముంబై జట్టులో ఎంపిక



ముంబై: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ముంబై జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌పై అంతర్జాతీయ వన్డే అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్‌కు చాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగే భారత జట్టులో చోటు దక్కలేదు. ప్రాథమిక జట్టులో జైస్వాల్‌ను ఎంపిక చేసినా... అనంతరం స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కోసం 15 మందితో కూడిన జట్టు నుంచి అతడిని తప్పించారు. ప్రస్తుతానికి జైస్వాల్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి నాన్ ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ఉన్నారు. అత్యవసమైతేనే వీరు దుబాయ్‌కు వెళ్లనున్నారు. దీంతో రంజీ ట్రోఫీ సెమీఫైనల్ కోసం జైస్వాల్ ముంబై సెలెక్టర్లు ఎంపిక చేశారు. విదర్భతో ఈనెల 17 నుంచి జరగనున్న సెమీఫైనల్ పోరులో యశస్వి, సూర్యకుమార్, శివమ్ దూబే, అజింక్య రహానే, శార్దుల్ ఠాకూర్ వంటి భారత ఆటగాళ్లు ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సీజన్‌లో జమ్మూకశ్మీర్‌తో ఆడిన ఏకైక రంజీ మ్యాచ్‌లో జైస్వాల్ ఆకట్టుకోలేకపోయాడు. రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగినా... భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయాడు. గతేడాది రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భను చిత్తు చేసిన ముంబై జట్టు 42వసారి టైటిల్ చేజిక్కించుకుంది.

ముంబై జట్టు: అజింక్య రహానే (కెప్టెన్), ఆయుశ్ మాత్రే, అంగ్‌క్రిష్ రఘువంశీ, అమోఘ్ భత్కల్, సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్, సిద్దేశ్ లాడ్, శివమ్ దూబే, ఆకాశ్ ఆనంద్, హార్దిక్ తమోర్, సూర్యాన్ష్ షెడ్గే, శార్దుల్ ఠాకూర్, షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్, మోహిత్ అవస్థి, సెల్వెస్టర్ డిసౌజ, రోస్టన్ డియాస్, అథర్వ అంకొలేకర్, హర్ష్ తన్నా.

సెమీఫైనల్లో నికీ పునాచా-జాన్ ద్వయం



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో నికీ కలియంద పునాచా (భారత్)-కోర్ట్‌నీ జాన్ లాక్ (జింబాబ్వే) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో నికీ-జాన్ లాక్ జోడీ 6-3, 2-6, 10-5తో సూపర్ టైబ్రేక్‌లో షిన్‌టారో మొచిజుకి-కైటో యుసుగి (జపాన్) జంటపై విజయం సాధించింది.


కాంస్య పతకాలతో తెలంగాణ నెట్‌బాల్ జట్టు

తెలంగాణకు 2 కాంస్యాలు

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో గురువారం తెలంగాణ రాష్ట్రానికి రెండు పతకాలు లభించాయి. నెట్‌బాల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టుకు కాంస్య పతకం దక్కగా... షూటింగ్ మిక్స్‌డ్ స్కీట్ టీమ్ ఈవెంట్‌లో బత్తుల మునేక్-రష్మీ రాథోడ్ జోడీ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. నెట్‌బాల్‌లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరిగిన కాంస్య పతకం మ్యాచ్ 31-31 పాయింట్లతో 'డ్రా'గా ముగిసింది. దాంతో రెండు జట్లకు కాంస్య పతకాలు ఖరారయ్యాయి. తెలంగాణ నెట్‌బాల్ జట్టు తరఫున బోడ విక్రమ్ రెడ్డి, అబ్దుల్ ఖాన్, అబ్దుల్ షరీఫ్, మొహమ్మద్ ఖాజాయుద్దీన్, శ్రవణ్ కుమార్, రఘునందన్, పులి రితిక రెడ్డి, గేయశ్రీ, శ్రుతి, గోపీ చంద్రిక, ముద్దం కీర్తన, సంహిత ప్రాతినిధ్యం వహించారు. షూటింగ్ మిక్స్‌డ్ స్కీట్ ఫైనల్లో ఆరు జోడీలు పోటీపడ్డాయి. 138 పాయింట్లతో ఇషాన్ సింగ్-రైజా ధిల్లాన్ (హరియాణా) జంట స్వర్ణం దక్కించుకోగా... భవతేజ్ సింగ్-గనీమత్ సెఖోన్ (పంజాబ్) ద్వయం రజతం సంపాదించింది. 133 పాయింట్లతో మునేక్-రష్మీ జంటకు కాంస్యం లభించింది. గురువారం పోటీలు ముగిశాక తెలంగాణ 18 పతకాలతో (3 స్వర్ణాలు, 3 రజతాలు, 12 కాంస్యాలు) 26వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 14 పతకాలతో (7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 18వ స్థానంలో కొనసాగుతోంది.


కాంస్య పతకాలతో బత్తుల మునేక్-రష్మీ రాథోడ్

‘హోదా’ పునరుద్ధరణకిదే సమయం

జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఆశాభావం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా త్వరలోనే వస్తుందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సమయం ఆసన్నమైనట్లుగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన పీటీఐ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ‘కేంద్ర హోం మంత్రితో ఏడాది క్రితమే ఈ విషయం చర్చించాను. రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ఇదే సరైన సమయం’అని ఆయన వివరించారు. ‘ఇటీవల హోం మంత్రి అమిత్ షాతో ఢిల్లీలో ఈ విషయమై చర్చ సానుకూలంగా జరిగింది. త్వరలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరణ ప్రకటన వెలువడుతుందని ఆశిస్తున్నా. ఈ అంశాన్ని చట్టపరమైన ముగింపు లభించాలని కోరుకుంటున్నా’అని అబ్దుల్లా చెప్పారు. సీఎంగా పగ్గాలు చేపట్టాక కేంద్రం, జమ్మూకశ్మీర్ మధ్య అంతరం తగ్గిందన్న విషయమై ఆయన స్పందిస్తూ..కొన్ని ఘటనల వల్లే దూరం పెరుగుతుందని చెప్పారు. ఇటీవల బారాముల్లా జిల్లా సాపోర్, కథువా జిల్లా బిల్లావర్‌లో జరిగిన రెండు హత్యలు నివారించదగినవని చెప్పారు. వీటిపై కేంద్రం పారదర్శకంగా దర్యాప్తు చేయించి, బాధ్యులను తగు విధంగా శిక్షించాలన్నారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఇటువంటి పరిణామాలు అవరోధంగా మారుతాయని వ్యాఖ్యానించారు. భద్రత, పోలీసు విభాగాలు కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికైన ప్రభుత్వానికి జవాబుదారీ కానప్పటికీ, ఇటువంటివి చోటుచేసుకోకుండా చూడాల్సిన సమష్టి బాధ్యత ఉందని వివరించారు. ఈ విషయంపైనా హోం మంత్రితో మాట్లాడానని వెల్లడించారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు అనుమానమున్న 26 ఏళ్ల వ్యక్తి పోలీసులు వేధిస్తున్నారంటూ ఈ నెల 4న ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ మరునాడే, సాపోర్‌లోని చెక్‌పోస్ట్ వద్ద ఆగకుండా వెళ్తున్న ట్రక్కు డ్రైవర్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో చనిపోయాడు.

100 రోజుల పాలనపై..

‘ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నది వంద రోజులు కోసం కాదు, ఐదేళ్లు పాలించడానికే. మా పని మమ్మల్ని చేయనివ్వండి. జమ్మూకశ్మీర్‌లో పాలన అంటే మామూలు విషయం కాదు. 2009–2015లోనూ తేలిగ్గా లేదు. ఇప్పుడూ అంతే. ఎవరికైనా ఈ ఇబ్బంది తప్పేది కాదు. ఇది కేంద్ర పాలిత ప్రాంతం. ఈ పరిస్థితుల్లో ఎలా పనిచేయాలో నేర్చుకుంటున్నాం. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకూ ఇది కొత్తే. ఆయనా నేర్చుకుంటున్నారు’అని ఒమర్ అబ్దుల్లా వివరించారు.

కేంద్రం నుంచి ఒత్తిళ్లు..

కేంద్ర ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లపై ఆయన మాట్లాడుతూ..ఇక్కడ తమకు రాజకీయ పరమైన ఒత్తిళ్ల కంటే వాతావరణ పరమైన సవాళ్లే ఎక్కువగా ఉన్నాయంటూ నవ్వారు. ఫిబ్రవరిలోనే ఎండలు మార్చి, ఏప్రిల్‌లో మాదిరిగా మండిపోతున్నాయి. రానున్న వేసవిలో నీటి కొరత తీవ్రం కానుందంటూ ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ‘వేడి ఎక్కువగా ఉంది. అయితే, అది కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్ నుంచీ, ఎవరైనా అధికారీ నుంచీ కాదు. వేడి వాతావరణం కారణంగా ఈసారి నీటి సమస్య తలెత్తనుంది. ఇతరత్రా సమస్యల కంటే దీనిని తీర్చడమెలాగన్నదే మాకు అతిపెద్ద సవాల్ కానుంది’అని ఆయన వివరించారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని విభాగాల అధికారులతో సమావేశం కానున్నామన్నారు. వచ్చే రోజుల్లో మంచు, వాన కురిస్తే బాగుంటుందని ప్రార్థిస్తున్నానన్నారు.

కనువిందుగా సూర్య కిరణాలు



బెంగళూరులోని యలహంకలో ‘ఏరో ఇండియా’ ప్రదర్శన గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. భారత వాయుసేనకు చెందిన సూర్య కిరణ్ ఏరోబిక్ బృందం ఆకాశంలో చేసిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి.



చిరుతను బంధించి తీసుకెళ్తున్న ఫారెస్ట్ అధికారులు

పెళ్లి వేడుకలో అనుకోని అతిథిగా చిరుత

గంటలపాటు కారులోనే బందీలుగా వధూవరులు

బంధువర్గమంతా కకావికలు ● లక్నోలో ఘటన.. పట్టుబడిన చిరుత

లక్నో: ‘హమ్ తుమ్ ఏక్ కమ్రె మె బంద్ హో.. ఔర్ రాత్ హో జాయె..’అంటూ సాగే పాపులర్ హిందీ సినిమా బాబీలోని పాటను కాస్త అటూ ఇటూగా మార్చి ‘హమ్ తుమ్ ఏక్ గాడీ మే బంద్ హో..ఔర్ షేర్ ఆ జాయె..’అంటూ పాడుకునే సందర్భమిది. పెళ్లి వేడుకలో అందరూ బిజిబిజీగా ఉన్న సమయంలో ఎక్కడి నుంచో హఠాత్తుగా ఓ చిరుతపులి ఫంక్షన్ హాల్‌లోకి ప్రవేశించింది. దీంతో, జనం హతాశులై ఎక్కడి వారక్కడే పరుగులు తీశారు. వరుడు, వధువు ఓ వాహనంలో డోర్‌లు బిగించుక్కూర్చున్నారు. దాదాపు గంటన్నరపాటు ఆ చిరుత అక్కడే తిరుగాడింది. పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారి ముకద్దర్ అలీ చిరుతను బంధించేందుకు యత్నించగా ఆయన చేతిని గాయపరిచింది. దీంతో, మిగతా సిబ్బంది వెనక్కి తగ్గారు. ఎట్టకేలకు మత్తు మందు ప్రయోగించి అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో చిరుతను బంధించారు. ఆ తర్వాతే పెళ్లి వేడుకను ముగించారు. ఈ ఘటన బుధవారం రాత్రి లక్నోలోని బుధేశ్వర్ రోడ్డు ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. అయితే, ఆ చిరుత జనసమ్మర్దం ఉండే ప్రాంతంలోకి, అందునా భవనంలోకి ఎలా ప్రవేశించింది? అనే విషయంపై దర్యాప్తు జరుపుతున్నామని అటవీ శాఖ మంత్రి అరుణ్ కుమార్ సక్సేనా చెప్పారు. సుమారు 90 కిలోల బరువున్న ఆ చిరుతను అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు.

భయాన్ని మెదడు ఎలా అధిగమిస్తుందంటే..

ఆందోళనను అడ్డుకునే తీరును కనిపెట్టిన శాస్త్రవేత్తలు | ఫోబియాలున్న వ్యక్తులను థెరపీలతో బాగుచేసేందుకు అవకాశం | శాస్త్రవేత్తల కీలక ముందడుగు

హఠాత్పరిణామానికి ఒక మనిషి భయపడిపోతే ఇంకొకరు నిర్భీతిలో నిశ్చలంగా ఉంటారు. ఒక భావనను ఇద్దరు వ్యక్తులు ఎలా వేర్వేరుగా స్వీకరిస్తారు?. కొందరికి భయంగా ఎందుకు అనిపించదు? అనే ప్రశ్నలకు శాస్త్రవేత్తలు ఎట్టకేలకు సమాధానాలు దొరికాయి. భయాలకు నెరవకుండా ధైర్యంగా మసులుకునేలా మానవ మెదడు ఎలా పనిచేస్తుందన్న విషయాన్ని తాజాగా శాస్త్రవేత్తలు కనిపెట్టారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లోని సెయిన్స్‌బరీ వెల్‌కమ్ సెంటర్‌లోని పరిశోధకుల బృందం భయానికి సంబంధించి మానవ మెదడు ఎలా ప్రతిస్పందిస్తుంది? అనే అంశంతోపాటు భయం వేళ మెదడు పనితీరుపై స్పష్టమైన అవగాహనకు వచ్చారు. ఈ వివరాలు ప్రఖ్యాత సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పలు రకాల ఫోబియాలు, ఆదుర్దా, ఏదైనా చికిత్స తర్వాత ఎదుర్కొనే సమస్యలను ఎదుర్కొనే రోగులను థెరపీ ద్వారా స్వస్థత చేకూర్చేందుకు కొత్త విషయాలు దోహదపడతాయని పరిశోధకులు చెబుతున్నారు.

తొలుత ఎలుకలపై ప్రయోగం

ప్రయోగం వివరాలను సెయిన్స్‌బరీ వెల్‌కమ్ సెంటర్‌లోని హోఫర్ ల్యాబ్‌లో పరిశోధకులు డాక్టర్ సారా మెడిరోస్, ప్రొఫెసర్ సోంజా హోఫర్ వివరించారు. ‘‘మనిషికి పుట్టుకతోనే కొన్ని భయాలుంటాయి. పెద్ద శబ్దాలు, హఠాత్తుగా తమ వైపు దూసుకొచ్చే వస్తువులను చూసి భయపడతాడు. అయితే కొన్నాళ్లకు కొన్ని భయాలు పోతాయి. చిన్నప్పుడు టపాసుల పేలుళ్ల భయపడిన వ్యక్తే ఆ తర్వాత తెగ టపాసులు కాలుస్తాడు. ఇదే తరహాలో ఎలుకలపైకి పక్షుల లాంటి వస్తువులు దూసుకొస్తున్నట్లు ప్రయోగం చేశాం. ఎగిరొచ్చే వాటి నీడ పెద్దదయ్యే కొద్దీ ఎలుకలు భయపడ్డాయి. ప్రాణభయంతో పారిపోయాయి. అయితే నీడను ఇలా పదే పదే పెద్దగా చేశాక కేవలం నీడ పరిమాణం మాత్రమే పెరగడం ఎలుకలు గమనించి, ఆ తర్వాత భయపడటం మానేశాయి. పారిపోకుండా అలాగే చూశాయి. ఇలాంటి దృగ్విషయంలో ఎలుక మెదడులోని వెంట్రో లేటరల్ జెనిక్యులేట్ న్యూక్లియస్(వీఎల్‌జీఎన్) అనే ప్రాంతం క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. మెదడులోని సెరిబ్రల్ కార్టెక్స్ ప్రాంతంలో నిక్షిప్తమయ్యే దృశ్యసంబంధ సమాచారం అత్యధికంగా వీఎల్‌జీఎన్‌కు బటావ్డా అవుతోంది. ఈ సమాచారాన్ని పదేపదే విశ్లేషించాక ఫలానా అంశంలో భయపడాల్సిన పనిలేదని వీఎల్‌జీఎన్ నిర్ధారిస్తోందని మేం ఓ అంచనాకొచ్చాం. దృశ్యసంబంధ కార్టెక్స్ అనేది ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకునేందుకు దోహపడుతోంది. ఇలాంటి అభ్యసన జ్ఞాపకాలు వీఎల్‌జీఎన్‌లో నిక్షిప్తమవుతున్నాయి. నేర్చుకోవడం, గుర్తుంచుకోవడం, ప్రవర్తనకు సంబంధించిన అంశాల్లో సెరబ్రల్ కార్టెక్స్‌దే కీలకపాత్ర అని ఇన్నాళ్లు భావించాం. కానీ అది తప్పు అని తేలింది. ఈ జ్ఞాపకాలన్నింటినీ వీఎల్‌జీఎన్ మాత్రమే భద్రపరుస్తోంది. దీంతో శ్వాస, గుండెలయ, స్పృహ, నిద్ర వంటి జ్ఞప్తియేతర విధులకు, అభ్యసన, ఆలోచన వంటి జ్ఞాపకశక్తి సంబంధ అంశాలకు మధ్య సంబంధం తెల్సుకునేందుకు అవకాశం చిక్కింది. వీఎల్‌జీఎన్ సర్క్యూట్‌లలో మార్పులు చేయడం ద్వారా రోగిని భయపడకుండా చేయొచ్చు. ఇందుకు సంబంధించి ఇంకా విస్తృతమైన పరిశోధనలు చేయాల్సి ఉంది’’ అని శాస్త్రవేత్తలు చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ నిరసన

న్యూఢిల్లీ: కేరళలో ప్రజలపై అడవి జంతువుల దాడులు, తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలు గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్లకార్డులు చేబూని పాల్గొన్నారు. కేరళలోని వయనాడ్‌లో డిసెంబర్ 27వ తేదీ నుంచి ఇప్పటి వరకు అడవి జంతువుల దాడుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోవడం, ఎంతో ఆందోళన చెందాల్సిన విషయమని ఎంపీ ప్రియాంక గాంధీ తెలిపారు. దాడులను నిలువరించేందుకు స్థానికులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా నిధుల లేమి కారణంగా ఫలప్రదం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి ప్రజల సమస్యను తీర్చాలని కోరారు. తీరం వెంబడి ఇసుక తవ్వకాలతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని చెప్పారు. గుజరాత్, కేరళ, అండమాన్ నికోబార్ దీవుల్లో తీర ప్రాంతాల వెంబడి ఇసుక తవ్వకాలు జరపాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్, ఆర్‌ఎస్‌పీ ఎంపీలు డిమాండ్ చేశారు.

దలైలామాకు జెడ్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ: టిబెట్‌కు చెందిన బౌద్ధుల ఆధ్యాత్మిక గురువు దలైలామా(89)కు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రత కల్పించింది. ఆయనకు ప్రాణహాని ఉందంటూ నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా దలైలామాకు మొత్తం 33 మంది సుశిక్షితులైన సాయుధ సిబ్బంది హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలోని ఆయన నివాసం వద్ద భద్రత కల్పిస్తారు. సాయుధ కమాండోలు 24 గంటలూ కంటికి రెప్పలా కాపాడుతారు. 1959లో టిబెట్‌లో చెలరేగిన తిరుగుబాటును చైనా అణచివేసింది. అప్పటి నుంచి శిష్యగణంతో తరలివచ్చిన దలైలామా ధర్మశాలలో ఉంటున్నారు. ఆయనకు ప్రభుత్వం ఉన్నత స్థాయి భద్రత కల్పిస్తోంది. జులైలో 90వ పుట్టిన రోజు సందర్భంగా దలైలామా తన వారసుడిని ప్రకటిస్తారని భావిస్తున్నారు.

ఇద్దరు సహచర జవాన్లను చంపి..

ఇంఫాల్: సీఆర్పీఎఫ్ జవాను ఒకరు ఇద్దరు సహచరులను కాల్చి చంపి, ఆపై తనను తాను కాల్చుకున్నారు. ఈ ఘటన ఇంఫాల్‌లోని లంఫెల్ సీఆర్పీఎఫ్ క్యాంపులో గురువారం రాత్రి 8.20 గంటల సమయంలో చోటుచేసుకుంది. హవిల్దార్ సంజయ్ కుమార్ తన వద్ద ఉన్న రైఫిల్‌తో ఒక కానిస్టేబుల్‌ను, సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కాల్చారు. అదే తుపాకీతో కాల్చుకున్నారు. ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయపడిన మరో 8 మంది జవాన్లను వెంటనే ఇంఫాల్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఘటనకు కారణాలు తెలియరాలేదు. సీఆర్పీఎఫ్ అధికారులు దీనిపై స్పందించలేదు.

రేడియో దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రపంచ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ‘‘హ్యాపీ వరల్డ్ రేడియో డే. రేడియో ఎందరికో కాలాతీత జీవనాధారంగా, ప్రజలకు సమాచారం, ప్రేరణ, అనుసంధానంగా ఉంది. వార్తలు, సంస్కృతి నుంచి సంగీతం, కథానిక వరకు, ఇది సృజనాత్మకతకు శక్తివంతమైన మాధ్యమం. రేడియో ప్రపంచంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నాను’’అని మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతా ‘ఎక్స్’లో గురువారం ఒక పోస్ట్ చేశారు. ఈ నెల 23న జరగనున్న ‘మన్ కీ బాత్’కార్యక్రమం కోసం ప్రజలు తమ ఆలోచనలు, అభిప్రాయాలను తనతో పంచుకోవాలని మోదీ కోరారు.

ఫోన్ చూడొద్దని తల్లి మందలించిందని

20వ అంతస్తు నుంచి దూకి బాలిక ఆత్మహత్య

బెంగళూరు: మొబైల్ ఫోన్ వాడొద్దని తల్లి హెచ్చరించిందని బెంగళూరులో బాలిక ప్రాణాలు తీసుకుంది. తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో 20వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బెంగళూరు శివార్లలోని కడుగోడి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని సీబీఎస్‌ఈ పాఠశాలలో అవంతిక చౌరాసియా అనే బాలిక చదువుతోంది. వారి కుటుంబం మధ్య ప్రదేశ్ నుంచి వచ్చి కర్ణాటకలో స్థిరపడింది. బాలిక తండ్రి ఇంజనీర్ కాగా తల్లి గృహిణి. ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక గత పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి. ఈ నెల 15 నుంచే వార్షిక పరీక్షలున్నాయి. అయితే బాలిక సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తుండటంతో తల్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫోన్‌ను వాడొద్దని, చదువుపై దృష్టి పెట్టాలని మందలించింది. మనస్తాపానికి గురైన బాలిక అపార్ట్‌మెంట్ 20వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కడుగోడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైవాన్ హోటల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

నలుగురు మృతి, 26 మందికి గాయాలు

తైపీ: తైవాన్‌లోని తైచుంగ్ నగరంలోని ఓ హోటల్‌లో సంభవించిన గ్యాస్ సిలిండర్ పేలుడులో నలుగురు చనిపోగా మరో 26 మంది గాయపడ్డారు. షిన్ కాంగ్ మిట్సుకోషి డిపార్టుమెంట్ స్టోర్ నిర్వహించే 12వ ఫ్లోర్‌లోని హోటల్‌లో గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు చైనాలోని మకావూకు చెందిన వారని అధికారులు తెలిపారు. ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది.

ట్రంప్ బృందంలో పాల్ కపూర్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికార బృందంలో మరో భారత సంతతి వ్యక్తికి చోటు లభించింది. అమెరికా దక్షిణాసియా వ్యవహారాల సహాయ కార్యదర్శిగా ఎస్.పాల్ కపూర్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా సెనేట్ పరిశీలించి ధ్రువీకరిస్తే ప్రస్తుత సహాయ కార్యదర్శి అయిన డొనాల్డ్ లూ స్థానంలో పాల్‌కపూర్ బాధ్యతలు చేపడతారు. ఆ తర్వాత భారత్ సహా దక్షిణాసియా ప్రాంతంలో అమెరికా దౌత్య సంబంధాల్లో కపూర్ కీలక పాత్ర పోషించనున్నారు. కపూర్ ప్రస్తుతం నేవల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2020 నుంచి 2021 వరకు స్టేట్ డిపార్ట్‌మెంట్ పాలసీ ప్లానింగ్ సిబ్బందిగా పనిచేశారు. దక్షిణ, మధ్య ఆసియా, ఇండో–పసిఫిక్ , అమెరికా–ఇండియా సంబంధాలకు సంబంధించిన సమస్యలపై పనిచేశారు. అంతకుముందు కపూర్ క్లేర్‌మోంట్ మెకెనా కళాశాలలో బోధించారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన ‘జిహాద్ యాజ్ గ్రాండ్ స్ట్రాటజీ: ఇస్లామిక్ మిలిటెన్సీ’, ‘నేషనల్ సెక్యూరిటీ అండ్ ది పాకిస్తానీ స్టేట్’, ‘దక్షిణాసియాలో సంఘర్షణ’తదితర పుస్తకాలు రచించారు. ‘ఇండియా, పాకిస్తాన్ అండ్ ది బాంబ్: డిబేటింగ్ న్యూక్లియర్ స్టెబిలిటీ ఇన్ సౌత్ ఏషియా’ అనే పుస్తకానికి సహ రచయితగా వ్యవహరించారు. ‘ది ఛాలెంజెస్ ఆఫ్ న్యూక్లియర్ సెక్యూరిటీ: యూఎస్ అండ్ ఇండియన్ పర్స్పెక్టివ్స్’కు సహ సంపాదకత్వం వహించారు.

సైనిక నిర్బంధంలో వెనిజులా వలసదారులు

వాషింగ్టన్: గ్వాంటనామో బేలోని వలసదారుల నిర్బంధ కేంద్రానికి చేరుకున్న వెనిజులా వలసదారుల పర్యవేక్షణా బాధ్యతలను సాధారణ ఇమ్మిగ్రేషన్ సిబ్బందికి బదులు సైనిక అధికారులు చూస్తున్నారు. వలసదారులు ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కస్టడీలో ఉన్నారని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ వలసదారులను సైనిక బలగాలు, వైద్యుల బృందాలు చూసుకుంటున్నాయని తాజాగా న్యూయార్క్‌టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. గ్వాంటనామోలో వలసదారుల నిర్బంధ కేంద్రాలను విస్తరించే ప్రణాళికలను ట్రంప్ ప్రకటించిన తరువాత ఇటీవల కొందరు వలసదారులను గ్వాంటనామోకు పంపిన విషయం తెల్సిందే. గ్వాంటనామోలో ఉంచిన వలసదారులకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించిన వివరాల్లో వారి జాతీయత మినహా మరే సమాచారం లేదు. ఆరో నంబర్ వలసదారుల శిబిరంలో 53 మంది పురుషులను ఉంచారు. గతంలో ఈ శిబిరంలో అల్‌ఖైదా అనుమానిత ఉగ్రవాదులను నిర్బంధించారు. ఈ శిబిరంలో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. సౌకర్యాలులేని శిబిరంలో వలసదారులను ఉంచారని, తాజా ఆహారం అందించకుండా ప్యాక్‌చేసి తీసుకొచ్చిన సైనిక ఆహారాన్నే వలసదారులకు అందిస్తున్నట్లు తెలుస్తోంది.

చట్టవిరుద్ధంగా రావడమే నేరం: ట్రిసియా

దాదాపు 100 మందిని గ్వాంటనామో కేంద్రానికి తీసుకొచ్చాం. వీరందరికీ బహిష్కరణ ఉత్తర్వులు అందాయి. చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించి ప్రతి ఒక్కరూ నేరానికి పాల్పడ్డారు. వీరిలో హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడిన ముఠా సభ్యులు, అక్రమ విదేశీయులు ఉన్నారు’’అని హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతినిధి ట్రిసియా మెక్ లాఫ్లిన్ చెప్పారు. అయితే, బందీలందరూ చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించలేదని, కొందరు శరణార్థులుగా పరిగణించి ఆశ్రయం కల్పించాలని కోరగా వారి అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం తిరస్కరించి వారిని కూడా అరెస్ట్‌చేసిందని వార్తలొచ్చాయి.

కర్ణాటకలో ప్రారంభమైన కుంభమేళా

మైసూరు: కర్ణాటకలో 13వ చరిత్రాత్మక కుంభమేళా ప్రారంభమైంది. మైసూరు జిల్లా టి.నరసిపురలోని కావేరి, కపిల, స్ఫటికా సరోవర నదులు కలిసే త్రివేణి సంగమంలో కుంభమేళా మొదలైంది. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, సాధువులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లడానికి బదులుగా కర్ణాటకలో జరిగే కుంభమేళాకు హాజరుకావాలని భక్తులను కోరారు. ‘‘త్రివేణి సంగమంలో భాగమైన గంగా, యమున, సరస్వతి నదులకు ఎలాగైనా దైవత్వం, స్వచ్ఛత ఆపాదించారో కావేరి నదికి సైతం అంతే ప్రాశస్త్యం ఉందని మన పురాణాల్లో పేర్కొన్నారు. అందుకే ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌కు వెళ్లి అక్కడ కిక్కిరిసిన జనం మధ్య ఇబ్బందులు పడే బదులు కర్ణాటకలో దక్షిణభారత ప్రయాగ్‌రాజ్‌గా వినతికెక్కిన టి.నరసిపుర త్రివేణి సంగమ స్థలికి విచ్చేయండి. పుణ్యస్నానాలు ఆచరించండి. అత్యంత పటిష్టవంతంగా, భక్తులకు సౌకర్యవంతంగా ఇక్కడ కుంభమేళాకు ఏర్పాట్లుచేశాం’’అని భక్తులకు శివకుమార్ పిలుపునిచ్చారు.



అలెగ్జాండర్ విన్నిక్ (ఫైల్)

రష్యన్ సైబర్ నేరస్తుడిని విడుదల చేసిన అమెరికా

వాషింగ్టన్: రష్యాతో సంబంధాలను పునరుద్ధరించడానికి, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడింది. ఖైదీల మార్పిడిలో భాగంగా బుధవారం రష్యాకు చెందిన సైబర్ నేరస్థుడు అలెగ్జాండర్ విన్నిక్‌ను అమెరికా విడుదల చేసింది. అమెరికన్ ఉపాధ్యాయుడు మార్క్ ఫోగెల్‌ను రష్యా విడుదల చేసినందుకు ప్రతిగా విన్నిక్‌ను విడుదలచేసినట్లు తెలుస్తోంది. విన్నిక్ మనీలాండరింగ్ ఆరోపణలపై 2017లో గ్రీస్‌లో అరెస్టయ్యారు. ఆయనను గ్రీస్ 2022లో అమెరికాకు అప్పగించింది. తన క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ బీటీసీ–ఈ ద్వారా రాన్సమ్‌వేర్ దాడులు, ఐడీ చోరీ, మాదకద్రవ్యాల ముఠాలతో సంబంధాలు, ఇతర నేరాల ద్వారా 4 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నందుకు మనీలాండరింగ్ చట్టాల కింద విన్నిక్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ నేరాలను విన్నిక్ 2024 మేలో అంగీకరించాడు. అప్పటినుంచి జైలులో ఉన్నారు.

మొత్తం 11 మంది విడుదల

ఫోగెల్ విడుదల ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించడానికి తాము సరైన దిశలో వెళ్తున్నామనడానికి సంకేతమని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్జ్ అన్నారు. ఖైదీల మార్పిడి అమెరికా, రష్యాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పాదుకొల్పడానికి సహాయపడిందని రష్యా అధ్యక్షకార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. ఇవి పరస్పర నమ్మకాన్ని పెంపొందించే చర్యలే తప్ప ఉక్రెయిన్ కోణంలో చేస్తున్న పనులు కావని ఆయన స్పష్టంచేశారు. రష్యాకు సన్నిహిత మిత్రదేశమైన బెలారస్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న మరో అమెరికా పౌరుడిని కూడా విడుదల చేసినట్లు అమెరికా అధ్యక్షభవనం బుధవారం ప్రకటించింది. బెలారస్‌లో అన్యాయంగా నిర్బంధించబడిన ఒక అమెరికన్‌ను, ఇద్దరు రాజకీయ ఖైదీలు విడుదల అయ్యారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తెలిపారు. ఇతర దేశాల్లోని అమెరికా పౌరుల విడుదలకు కృషిచేస్తున్నామని రూబియో చెప్పారు. ఇవి ట్రంప్ మధ్యవర్తిత్వ సామర్థ్యానికి నిదర్శనమని వైట్ హౌస్ వ్యాఖ్యానించింది. గత నెలాఖరులో ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విదేశ కారాగారాల నుంచి ఇప్పటిదాకా 11 మంది అమెరికన్లు విడుదలయ్యారు.

న్యాయ పంచాయతీల ఉద్దేశం ఏమిటి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారతదేశ అభివృద్ధిలో గ్రామాల పాత్ర అత్యంత కీలకం. గ్రామీణ అభివృద్ధి, సమాజ వికాస సాధనలో స్థానిక ప్రభుత్వాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదా కల్పించారు. అందువల్ల దీన్ని 'పంచాయతీరాజ్ చట్టం' అని కూడా అంటారు.

73వ రాజ్యాంగ సవరణ చట్టం

స్థానిక ప్రభుత్వాల బలోపేతం ద్వారా గ్రామీణ వికాసాన్ని సాధించడానికి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని 1986లో నియమించిన ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ సిఫార్సు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989లో 64వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందగా రాజ్యసభలో తిరస్కరించారు. అనంతరం పి.వి.నరసింహారావు ప్రభుత్వం 1991లో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. పార్లమెంట్ దీన్ని 1992లో ఆమోదించగా, రాష్ట్రపతి 1993 ఏప్రిల్ 20న ఆమోదించారు. ఇది 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం గురించి ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అధికరణలు 243(ఎ) నుంచి 243(ఒ) వరకు దీని గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా 9వ భాగంలో చేర్చారు. ఈ చట్టంలో చేర్చిన మొత్తం అంశాలు 29.

243వ అధికరణ నిర్వచనాలు

జిల్లా, గ్రామసభ, మాధ్యమిక స్థాయి (మండల పరిషత్), పంచాయతీ ఏరియా, జనాభా మొదలైన అంశాలపై గవర్నర్ నోటిఫికేషన్ ద్వారా నిర్వచనాలు తెలియజేస్తారు.

అధికరణ 243(ఎ) – గ్రామసభ: పంచాయతీరాజ్ చట్టం ద్వారా గ్రామసభకు అత్యంత ప్రాముఖ్యం కల్పించారు. దీంట్లో గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. గ్రామసభ కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. సమావేశాల కోరం 1/10వ వంతు. గ్రామ సర్పంచ్ ఈ సమావేశాలను ఏర్పాటు చేసి, నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీ దీనికి సమష్టి బాధ్యత వహిస్తుంది. ఈ సమావేశాల్లో గ్రామ పంచాయతీ ఎజెండాను రూపొందిస్తారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి దీన్ని ప్రాతిపదికగా భావించవచ్చు.

అధికరణ 243 (బి)– పంచాయతీల వ్యవస్థాపన: ప్రతి రాష్ట్రంలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. 20 లక్షల లోపు జనాభా ఉన్న రాష్ట్రాల్లో మాధ్యమిక వ్యవస్థ తప్పనిసరి కాదు.

1. **గ్రామ పంచాయతీ:** 500ల మందికి మించి జనాభా ఉన్న గ్రామాన్ని గ్రామ పంచాయతీగా గుర్తించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య సుమారుగా 21,590. తెలంగాణలో గ్రామాల సంఖ్య సుమారుగా 8872. వార్షిక ఆదాయం 60 వేలు దాటితే మేజర్ పంచాయతీగా, అంత కంటే తక్కువగా ఉంటే మైనర్ పంచాయతీగా పేర్కొంటారు.
2. **మండల పరిషత్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986లో ప్రవేశపెట్టారు. సుమారుగా 40 వేల జనాభాకు 20 నుంచి 30 గ్రామాలను కలుపుతూ మండలాన్ని ఏర్పాటు చేశారు.
3. **జిల్లా పరిషత్:** పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

అధికరణ 243 (సి) – పంచాయతీల నిర్మాణం: రాష్ట్ర శాసన సభ నిర్ణయించిన చట్టాల మేరకు పంచాయతీల నిర్మాణం ఉంటుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌లో ప్రధానంగా ఆరు విభాగాలుంటాయి.

జిల్లా పరిషత్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1) ప్రత్యక్షంగా ఎన్నికైన జడ్పీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యులు

వీరితోపాటు జిల్లా గ్రంథాలయ, సహకార బ్యాంక్, డెయిరీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శాశ్వత ఆహ్వానిత సభ్యులుగా కొనసాగుతారు.

జిల్లా పరిషత్ ఛైర్మన్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

జిల్లా మహాసభ: జిల్లా పరిషత్ మండల పరిషత్‌కు మధ్య వారధిగా పనిచేస్తుంది. జడ్పీటీసీ, ఎంపీపీలు సభ్యులుగా కొనసాగుతారు.

స్థాయీ సంఘం: జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘాల పాత్ర కీలకమైంది. అందువల్ల వీటిని 'స్థానిక ప్రభుత్వాల కళ్లు, చెవులు'గా పేర్కొంటారు. ప్రతి జిల్లా పరిషత్‌లో ఏడు స్థాయీ సంఘాలు ఉంటాయి.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో): సీఈవోగా సీనియర్ గ్రూప్–1 అధికారిని నియమిస్తారు. ఈయన జిల్లా సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

కలెక్టర్: జిల్లా పరిపాలనలో ఈయనే ముఖ్యులు. జిల్లాకు ఈయన ప్రధాన న్యాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎన్నికలు, శాంతి భద్రతలు, పౌరసరఫరా, కరవు కాటకాల అధికారిగా వ్యవహరిస్తారు.

మండల పరిషత్

మండల పరిషత్‌లో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

మండల పరిషత్ కౌన్సిల్: దీంట్లో మూడు రకాల సభ్యులుంటారు.

1) పార్టీ ప్రాతిపదికన ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యుడు

మండల పరిషత్ ప్రెసిడెంట్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మండల మహాసభ: మండల పరిషత్‌కు గ్రామ పంచాయతీకి మధ్య వారధిగా పనిచేస్తుంది. దీంట్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ దీని సమావేశాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తారు.

ఎంపీడీవో: గ్రూప్–1 అధికారిని ఎంపీడీవోగా నియమిస్తారు. ఈయన మండల సమాచారాన్ని జిల్లా పరిషత్‌కు అందజేస్తారు.

గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయతీలో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.


పంచాయతీ బోర్డు: వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వీరి సంఖ్య కనిష్ఠంగా 5, గరిష్ఠంగా 21 ఉండాలి. పంచాయతీ బోర్డు కనీసం నెలకు ఒకసారి సమావేశం కావాలి.

సర్పంచ్: గ్రామ ఓటర్లు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. గ్రామ ప్రథమ పౌరుడు ఈయనే. ఈయనను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించే అవకాశం లేదు.

గ్రామసభ: గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి.

పంచాయతీ కార్యదర్శి: ఈయన ప్రభుత్వ ఉద్యోగి. గ్రామ పంచాయతీ సమాచారాన్ని మండల పరిషత్‌కు అందజేస్తారు.

అధికరణ 243(డి)–రిజర్వేషన్లు: ఎస్సీ,ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన, మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించారు. బీసీ రిజర్వేషన్లను రాష్ట్రాలే నిర్ణయిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలకు 18.25 శాతం, ఎస్టీలకు 8.25 శాతం, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మహిళా రిజర్వేషన్‌ను ఇటీవల కొన్ని రాష్ట్రాలు 50 శాతానికి పెంచాయి. దీన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం బీహార్.



అధికరణ 243 (ఇ) – పంచాయతీల పదవీ కాలం: స్థానిక ప్రభుత్వాల సాధారణ కాల పరిమితి అయిదేళ్లు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రద్దుచేయవచ్చు. ఒకవేళ ముందుగా రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి.

అధికరణ 243 (ఎఫ్) – పంచాయతీ సభ్యుల అనర్హతలు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా ఈ అనర్హతలను నిర్ణయిస్తుంది. 21 ఏళ్ల లోపు ఉన్నవారు పోటీ చేసేందుకు అనర్హులు. 1995 తర్వాత ఇద్దరికి మించి సంతానం ఉన్నవారు అనర్హులు.

అధికరణ 243 (జి) – పంచాయతీల విధులు, అధికారాలు: పంచాయతీలకు 29 అంశాలకు సంబంధించిన విధులు, అధికారాలను కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు బదలాయించాలి.

ఉదాహరణలు:

1) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2) భూ సంస్కరణలు, భూ పరిరక్షణ
3) తాగునీరు, సాగునీటి సరఫరా
4) పశు సంరక్షణ, కోళ్ల పరిశ్రమ
5) చేపలు
6) వనసంరక్షణ, సామాజిక అడవులు

అధికరణ 243(హెచ్)– పంచాయతీల ఆదాయ వనరులు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా పంచాయతీలకు కొన్ని పన్నులను విధించే అధికారం కల్పిస్తుంది. కొన్ని పన్నుల్లో వాటా, సహాయ నిధులను కూడా ఇస్తుంది.

అధికరణ 243 (ఐ) – రాష్ట్ర ఆర్థిక సంఘం: రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గవర్నర్ ఏర్పాటు చేస్తారు. దీని పదవీ కాలం 5 ఏళ్లు. ఇందులో ఛైర్మన్, సభ్యులు ఉంటారు. వీరిని నియమించే, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఆర్థిక సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. దీని ఛైర్మన్ లక్ష్మణస్వామి. రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులు, పన్నుల విభజన, ఇతర సహాయ గ్రాంట్ల గురించి సిఫార్సులు చేస్తుంది. సంబంధిత నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తుంది. గవర్నర్ శాసనసభకు అందజేస్తారు.

అధికరణ 243 (జె) – పంచాయతీ ఖాతాల ఆడిటింగ్: పంచాయతీల ఆడిటింగ్ నిర్వహణకు శాసన చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ విధులను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు నిర్వహిస్తున్నారు.

అధికరణ 243 (కె) – రాష్ట్ర ఎన్నికల కమిషన్: పంచాయతీలకు సకాలంలో సక్రమంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపొందించడం తదితర విధులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఎన్నికల కమిషనర్‌ను గవర్నర్ నియమిస్తారు. ఈయన పదవీ కాలం అయిదేళ్లు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. మొదటి కమిషనర్ కాశీ పాండ్యన్. 2014లో తెలంగాణకు ప్రత్యేక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీని కమిషనర్ నాగిరెడ్డి.

అధికరణ 243(ఎల్) – కేంద్ర పాలిత ప్రాంతాలకు అనువర్తన: పంచాయతీరాజ్ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా వర్తింపజేయవచ్చు. శాసనసభ ఉంటే శాసనసభ ప్రత్యేక తీర్మానం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. శాసనసభ లేకుంటే రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వర్తింపజేయవచ్చు.

అధికరణ 243 (ఎం) – మినహాయింపులు: పంచాయతీరాజ్ చట్టం నుంచి కొన్ని ప్రాంతాలకు మినహాయింపులు ఇచ్చారు. ముఖ్యంగా జమ్ము–కశ్మీర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, షెడ్యూల్ ప్రాంతాలు, మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి మినహాయింపులు ఉన్నాయి.

అధికరణ 243 (ఎన్) – పాత చట్టాల కొనసాగింపు: ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది వరకు పాత చట్టాలు అమల్లో ఉండవచ్చు. అంతకు ముందు రాష్ట్ర శాసనసభ 73వ సవరణ చట్టం మౌలిక స్వరూపానికి భంగం వాటిల్లకుండా సొంత చట్టాలను రూపొందించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన చట్టం 1994 నుంచి అమల్లోకి వచ్చింది.

అధికరణ 243 (ఒ)– న్యాయస్థానాల జోక్యం: పంచాయతీల్లో నియోజకవర్గాల ఏర్పాటు, వాటిలో సీట్ల కేటాయింపు గురించి న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. వీటి వివాదాల పరిష్కారానికి శాసనసభ తీర్మానం ద్వారా లీగల్ అథారిటీలను ఏర్పాటు చేయాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జిల్లాపరిషత్ ఛైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) మండల పరిషత్ అధ్యక్షులు
   సి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   డి) జిల్లాలోని సర్పంచ్‌లు
2. పంచాయతీరాజ్ వ్యవస్థను మొదటగా1959 అక్టోబరులో ఏ రాష్ట్రం అమలు చేసింది?
   ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
   సి) కర్ణాటక డి) కేరళ
3. న్యాయ పంచాయతీల ఉద్దేశం ఏమిటి?
   ఎ) గ్రామ పంచాయతీలను నిర్వహించడం
   బి) పంచాయతీ ప్రెసిడెంట్ ఇచ్చిన తీర్పులను కొట్టేయడం
   సి) హైకోర్టు అప్పీలుకు అనుమతి ఇవ్వడం
   డి) గ్రామీణ ప్రజలకు త్వరగా ఎక్కువ ఖర్చు లేకుండా న్యాయాన్ని అందించడం
4. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు కింది వాటిలో ఏ రాష్ట్రాలకు వర్తించవు?
   ఎ) గోవా, జమ్ము–కశ్మీర్, పాండిచ్చేరి
   బి) ఢిల్లీ, గోవా, మిజోరాం, మేఘాలయ
   సి) మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం
   డి) సిక్కిం, అసోం, మిజోరాం
5. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏ ముఖ్యమంత్రి కాలంలో ప్రవేశపెట్టారు?
   ఎ) నీలం సంజీవరెడ్డి
   బి) దామోదరం సంజీవయ్య
   సి) కాసు బ్రహ్మానందరెడ్డి
   డి) పి.వి. నరసింహారావు

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ.

ఏ గాలి ఎక్కువ పీడనాన్ని కలిగిస్తుంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

వాతావరణ పీడనం - పీడన మేఖలలు

మన చుట్టూ ఉన్న గాలిలో చాలా వాయు పరమాణువులు ఉంటాయి. ఆ పరమాణువులు ఒకదానిపై ఒకటి ఒత్తిడిని కలిగిస్తాయి. లేదా వాటి దారిలోకి వచ్చిన వాటిపై ఒత్తిడి కలిగిస్తాయి.

ఏ వస్తువు పై అయినా చూపే ఒత్తిడి ప్రభావాన్ని 'వాయు పీడనం' అంటారు. గాలి పై నుంచే కాకుండా అన్ని వైపుల నుంచి పీడనాన్ని కలిగిస్తుంది. గాలికి బరువు ఉంటుంది అని కనుగొన్న మొదటి శాస్త్రవేత్త గెలీలియో.

- వాయు పరమాణువులు వేడెక్కినప్పుడు వాటికి ఎక్కువ శక్తి లభించి వేగంగా కదులుతాయి. దీనివల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఎక్కువ పరమాణువులు వాతావరణంలోని పైపొరలోకి వెళ్లినప్పుడు భూమికి దగ్గరగా వాటి సంఖ్య తగ్గుతుంది. అదేవిధంగా పీడనం తగ్గుతుంది.
- గాలి వేడెక్కినప్పుడు పీడనం తగ్గి, గాలి చల్లబడినప్పుడు పీడనం పెరుగుతుంది. గాలి, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.
- వేడెక్కిన గాలి పైకి వెళుతున్న కొద్దీ భూమి ఉపరితలం నుంచి పొందిన శక్తిని వేడిమి రూపంలో కోల్పోవడం మొదలు పెడుతుంది. శక్తి తగ్గినప్పుడు పరమాణువుల వేగం తగ్గి, మందకొడిగా తయారై దగ్గర దగ్గరవుతాయి. గాలి చల్లబడి గట్టిగా అవుతుంది. ఇలా చిక్కబడిన గాలి భూమ్యాకర్షణ శక్తి వల్ల ఉపరితలం దగ్గరకు వస్తుంది. చల్లటి గాలి కిందికి దిగిన చోట వాయుపీడనం పెరుగుతుంది.
- భూమిలో ఒక భాగం వేడెక్కి పీడనం తగ్గిందంటే.. అక్కడ తక్కువ పరమాణువులు, ఎక్కువ ఖాళీ ఉందని అర్థం. అధిక పీడనం ఉన్న ప్రాంతాల నుంచి గాలి ఈ ఖాళీ ప్రదేశాల వైపు కదులుతుంది. అందువల్లే గాలి ఎక్కువ పీడనం ఉన్న ప్రాంతాల నుంచి తక్కువ పీడనం ఉన్న ప్రాంతాలకు వీస్తుంది.

వాతావరణ పీడనం

ఏదైనా ఒక ప్రదేశంపై ఉన్న వాయువుల పొర బరువును ఆ ప్రదేశానికి సంబంధించిన 'వాతావరణ పీడనం' అంటారు. వాతావరణ పీడనాన్ని కొలిచే సాధనం భారమితి. కాబట్టి దీన్ని భారమితి పీడనం అంటారు.

భారమితిలో పాదరస మట్టం అకస్మాత్తుగా తగ్గడం తుపాను రాకను తెలుపుతుంది. అదేవిధంగా భారమితిలో పాదరస మట్టం పెరగడం ప్రశాంత వాతావరణాన్ని తెలుపుతుంది.

సముద్రమట్టం వద్ద సామాన్య (లేదా) ప్రామాణిక వాతావరణ పీడనం ఉన్నప్పుడు పాదరస మట్టం ఎత్తు 760 మి.మీ. లేదా 29 అంగుళాలుగా ఉంటుంది. భారమితిలో పాదరస మట్టం 760 మి.మీ. ఉన్నప్పుడు వాతావరణ పీడనం 1013.2 మిల్లీబార్లుగా ఉంటుంది. పాదరస మట్టం ఎత్తు 3 మి.మీ. అయితే అది 4 మిల్లీబార్ల వాతావరణ పీడనానికి సమానం.

వాతావరణ పీడనాన్ని ప్రభావితం చేసే అంశాలు:

ఎత్తు

భూమి ఆకర్షణ శక్తి వల్ల వాతావరణం కింది పొరలు దట్టంగా ఉండి అధిక పీడనం కలిగిస్తాయి. కాబట్టి భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లే కొద్దీ పీడనం తగ్గుతుంది. ప్రతి 10 మీటర్ల ఎత్తుకు ఒక మిల్లీబారు చొప్పున (లేదా) 300 మీటర్లకు 34 మిల్లీబార్ల పీడనం తగ్గుతుంది.

ఉష్ణోగ్రత

వేడెక్కిన గాలి వ్యాకోచించి తేలికగా ఉంటుంది. చల్లటి గాలి సంకోచించి ఎక్కువ బరువుగా ఉంటుంది. ఉష్ణోగ్రత పెరిగితే పీడనం తగ్గుతుంది. ఉష్ణోగ్రత తగ్గితే పీడనం పెరుగుతుంది. ఉష్ణోగ్రత, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.

నీటి ఆవిరి

పొడి గాలి కంటే నీటి ఆవిరి తేలికగా ఉంటుంది. కాబట్టి వాతావరణంలో నీటి ఆవిరి పరిమాణం ఎక్కువైతే పీడనం తగ్గుతుంది.

పీడన మేఖలలు

క్షితిజ సమాంతరంగా భూమి ఉపరితలంపై వివిధ పీడన మేఖలలు ఏర్పడ్డాయి. అధిక, అల్పపీడన మేఖలలు ఒకదాని తర్వాత ఒకటిగా ఏర్పడ్డాయి.

- భూగోళంపై మొత్తం 7 పీడన మేఖలలు ఉన్నాయి.

భూమధ్యరేఖ అల్పపీడన మేఖల

ఇది 10° ఉత్తర అక్షాంశం నుంచి 10° దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది. ఇది అధిక ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడింది. దీన్ని నిర్వాత మండలం, డోల్‌డ్రమ్, ప్రశాంత మండలం అని కూడా అంటారు. ఈ మేఖలలో సూర్యకిరణాలు నిట్టనిలువుగా ప్రసరించడం వల్ల రోజూ సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. ఈ విధమైన వర్షపాతాన్ని 'సంవహన వర్షపాతం' అంటారు.

ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల

ఇది 23 1/2° ఉత్తరార్ధగోళం నుంచి 35° దక్షిణార్ధ గోళంలో విస్తరించి ఉంది. భూమధ్యరేఖ నుంచి పైకి తేలి వచ్చే వాయువులు సంకోచించి ఇది ఏర్పడుతుంది. ఈ మండలాన్ని 'నిమజ్జిత మండలం' అంటారు.

ఉప ధ్రువ అల్ప పీడన మేఖల (లేదా) సమశీతోష్ణ అల్పపీడన మేఖల

ఈ మేఖలలు 45°–66 $^1/_2$° అక్షాంశాల మధ్య, పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాలు మధ్య భాగంలో ఏర్పడతాయి. ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల నుంచి వచ్చే వేడి గాలులు ధ్రువ అధిక పీడన మేఖల నుంచి వీచే చల్ల గాలులు అభిసరణం చెందడం వల్ల అల్పపీడన మేఖల ఏర్పడుతుంది.

ధ్రువ అధిక పీడన మేఖల

ఇది 75° నుంచి 90° అక్షాంశాల మధ్య, అతిశీతల ప్రాంతం, అధిక గురుత్వాకర్షణ బలాలు పనిచేయడం వల్ల ధ్రువ ప్రాంతాల్లో అధిక పీడన మేఖలలు ఏర్పడతాయి. ఈ ప్రాంతంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించడం వల్ల అధిక పీడనాలు ఏర్పడతాయి.

పీడన ప్రవణత

ఒక ప్రమాణ వైశాల్యం ఉన్న భూభాగంపై పీడనంలో కలిగే మార్పు రేటును 'పీడన ప్రవణత' అంటారు.

ముఖ్యాంశాలు

- సూర్య గమనాన్ని బట్టి అల్ప, అధిక పీడన మేఖలలు ఉత్తరం వైపు, దక్షిణం వైపు జరుగుతూ ఉంటాయి.
- భూగోళంపై ఇప్పటి వరకు నమోదైన అధిక వాతావరణ పీడనం 1083.3 మిల్లీ బార్లు. 1963 డిసెంబర్ 31న సైబీరియాలోని అగాటా వద్ద దీన్ని గుర్తించారు.
- 1979 అక్టోబర్ 12న మెరియానా దీవుల్లో 'టిప్' అనే చక్రవాతంలో గుర్తించిన అత్యల్ప వాతావరణ పీడనం 870 మిల్లీబార్లు.
- ప్రపంచపటంలో సమానమైన పీడనం ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలను 'సమభార రేఖలు' అంటారు. ఇవి వేసవిలో భూభాగంపై ఉత్తర దిశకు, సముద్రంపై దక్షిణం వైపు వంగి ఉంటాయి.
- శీతాకాలంలో సమభార రేఖలు భూమి మీద దక్షిణం వైపు సముద్రం మీద ఉత్తరం వైపు వంగి ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలో ప్రతి 300 మీటర్ల ఎత్తుకు ఎన్ని మిల్లీబార్ల వాతావరణ పీడనం తగ్గుతుంది?
   1) 1 మిల్లీబారు 2) 12 మిల్లీబార్లు
   3) 34 మిల్లీబార్లు 4) 30 మిల్లీబార్లు
2. పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాల మధ్య ఏర్పడిన అల్పపీడన మేఖల?
   1) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
   2) ఉపధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) అధిక పీడన ధ్రువ మేఖల
3. అధిక గురుత్వాకర్షణ బలాల వల్ల ఏర్పడ్డ పీడన మేఖల?
   1) అధిక పీడన ధ్రువ మేఖల
   2) ఉప ధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
4. ఉరుములు, మెరుపులతో సంభవించే వర్షపాతం?
   1) చక్రవాత 2) పర్వతీయ
   3) నిమ్నోన్నత 4) సంవహన
5. కింది వాటిలో అభిసరణ మండలం ఏది?
   1) భూమధ్యరేఖ అల్పపీడనం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడనం
   3) ఉపధ్రువ అల్పపీడనం
   4) ధ్రువ అధిక పీడనం
6. వాతావరణ పీడనాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం?
   1) హైగ్రోమీటర్ 2) హైడ్రోమీటర్
   3) బారోమీటర్ 4) ప్రెజర్ గేజ్
7. కింది వాటిలో ఏ గాలి ఎక్కువ పీడనాన్ని కలిగిస్తుంది?
   1) తడి గాలి 2) పొడి గాలి
   3) రెండూ సమాన పీడనాన్ని కలగజేస్తాయి
   4) ఏదీకాదు
8. భూమధ్యరేఖ అల్పపీడన మండలం ఏయే అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది?
   1) 0°–15° 2) 0°–5°
   3) 20°– 40° 4) 66 $^1/_2$° – 90°
9. సంవహన ప్రక్రియ అధికంగా జరిగే మండలం?
   1) భూమధ్యరేఖ అల్పపీడన మండలం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడన మండలం
   3) ఉపధ్రువ అల్పపీడన మండలం
   4) ధ్రువ అధిక పీడన మండలం
10. పీడన ప్రవణత అంటే?
    1) ఉత్తరం నుంచి దక్షిణ దిశగా ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే వ్యత్యాసం
    2) ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే తరుగుదల
    3) ప్రతి యూనిట్ దూరానికి పీడనం పెరుగుదల
    4) ఏదీకాదు

సమాధానాలు

1) 3 2) 2 3) 1 4) 4
5) 1 6) 3 7) 2 8) 2
9) 1 10) 2

విద్య, ఉద్యోగ సమాచారం

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఆర్‌బీఐ, కోల్‌కతాలో మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు

కోల్‌కతాలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోల్‌కతా రీజనల్ ఆఫీస్, 15, నేతాజీ సుభాష్ రోడ్, కోల్‌కతా–700001 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.02.2025.
» **వెబ్‌సైట్:** https://.rbi.org.in

ఓఎఫ్ఎంకే, ఎద్దుమైలారంలో టూల్ డిజైనర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్ఎంకే)లో ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన టూల్ డిజైనర్(మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **వేతనం:** నెలకు రూ.30,000.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్(మెకానికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27.01.2025 నాటికి 63 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జనరల్ మేనేజర్/హెచ్ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ–502205 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2025.
» **వెబ్‌సైట్:** http://avnl.co.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఆనందభైరవి రాగాన్ని ఉపయోగించిన తొలి వాగ్గేయకారుడు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ సాహిత్యం

టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్స్ జనరల్ స్టడీస్ సిలబస్‌లో 'సంస్కృతి, నాగరికత, కళలు - తెలంగాణ సాహిత్యం' అనే అంశాలను ఒక ప్రత్యేక అధ్యాయంగా పొందుపర్చారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి ఈ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించాలి. జనరల్ స్టడీస్‌లో ఇప్పటికే ఉన్న అంశాలకు తెలుగు, ఇంగ్లిష్ విభాగాలను జతచేశారు. కాబట్టి అభ్యర్థులు తెలంగాణ చరిత్రతోపాటు 'తెలంగాణ సంస్కృతి, నాగరికత, కళలు, సాహిత్యం' మొదలైన అంశాలపై కూడా అవగాహన ఏర్పర్చుకోవాలి. ఇందు కోసం తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, కళారూపాలు, తెలంగాణలోని ప్రాచీన కవులు, ఆధునిక కవులు, కవయిత్రులు, ముఖ్య పండుగలు మొదలైన అంశాలపై పట్టు సాధించాలి.

తెలంగాణ ప్రాచీన కవులు

పాల్కురికి సోమనాథుడు (1160 - 1240)

జన్మస్థలం: వరంగల్ జిల్లా జనగామ సమీపంలోని పాలకుర్తి.

బిరుదులు: ప్రథమాంధ్ర విప్లవ కవి, దేశీ కవిత్వోద్యమ పితామహుడు.

రచనా శిల్పం: 'అల్పాక్షరాల అనల్పార్థ రచన'

రచనలు:

1. **పద్య ప్రకృతులు:**
   అనుభవసారం, చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకం
2. **లఘుకృతులు:**
   బసవరగడ, నమస్కార గద్య, శరణుబసవ గద్య, బసవాష్టకం, బసవోదాహరణం, బసవ లింగ నామావళి.
3. **ద్విపద కావ్యాలు:**
   బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లమదేవి పురాణం (అలభ్యం).

పాల్కురికి సోమనాథుడు కాకతీయుల కాలానికి చెందినవాడు. పరిశోధకులు పాల్కురికి సోమనాథుణ్ని 'తెలంగాణ ఆదికవి'గా పేర్కొంటారు. తెలుగు కవితా ప్రపంచంలో ప్రథమాంధ్ర విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు. తెలుగు సాహిత్యంలో శైవ సాహిత్యానికి సుస్థిర స్థానం సంపాదించి పెట్టిన వారిలో పాల్కురికి ఆద్యుడు, అగ్రగణ్యుడు. పాల్కురికి సోమనాథుడు ద్విపద కావ్య ప్రక్రియకు ఆద్యుడు. ఉదాహరణ కావ్య రచనకు మార్గదర్శకుడు.

సంఖ్యా నియమం, మకుట నియమం ఉన్న మొదటి శతకం వృషాధిప శతకం. పాల్కురికి సోమనాథుడి తొలి రచన అనుభవసారం. తెలుగు సాహిత్యంలో శుద్ధమైన తొలి దేశీ స్వతంత్ర పురాణంగా బసవ పురాణం పేరొందింది. ఇది ఏడు ఆశ్వాసాల ద్విపద కావ్యం. సమకాలీన సమాజాన్ని చిత్రించిన తొలి తెలుగు సాంఘిక కావ్యం బసవ పురాణం. పాల్కురికి సోమనాథుడి ద్విపద బసవ పురాణాన్ని పిడుపర్తి సోమన పద్యకావ్యంగా రాశారు.

రుద్రపశుపతి, గొడగూచి, బెజ్జ మహాదేవి, ఉడుమూరి కన్నప్ప, ముగ్ధ సంగయ్య, చిరుతొండ నంబి లాంటి చిన్నపాత్రలకు పాల్కురికి సోమన కావ్య ప్రవేశం కల్పించారు. 'ఉరుతర పద్యోక్తులకంటే సరసమై ఎరిగిన జాను తెనుగు' అన్న కవి పాల్కురికి సోమనాథుడు. ఇతడి చివరి కృతి పండితారాధ్య చరిత్ర. తెలుగులో తొలిసారిగా జీవిత చరిత్ర రాసింది పాల్కురికి సోమనాథుడే అని విమర్శకుల అభిప్రాయం. తొలి తెలుగు విజ్ఞాన సర్వస్వంగా పండితారాధ్య చరిత్రను విమర్శకులు ప్రశంసించారు.

బద్దెన (13వ శతాబ్దం)

బిరుదు: కమలాసనుడు

రచనలు: నీతిశాస్త్ర ముక్తావళి, సుమతీ శతకం.

బద్దెన కాకతీయుల సామంతరాజు. వేములవాడ చాళుక్య రాజు భద్రభూపాలుడే 'బద్దెన' అని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రచించిన 'నీతిశాస్త్ర ముక్తావళి' ఒక గొప్ప రాజనీతి గ్రంథం. తెలుగులో వచ్చిన నీతి శతకాల్లో అగ్రగణ్యమైంది సుమతీ శతకం. ఇది కంద పద్య రచనలో వెలువడింది.

గోన బుద్ధారెడ్డి (13వ శతాబ్దం)

బిరుదులు: కవి కల్పతరువు, కవిలోక భోజుడు.

రచన: రంగనాథ రామాయణం

కవితా శైలి: సరళం, పండిత పామర జన రంజకం

గోన వంశ రాజులు కాకతీయుల సామంతులు. వీరు రాయచూరు ప్రాంతాన్ని పరిపాలించేవారు. గోన బుద్ధారెడ్డి నిజాం రాష్ట్రంలోని రాయచూరు ప్రాంతాన్ని పాలించినట్లు 'బూదపూరు, రాయచూరు శాసనాలు' తెలుపుతున్నాయి. గోన బుద్ధారెడ్డి 'పాత్యగేయేచ మధురం' అనే కావ్యోక్తిని దృష్టిలో పెట్టుకొని రంగనాథ రామాయణాన్ని దేశీ ఛందమైన ద్విపదలో రచించాడు. తెలుగులో వచ్చిన రామాయణ కావ్యాల్లో మొదటిది రంగనాథ రామాయణం. ఇది ద్విపద ప్రక్రియకు చెందిన రచన. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని యుద్ధకాండ వరకు మాత్రమే రాశాడు. ఉత్తర కాండను ద్విపదలో రాసిన సోదర జంట కవులు కాచవిభుడు, విఠలనాథుడు. తెలుగులో వెలువడిన ద్విపద కావ్యాల్లో ప్రథమ గౌరవం పొందిన రచన రంగనాథ రామాయణం.

మారన (13వ శతాబ్దం)

రచన: మార్కండేయ పురాణం

మార్కండేయ పురాణాన్ని ప్రథమాంధ్ర మహాపురాణంగా పిలుస్తారు. అష్టాదశ పురాణాల్లో ఇది ఏడోది. మార్కండేయ పురాణం కృతిపతియైన 'నాగయగన్నడు' కాకతీయ రెండో ప్రతాపరుద్రుడి సేనాపతి. మార్కండేయ పురాణం తెలుగులో అనేక మనోహర కథలకు పుట్టినిల్లు. మార్కండేయ పురాణం ఎనిమిది ఆశ్వాసాల చంపూ కథాకావ్యం.

శరభాంకుడు

కాలం:
రెండో ప్రతాపరుద్రుడి సమకాలీకుడు.

రచన: శరభాంక లింగమ శతకం

పోతన (1420-1480)

నివాసం: బమ్మెర (ఓరుగల్లు)

తల్లిదండ్రులు: కేసన, లక్కమాంబ

బిరుదులు:
సహజ పండితుడు, నిగర్వ చూడామణి.

కవితాశైలి:
మధుర కవితా నిర్మాణం (అతి మధురం)

రచనలు: వీరభద్ర విజయం, నారాయణ శతకం (అలభ్యం), భోగినీ దండకం, మహాభాగవతం.

శ్రీనాథుడి సమకాలీకుల్లో అగ్రగణ్యుడు పోతన. కృతిని మానవులకు అంకితం చేయనని ప్రతిజ్ఞ చేసిన తొలి తెలుగు కవి పోతన. 'సత్కవుల్ హాలికులైననేమి' అని పోతన ప్రకటించాడు. పోతన సర్వజ్ఞ సింగ భూపాలుడు అనే రాజును తిరస్కరించాడు. పోతన భాగవతాన్ని రాస్తూ 'నా జననంబు సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండ గన్' అని చెప్పుకున్నాడు. భాగవత పురాణంలో ద్వాదశ స్కంధాలున్నాయి. పోతన భాగవతాన్ని శ్రీరామచంద్రుడికి అంకితమిచ్చాడు. తెలుగు వాఙ్మయ ప్రపంచంలో పోతనను చిరంజీవిని చేసిన రచన భాగవతం. ఇందులో ప్రధానంగా భక్తి మార్గ ప్రశంస ఉంది. భాగవతాన్ని శుకమహర్షి మోక్షశాస్త్రంగా పేర్కొన్నాడు.

తెలుగు భాగవత పురాణంలో పంచమ స్కంధాన్ని బొప్పరాజు గంగన, షష్ఠమ స్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను వెలిగందుల నారయ రచించగా, 1, 2, 3, 4, 7, 8, 9, 10 స్కంధాలను పోతన రచించారు. క్రీ.శ.1848లో పురాణం హయగ్రీవ శాస్త్రులు తొలిసారిగా భాగవతాన్ని ముద్రించారు. శ్రీకృష్ణుని బాల్య క్రీడలు భాగవతంలోని దశమ స్కంధంలో ఉన్నాయి.

'కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ...' అంటూ పోతన ప్రహ్లాద చరిత్రం ఘట్టంలో తన భక్తి పారవశ్యాన్ని చాటుకున్నాడు.

'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై...' అనే ప్రసిద్ధ పద్యం పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలోనిది. భాగవతంలో మధురభక్తికి చక్కని ఉదాహరణగా దశమస్కంధంలో శ్రీకృష్ణుడి రాసక్రీడల సందర్భంలో పోతన చెప్పిన 'నల్లని వాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై..' పద్యాన్ని చెప్పుకోవచ్చు.

పిల్లలమర్రి పిన వీరభద్రుడు (15వ శతాబ్దం)

పూర్వీకులు:
నల్లగొండ జిల్లా పిల్లలమర్రి నివాసులు

ఆస్థానం: సాళువ నరసింగరాయలు

రచనలు:
శృంగార శాకుంతలం, జైమినీ భారతం.

శ్రీనాథుడి కాలం నాటికి పిల్లలమర్రి వంశస్థులు నెల్లూరులో ప్రధానులుగా ఉండేవారు. పిల్లమర్రి పినవీరభద్రుడు 'వాణి నా రాణి' అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు. ఇతడు రచించిన సుప్రసిద్ధ కావ్యం శృంగార శాకుంతలం. దీనికి శకుంతలా పరిణయం అనే పేరుంది. శృంగార శాకుంతలం నాలుగు ఆశ్వాసాల శృంగార ప్రబంధం. ఈ గ్రంథ కృతిపతి చిల్లర వెన్నయామాత్యుడు. జైమినీ భారతం కృతిపతి సాళువ నరసింగరాయలు. కురుక్షేత్రం తర్వాత ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగం గురించి జైమిని మహర్షి జనమేయుడికి చెప్పిన కథే జైమినీ భారతం ఇతివృత్తం.

చరిగొండ ధర్మన్న (1480-1530)

జన్మస్థలం: పాలమూరు జిల్లా చరికొండ

బిరుదులు: శతలేఖినీ సురత్రాణ, శతఘంట సురవూతాణుడు.

రచన: చిత్ర భారతం.

ఇది ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధం. చిత్రభారతానికి మూలం పద్మపురాణం. దీని కృతిపతి ఎనుమలూరి పెద్దన మంత్రి.

అద్దంకి గంగాధరుడు 1525-1585

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: తపతీ సంవరణోపాఖ్యానం

అంకితం: ఇబ్రహీం కుతుబ్‌షా

తపతి సంవరణోపాఖ్యానం ఐదు ఆశ్వాసాల ప్రబంధం. ఇది చక్కటి లోకోక్తులతో, 24 రకాల వర్ణనలతో కూడుకున్న ప్రబంధం. మహమ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి అద్దంకి గంగాధరుడు. ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు కవులకు ఆశ్రయమిచ్చి, తెలుగువారితో స్నేహభావంతో మెలిగాడు.

పొన్నికంటి తెలగన (1520-1580)

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: యయాతి చరిత్ర

పొన్నికంటి తెలగననే పొన్నగంటి తెలగనార్యుడు అని పిలుస్తారు. తొలి అచ్చ తెలుగు కావ్యం యయాతి చరిత్ర. ఈ గ్రంథ కృతిపతి అమీన్ ఖాన్. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షాకు సామంతుడు. యయాతి చరిత్ర అయిదు ఆశ్వాసాల శృంగార కావ్యం.

మరింగంటి సింగరాచార్యులు (1520-1590)

బిరుదులు: శతఘంటావధాని,
అష్టభాషా కవితా విశారదుడు

రచనలు:
నిరోష్ఠ్య రామాయణం (దశరథరాజ నందన చరిత్రం), సీతాకళ్యాణం(శుద్ధాంధ్ర ప్రబంధం), తారకబ్రహ్మ రామ శతకం, రామకృష్ణ విజయం (ద్వ్యర్థి కావ్యం), నలయాదవ రాఘవ పాండవీయం(చతుర్థీ కావ్యం), శ్రీరంగ శతకం.

తెలుగులో మొదటి నిరోష్ఠ్య రచన దశరథ రాజనందన చరిత్రం. మొదటి అచ్చ తెలుగు నిరోష్ఠ్య రచన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణం. తెలుగులో ద్వ్యర్థి, చతుర్థి కావ్యాల రచనలకు ఆద్యుడు మరింగంటి సింగరాచార్యులు.

ఎలకూచి బాలసరస్వతి (17వ శతాబ్దం)

జన్మస్థలం: మహబూబ్‌నగర్ జిల్లా

ఆస్థానం: సురభిమాధవ రాయలు

సంస్థానం: జటప్రోలు

రచనలు: రాఘవ యాదవ పాండవీయం (నాలుగు ఆశ్వాసాల కావ్యం), సుభాషిత త్రిశతి అనువాదం, మల్లభూపాలీయం (నీతి శతకం), చంద్రికా పరిణయం (ప్రబంధ కావ్యం), సురభి మల్లా! వైదుషీ భూషణా! (వైరాగ్య శతకం), రంగకౌముది (యక్షగానం).

భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన తొలి వ్యక్తి ఎలకూచి బాలసరస్వతి. ఇతడే ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యాత. తెలుగులో త్ర్యర్థి కావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం'ను ఎలకూచి బాలసరస్వతి రచించి తిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు.

కంచర్ల గోపన్న (1620 - 1684)

జన్మస్థలం: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి

బిరుదు: భక్త రామదాసు

రచనలు: దాశరథీ కీర్తనలు, దాశరథీ శతకం, దాసబోధ.

నిజాం పరిపాలకుడైన అబుల్ హసన్ తానీషా వద్ద మంత్రులైన అక్కన్న, మాదన్నల మేనల్లుడే కంచర్ల గోపన్న. ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా భూమి శిస్తులను దుర్వినియోగం చేశాడన్న ఆరోపణలతో తానీషా గోల్కొండ కోటలో రామదాసును బంధించాడు. భద్రాచలంలోని రామదాసు మండపంలో రామదాసు రాసిన 220 కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. ఇతడి కీర్తనలు 'భజన సంప్రదాయానికి' చెందినవి. ఆనందభైరవి రాగాన్ని మొదట ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసు. 'రామదాసు చరిత్ర' రచయిత సింగిరి దాసు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. పొన్నికంటి తెలగన రాసిన అచ్చ తెలుగు కావ్యం?
   1) సౌందరనందం 2) నాగానందం
   3) రాజశేఖర చరిత్ర
   4) యయాతి చరిత్ర
2. తెలుగు సాహిత్యంలో రెండో యుగకర్త?
   1) పాల్కురికి సోమన
   2) నన్నయ 3) తిక్కన
   4) నన్నెచోడుడు
3. మార్కండేయ పురాణాన్ని మారన ఎవరికి అంకితమిచ్చాడు?
   1) మల్ల సైన్య విభుడు
   2) నాగయ గన్న విభుడు
   3) ఎల్లయ సైన్యనాథుడు
   4) నాగయ మేచవిభుడు

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2.

Which file is responsible to start MS-Word?



BANK EXAMS

COMPUTER AWARENESS

MS - WORD

1. Which is not a font style?
   1) Bold 2) Superscript
   3) Italic 4) Regular
   5) None of above
2. What is gutter margin?
   1) Margin that is added to right margin when printing
   2) Margin that is added to the left margin when printing
   3) Margin that is added to the outside of the page when printing
   4) Margin that is added to the binding side of page when printing
   5) None
3. Landscape is?
   1) A font style 2) Paper Size
   3) Page Layout
   4) Page Orientation
   5) None
4. Typeface option will come under which menu?
   1) Edit 2) View 3) Format
   4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
   1) Web layout view
   2) Print Preview
   3) Reading View
   4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page Setup 2) Section
   3) Page 4) Document
   5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
   1) Tab stop box 2) Left Indent
   3) Right Indent 4) Center Indent
   5) None of above
8. Gutter position can be set in following positions
   1) Left & Right 2) Left & Top
   3) Left & Bottom
   4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
   1) CTRL + Enter
   2) Alt + Enter 3) Shift + Enter
   4) Space + Enter
   5) None of above
10. By pressing F12, which of following will happen?
    1) Save As dialog box will open
    2) Save dialog box will open
    3) Open dialog box will open
    4) Close dialog box will open
    5) None of above
11. Which key will open an Open dialogue box?
    1) F12 2) Alt + F12
    3) Ctrl + F12 4) Shift + F12
    5) None of above
12. How will MS Word will respond in repeated word ?
    1) A Green wavy line under the repeated word
    2) A Red wavy line under the repeated word
    3) A Blue wavy line under the repeated word
    4) A pink wavy lines under the repeated word
    5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
    1) It changes all selected text into Capital Letter
    2) It adds captions for selected Image
    3) It shows all the image captions
    4) It changes some text into Capital Letter
    5) None of above
14. Which file is responsible to start MS Word?
    1) Winword.exe 2) Win.exe
    3) Word.exe 4) Wordwin.exe
    5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
    1) Editions 2) versions
    3) Tracks 4) Traces
    5) None of above
16. Which is not a type of margin?
    1) Top 2) Left 3) Right
    4) Center 5) None of above
17. What will be the use of Ctrl + J?
    1) Insert Image
    2) Insert Hyperlink
    3) Align Justify
    4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
    1) Ctrl + A 2) Ctrl + E
    3) Ctrl + D 4) Ctrl + B
    5) None of above
19. Which shortcut will we use to make text Italic?
    1) Ctrl + U 2) Ctrl + T
    3) Ctrl + I 4) Ctrl + P
    5) None of above
20. How to use Format Painter multiple times?
    1) By Click on Lock Format Painter Icon
    2) Format Painter cannot be use multiple times
    3) By Double Click on the Format Painter Icon
    4) By Double Click on the Format Painter Icon
    5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
    1) Indicators 2) Split buttons
    3) Tab stop buttons
    4) View buttons
    5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
    1) On the top of vertical scroll bar
    2) On the bottom of vertical scroll bar
    3) On the left of horizontal scroll bar
    4) On the right of horizontal scroll bar Comment on this question
    5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
    1) Decimal Alignment
    2) Center Alignment
    3) Bar Alignment
    4) Justify Alignment
    5) None of above
24. What is the use of bookmarks?
    1) To correct the spellings.
    2) To jump to a specific location in the document
    3) To ignore spelling mistakes
    4) To save alignments as it is
    5) None of above
25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
    1) Auto Correct as you type
    2) Auto Change as you type
    3) Auto Ignore as you type
    4) Auto Format as you type
    5) None of above
26. Ctrl + D is short cut used for?
    1) Open Dialogue Box
    2) Font Dialogue Box
    3) Save as Dialogue Box
    4) Save Dialogue Box
    5) None of above
27. Ctrl + G is shortcut for?
    1) Open Find and Replace Dialog box with activating Goto Tab
    2) Open Find and Replace Dialog box with activating Find Tab
    3) Open Find and Replace Dialog box with activating Replace Tab
    4) Open Goto Dialog box
    5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
    1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
    2) Open Find and Replace Dialog box with activating Go to Tab
    3) Open Find and Replace Dialog box with activating Find Tab
    4) Open Find and Replace Dialog box with activating Replace Tab
    5) None of above
29. What can be searched by find?
    1) Format 2) Characters
    3) Symbol 4) All of above
    5) None of above
30. On which page the header or the footer is printed by default?
    1) On first page
    2) on last page
    3) on alternate page
    4) Every page 5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
    1) Standard 2) Formatting
    3) Options 4) Review
    5) None of above
32. To spell check which function key you will press?
    1) F5 2) F6 3) F7
    4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
    1) From insert -> sound menu option
    2) From insert -> object menu option
    3) From insert -> subject menu option
    4) From insert -> file menu option
    5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
    1) 45 2) 50 3) 55
    4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
    1) Smallest 8 and Largest 70
    2) Smallest 5 and Largest 72
    3) Smallest 8 and Largest 72
    4) Smallest 5 and Largest 70
    5) None of above
36. Why drop cap is used in document?
    1) To get all first character capital
    2) To get all first character small
    3) To begin a paragraph with a large dropped initial capital letter
    4) To begin a paragraph with a large dropped initial small letter
    5) None of above
37. What is Macro?
    1) Small add-on programs that are installed afterwards if you need them
    2) Type of high level programming language
    3) Type of low level programming language
    4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
    5) None of above
38. Which among following can be a vertical separation between columns?
    1) Margin 2) Header
    3) Orientation 4) Gutter
    5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
    1) Edit 2) View 3) Tools
    4) Format 5) None of above

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4 ; 29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4;